అనుదినం... జనస్వరం

www.navatelangana.com

నవతెలంగాణ

సమగ్ర తెలుగు దినపత్రిక

శనివారం 26-8-2023

సంపుటి : 9 సంచిక : 236 | Published from Hyderabad, Rangareddy, Khammam, Karimnagar | 10 పేజీలు | వెల : 6.50

అదానీ కోసమే బీజేపీ స్కెచ్

ప్రజల భూముల్ని గుంజుకుని కట్టబెట్టే కుట్ర : కార్గిల్‌లో రాహుల్ గాంధీ



లద్దాక్‌లో రాహుల్

లద్దాక్ : లద్దాక్ ప్రజల భూముల్ని లాక్కొని.. అదానీ గ్రూపునకు కట్టబెట్టేందుకు బీజేపీ ప్రయత్నిస్తోందని కాంగ్రెస్‌నేత రాహుల్ గాంధీ విమర్శించారు. శుక్రవారం కార్గిల్‌లో జరిగిన ఓ ర్యాలీలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. 'మీ భూములను లాక్కొని అదానీ గ్రూప్‌కి అప్పజెప్పేందుకు కాషాయపార్టీ కుట్ర చేస్తోంది. మీ భూముల్ని అదానీకి కట్టబెడితే ఆయన.. ఇక్కడ ఓ ప్లాంట్‌ను ఏర్పాటు చేస్తారు. ఆ ప్లాంట్ వల్ల వచ్చే లాభాల్ని మీకు పంచరు. మీ భూముల్ని అదానీ గ్రూపుకు ఇవ్వకుండా మీరే అడ్డుకోవాలి' అని రాహుల్ లద్దాక్ ప్రజలకు పిలుపునిచ్చారు. లద్దాక్ వ్యూహాత్మక ప్రదేశం. భారత ...11లో

గోల్ మాల్ భారత్‌మాల

అవకతవకలు బయటపెట్టిన కాగ్...

- అనుభవం లేకున్నా అదానీ కన్సార్టియంకు పనులు
- జాబితాలో బీజేపీ నేత కంపెనీ కూడా..
- కాషాయ పార్టీకి విరాళాలు అందించిన మరో నాలుగు కంపెనీలకూ పనులు
- వీటి నుంచి రూ.77 కోట్లకు పైగా విరాళాలు
- యధేచ్ఛగా నిబంధనల ఉల్లంఘనలు



మోడీ ప్రభుత్వం అత్యంత ప్రతిష్టాత్మకంగా భావిస్తున్న జాతీయ రహదారుల విస్తరణ కార్యక్రమం భారత్‌మాల ప్రాజెక్టు మొదటి దశ పనుల్లో అవకతవకలు చోటు చేసుకున్నాయి. అదానీ కంపెనీలకు లబ్ది చేకూర్చే ప్రయత్నాలు జరిగాయి. బీజేపీ నేత కంపెనీ కూడా ఇందులో ఉన్నది. కాషాయ పార్టీకి విరాళాలు అందించిన కంపెనీలూ దీని కింద లబ్దిని పొందాయి అని కాగ్ నివేదిక చెపుతున్నది. అదానీ నేతృత్వంలోని కన్సార్టియంతో పాటు మరికొన్ని కంపెనీలు భారత్‌మాల ప్రాజెక్టు మొదటి దశ కింద నిబంధనలు ఉల్లంఘించి మరీ టెండర్లను పొందాయని తెలుస్తున్నది. సరైన అనుభవం లేనప్పటికీ రోడ్డు నిర్మాణ ప్రాజెక్టులను దక్కించుకున్నట్టు కాగ్ నివేదిక వెల్లడిస్తున్నది. ఈ ప్రాజెక్టు కింద పనులను పొందిన కంపెనీలకు కేంద్రంలోని అధికార బీజేపీతో ప్రత్యంక్షంగానో, పరోక్షంగానో సంబంధాలు ఉన్నట్టు తెలుస్తున్నది.

న్యూఢిల్లీ : మోడీ సర్కార్ అధికారంలోకి వచ్చాక..కార్పొరేట్లను ప్రసన్నం చేసుకోవటంలోనే తలమునకలైంది. పార్టీకి విరాళాలిచ్చే పెద్దలకు కావాల్సిన పనులను అప్పగించేందుకు వెనుకాడటంలేదు. దీనికి ఉదాహరణకు అదానీ ట్రాన్స్‌పోర్ట్ నేతృత్వంలోని కన్సార్టియం... హైబ్రిడ్ యాన్యుటీ మోడల్‌లో తెలంగాణలోని సూర్యాపేట నుంచి ఖమ్మం మధ్య జాతీయ రహదారిని నాలుగు-లేన్‌లుగా చేసే ప్రాజెక్ట్‌ను పొందింది. అయితే, హైవే సెక్టార్‌లో నిర్మాణ పనుల్లో అనుభవం కలిగి ఉండాలనే షరతు ఉన్నది. దానిని అదానీకి చెందిన కంపెనీ సంతృప్తిపర్చలేదు. అయినప్పటికీ అదానీ కన్సార్టియంకే ఈ ప్రాజెక్టు అందటం గమనార్హం. అలాగే, బీజేపీ నాయకుడు నవీన్ జైన్ ప్రమోట్ చేసిన ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ కంపెనీ అయిన పీఎన్‌ఆర్ ఇన్ఫోటెక్‌కు 2019 ఆగస్టులో లక్నో రింగ్ రోడ్ యొక్క ప్యాకేజీ 1 కాంట్రాక్ట్‌ను మొదట అంచనా వేసిన దానికంటే 17.44 శాతం అధిక ధరతో అందించారు. బిడ్ ధర సవరించిన అంచనాల కంటే 2.02 శాతం పెరిగింది. ఆ సమయంలో జైన్ ఆగ్రా మేయర్‌గా ఉండటం గమనార్హం.



దీంతో ఇందులో అధికార దుర్వినియోగం కూడా జరిగిందనే ఆరోపణలు వచ్చాయి.

2013 నుంచి 2021 మధ్య కాలంలో బీజేపీకి రూ. 77 కోట్లకు పైగా విరాళం ఇచ్చిన నాలుగు కంపెనీలు ఐఆర్‌బీ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ డెవలపర్స్, జె కుమార్ ఇన్‌ఫ్రాప్రాజెక్ట్స్, లార్సెన్ అండ్ టూబ్రో, ఎంకేసీ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ లిమిటెడ్‌లతో అక్రమాలకు పాల్పడినట్టు కాగ్ నివేదిక పేర్కొన్నది.

అదానీ ట్రాన్స్‌పోర్ట్ కన్సార్టియం

కన్సార్టియంలో అదానీ సంస్థకు 74 శాతం సింహభాగం ఉన్నది. అయితే, సదరు కన్సార్టియం హైవే సెక్టార్‌లో నిర్మాణ పనుల్లో ఐదేండ్ల అనుభవానికి సంబంధించిన షరతును నెరవేర్చలేదు. బిడ్డర్ సమర్పించిన పనుల జాబితా ప్రకారం కంపెనీ "ప్రత్యక్షంగా లేదా పరోక్షంగా" ఎటువంటి నిర్మాణ పనులను ఎప్పుడూ నిర్వహించలేదు. ఏది ...11లో


సచివాలయ ప్రాంగణాన్ని గవర్నర్ తమిళిసై కి స్వయంగా చూపిస్తున్న సీఎం కేసీఆర్

రాజీ కుదిరింది..

సీఎం..గవర్నర్ మధ్య సయోధ్య

- సచివాలయంలో గవర్నర్‌కు ఘన సన్మానం
- రాజ్‌భవన్‌లో కేసీఆర్‌కు తేనీటి విందు
- ప్రగతి భవన్, రాజ్ భవన్‌కు మధ్య తగ్గిన దూరం
- ఇక బిల్లులన్నింటికీ గ్రీన్ సిగ్నల్...?
- రాజకీయ పరిణామాల్లో భాగమేనంటున్న విశ్లేషకులు

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

నిన్నటిదాకా ఉప్పు.. నిప్పుగా ఉన్న ప్రగతి భవన్.. రాజ్‌భవన్‌లలో అకస్మాత్తుగా సీన్ మారిపోయింది. దాదాపు రెండేండ్లపాటు ఎడమొఖం.. పెడమొఖంగా ఉన్న సీఎం కేసీఆర్, గవర్నర్ తమిళిసై మోముల్లో ఒక్కసారిగా చిరు దరహాసాలు విరబూశాయి. రాష్ట్రపతి హైదరాబాద్‌కు వచ్చినప్పుడు, హైకోర్టు చీఫ్ జస్టిస్, మంత్రుల ప్రమాణ స్వీకారాలు తదితర ప్రత్యేక సందర్భాల్లో తప్ప ఇన్నాళ్లూ ఏ ఒక్క రోజూ మర్యాదపూర్వకంగా భేటీలుకాని ముఖ్యమంత్రి, గవర్నర్... హఠాత్తుగా వరసగా రెండు రోజులపాటు గంటలపాటు వేదికలను పంచుకున్నారు. ఇటీవల రాష్ట్ర క్యాబినెట్‌లోకి తీసుకున్న పట్నం మహేందర్‌రెడ్డి ప్రమాణ స్వీకారం సందర్భంగా గురువారం సీఎం కేసీఆర్ రాజ్‌భవన్‌కు వెళ్లారు. అక్కడ ఆయనకు ఘన స్వాగతం లభించింది. నిమిషాల వ్యవధిలో పట్నం ప్రమాణ స్వీకారం పూర్తికాగా... ఆ తర్వాత దాదాపు అరగంటపాటు కేసీఆర్, తమిళిసై ప్రత్యేకంగా భేటీ అయ్యారు. గవర్నర్ ఇచ్చిన తేనీటి విందులో సీఎం పాల్గొన్నారు. ఈ పరిణామాలు బీఆర్‌ఎస్ వర్గాలను, ప్రభుత్వ అధికార యంత్రాంగాన్ని సైతం అమితాశ్చర్యంలో ముంచెత్తాయి. మరోవైపు శుక్రవారం హైదరాబాద్‌లోని నూతన సచివాలయంలో ప్రార్థనా మందిరాల ప్రారంభోత్సవ ...11లో



మత సామరస్య లౌకికవాద స్ఫూర్తి పరిఢవిల్లింది

- సచివాలయం ప్రాంగణంలోని గుడి, చర్చి, మసీదుల ప్రారంభోత్సవంలో సీఎం కేసీఆర్
- హాజరైన గవర్నర్ తమిళిసై 2లో..

పోటీ చేసి తీరుతా..

ఖమ్మం జిల్లా సరిహద్దులో మాజీ మంత్రి తుమ్మలకి ఘనస్వాగతం

- వెయ్యికి పైగా కార్లు..మరో వెయ్యి బైక్‌లతో భారీ ర్యాలీ
- కాంగ్రెస్ వైపేనంటున్న అనుచరులు...
- జై తుమ్మల... జై కాంగ్రెస్ అంటూ నినాదాలు


ఖమ్మం ర్యాలీలో అభివాదం చేస్తున్న తుమ్మల నాగేశ్వరరావు

నవతెలంగాణ-ఖమ్మం ప్రాంతీయ ప్రతినిధి/ కూసుమంచి

బీఆర్‌ఎస్ టిక్కెట్ల కేటాయింపులో భంగపడ్డ మాజీ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు హైదరాబాద్ నుంచి తొలిసారి శుక్రవారం ఖమ్మం జిల్లా పర్యటనకు వచ్చారు. ఆయనకు జిల్లా సరిహద్దు కూసుమంచి మండలం నాయకన్‌గూడెం వద్ద ఘనస్వాగతం లభించింది. వేలాదిగా తుమ్మల అభిమానులు తరలివచ్చారు. వెయ్యికి పైగా కార్లు, మరో వెయ్యికి పైగా బైక్‌లతో ర్యాలీగా పాలేరు, కూసుమంచి, ఖమ్మం రూరల్ మండలం మద్దులపల్లి, వరంగల్ క్రాస్ రోడ్డు ...11లో

సామాజిక సమీకరణాలపై కాంగ్రెస్ ఫోకస్

బీసీలకు ఎన్నికల్లో ప్రాధాన్యత | మాదిగ సామాజికవర్గంపైనా కేంద్రీకరణ | కారును ఢీ కొట్టేందుకు పక్కా వ్యూహం



నవతెలంగాణబ్యూరో-హైదరాబాద్

ఎన్నికల్లో పోటీ చేసేందుకు దరఖాస్తులను ఆహ్వానించిన కాంగ్రెస్ పార్టీ...సామాజిక సమీకరణాలపై ఫోకస్ పెట్టింది. రాష్ట్రంలో అత్యధిక జనాభా కలిగిన బీసీలకు ఎన్నికల్లో ప్రాధాన్యత ఇవ్వాలని భావిస్తోంది. అధికార పార్టీ బీసీలకు అన్యాయం చేసిందనే విమర్శల నేపథ్యంలో కాంగ్రెస్ పార్టీ ఆ సామాజికవర్గంపై దృష్టి సారించింది. అందులోనూ బీఆర్‌ఎస్ ముదిరాజ్ సామాజికవర్గానికి ఒక సీటు కూడా ఇవ్వలేదు. ఈసారి ఆ వర్గాలకు కాంగ్రెస్ పెద్ద పీట వేసేలా ప్రణాళికలు రచిస్తోంది. బీఆర్‌ఎస్ పార్టీ ప్రాధాన్యత ఇవ్వని ముదిరాజ్, కురుమ లాంటి సామాజిక వర్గాలతో పాటు, గౌడ, మున్నూరు కాపు సామాజిక వర్గాలకు ప్రాధాన్యత ఇచ్చేలా అడుగులు వేస్తోంది. రాష్ట్రంలోని అనేక నియోజకవర్గాల్లో ముఖ్యంగా ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లాలో గెలుపోటములను ప్రభావితం చేయడంలో ముదిరాజ్ సామాజిక వర్గం పాత్ర కీలకం. ఇటీవల బీఆర్‌ఎస్ పార్టీ ప్రకటించిన అభ్యర్థుల జాబితాలో ముదిరాజ్ సామాజిక వర్గానికి బీఆర్‌ఎస్ పార్టీ మొండిచేయి చూపింది.ఆ సామాజిక వర్గానికి మంత్రి పదవులు ఇవ్వకుండా బీఆర్‌ఎస్ అన్యాయం చేసిందంటూ శుక్రవారం గాంధీభవన్‌లో ఎంపీ ఎన్ ఉత్తమ్‌కుమార్‌రెడ్డి వ్యాఖ్యానించారు. కురుమ సామాజికవర్గం నుంచి ఉమ్మడి నల్గొండ జిల్లా, ఉమ్మడి మహబూబ్ నగర్ నుంచి ఒక్కోనేత ఎమ్మెల్యే అభ్యర్థిత్వం కోసం పోటీ పడుతున్నారు. రాష్ట్రంలో అత్యధిక సంఖ్యలో ఉన్న మాదిగ సామాజిక వర్గంపై సైతం కాంగ్రెస్ పార్టీ నజర్ పెట్టింది. ఇటీవల మాజీ మంత్రి, మాదిగ సామాజిక వర్గానికి చెందిన ఏ చంద్రశేఖర్ కాంగ్రెస్ పార్టీలో చేరారు. అదే సామాజిక వర్గానికి చెందిన నకిరేకల్ మాజీ ఎమ్మెల్యే వేముల వీరేశం, బీఆర్‌ఎస్ నేత మందుల సామేలు బీఆర్‌ఎస్‌కు రాజీనామా చేశారు. స్టేషన్‌ఘన్‌పూర్ ఎమ్మెల్యే తాటికొండ రాజయ్యకు టికెట్ దక్కకపోవడంతో అసంతృప్తిని వ్యక్తం చేసి పార్టీ కార్యక్రమాలకు దూరంగా ఉంటున్నారు. ఈ సామాజిక వర్గానికి రాష్ట్ర క్యాబినెట్‌లో కూడా బీఆర్‌ఎస్ చోటివ్వలేదని కాంగ్రెస్ మొదటి నుంచే విమర్శిస్తోంది. ఈ నేపథ్యంలో ఈ వర్గానికి కూడా తగిన ప్రాధాన్యత కోసం కాంగ్రెస్ కసరత్తు చేస్తోంది.బీసీల్లో గౌడ, మున్నూరుకాపు, పద్మశాలి ...2లో

కారుకు షాక్ ?

కాంగ్రెస్‌తో కుదిరిన ఒప్పందం

- మల్కాజిగిరి నుంచి మైనంపల్లి
- మెదక్ నుంచి రోహిత్


మైనంపల్లి హనుమంతరావు, తనయుడు రోహిత్

నవతెలంగాణబ్యూరో-హైదరాబాద్

కారుకు మరో షాక్ తగిలింది. ఆ పార్టీ ఎమ్మెల్యే, మల్కాజిగిరి తాజా బీఆర్‌ఎస్ అభ్యర్థి మైనంపల్లి హనుమంతరావు గులాబీకి గుడ్‌బై చెప్పనున్నారు. ఈమేరకు శుక్రవారం కాంగ్రెస్ నేతలతో చర్చలు పూర్తయ్యాయి. మైనంపల్లికి మల్కాజిగిరి అసెంబ్లీ స్థానాన్ని, ఆయన కుమారుడు మైనంపల్లి రోహిత్‌కు మెదక్ అసెంబ్లీ స్థానాన్ని కేటాయించేలా ఒప్పందం కుదిరినట్టు విశ్వసనీయ సమాచారం. ఈ నేపథ్యంలో కాంగ్రెస్ నుంచి మెదక్ టికెట్ ఆశిస్తున్న తిరుపతిరెడ్డిని పార్టీ నేతలు ఒప్పించినట్టు ...11లో

మణుగూరు, వరంగల్‌లో భూకంపం


నవతెలంగాణ-మణుగూరు/ వరంగల్

భద్రాద్రి కొత్తగూడెం జిల్లా మణుగూరు, వరంగల్‌లో శుక్రవారం తెల్లవారుజామున స్వల్పంగా భూమి కంపించింది. మణుగూరు మున్సిపాలిటీలో తెల్లవారుజామున 4 గంటల 43 నిమిషాలకు ఐదు సెకండ్లు భూమి కంపించింది. నేషనల్ సెంటర్ ఫర్ సిస్మాలజీ (ఎన్‌సీఆర్) ప్రకారం.. భూకంప తీవ్రత రెక్టర్ స్కేల్‌పై 3.6గా నమోదైనట్టు అధికారులు తెలిపారు. భూ అంతర్భాగంలో 30 కిలోమీటర్ల లోతులో కదలికలు సంభవించాయని వెల్లడించారు. రాజుపేట, విఠల్‌రావు నగర్, బాపనగుంట, శివలింగాపురం గ్రామాల్లో ఇండ్లలో వస్తువులు కదలడంతో ప్రజలు భయభ్రాంతులకు గురయ్యారు. మండల పరిధిలో సమితి సింగారం, అశోక్‌నగర్, ముత్యాలమ్మ నగర్, పగిడేరులో కూడా భూమి కంపించిందని స్థానికులు తెలిపారు. మణుగూరులో భూకంపం రావడం ఇది రెండోసారి.వరంగల్‌లోనూ స్వల్పంగా భూమి కంపించింది. భూకంప తీవ్రత రిక్టర్ స్కేలుపై 3.6గా నమోదైనట్టు జాతీయ భూకంప అధ్యయన విభాగం వెల్లడించింది.

దేశవ్యాప్త ఉద్యమానికి శ్రీకారం

హైదరాబాద్ కేంద్రంగా దళిత్ సమ్మిట్

- బీజేపీ విధానాలను ఓడించడమే లక్ష్యం
- విశాల ఐక్యవేదిక నిర్మాణానికి పునాది :బి.వెంకట్



దళిత ఎజెండా సమ్మిట్‌కు హైదరాబాద్ కేంద్రమైంది. దళితులపై దాడులు పెరగడం, కేంద్రంలో బీజేపీ అధికారంలోకి వచ్చాక వారి సామాజిక, ఆర్థిక, రాజకీయ స్థితి మరింత దిగజారిన నేపథ్యంలో సెంటర్ ఫర్ దళిత్ స్టడీస్ ఈ సమ్మిట్‌కు పూనుకున్నది. ఈ నెల 26, 27 తేదీల్లో రెండు రోజుల పాటు హైదరాబాద్ బేగంపేటలోని ది ప్లాజా హోటల్‌లో నిర్వహించనున్న సమ్మిట్‌కు 25 రాష్ట్రాలు, కేంద్ర పాలిత ప్రాంతాల నుంచి 350 మంది ప్రతినిధులు హాజరు కానున్నారు. రెండు రోజుల పాటు దళితుల గురించి సమ్మిట్ చర్చించనున్నది. అవసరమైన కార్యాచరణ ప్రణాళిక, దళితులకు న్యాయం చేసేందుకు అవసరమైన రాజకీయ పోరాటంపై ఒక నిర్ణయానికి రానున్నది. సమ్మిట్ నేపథ్యంలో ఆల్ ఇండియా అగ్రికల్చర్ వర్కర్స్ యూనియన్ ప్రధాన కార్యదర్శి **బి.వెంకట్** నవతెలంగాణ ప్రతినిధి **కె.ప్రియకుమార్**కి ప్రత్యేక ఇంటర్వ్యూ ఇచ్చారు.

ప్రశ్న... జాతీయ దళిత్ సమ్మిట్ లక్ష్యమేంటి?

బి.వెంకట్... దేశంలో 27 కోట్ల నుంచి 29 కోట్ల మంది దళితులున్నారు. సంఖ్య రీత్యా కోట్లలో ఉన్న దళితులు ఉత్పత్తి తరగతులు. గ్రామీణ ప్రాంతాల్లో వ్యవసాయ కార్మికులు, చిన్న, సన్నకారు రైతులు, పట్టణ ప్రాంతాల్లో అసంఘటిత కార్మికులున్నారు. సంఖ్య రీత్యా, ఉత్పత్తి తరగతులుగా వారు భారత జీడీపీని సృష్టించడంలో వారిది కీలక పాత్ర. అలాంటి దళితులు దేశంలో ఆర్థిక దోపిడీ, సామాజిక వివక్ష, సాంస్కృతిక రంగంలో అణచివేతకు గురవుతున్నారు. ప్రపంచంలో లేని ఒక ప్రత్యేక దుస్థితి ...కులం పేరుతో అణచివేత మన దేశంలో ఉంది. అందుకే ఈ సమ్మిట్ ఉత్పత్తికారులకు ప్రాతినిధ్యం వహిస్తున్న వారి కోసం జరుగుతున్నది. వారి గురించి చర్చిస్తున్నది. మన అభివృద్ధి కారకులుగా దళితుల గురించి మాట్లాడుతున్నాం.

ప్రశ్న... ప్రస్తుత పరిస్థితుల్లో సమ్మిట్ ప్రాధాన్యత ఏమిటీ?

బి.వెంకట్.... గతం నుంచి పాలకవర్గాలు దళితులను ఓటు ...11లో

5089 ఉపాధ్యాయ పోస్టుల భర్తీకి అనుమతి

విద్యాశాఖ ఆధ్వర్యంలో డీఎస్సీ ద్వారా నియామకాలు

- ఉత్తర్వులు విడుదల

వివరాలు 2లో..

ద్వైపాక్షిక వాణిజ్యాన్ని రెట్టింపు చేస్తాం

- గ్రీక్‌లో మోడీ ఒక రోజు పర్యటన


ప్రధాని మోడీకి గ్రాండ్ క్రాస్ ఆఫ్ ది ఆర్డర్ ఆఫ్ ది ఆనర్ అందజేస్తున్న గ్రీస్ అధ్యక్షురాలు

ఏథెన్స్: భారత్- గ్రీక్ దేశాల మధ్య ద్వైపాక్షిక వాణిజ్యాన్ని 2030 నాటికి రెట్టింపు చేయడమే తమ లక్ష్యమని ప్రధానమంత్రి నరేంద్ర మోడీ తెలిపారు. ఒక రోజు పర్యటన కోసం గ్రీక్ ఏథెన్స్‌కు మోడీ ...11లో



అమెరికా మాజీ అధ్యక్షుడు ట్రంప్ అరెస్ట్

- బెయిల్‌పై విడుదల

వాషింగ్టన్ : అమెరికా మాజీ అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ అరెస్టయ్యారు. 2020 నాటి అమెరికా అధ్యక్ష ఎన్నికలకు సంబంధించి ఫలితాలను తారుమారు చేసేందుకు జోక్యం, కుట్ర, తదితర కేసులు ట్రంప్‌పై నమోదైన నేపథ్యంలో ... జార్జియా జైలు వద్ద పోలీసుల ఎదుట ట్రంప్ లొంగిపోయారు. స్వయంగా ...11లో

5089 ఉపాధ్యాయ పోస్టుల భర్తీకి అనుమతి

విద్యాశాఖ ఆధ్వర్యంలో డీఎస్సీ ద్వారా నియామకాలు ఉత్తర్వులు విడుదల

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

రాష్ట్రంలో పాఠశాల విద్యాశాఖలో 5,089 ఉపాధ్యాయ పోస్టులను భర్తీకి ప్రభుత్వం పచ్చజెండా ఊపింది. ఈ మేరకు ఆర్థిక శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి కె రామకృష్ణారావు శుక్రవారం ఉత్తర్వులు విడుదల చేశారు. 5,089 ఉపాధ్యాయ పోస్టుల్లో 1,739 స్కూల్ అసిస్టెంట్ (ఎస్ఏ), 2,575 సెకండరీ గ్రేడ్ టీచర్ (ఎస్జీటీ), 611 భాషా పండితులు (ఎల్పీ), 164 ఫిజికల్ ఎడ్యుకేషన్ టీచర్ (పీఈటీ) పోస్టులున్నాయని తెలిపారు. అయితే ఆ పోస్టులను పాఠశాల విద్యాశాఖ ఆధ్వర్యంలో డిపార్ట్‌మెంటల్ సెలెక్షన్ కమిటీ (డీఎస్సీ) ద్వారా నేరుగా నియామకాలను చేపడతామని పేర్కొన్నారు.

ఖాళీల వివరాలు, రోస్టర్ పాయింట్లు, అర్హతలను నిర్ణయించి నియామకాల ప్రక్రియను నిర్వహిస్తుందని తెలిపారు. విద్యాశాఖ కార్యదర్శి, సంచాలకులు తదుపరి చర్యలు తీసుకుంటారని వివరించారు. డీఎస్సీ నోటిఫికేషన్, షెడ్యూల్‌ను విడుదల చేస్తారని పేర్కొన్నారు.

10 జిల్లాల్లో వందకంటే తక్కువ పోస్టులు

డీఎస్సీలో వందకంటే తక్కువ పోస్టులు పది జిల్లాల్లో ఉన్నాయి. హన్మకొండలో 54 పోస్టులు, జనగామలో 76 పోస్టులు, జయశంకర్ భూపాలపల్లిలో 74 పోస్టులు, కరీంనగర్‌లో 99 పోస్టులు, మహబూబ్‌నగర్‌లో 96 పోస్టులు, మేడ్చల్ మల్కాజిగిరిలో 78 పోస్టులు, ములుగులో 65 పోస్టులు, పెద్దపల్లిలో 43 పోస్టులు, వనపర్తిలో 76 పోస్టులు, యాదాద్రి భువనగిరిలో 99 పోస్టులున్నాయి.

అయితే కొన్ని జిల్లాల్లో ఎస్జీటీ పోస్టుల కంటే ఎస్ఏ పోస్టులు ఎక్కువగా ఉన్నాయి. ఉదాహరణకు కామారెడ్డిలో ఎస్ఏ పోస్టులు 97 ఉంటే, ఎస్జీటీ పోస్టులు 86 ఉన్నాయి. నాగర్‌కర్నూల్‌లో ఎస్ఏ పోస్టులు 61 ఉండగా, ఎస్జీటీ పోస్టులు 36, పెద్దపల్లిలో 30 ఎస్ఏ, ఏడు ఎస్జీటీ, సూర్యాపేటలో 80 ఎస్ఏ, 78 ఎస్జీటీ, వనపర్తిలో 43 ఎస్ఏ, 19 ఎస్జీటీ, వరంగల్‌లో 56 ఎస్ఏ, 55 ఎస్జీటీ, యాదాద్రి భువనగిరిలో 39 ఎస్ఏ, 38 ఎస్జీటీ పోస్టులున్నాయి.

డీఎస్సీ-2023 పోస్టుల వివరాలు

కేటగిరీ	పోస్టులు
స్కూల్ అసిస్టెంట్ (ఎస్ఏ)	1,739
సెకండరీ గ్రేడ్ టీచర్ (ఎస్జీటీ)	2,575
లాంగ్వేజ్ పండితులు (ఎల్పీ)	611
ఫిజికల్ ఎడ్యుకేషన్ టీచర్ (పీఈటీ)	164
మొత్తం	5,089

జిల్లాల వారీగా ఉపాధ్యాయ పోస్టులు

జిల్లా	ఎస్ఏ	ఎస్జీటీ	ఎల్పీ	పీఈటీ	మొత్తం
1. ఆదిలాబాద్	54	206	13	2	275
2. ఆసిఫాబాద్	49	214	24	2	289
3. భద్రాద్రి కొత్తగూడెం	76	101	7	1	185
4. హన్మకొండ	21	21	5	7	54
5. హైదరాబాద్	116	163	57	22	358
6. జగిత్యాల	50	53	37	8	148
7. జనగామ	23	29	17	7	76
8. జయశంకర్	12	38	17	7	74
9. జోగులాంబ	34	77	27	8	146
10. కామారెడ్డి	97	86	12	5	200
11. కరీంనగర్	22	52	18	7	99
12. ఖమ్మం	89	83	13	10	195
13. మహబూబాబాద్	35	69	19	2	125
14. మహబూబ్‌నగర్	23	47	19	7	96
15. మంచిర్యాల	36	58	16	3	113
16. మెదక్	70	48	28	1	147
17. మేడ్చల్	25	45	7	1	78
18. ములుగు	16	33	15	1	65
19. నాగర్‌కర్నూల్	61	36	15	2	114
20. నల్లగొండ	86	102	25	6	219
21. నారాయణపేట	71	62	20	1	154
22. నిర్మల్	16	91	4	4	115
23. నిజామాబాద్	96	183	21	9	309
24. పెద్దపల్లి	30	7	5	1	43
25. రాజన్న సిరిసిల్ల	23	64	12	4	103
26. రంగారెడ్డి	48	117	25	6	196
27. సంగారెడ్డి	80	174	24	5	283
28. సిద్దిపేట	60	49	24	8	141
29. సూర్యాపేట	80	78	23	4	185
30. వికారాబాద్	102	77	12	0	191
31. వనపర్తి	43	19	9	5	76
32. వరంగల్	56	55	21	6	138
33. యాదాద్రి	39	38	20	2	99
మొత్తం	1,739	2,575	611	164	5,089

ఈసెట్‌లో 88.53 శాతం మందికి సీట్ల కేటాయింపు

- సెల్ఫ్ రిపోర్టింగ్ గడువు 29

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

రాష్ట్రంలో ఇంజినీరింగ్, బీ ఫార్మసీ, బీఎస్సీ మ్యాథమెటిక్స్ కోర్సుల్లో 2023-24 విద్యాసంవత్సరానికి సంబంధించి ద్వితీయ సంవత్సరంలో (లాటరల్ ఎంట్రీ) ప్రవేశాలకు నిర్వహించిన ఇంజినీరింగ్ కామన్ ఎంట్రెన్స్ టెస్ట్ (ఈసెట్) రెండో విడత కౌన్సెలింగ్ ప్రక్రియలో శుక్రవారం సాంకేతిక విద్యాశాఖ సీట్లు కేటాయించింది. ఈ మేరకు సాంకేతిక విద్యాశాఖ కమిషనర్, ఈసెట్ ప్రవేశాల కన్వీనర్ వాకాటి కరుణ ఒక ప్రకటన విడుదల చేశారు. 170 ఇంజినీరింగ్ కాలేజీల్లో 11,855 సీట్లుంటే, 10.496 (88.53 శాతం) మంది అభ్యర్థులకు సీట్లు కేటాయించామని పేర్కొన్నారు. 1,359 (11.47 శాతం) సీట్లు మిగిలిపోయాయని తెలిపారు. 117 ఫార్మసీ కాలేజీల్లో 1,228 సీట్లుంటే, 77 (6.27 శాతం) మంది అభ్యర్థులకు సీట్లు కేటాయించామని వివరించారు. ఇంకా 1,151 (93.73 శాతం) సీట్లు మిగిలిపోయాయని వివరించారు. రెండోవిడతలో స్లైడింగ్ ద్వారా 1,901 మంది అభ్యర్థులు పొందారని తెలిపారు. కొత్తగా 1,639 మందికి సీట్లు కేటాయించామని పేర్కొ న్నారు. సరిపోయినన్ని వెబ్‌ఆప్షన్లను నమోదు చేయక పోవడం వల్ల 2,603 మంది అభ్యర్థులు సీట్లు పొందలేక పోయారని తెలిపారు. ఆర్థికంగా వెనుకబడిన తరగతులు (ఈడబ్ల్యూఎస్) కోటా కింద 640 మంది సీట్లు పొందారని పేర్కొన్నారు. సీట్లు పొందిన అభ్యర్థులు అలాట్‌మెంట్ ఆర్డర్‌ను డౌన్‌లోడ్ చేసుకోవాలని సూచించారు. ఆన్‌లైన్ ద్వారా ట్యూషన్‌ఫీజును చెల్లించాలని కోరారు. సీట్లు కేటాయించిన అభ్యర్థులు వెబ్‌సైట్ ద్వారా సెల్ఫ్ రిపోర్టింగ్ చేసే గడువు ఈనెల 29 వరకు ఉందని వివరించారు. సీట్లు పొందిన అభ్యర్థులు ఈనెల 26 నుంచి 29 వరకు కాలేజీల్లో రిపోర్టు చేయాలని కోరారు.

కంప్యూటర్ సైన్స్‌లో 84.75 శాతం మంది చేరిక

కంప్యూటర్ సైన్స్, ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ (ఐటీ) అనుబంధ కోర్సుల్లో 6,989 సీట్లుంటే, 5,923 (84.75 శాతం) మంది అభ్యర్థులకు సీట్లు కేటాయించామని వాకాటి కరుణ తెలిపారు. 1,066 (15.25 శాతం) సీట్లు మిగిలాయని వివరించారు. ఎలక్ట్రానిక్స్, ఎలక్ట్రికల్ కోర్సుల్లో 2,932 సీట్లకుగాను 2,783 (94.92 శాతం) మంది అభ్యర్థులు సీట్లు పొందారని పేర్కొన్నారు. ఇందులో 149 (5.08 శాతం) సీట్లు మిగిలిపోయాయని తెలిపారు.

మత సామరస్య లౌకికవాద స్ఫూర్తి పరిఢవిల్లింది.

- సచివాలయం ప్రాంగణంలోని గుడి, చర్చి, మసీదుల ప్రారంభోత్సవంలో సీఎం కేసీఆర్ • హాజరైన గవర్నర్

నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్

'ఇది చాలా సంతోషకరమైన సమయం. మత సామరస్య స్ఫూర్తి పరిఢవిల్లింది. రాష్ట్రంలో ఇలాగే సౌభ్రాతత్వం వెల్లివిరియాలి. ఇందుకోసం ప్రభుత్వం తన కృషిని కొనసాగిస్తుంది. ఈ దిశగా ప్రతి అవకాశాన్ని వినియోగించుకుంటుంది. పాత సచివాలయంలోని మసీదును మించి కొత్త సచివాలయంలో మసీదును సుందరంగా నిర్మించుకోవడం నాకు చాలా సంతోషాన్నిస్తున్నది. ఈ సందర్భంగా తెలంగాణతో పాటు యావత్ భారతదేశంలోని ముస్లింలకు నేను శుభాకాంక్షలు తెలుపుతున్నాను.

లౌకికతత్వాన్ని చాటేలా ఆలయాలు, మసీదులు, చర్చిలు వెలయాలి. ఈ మూడు ఒక్కచోట ఉన్న ప్రదేశానికి ఉత్తమ నిదర్శనంగా మన రాష్ట్ర సచివాలయం నిలుస్తుంది' అని సీఎం కేసీఆర్ అన్నారు. డా.బి.ఆర్.అంబేద్కర్ తెలంగాణ రాష్ట్ర సచివాలయం వేదికగా రాష్ట్ర గవర్నర్ ముఖ్యఅతిథిగా సీఎం కేసీఆర్ చేతుల మీదుగా హిందూ, క్రైస్తవ, ముస్లిం మతాలకు చెందిన మూడు ప్రార్థనా మందిరాలను శుక్రవారం వరుసగా ప్రారంభించారు. తొలుత, నిర్మాణం పూర్తి చేసుకుని ప్రారంభానికి సిద్ధమైన సచివాలయంలోని శ్రీ నల్లపోచమ్మ దేవాలయానికి సీఎం చేరుకున్నారు. గవర్నర్ రాగానే సాంప్రదాయ పద్ధతిలో మేళ తాళాలతో ఆహ్వానం పలికారు. గవర్నర్‌ను ఆహ్వానించిన కార్యక్రమంలో సీఎం కేసీఆర్‌తో పాటు మంత్రులు, ఎంపీలు, ఎమ్మెల్సీలు, ఎమ్మెల్యేలు, ప్రజా ప్రతినిధులు, సీఎస్, ఉన్నతాధికారులు, దేవాదాయ శాఖ అధికారులు పాల్గొన్నారు. అనంతరం సచివాలయం ప్రాంగణంలో నిర్మించిన చర్చికి, గవర్నర్‌ను తోడ్కొని సీఎం కేసీఆర్ చేరుకున్నారు. క్రిస్టియన్ మత సాంప్రదాయ ప్రకారం నిర్వహించిన ప్రార్థన కార్యక్రమంలో పాల్గొన్నారు. అక్కడ పాస్టర్ తదితర మత పెద్దలు క్రీస్తు సందేశాన్ని వినిపించారు.సంప్రదాయం ప్రకారం కేక్‌ను కట్ చేశారు. ఆ తర్వాత పక్కనే నిర్మించిన మసీదుకు సీఎం కేసీఆర్ చేరుకున్నారు. గవర్నర్‌తో పాటుగా వచ్చిన సీఎంకు ఇస్లాం సాంప్రదాయ పద్ధతిలో ఇమామ్, తదితర మత పెద్దలు స్వాగతం పలికారు. అనంతరం ఇస్లాం మత సాంప్రదాయం ప్రకారం ఏర్పాటు చేసిన కార్యక్రమాల్లో సీఎం పాల్గొన్నారు. ప్రత్యేక ప్రార్థనల్లో సీఎం పాల్గొన్నారు. మంత్రి మహమూద్ అలీ, ఎంపీ అసదుద్దీన్ ఒవైసీ సహా పలువురు ఇస్లాం మత పెద్దలు, ఇతర ప్రముఖులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా సీఎం కేసీఆర్ మాట్లాడుతూ 'హిందూ, ముస్లిం, క్రిస్టియన్ సోదరులు కలిసిమెలిసి ముందుకు సాగుతూ, ప్రార్థనలు చేసుకుంటూ ఐకమత్యాన్ని చాటుతున్నారు.

యావత్ భారతదేశం తెలంగాణను చూసి నేర్చుకోవచ్చు. రాష్ట్రంలో ఇదే విధమైన సుహృద్భావ పరిస్థితులు సదా కొనసాగాలని ఆకాంక్షిస్తున్నాను. ఎల్లవేళలా శాంతి నెలకొని ఉండాలని ప్రార్థిస్తున్నాను' అని తెలిపారు.

ఈ కార్యక్రమంలో మంత్రులు హరీశ్ రావు, ప్రశాంత్‌రెడ్డి, మల్లారెడ్డి, మహమూద్‌అలీ, పువ్వాడ అజయ్ కుమార్, ఎర్రబెల్లి దయాకర్‌రావు, సబితాఇంద్రారెడ్డి, సత్యవతి రాథోడ్ ఎమ్మెల్సీ పల్ల రాజేశ్వర్‌రెడ్డి, స్థానిక ఎమ్మెల్యే దానం నాగేందర్, ప్రభుత్వ విప్ బాల్క సుమన్, కోర్కంటి చందర్, ఎమ్మెల్సీ మధుసూదనా చారి, ప్రణాళికా సంఘం వైస్ చైర్మెన్ వినోద్‌కుమార్, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతికుమారి, బేవరేజెస్ కార్పొరేషన్ చైర్మెన్ గజ్జల నగేష్, ఆర్అండ్‌బీ ముఖ్యకార్యదర్శి శ్రీనివాసరాజు, ఈఎన్‌సీ, గణపతిరెడ్డి, దేవదాయ శాఖ కమిషనర్ అనిల్ కుమార్, సచివాలయ ఉద్యోగుల సంఘం అధ్యక్షులు మాధవరం నరేందర్‌రావు, మంగ తదితరులు పాల్గొన్నారు.



రజక వృత్తిదారుల రక్షణ చట్టం కోసం రాష్ట్ర వ్యాప్త ఉద్యమం

రాష్ట్ర స్థాయి వర్క్‌షాప్‌లో పైళ్ల ఆశయ్య

నవతెలంగాణ-హైదరాబాద్‌బ్యూరో

రజక వృత్తిదారుల రక్షణ చట్టం కోసం రాష్ట్ర వ్యాప్త ఉద్యమం చేపట్టాలని తెలంగాణ రజక వృత్తిదారుల సంఘం ప్రధాన కార్యదర్శి పైళ్ల ఆశయ్య అన్నారు. వృత్తిదారులపై సామాజిక వివక్ష, దాడులు పెరిగిపోయాయనీ, సామాజికంగా చిన్న చూపు చూడబడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. తెలంగాణ రజక వృత్తిదారుల సంఘం రెండ్రోజుల రాష్ట్ర స్థాయి చైతన్య సభల వర్క్‌షాప్ ముగింపు కార్యక్రమం ఉపాధ్యక్షులు చిటికెన ముసలయ్య అధ్యక్షతన శుక్రవారం హైదరాబాద్ సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో జరిగింది. ఈ సందర్భంగా రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పైళ్ళ ఆశయ్య మాట్లాడారు. రాష్ట్రవ్యాప్తంగా రజక వృత్తిదారులపై 44చోట్ల దౌర్జన్యాలు, మహిళలపై 14 అత్యాచారాలు, సామాజిక దాడులు జరిగాయని వివరించారు. రజకులకు రక్షణ కల్పించడంలో ప్రభుత్వం విఫలమైందని విమర్శించారు. 40 ఏండ్లుగా అమల్లో ఉన్న రజక ఫెడరేషన్‌కు పాలక మండళ్ళు వేయకుండా ప్రభుత్వం కాలయాపన చేస్తూ, వాటిని రద్దు చేయడానికి ప్రయత్నం చేస్తున్నదని ఆందోళన వ్యక్తం చేశారు. గృహలక్ష్మి పథకం నిరుపేద వృత్తిదారులకు వర్తించేలా అవకాశాలు కల్పించాలనీ, 50 ఏండ్లు నిండిన రజక వృత్తిదారులకు పెన్షన్ ఇవ్వాలనీ, వీరనారి ఐలమ్మ విగ్రహాన్ని ట్యాంక్ బండ్‌పై పెట్టాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో రాష్ట్ర సీనియర్ నాయకులు పీ సోమయ్య, అన్నారుపు వెంకటేశ్వర్లు, ఎదునూరి మదర్, సీ మల్లేష్, జ్యోతి, ఉపేందర్, కంచర్ల కుమారస్వామి, మంజుల, బాగ్యా తదితరులు పాల్గొన్నారు.

సామాజిక సమీకరణాలపై కాంగ్రెస్ ఫోకస్

(మొదటిపేజీ తరువాయి)

సామాజిక వర్గాలకు సైతం వీలైనంత ఎక్కువ ప్రాధాన్యత ఇవ్వాలని కాంగ్రెస్ పార్టీ భావిస్తోంది. బీఆర్ఎస్‌లో ముదిరాజ్, మాదిగ సామాజిక వర్గాలకు ప్రాధాన్యత లభించకపోవడంపై టీపీసీసీ అధ్యక్షులు, ఎంపీ ఎనుముల రేవంత్‌రెడ్డి, ఎంపీ ఉత్తమ్ కుమార్‌రెడ్డి లాంటి కీలక కాంగ్రెస్ నేతలు ఇప్పటికే పలుమార్లు విమర్శలు చేశారు. ఇప్పుడు ఇదే అంశాన్ని మరింత బలంగా ప్రజల్లోకి తీసుకెళ్లాలని భావిస్తున్నారు.

పోటెత్తిన దరఖాస్తులు

రానున్న అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్ టికెట్లు ఆశించే వారి నుంచి దరఖాస్తుల స్వీకరణ ప్రక్రియ పూర్తయింది. దరఖాస్తులకు ఇవాళ చివరి రోజు కావడంతో పెద్ద ఎత్తున ఆశావహులు గాంధీభవన్‌కి వచ్చారు. 723 దరఖాస్తులు రాగా.. శుక్ర వారం అవి 1000కి దాటాయి. ఇల్లెందుల నుంచి అత్యధికంగా 38 మంది దర ఖాస్తు చేసుకున్నారు. కాగా కొందరు నేతలు ఒకటి కంటే ఎక్కువ స్థానాలకు దరఖాస్తు చేసుకుంటున్న ధోరణి కూడా ఉన్నది. ఆశావాహులు పెద్ద ఎత్తున దర ఖాస్తు చేసుకున్నారు. ప్రతి నియోజకవర్గానికి సగటున 8-9 మంది అభ్యర్థులు పోటీ పడుతున్నారు. అంతేకాకుండా టికెట్ల కోసం ఒకే నియోజకవర్గంలో ఒకే కుటుంబం నుంచి వేర్వేరుగా దరఖాస్తు చేసుకున్న వారు కూడా ఉన్నారు.

తప్పుకున్న జానారెడ్డి

ఎన్నికల పర్వం నుంచి మాజీ ప్రతిపక్ష నేత కె జానారెడ్డి తప్పుకున్నారు. ఆయన ఇద్దరు కుమారులతో దరఖాస్తు చేయించారు. నాగార్జునసాగర్ టిక్కెట్ కోసం జైవీర్‌రెడ్డి, మిర్యాలగూడ టికెట్ కోసం రఘువీర్ రెడ్డి దరఖాస్తు చేశారు. అంథోల్ నుంచి మాజీ ఉపముఖ్యమంత్రి దామోదర రాజనర్సింహ, ఆయన కుమార్తె కూడా దరఖాస్తు చేసుకున్నారు. కరీంనగర్ నియోజకవర్గానికి సీఎం కేసీఆర్ సోదరుడు రంగారావు కుమార్తె రమ్యారావు, ఆమె కుమారుడు రితేష్‌రావు దరఖాస్తు చేశారు. ముషీరాబాద్ టికెట్ కోసం కాంగ్రెస్ నేత అంజన్ కుమార్ యాదవ్, ఆయన కొడుకు అనిల్‌కుమార్ యాదవ్ అర్జీ పెట్టుకున్నారు. ఎమ్మెల్యే సీతక్క, ఆమె కుమారుడు సూర్య దరఖాస్తు చేశారు. జూబ్లీహిల్స్ నుంచి పీజేఆర్ కుమారుడు పి విష్ణువర్ధన్‌రెడ్డి, ఖైరతాబాద్ నుంచి పి విజయారెడ్డి, హుజురునగర్, కోదాడ నుంచి భార్యాభర్తలు ఎన్ ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, ఉత్తమ్ పద్మావతి దర ఖాస్తు చేసుకున్నారు. ఇదిలా ఉండగా ఎల్బీనగర్ నుంచి మాజీ ఎంపీ మధుయాష్కీగౌడ్, కంటోన్మెంట్‌కు సర్వే సత్యనారాయణ, కొల్లాపూర్ నుంచి యువ నేత కేతూరి వెంకటేష్, మిర్యాలగూడ నుంచి వికలాంగుల చైర్మెన్ ముత్తినేని వీరయ్య అర్జీ పెట్టుకున్నారు. సీనియర్ నేతలు వి హనుమంతరావు, నాగం జనార్ధన్‌రెడ్డి, గీతారెడ్డి, రేణుకాచౌదరి దరఖాస్తు చేసుకోలేదు.

ఐదేండ్లపాటు పార్టీకి సమయమిస్తే టికెట్ ఇవ్వొచ్చు

ఒకే కుటుంబానికి రెండు టికెట్లు కేటాయించకూడదనే నిబంధనపై ఉదయ్‌పూర్ కాంగ్రెస్ చింతన్ శిబిర్‌లో స్పష్టత ఇచ్చింది. పార్టీ కోసం కనీసం ఐదేండ్లపాటు సమయం కేటాయించినట్లైతే ఒక కుటుంబంలోని రెండో సభ్యుడికి టిక్కెట్ ఇచ్చే విషయాన్ని ఆలోచించవచ్చు అని తెలిపింది.

తెలంగాణ సాహితి ఉర్దూ లిటరరీ ఫెస్ట్‌లో వక్తలు

సర్వమానవ సౌభ్రాతృత్వమే మఖ్దూం మొయినుద్దీన్‌కు నివాళి

నవతెలంగాణ-హైదరాబాద్‌బ్యూరో

కుల, మత, ప్రాంత, భాష, లింగ భేదం లేని సర్వమానవ సౌభ్రాతృత్వమే స్వాతంత్ర్య సమరయోధుడు, ప్రముఖ అభ్యుదయ కవి మఖ్దూం మొయినుద్దీన్‌కు ఇచ్చే అసలైన నివాళి అని పలువురు వక్తలు అన్నారు. మఖ్దూం మొయినుద్దీన్ వర్ధంతి సందర్భంగా తెలంగాణ సాహితి ఆధ్వర్యంలో శుక్రవారంనాడిక్కడి సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో 'ఉర్దూ లిటరరీ ఫెస్ట్' నిర్వహించారు. తెలంగాణ సాహితి రాష్ట్ర కార్యదర్శి కే ఆనందాచారి అధ్యక్షతన జరిగిన ప్రారంభ కార్యక్రమంలో ప్రముఖ కవి, శాసనమండలి చైర్మెన్ వ్యక్తిగత కార్యదర్శి డాక్టర్ ఏనుగు నర్సింహారెడ్డి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. కార్యక్రమ కన్వీనర్, రచయిత మహ్మద్ అబ్దుల్ రషీద్, ప్రముఖ కవయిత్రి జమీలా నిషాత్, పార్సీ, ఉర్దూ భాషావేత్త డాక్టర్ రవూఫ్ ఖైర్, ప్రముఖ కవులు యాకూబ్, అబ్దుల్ వాహెద్, ఆవాజ్ రాష్ట్ర కార్యదర్శి అబ్బాస్, తెలంగాణ సాహితి అధ్యక్షులు వల్లభాపురం జనార్ధన, ఇస్లామియా సాహిత్య వేదిక ఉపాధ్యక్షులు సయ్యద్ రియాజ్ తన్వా తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మఖ్దూం మొయినుద్దీన్ అభ్యుదయ భావాలు, కవిత్వం, ప్రజా చైతన్యం కోసం చేసిన కృషిని కొనియాడారు. మానవతా సమాజ నిర్మాణం కవిత్వంతోనే సాధ్యమవుతుందని ఆయన విశ్వసించారని చెప్పారు. ఉర్దూ భాష ఓ మతానికి సంబంధించినది కాదనీ, అది మానవుల అంతర్జాతీయ భాష అని అభిప్రాయపడ్డారు. భాషతో సహజీవనం నుంచే ప్రేమాభిమానాలు, బంధుత్వాలు ఏర్పడతాయని ఉదహరించారు. తెలంగాణ రాష్ట్ర చరిత్ర తెలుగు, ఉర్దూ, హిందీ, ఇంగ్లీషు భాషల సమాహారంగా వర్ధిల్లుతుందనీ, దీన్ని విచ్ఛిన్నం చేయడానికి కొన్ని శక్తులు కుట్రలు చేస్తున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. చరిత్రను వక్రీకరిస్తూ, ప్రజల మధ్య విభజన తెచ్చే దుష్ట శక్తులను తరిమికొట్టడంలో కవులు, రచయితల పాత్ర మరింత పెరగాలని ఆకాంక్షించారు. అనేకమంది ముస్లిం రచయితలు తెలుగులో రచనలు చేశారని చెప్పారు. తెలుగు రాష్ట్రాల్లో తెలుగు మీడియం పాఠశాలల సంఖ్య తగ్గుతున్నదనీ, ఉర్దూ అకాడమీకి నిధులే లేవని ఆక్షేపించారు. భాషా పరిరక్షణ భాధ్యతను అందరూ స్వీకరించాలని విజ్ఞప్తి చేశారు.



ముఖ్దూం మొయినుద్దీన్ కవితలతో కూడిన క్యాలండర్‌ను ఆవిష్కరిస్తున్న నేతలు

మైమరిపించిన ముషాయిరా

తెలంగాణ సాహితి నిర్వహించిన 'ఉర్దూ లిటరరీ ఫెస్ట్'లో కవులు తమ ముషాయిరాను గొప్పగా చదివి వినిపించారు. భాష, అభ్యుదయం, సాహిత్యం, లోకంపోకడ, మతోన్మాద ప్రమాదం, సమాజ కర్తవ్యాలను నిర్దేశిస్తూ కవులు తమ కవితల్ని చదివారు. మూడు సెషన్స్‌లో జరిగిన లిటరరీ ఫెస్ట్ రాత్రి వరకు కొనసాగింది. తొలి సెషన్‌కు షేక్ సలీమ అధ్యక్షత వహించగా, సౌత్ ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఇస్లామిక్ లిటరేచర్ జాతీయ అధ్యక్షులు అబూ నబీల్ ఖాజా మసీహుద్దీన్ అతిథిగా హాజరయ్యారు. ముజాహిద్ సమన్వయ కర్తగా వ్యవహరించారు.

రెండో సెషన్‌కు ఖాజా మొహియుద్దీన్ అధ్యక్షత వహించగా, ఎస్వీఆర్ ఇంటర్నేషనల్ క్లబ్ చైర్మెన్ మిన్హాజ్ అహ్మద్ ఖాన్ అతిథిగా పాల్గొన్నారు. సమన్వయకర్తగా తంగిరాల చక్రవర్తి వ్యవహరించారు.

మూడో సెషన్‌కు వాహెద్‌ఖాన్ అధ్యక్షత వహించగా,ఎమ్ నరహరి అతిథిగా వ్యవహరించారు. గౌస్‌భాషా సమన్వయం చేశారు. అనంతోజు మోహనకృష్ణ, మేగోటి రేఖ ఫెస్ట్ నిర్వహణలో భాగస్వాములు అయ్యారు. కార్యక్రమ ప్రారంభంలో మఖ్దూం మొయినుద్దీన్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా జనవిజ్ఞాన వేదిక రూపొందించిన మఖ్దూం మొయినుద్దీన్ కవితలతో కూడిన కేలండర్‌ను ఏనుగు నర్సింహారెడ్డి ఆవిష్కరించారు. జనవిజ్ఞాన వేదిక బాధ్యులు రాజా తదితరులు పాల్గొన్నారు.

మా సీఎం అభ్యర్థి కేసీఆర్.. మరి మీ అభ్యర్థి..?

- వంద సీట్లు గెలుస్తం.. : ఎమ్మెల్సీ కవిత
- ఎంపీ అరవింద్‌కు ఇవే ఆఖరి ఎన్నికలు : జీవన్‌రెడ్డి

నవతెలంగాణ-ఆర్మూర్



రానున్న అసెంబ్లీ ఎన్నికల్లో 100 సీట్లతో గెలుస్తామని, బీఆర్ఎస్‌లో ముఖ్యమంత్రి అభ్యర్థి కేసీఆర్.. మరి కాంగ్రెస్, బీజేపీలో ఎవరో చెప్పాలని ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత సవాల్ విసిరారు. నిజామాబాద్ జిల్లా ఆర్మూర్ పట్టణంలోని పెర్కిట్ బైపాస్ నుంచి అంకాపూర్ వరకు ఎమ్మెల్యే జీవన్‌రెడ్డి శుక్రవారం ప్రజా ఆశీర్వాద ర్యాలీ నిర్వహించారు. ర్యాలీలో పాల్గొన్న ఎమ్మెల్సీ కవిత మాట్లాడుతూ.. మూడోసారి కూడా ఆర్మూర్ నుంచి జీవన్‌రెడ్డిని ఎమ్మెల్యేగా గెలిపించుకోవాలని కార్యకర్తలను కోరారు. 115 మంది అభ్యర్థులను ఒకేసారి ప్రకటించి దేశంలోనే బీఆర్ఎస్ పార్టీ రికార్డు సృష్టించిందని, 100కు పైగా ఎమ్మెల్యే సీట్లు గెలుస్తామని అన్నారు. ఆర్మూర్ నుంచి ఒక పంతం పట్టిపోదామని, తగ్గేదే లేదని అన్నారు.

జీవన్‌రెడ్డి మాట్లాడుతూ.. ఎంపీ అరవింద్‌కు ఇవే ఆఖరి ఎన్నికలని, ఎక్కడ పోటీ చేసినా వేటాడి, వెంటాడి ఓడిస్తామని స్పష్టం చేశారు. ఈ రోజు ఎంపీ అరవింద్ బర్త్ డే అని, వచ్చే బర్త్ డే నాటికి మాజీ ఎంపీ కాక తప్పదని అన్నారు. బీఆర్ఎస్‌ది అభివృద్ధి, విపక్షాలది దుర్బుద్ధి అని విమర్శించారు. ఈ కార్యక్రమంలో రాజ్యసభ సభ్యులు కెఆర్.సురేష్ రెడ్డి, చైర్మెన్లు మార గంగారెడ్డి, డాక్టర్ మధు శేఖర్, ఆకుల లలిత, జెడ్పీ చైర్మెన్ దాదన్నగారి విఠల్‌రావు, సీనియర్ నాయకులు రాజారామ్ యాదవ్, కోటపాటి నరసింహ నాయుడు, ప్రజాప్రతినిధులు, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

జనశక్తి నేత కూర రాజన్న, అమర్ అరెస్ట్

నవతెలంగాణ-మిర్యాలగూడ

జనశక్తి నేత కూర రాజన్న, అరుణోదయ గాయకురాలు విమలక్క భర్త అమర్‌తోపాటు మరో ముగ్గురిని పోలీసులు అరెస్టు చేశారు. నల్లగొండ జిల్లా మాడుగులపల్లి మండలం గాజువాక సమీపంలోని ఓ బత్తాయి తోటలో సమావేశం నిర్వహిస్తుండగా గురువారం మధ్యాహ్నం పోలీసులు రెక్కీ నిర్వహించి అరెస్టు చేశారు. సాయంత్రం వరకు సుమారు మూడు గంటలపాటు ఆ తోటలోనే విచారించారు. అనంతరం జిల్లా పోలీసు అధికారుల సూచన మేరకు జిల్లా కేంద్రంలోని డీటీఎస్‌కు తరలించారు.

అక్కడ కొద్దిసేపు విచారించాక వ్యక్తిగత పూచీకత్తుపై విడుదల చేశారు. ఎక్కడ అరెస్టు చేశారో అక్కడే ఉంచి ఇద్దరు పోలీసులను బందోబస్తు పెట్టారు. శుక్రవారం పోలీస్ స్టేషన్‌కి రావాలని ముందే సూచించగా.. మధ్యాహ్న భోజనం తర్వాత వారిని జిల్లా పోలీసు అధికారుల ముందు ప్రవేశపెట్టారు.

అరెస్టు అయిన వారిలో వారిద్దరితోపాటు ఛత్తీస్‌గఢ్ రాష్ట్రానికి చెందిన మరో ముగ్గురు రైతు నాయకులు ఉన్నట్టు సమాచారం. దేశవ్యాప్తంగా జరగబోయే రైతు ఉద్యమాల గురించి చర్చించేందుకు రెండ్రోజులపాటు ఇక్కడ సమావేశాలు పెట్టుకున్నట్టు సమాచారం. వీరిని అదుపులోకి తీసుకున్నాక బ్యాగులను తనిఖీ చేశారు. అమర్ బ్యాగులో ఒక లేఖ ఉన్నట్టు పోలీసు వర్గాల సమాచారం.



పోలీసులు వేధింపులు అధికమయ్యాయి విలేకర్లతో రాజన్న, అమర్

ఈ మధ్యకాలంలో పోలీసుల వేధింపులు ఎక్కువయ్యాయని జనశక్తి నేత కూర రాజన్న, విమలక్క భర్త అమర్ ఆరోపించారు. శుక్రవారం వారు తమను కలిసిన విలేకరులతో మాట్లాడారు. తాము జైలు నుంచి విడుదలయ్యాక అడుగడుగునా పోలీసులు వేధిస్తున్నారని చెప్పారు. వరంగల్ జిల్లాలో ముంపు బాధితులను పరామర్శించేందుకు వెళితే అక్కడా ఇబ్బందులు పెట్టారని, ఖమ్మం జిల్లాలో కూడా పోలీసులు అనేక రకాలుగా ఇబ్బందులకు గురి చేశారని అన్నారు.

తమ సంఘం విద్రోహ కార్యక్రమాలు చేపట్టడం లేదని, తమ సంఘం నిషేధితం కాదని, అలాంటప్పుడు తమను ఎందుకు ఇబ్బందులు పెడుతున్నారని ప్రశ్నించారు. పోలీసులు కావాలనే వేధిస్తున్నారన్నారు.

మతోన్మాదాన్ని ఐక్యంగా తరిమికొడదాం

- అరుణోదయ సాంస్కృతిక సమాఖ్య చైర్మెన్ విమలక్క
- మణిపూర్ అకృత్యాలకు వ్యతిరేకంగా ప్రజాప్రదర్శన సదస్సు



సిరిసిల్ల అంబేద్కర్ చౌరస్తాలో మణిపూర్ ఘటనపై నిరసన వ్యక్తం చేస్తున్న అఖిలపక్ష నేతలు

నవతెలంగాణ - సిరిసిల్ల రూరల్

మణిపూర్ మంటలకు కారణమైన మతోన్మాదాన్ని ఉపేక్షిస్తే మనదాకా వస్తుందని, దాన్ని ఐక్యంగా తరిమికొట్టాలని అరుణోదయ సాంస్కృతిక సమాఖ్య చైర్మెన్ విమలక్క అన్నారు. మణిపూర్ మహిళలపై అకృత్యాలకు వ్యతిరేకంగా శుక్రవారం రాజన్న సిరిసిల్ల జిల్లా కేంద్రంలో ప్రజాప్రదర్శన నిర్వహించారు. సీపీఐఎంఎల్ న్యూ డెమోక్రసీ రాష్ట్ర నాయకులు జెవి.చలపతిరావు అంబేద్కర్ విగ్రహానికి నివాళులు అర్పించి ప్రదర్శనను ప్రారంభించారు. అనంతరం గాజుల మల్లయ్య కల్యాణ మండపంలో గొట్టే రుక్మిణి అధ్యక్షతన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా విమలక్క మాట్లాడుతూ.. మణిపూర్ విధ్వంసం కుట్రపూరితంగానే జరిగిందన్నారు. కలిసిమెలిసి ఉన్న ప్రజల్లో విద్వేషాలను రెచ్చగొట్టి హింసాకాండకు కారణమైన పాలకులపై ఎలాంటి చర్యలూ లేకపోవడం పట్ల ఆవేదన వ్యక్తం చేశారు. మణిపూర్, నాగాలాండ్‌తో మొదలై దేశం మొత్తం మీద విద్వేషాలను రెచ్చగొడుతున్న బీజేపీ అకృత్యాలను అడ్డుకోకపోతే మనదాకా వచ్చే ప్రమాదం ఉందన్నారు. సీపీఐఎంఎల్ న్యూడెమోక్రసీ రాష్ట్ర నాయకులు జెవి చలపతిరావు మాట్లాడుతూ.. ఉన్మాదంతో అధికారంలోకి రావాలని బీజేపీ అనుసరిస్తున్న విధానాలను ప్రజలు అర్థం చేసుకోవాలని కోరారు. గుజరాత్‌లో ఏం జరిగిందో ఆలోచిస్తే.. దేశ మొత్తం మీద అలాంటి ఫార్ములానే ప్రయోగిస్తున్నారని అర్థమవుతుం దన్నారు. ఇది దేశానికి ప్రమాదకరమని ఆందోళన వ్యక్తం చేశారు. ప్రొఫెసర్ లక్ష్మి మాట్లాడుతూ.. మణిపూర్ ఘటన వెనుక మూలాలను అర్థం చేసుకోవాలన్నారు. ఈ సందర్భంగా మణిపూర్ అకృత్యాలపై సదస్సు పలు తీర్మానాలు చేసింది. అరుణోదయ కళాకారులు ఆలపించిన ఉద్యమ గీతాలు సభికులను ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో మాల మహానాడు జాతీయ ఉపాధ్యక్షులు రాగుల రాములు, సీపీఐ(ఎం) జిల్లా కార్యదర్శి ముషం రమేష్, గుంటి వేణు బోజ్జ కనకయ్య, చేన్నమనేని పురుషోత్తం రావు, గుండా థామస్, దోసల చంద్రం, కంచర్ల రవి గౌడ్, మార్వాడి గంగరాజు, సాయికుమార్, సౌమ్య కృష్ణవేణి తదితరులు పాల్గొన్నారు.

మోడీ, కేసీఆర్, అసదుద్దీన్ తోడు దొంగలు

- రాజ్‌భవన్‌లో రహస్య చర్చలు ఎందుకు..?
- టీపీసీసీ అధ్యక్షులు రేవంత్ రెడ్డి
- కాంగ్రెస్‌లో చేరిన బీజేపీ నేత ఎన్‌పి వెంకటేశ్

నవతెలంగాణబ్యూరో-హైదరాబాద్

ప్రధాని మోడీ, ముఖ్యమంత్రి కేసీఆర్, ఎంఐఎం అధినేత అసదుద్దీన్ ఒవైసీ ముగ్గురూ తోడు దొంగలేనని టీపీసీసీ అధ్యక్షులు, ఎంపీ ఎనుముల రేవంత్‌రెడ్డి విమర్శించారు. వారి రూపం వేరుగా ఉన్నా మనస్సు ఒక్కటేనని ఎద్దేవా చేశారు. మోడీకి మద్దతిస్తున్న కేసీఆర్‌ను అసదుద్దీన్ ఎందుకు ప్రశ్నించడం లేదని నిలదీశారు. మైనార్టీలు ఈ విషయాన్ని గమనించాలని కోరారు. బీఆర్ఎస్, ఎంఐఎంకు ఓటు వేస్తే బీజేపీకి వేసినట్టేనని అభిప్రాయపడ్డారు. మహబూబ్‌నగర్ నియోజకవర్గానికి చెందిన బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు, ప్రముఖ న్యాయవాది ఎన్‌పీ వెంకటేశ్‌తోపాటు పలువురు బీజేపీ, బీఆర్ఎస్ నాయకులు శుక్రవారం జూబ్లీహిల్స్‌లోని రేవంత్ నివాసంలో కాంగ్రెస్‌లో చేరారు. ఆయన వారికి కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా రేవంత్ మాట్లాడుతూ సీఎం కేటీఆర్‌కు ధరణి పోర్టల్ ఏటీఎంగా మారిందని ఆరోపించారు. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిన తర్వాత ధరణిని కచ్చితంగా రద్దు చేస్తామని పునరుద్ఘాటించారు. ధరణి కంటే మెరుగైన విధానాన్ని తీసుకొచ్చి భూములకు రక్షణ కల్పిస్తామన్నారు. ధరణి ఉన్నంత కాలం దళిత, గిరిజనుల భూములకు రక్షణ లేదని చెప్పారు. ధరణి వచ్చిన తర్వాత 35 లక్షల ఎకరాల దళిత, గిరిజన భూములను కొల్లగొట్టారనీ, కలెక్టర్లను అడ్డంపెట్టుకుని బీఆర్ఎస్ పెద్దలు భూములు దోచుకుంటున్నారని విమర్శించారు. ధరణి పనితీరుపై రాష్ట్రంలోని 12వేల గ్రామాల్లో 'గ్రామ సభలు' పెట్టేందుకు సిద్ధమా..? అని ప్రభుత్వానికి సవాల్ విసిరారు. ధరణిని రద్దు చేస్తే రైతు బీమా, రైతు బంధు ఎలా వస్తుందన్న కేసీఆర్ వ్యాఖ్యలపై ఆయన స్పందిస్తూ...2018లో రైతుబంధు, రైతుబీమా తీసుకొచ్చారన్నారు. ధరణి వచ్చింది 2022లోనని గుర్తు చేశారు. బీఆర్ఎస్ ప్రభుత్వం రాకముందే రైతు రుణమాఫీ, పంట నష్టం చెల్లించిన ఘనత కాంగ్రెస్ పార్టీదేనన్నారు. మంత్రి శ్రీనివాస్‌గౌడ్ దోపిడీని ప్రశ్నిస్తే, బీసీ కార్డును ముందుపెడుతున్నారని చెప్పారు. ప్రగతిభవన్, రాజ్‌భవన్ మధ్య అగాధం ఉన్నట్టు కేసీఆర్ ప్రజలను నమ్మించారని అన్నారు. రాజ్‌భవన్‌లో గవర్నర్, సీఎం రహస్య చర్చల సారాంశం ఏమిటని ప్రశ్నించారు. వీళ్లిద్దరి మధ్య ఎన్నికల పొత్తు అయినట్టా? కానట్టా? ప్రజలు ఆలోచించాలని ప్రజలను కోరారు. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన తర్వాత పెన్షన్లు రూ. 4వేలకు పెంచుతామన్నారు. రెండు లక్షల ప్రభుత్వ ఉద్యోగాల ఖాళీలు భర్తీ చేయడంతోపాటు రూ.500లకే గ్యాస్ సిలిండర్ అందిస్తామన్నారు. ఆరోగ్యశ్రీ ద్వారా పేదలకు రూ.5 లక్షల వరకు వైద్య ఖర్చులు ప్రభుత్వమే భరిస్తుందన్నారు. ఇల్లు కట్టుకునే ప్రతీ పేదవాడికి రూ.5 లక్షల సాయం అందిస్తామన్నారు రేవంత్ రెడ్డి పేర్కొన్నారు.

మినీ డీఎస్సీ వద్దు..మెగా డీఎస్సీ కావాలి

- 13,500 ఉపాధ్యాయ పోస్టులను భర్తీ చేయాలి
- విద్యాశాఖ కార్యాలయం వద్ద అభ్యర్థుల ఆందోళన
- అరెస్టు చేసిన పోలీసులు

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

రాష్ట్రంలో ఐదు వేల ఉపాధ్యాయ పోస్టుల భర్తీకి డీఎస్సీ నోటిఫికేషన్‌ను విడుదల చేస్తున్నట్టు విద్యాశాఖ మంత్రి పి సబితా ఇంద్రారెడ్డి ప్రకటనపై అభ్యర్థులు ఆగ్రహం వ్యక్తం చేశారు. 'మాకు మినీ డీఎస్సీ వద్దు... మెగా డీఎస్సీ కావాలి'అంటూ డిమాండ్ చేశారు. అసెంబ్లీలో ముఖ్యమంత్రి కేసీఆర్ ప్రకటించినట్టుగా 13,500 ఉపాధ్యాయ పోస్టులను భర్తీ చేయాలని కోరారు. ఇందుకోసం పాఠశాల విద్యాశాఖ సంచాలకుల కార్యాలయం వద్ద వందలాది మంది అభ్యర్థులు ఆందోళన చేపట్టారు. ఫ్లకార్డులు ప్రదర్శించి నిరసన వ్యక్తం చేశారు. అక్కడే బైఠాయించి నినాదాలు చేశారు. అయితే అప్పటికే పెద్దఎత్తున పోలీసులు మోహరించడంతో అభ్యర్థులను అరెస్టు చేశారు. గోషామహల్ పోలీస్ స్టేషన్‌కు తరలించారు. అయితే ఐదు వేల ఉపాధ్యాయ పోస్టుల భర్తీకి నోటిఫికేషన్‌ను జారీ చేస్తే చాలా జిల్లాల్లో ఖాళీలుండబోవని డీఎడ్, బీఎడ్ అభ్యర్థులు ఆందోళన వ్యక్తం చేశారు. ప్రభుత్వం స్పందించకుంటే వారంరోజుల్లో మళ్లీ పెద్దఎత్తున ఆందోళన చేస్తామని హెచ్చరించారు. రవీంద్రభారతి వద్ద కొందరు అబ్యర్థులను పోలీసులు అరెస్టు చేశారు. డీఎడ్, బీఎడ్ అభ్యర్థుల సంఘం నాయకులు హరీశ్, శ్రీను, సాయి, లక్ష్మణ్, చందు, ఇర్ఫాన్, భాను, కోటేశ్, కవిత, స్వప్న, మౌనిక, శ్రీలత, మంజుల తదితరులు పాల్గొన్నారు.

ఇంధనం లేక..గమ్యం చేరలేక..!

కదల్లేకపోతున్న అంబులెన్సులు

- ఐటీడీఏ పరిధిలో నెలల తరబడి పెండింగ్‌లో డీజిల్ బిల్లులు
- నిధుల భారంతో అవస్థలు పడుతున్న వైద్యులు
- పీహెచ్‌సీకి వెళ్లలేక నడిరోడ్డుపైనే మహిళ ప్రసవం

ఎవరికి ఆపదొచ్చినా నేనున్నానంటూ కుయ్.. కుయ్‌మంటూ పరుగెత్తుకొచ్చే అంబులెన్సులకే పెద్ద ఆపద వచ్చింది. ఇంధనం లేకపోవడంతో ఉన్నచోట నుంచి చక్రాలు కదల్లేని పరిస్థితి దాపురించింది. కుయ్..కుయ్ చప్పుడు తగ్గింది. ప్రభుత్వం డీజిల్ డబ్బులు సకాలంలో విడుదల చేయని కారణంగా పేదలకు వైద్య సేవలందించాల్సిన అంబులెన్సులు షెడ్డుకే పరిమితవుతున్నాయన్న విమర్శలు వినిపిస్తున్నాయి. ఫలితంగా అత్యవసరంలో ఆస్పత్రులకు వెళ్లాల్సిన గర్భిణీలు అవస్థలు పడుతున్నారు. తాజాగా నిర్మల్ జిల్లా పెంబీ మండలంలో చోటుచేసుకున్న ఘటన ఇందుకు నిదర్శనంగా నిలుస్తోంది. తులసీపేటకు చెందిన మహిళకు గురువారం రాత్రి పురిటి నొప్పులు రావడంతో కుటుంబీకులు 108కు ఫోన్ చేశారు. డీజిల్ అయిపోవడంతో అంబులెన్సు మార్గమధ్యలోనే నిలిచిపోయింది. ఫలితంగా గర్భిణి నడిరోడ్డుపైనే ప్రసవించింది. ఐటీడీఏ పరిధిలోని అన్ని అంబులెన్సులు డీజిల్ సమస్య ఎదుర్కొంటున్నాయి.

నవతెలంగాణ- ఆదిలాబాద్ ప్రాంతీయ ప్రతినిధి



ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలోని ఐటీడీఏ పరిధిలో గిరిజనులు, పేదలకు అత్యవసర వైద్య సేవల కోసం ప్రభుత్వం అంబులెన్సులను ప్రవేశపెట్టింది. అవ్వాల్, 102, 108 వాహనాలను వివిధ మండలాలకు కేటాయించింది. ఆయా మండలాల పరిధిలోని ఎవరికి సమస్య వచ్చినా ఈ వాహనాలు సకాలంలో వెళ్లి వైద్య సేవల కోసం ఆస్పత్రికి తీసుకొస్తుంటాయి. కానీ కొన్ని నెలలుగా ఇంధనం సమస్య ఉండటంతో సకాలంలో గమ్య స్థానాలకు చేరలేకపోతున్నాయి. నిర్మల్ జిల్లా పెంబీ మండలం తులసీపేటకు చెందిన మహిళకు పురిటి నొప్పులు రావడంతో కుటుంబీకులు ఆసుపత్రికి తీసుకెళ్లేందుకు రాత్రి 8గంటల సమయంలో 108కు ఫోన్ చేశారు. ఎడ్లబండి సాయంతో సదరు మహిళను వాగు దాటించారు. రోడ్డుపై అంబులెన్సు కోసం ఎదురుచూశారు. మార్గమధ్యలో డీజిల్ అయిపోవడం తో అంబులెన్స్ ఆగిపోయింది. ఆ వెంటనే సంబంధిత వైద్యుడికి ఫోన్ చేయగా.. ఆయన డీజిల్ కోసం డబ్బులు పంపించడం.. అక్కడ్నుంచి పెట్రోల్ బంకుకు వెళ్లి పోయించడం జరిగినా ఉపయోగం లేకుండా పోయింది. దీంతో 10.30గంటల సమయంలో నడిరోడ్డుపైనే మహిళ బిడ్డకు జన్మనిచ్చింది. ఆ తర్వాత వచ్చిన అంబులెన్స్ ద్వారా ఆమెను పెంబీ పీహెచ్‌సీకి, అక్కడి నుంచి ఖానాపూర్ ఆస్పత్రికి తరలించారు. ఆరు నెలల కిందట నార్నూర్ మండలం నాగల్‌కొండకు చెందిన గర్భిణికి కూడా ఇదే సమస్య ఎదురైంది. స్థానిక ఆశా కార్య కర్త సొంత డబ్బులతో అంబులెన్సులో డీజిల్ పోయించి ఆస్పత్రికి తీసుకెళ్లాల్సి వచ్చింది.

నెలల తరబడి పెండింగ్‌లో బిల్లులు..!

ఐటీడీఏ పరిధిలోని అంబులెన్సులకు డీజిల్ ఖర్చుల కోసం ప్రభుత్వం నుంచి రావాల్సిన బిల్లులు నెలల తరబడి పెండింగ్‌లో ఉంటున్నాయి. పెంబీ మండలంలో రెండు నెలల బిల్లులు రూ.19,500 వరకు రావాల్సి ఉందని అక్కడి సిబ్బంది చెబుతున్నారు. ఈ సమస్య ఒక్క పెంబీ మండలానికే కాకుండా ఐటీడీఏ పరిధిలోని అన్ని మండలాలు ఎదుర్కొంటున్నాయి. బిల్లులు రాకపోవడం తో సంబంధిత పీహెచ్‌సీ వైద్యులకే డీజిల్ పోయించే బాధ్యత అప్పగించారు. అప్పట్నుంచి వైద్యులు ముందుగా అంబులెన్సులో డీజిల్ పోయిస్తే ప్రభుత్వం నుంచి బిల్లులు వచ్చిన తర్వాత తీసుకోవాల్సి ఉంటుంది. ఒకటి, రెండు నెలలు మాత్రమే కాకుండా ఒక్కోసారి సుమారు ఆరు నెలలపాటు బిల్లులు రాకపోవడంతో వైద్యులు సైతం ఆర్థికభారం తో ఇబ్బందులు పడుతున్నారు. డీజిల్ లేని కారణంగా అంబులెన్సులు బాధితు లను ఆస్పత్రులకు చేర్చలేకపోతున్నాయి. కొన్ని సందర్భాల్లో సమస్య ఉన్న బాధితులే సొంత డబ్బులతో డీజిల్ పోయిస్తామని చెప్పి అంబులెన్సులను పిలిపిస్తున్నట్టు తెలుస్తోంది. ఈ పరిస్థితి చాలా మండలాల్లో ఉందని పలువురు చెబుతున్నారు. రోడ్లు బాగా లేకపోవడం కూడా అంబులెన్సులు గమ్య స్థానానికి చేరుకోలేక పోతున్నాయి. తాజాగా డీజిల్ సమస్య ఏర్పడింది. ఈ విషయమై నిర్మల్ జిల్లా వైద్యాధికారి ధన్‌రాజ్‌ను సంప్రదించగా.. అంబులెన్సులకు డీజిల్ సమస్య లేదని పేర్కొన్నారు.

నేడు మంచిరేవులకు సీఎం

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

స్వతంత్ర భారత వజ్రోత్సవ వేడుకల ముగింపు కార్యక్రమం సందర్భంగా రంగారెడ్డి జిల్లా మంచిరేవుల ఫారెస్ట్ రేక్ పార్కులో ముఖ్యమంత్రి కె.చంద్రశేఖర్ రావు శనివారం కోటి మొక్కలు నాటే కార్యక్రమంలో పాల్గొననున్నారు. తెలంగాణకు హరితహారం కార్యక్రమంలో భాగంగా రాష్ట్ర వ్యాప్తంగా ఈ నెల 26న ఒక రోజు, ఒక కోటి మొక్కలు రాష్ట్ర వ్యాప్తంగా నాటే కార్యక్రమం జరగనున్నది. మొయినాబాద్ మండలంలో ఫారెస్ట్ రేక్ పార్కు 256 ఎకరాల విస్తీర్ణంలో ఉండి డంపింగ్ యార్డ్‌ను తలపిస్తూ, భవన నిర్మాణ వ్యర్థాలతో నిండి ఉండేది. ఈ ప్రాంతాన్ని అభివద్ధి చేసి ఫారెస్ట్ రేక్ పార్కుగా మార్చారు. వివిధ రకాలకు చెందిన 50 వేల మొక్కలు నాటారు. నిర్మాణ శిధిలాలను తొలగించిన తర్వాత, ఆ ఖాళీ ప్రదేశాలలో 'పొద' జాతికి చెందిన 25 వేల మొక్కలు నాటినట్టు రాష్ట్ర సమాచార, పౌర సంబంధాలశాఖ ఒక ప్రకటనలో తెలిపింది.

బీఆర్ఎస్ పార్టీలో చేరికలు

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

ఇండియన్ మెడికల్ కౌన్సిల్ (ఐఎంఏ) రాష్ట్ర అధ్యక్షులు డాక్టర్ బీ.ఎన్.రావు, వివిధ జిల్లాల అధ్యక్షులు, వైద్యులు బీఆర్ఎస్ పార్టీలో చేరారు. శుక్రవారం హైదరాబాద్ తెలంగాణ భవన్‌లో నిర్వహించిన ఈ కార్యక్రమంలో మంత్రులు హరీశ్ రావు, గంగుల కమలాకర్, ప్లానింగ్ బోర్డు వైస్ చైర్మెన్ వినోద్ కుమార్ గులాబీ కండువా కప్పి పార్టీలోకి వారిని ఆహ్వానించారు. ఈ సందర్భంగా హరీశ్ రావు బీఆర్ఎస్ ప్రభుత్వం చేసిన అభివృద్ధినీ, కేంద్రంలో బీజేపీ సర్కార్ వైఫల్యాలను వివరించారు.

మనోభావాలు దెబ్బతింటే సారీ

- తలసాని శ్రీనివాస్ యాదవ్

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

ముషీరాబాద్ స్టీల్ బ్రిడ్జి ఓపెనింగ్ సందర్భంగా జరిగిన సంఘటనపై మంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్ స్పందించారు. ఆ రోజు తన కాలును ఒక వ్యక్తి తొక్కడంతో గాయమై రక్తమొచ్చిందనీ, అందుకే ఆ వ్యక్తి నెట్టివేశానని తెలిపారు. ఈ ఘటనలో కాలు తొక్కిన గిరిజనునికి వెంటనే ఫోన్ చేసి సారీ చెప్పానని చెప్పారు. ఈ ఘటనలో వారి మనోభావాలు దెబ్బతింటే క్షమించాలని కోరారు.

అంగన్వాడీ టీచర్లు, హెల్పర్లకు ముఖ్యమంత్రి కేసీఆర్ శుభవార్త

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

రాష్ట్రంలో ఉన్న 3,989 మినీ అంగన్‌వాడీ కేంద్రాలను ప్రధాన అంగన్‌వాడీ కేంద్రాలుగా అప్‌గ్రేడ్ చేస్తూ రాష్ట్ర ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. అంగన్‌వాడీ టీచర్లు, మినీ అంగన్‌వాడీ టీచర్లు, అంగన్‌వాడీ హెల్పర్‌లకు ఏప్రిల్ 30 నాటికి 65 ఏళ్ల వయస్సును నిర్దేశించారు. ఉద్యోగ విరమణ చేసే అంగన్‌వాడీ టీచర్లకు ప్రత్యేక ఆర్థిక సాయం కింద అంగన్‌వాడీ టీచర్‌లకు రూ. ఒక లక్ష మినీ అంగన్‌వాడీ టీచర్లు, అంగన్‌వాడీ హెల్పర్‌లకు రూ.50 వేలు అందజేస్తూ నిర్ణయం తీసుకున్నారు. అంగన్వాడీ టీచర్లకు, హెల్పర్లకు పదవి విరమణ తర్వాత ఆసరా పెన్షన్ మంజూరు చేయనున్నారు. ఈ నిర్ణయాల పట్ల మంత్రి సత్యవతి రాథోడ్ సీఎం కేసీఆర్‌కు కృతజ్ఞతలు తెలిపారు.

హామీలకు కట్టుబడి ఉండాలి : అంగన్వాడీ యూనియన్

అంగన్‌వాడీ సంఘాలకు ప్రభుత్వం ఇచ్చిన హామీలకు కట్టుబడి ఉండాలని తెలంగాణ అంగన్వాడీ టీచర్స్ , హెల్పర్స్ యూనియన్ (సీఐటీయూ అనుబంధం) రాష్ట్ర కమిటీ డిమాండ్ చేసింది. ఈ మేరకు శుక్రవారం ఆ యూనియన్ రాష్ట్ర అధ్యక్షురాలు కె.సునీత, ప్రధాన కార్యదర్శి పి.జయలక్ష్మి, కోశాధికారి పి. మంగ ఒక ప్రకటన విడుదల చేశారు.

వ్యవసాయ సలహాదారుగా చెన్నమనేని రమేశ్‌బాబు

నవతెలంగాణ-హైదరాబాద్‌బ్యూరో

తెలంగాణ రాష్ట్ర వ్యవసాయ రంగ ప్రభుత్వ సలహాదారుగా వేములవాడ ఎమ్మెల్యే డాక్టర్ చెన్నమనేని రమేశ్‌బాబు నియమితులయ్యారు. ఈ మేరకు ముఖ్యమంత్రి కే చంద్రశేఖర్‌రావు నిర్ణయించారు. కేబినెట్ హెూదా కలిగిన ఈ పదవిలో ఆయన ఐదేండ్లు ఉంటారు. ఈ మేరకు ఉత్తర్వులు జారీ చేయాలని ముఖ్యమంత్రి అధికారులను ఆదేశించారు. చెన్నమనేని రమేశ్ బాబు జర్మనీకి చెందిన హంబోల్ట్ యూనివర్శిటీ నుంచి 'అగ్రికల్చర్ ఎకనామిక్స్'లో పీహెచ్‌డీ చేశారు.

టీటీడీ సభ్యురాలిగా గడ్డం సీత నియామకం

నవతెలంగాణ-హైదరాబాద్‌బ్యూరో



తిరుమల తిరుపతి దేవస్థానం (టీటీడీ) బోర్డు సభ్యురాలిగా చేవెళ్ల పార్లమెంటు సభ్యులు రంజిత్‌రెడ్డి సతీమణి గడ్డం సీత నియమితులయ్యారు. 24 మంది సభ్యులతో కూడిన జాబితాను టీటీడీ విడుదల చేసింది. తెలంగాణ నుంచి గడ్డం సీతను ఎంపిక చేశారు. ఆమె పలు సామాజిక సేవా కార్యక్రమాలు చేపడుతున్న విషయం తెలిసిందే.

బీజేపీని ఓడిస్తేనే యువతకు ఉద్యోగాలు

- ప్రభుత్వ శాఖల్లో ఏండ్ల తరబడి ఖాళీలు : డీవైఎఫ్ఐ అఖిల భారత కార్యదర్శి హిమాగ్నిరాజ్ భట్టాచార్య



సదస్సులో మాట్లాడుతున్న డీవైఎఫ్ఐ అఖిల భారత కార్యదర్శి హిమాగ్నిరాజ్ భట్టాచార్య

నవతెలంగాణ-హనుమకొండ

దేశంలోని నిరుద్యోగం పెరుగుతున్నా ఉద్యోగాలు ఇవ్వడంలో బీజేపీ ప్రభుత్వం విఫలమైందని, రానున్న ఎన్నికల్లో ఆ పార్టీని ఓడిస్తేనే యువతకు ఉద్యోగాలు వస్తాయని డీవైఎఫ్ఐ అఖిల భారత కార్యదర్శి హిమాగ్నిరాజ్ భట్టాచార్య అన్నారు. హనుమకొండ హరిత కాకతీయ హెూటల్లో డీవైఎఫ్ఐ ఆధ్వర్యంలో శుక్రవారం 'విద్య- ఉపాధి'పై రాష్ట్ర సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. దేశంలోని నిరుద్యోగ యువతకు ప్రతి ఏటా రెండు కోట్ల ఉద్యోగాలు ఇస్తామని చెప్పిన బీజేపీ ప్రభుత్వం ఇచ్చిన హామీని నెరవేర్చలేక పోయిందని విమర్శించారు. విదేశాల్లో ఉన్న నల్లధనం తీసుకొచ్చి ప్రతి కుటుంబానికీ రూ.15 లక్షలు అకౌంట్లో వేస్తామని ఒక్క రూపాయీ వెనక్కి తీసుకురాలేదని చెప్పారు. జీఎస్టీ వల్ల ప్రజలపై భారాలు పెరిగాయని ఆవేదన వ్యక్తం చేశారు. కరోనాతో లక్షల మంది ఉద్యోగాలు కోల్పోయారని చెప్పారు. దేశంలో ప్రజల మధ్య విద్వేషాలు రగిల్చి రాజకీయం చేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. కేంద్ర ప్రభుత్వం యువతకు ఉపయోగపడే ఏ పనీ చేయడం లేదని విమర్శించారు. ప్రభుత్వ శాఖల్లో ఏండ్ల తరబడి ఉద్యోగ పోస్టులు ఖాళీగా ఉన్నా భర్తీ చేయడం లేదన్నారు. కేంద్రం విధానాలు కార్పొరేట్ సంస్థలకు లాభాలు చేకూర్చే విధంగా ఉన్నాయని విమర్శించారు. నిత్యావసర వస్తువుల ధరలను అదుపు చేయకపోతోందని, ప్రజలు ధరల భారంతో అవస్థలు పడుతున్నారని అన్నారు. రాష్ట్రంలో టీఆర్ఎస్ ప్రభుత్వంతో యువతకు జరిగిన ఉపయోగం శూన్యమని, ఉద్యోగాల కోసం నోటిఫికేషన్ ఇచ్చి పేపర్ లీకేజీలతో సరిపుచ్చుకుందని విమర్శించారు. ఏ ఒక్క నోటిఫికేషన్ సక్రమంగా నిర్వహించలేకపోగా.. కోర్టు కేసులతో పెండింగ్‌లో పడిపోయాయని చెప్పారు. బీజేపీ, బీఆర్ఎస్ విధానాలు ఒక్కటేనని, వాటిని ఓడిస్తేనే యువతకు ఉద్యోగాలు, ఉపాధి అవకాశాలు ఏర్పడతాయని చెప్పారు. ఉపాధి కోసం జరుగుతున్న ఉద్యమంలో యువత భాగస్వామి కావాలని పిలుపునిచ్చారు. డీవైఎఫ్ఐ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఆనగంటి వెంకటేష్ మాట్లాడుతూ.. యువతకు ఉద్యోగాలు ఇవ్వని ప్రభుత్వాలకు బుద్ధి చెప్పాలని పిలుపునిచ్చారు. ఈ సదస్సుకు డీవైఎఫ్ఐ రాష్ట్ర అధ్యక్షులు కోట రమేష్ అధ్యక్షతన వహించగా.. రాష్ట్ర ఉపాధ్యక్షులు ఎండి బషీర్, జి.తిరుపతి నాయక్, గడ్డం, రోషన్ బేగం, వెంకటేష్, సహాయ కార్యదర్శులు గొడిశాల కార్తీక్, జగన్, కొంటూ సాగర్, డి.సాంబమూర్తి, హనుమకొండ జిల్లా అధ్యక్షులు నోముల కిషోర్, కార్యదర్శి దొగ్గెల తిరుపతి, ఉపాధ్యక్షులు మంద సుచందర్, సహాయ కార్యదర్శులు మంద సురేష్ ఓర్సు చిరంజీవి, చిట్యాల విజయకుమార్ తదితరులు పాల్గొన్నారు.

సంపాదకీయం

చిత్రానందం!

కొన్ని సినిమాల్లో కథే హీరోను నడిపిస్తుంది. మరికొన్నింటిలో హీరోనే కథను నడిపిస్తాడు. కానీ జాతీయ చలన చిత్ర పురస్కారాల ఎంపిక కమిటీని మాత్రం కేంద్రంలోని బీజేపీ వెనుకనుండి నడిపిందనేది 'కాశ్మీరీఫైల్స్'కు అవార్డుతో తేటతెల్లమైంది.

కేంద్రంలోని బీజేపీ అధికారంలోకి వచ్చాక రాజకీయ ప్రభావితం కోసం కొన్ని సినిమాలు తెరకెక్కడం ఓ ధోరణిగా మారింది. అందులో ముఖ్యమైనవి 'కాశ్మీర్ ఫైల్స్', 'ది కేరళ స్టోరీ'. ప్రజల్లో మత విద్వేషాలు పెంచిపోషించిన చిత్రాలివి. వాస్తవాల్ని వక్రీకరిస్తూ ప్రజల మధ్య విద్వేషానికి కారణమైన కాశ్మీర్‌ఫైల్స్‌కు దేశ సమైక్యత అవార్డును ఇవ్వడం శోచనీయం! ఇందులో భావాత్మక ఆలోచనలు, కళాత్మక గుణాలు, సందేశాత్మక సన్నివేశాలు ఏ కోశానా లేవు. కానీ కేంద్రం పురస్కారమివ్వడం ఎంతవరకు సమంజసం?

కాశ్మీరీపండిట్‌లు, ముస్లింల మధ్య విభజనను సృష్టించిన 'కాశ్మీర్‌ఫైల్స్'కు దేశ సమైక్యత అవార్డు ఇవ్వడం సర్వత్రా విమర్శలకు తావిస్తోంది. ఇక తెలుగు చలన చిత్రరంగం జాతీయ స్థాయిలో పలు అవార్డులు గెలుచుకోవడం అభినందనీయం. ఇన్నాళ్లూ ఏదో తెలియని వెలితి తెలుగుచిత్ర పరిశ్రమను వెంటాడుతూ ఉండేది. ఎన్నో స్ఫూర్తిదాయక అవార్డులు గెలుచుకున్నా ఉత్తమ నటుల్లో మనోళ్ల జాతీయస్థాయిని ఇంతవరకు అందుకోలేక పోయారు. దాదాపు 69 సంవత్సరాల తర్వాత తెలుగు హీరో అల్లు అర్జున్‌కు జాతీయ ఉత్తమనటుని అవార్డు దక్కింది. ఎంతోమంది మహామహులు, మరెంతోమంది ఉద్దండులు తెలుగు చిత్రసీమను ఏలారు. ప్రేక్షకుల్ని సంభ్రమాశ్చర్యంలో ముంచారు. ప్రజల హృదయాల్లో చెరగని ముద్ర వేసుకున్నారు. కానీ వారెవరినీ ఈ అవార్డు వరించలేదు. ఇప్పటికైనా ఓ తెలుగు నటునికి జాతీయ ఉత్తమనటుని అవార్డు దక్కటం అభినందించాల్సిన అంశం. కేంద్ర ప్రభుత్వం గురువారం ప్రకటించిన జాతీయ చలన చిత్ర పురస్కారాల్లో 'పుష్ప ద రైజ్' సినిమాలో అల్లుఅర్జున్ నటనకు అవార్డును ప్రకటించిన విషయం విదితమే. సాన బుచ్చిబాబు దర్శకత్వం వహించిన ఉప్పెన సినిమా ఉత్తమ ప్రాంతీయ చిత్రంగా ఎంపికైంది. ఇంకా పలు విభాగాల్లో తెలుగు సినిమాకు అవార్డులు ఈసారి ఎక్కువే దక్కాయి. వీటన్నిటి ఎంపికపైనా పలు విమర్శలు లేకపోలేదు!



అదలా ఉంచితే... తెలుగు చిత్ర పరిశ్రమ ప్రారంభమైనప్పటి నుంచి సందేశాత్మక చిత్రాలు ఎన్నో వచ్చాయి. అందులో సామాజిక కోణంలో ఉన్నవి, వైవిధ్య భరితమైనవి, ఆలోచించదగినవి చాలానే ఉన్నాయి. చిత్రసీమ కమర్షియల్ బాట పట్టిన తర్వాత సమాజానికి ఉపయోగపడే చిత్రాలు చాలా అరుదనే చెప్పాలి. కేంద్రంలోని బీజేపీ అధికారంలోకి వచ్చాక రాజకీయ ప్రభావితం కోసం కొన్ని సినిమాలు తెరకెక్కడం ఓ ధోరణిగా మారింది. అందులో ముఖ్యమైనవి 'కాశ్మీర్ ఫైల్స్', 'ది కేరళ స్టోరీ'. ప్రజల్లో మత విద్వేషాలు పెంచిపోషించిన చిత్రాలివి. వాస్తవాల్ని వక్రీకరిస్తూ ప్రజల మధ్య విద్వేషానికి కారణమైన కాశ్మీర్‌ఫైల్స్‌కు దేశ సమైక్యత అవార్డును ఇవ్వడం శోచనీయం! ఇందులో భావాత్మక ఆలోచనలు, కళాత్మక గుణాలు, సందేశాత్మక సన్నివేశాలు ఏ కోశానా లేవు. కానీ కేంద్రం పురస్కారమివ్వడం ఎంతవరకు సమంజసం? పుష్ప సినిమా నేపథ్యం కూడా పరిశీలించాల్సిన అంశమే. 2021లో సుకుమార్ దర్శకత్వంలో విడుదలైన ఈ చిత్రం మంచి బ్లాక్ బాస్టర్ హిట్‌కొట్టింది. కాదనలేం. కానీ సినిమా నేపథ్యం తిరుమల కొండల్లోని ఎర్రచందనం అక్రమ రవాణాతో నడిచే కథ. ఇందులో కలపను ఏ విధంగా పోలీసుల కన్నుగప్పి అక్రమంగా అడవిని దాటించాలనే స్మగర్ల కోణమే దాగుంది. ఈ సినిమా చూసిన కొంతమంది అక్రమార్కులు కలపను కారులో స్మగ్లింగ్ చేస్తూ పోలీసులకు దొరికిన ఘటనలు కూడా మనం చూశాం. ఈ సినిమా మంచికంటే చెడునే ఎక్కువ ప్రభావితం చేసిందని చెప్పొచ్చు. మన తెలుగువాడికి అవార్డు రావడం సంతోషించదగిన విషయమే అయినా, ఈ ఎంపిక దేనికి సంకేతమన్నదే ప్రశ్న.

ఇదే ఏడాది సామాజిక చైతన్యం నేపథ్యంగా తెరకెక్కిన సినిమా 'జైభీమ్'. జస్టిస్ కె చంద్రు నిజజీవిత కథ ఆధారంగా డైరెక్టర్ జ్ఞానవేల్ రూపొందించిన ఈ సినిమా అట్టడుగు వర్గాల జీవితాలకు అద్దం పట్టింది. వారికి జరుగుతున్న అన్యాయాలను ప్రశ్నించింది. ఈ సినిమా ప్రారంభం నుంచి ముగింపు వరకు పట్టుసడలని భావోద్వేగాల సమాహారంగా సాగుతుంది. పాత్రదారుల నటనలో సహజత్వం ఉట్టిపడుతుంది. సినిమా టేకింగ్‌లోనూ మేకింగ్ లోనూ ఉన్నత విలువలు దర్శనమిస్తాయి. అన్నిటికీ మించి ఈ సినిమా గొప్ప సామాజిక బాధ్యతను సందేశంగా ఇస్తుంది. బాధితులకు భరోసానిచ్చిన ఓ స్ఫూర్తి దాయకమైన సినిమా 'జైభీమ్'. కానీ కేంద్రం ప్రకటించిన చిత్ర పురస్కారాల్లో ఏ ఒక్క విభాగంలోనూ ఈ సినిమాకు అవార్డు దక్కకపోవడం నిజంగా అన్యాయం. ఇలాంటి సినిమాలు సమాజానికి నేడు అవసరం. వారిని ప్రోత్సహించాలి. అవసరమైన సహాయం కూడా అందించాలి. మొత్తంగా చూస్తే తెలుగు కథానాయకుడికి, తెలుగు సినిమాకి జాతీయస్థాయి గుర్తింపు లభించిందన్న ఆనందం తప్ప...అవార్డుల ఎంపికను మనస్ఫూర్తిగా హర్షించలేం.

"నాకొక కల ఉంది"

రివరెండ్ మార్టిన్ లూథర్ కింగ్

ఏ (అబ్రహామ్ లింకన్ అనే) మహానుభావుడి ఛత్ర ఛాయల్లో నేడు మనం నిలబడి ఉన్నామో ఆయన వందేండ్ల క్రితం బానిసల "విముక్తి ఆదేశం"పై సంతకం చేశాడు. అన్యాయపు మంటల్లో కాలిపోతున్న కోట్లాది నీగ్రో బానిసలు దానిలో వెలుగుదివ్వెను చూశారు. సుదీర్ఘ చీకట్ల బంధనాలు తొలగిపోతాయని ఆశించారు. వందేండ్ల తర్వాత కూడా నీగ్రోలకు విముక్తి లభించలేదు. ఇనుప సంకెళ్ల వివక్ష విడిపోలేదు. తమ చుట్టూ సంపదమేట వేసి ఉన్నా నీగ్రోలు మాత్రం పేదరికపు ద్వీపాల్లో ఒంటరిగా మిగిలిపోతున్నారు. తమ స్వంత భూమైన అమెరికా మూలల్లో నీగ్రోలు కుమిలిపోతున్నారు. మన జీవితాల అసలు రూపాల్ని ఈ సమాజానికి వెల్లడించడానికి నేడు దేశ రాజధానికి మనం చేరుకున్నాం.

మన రాజ్యాంగ నిర్మాతలు స్వతంత్ర రాజ్యాంగ ప్రకటన రాసినప్పుడు మనకిచ్చిన ప్రామిసరీ నోట్‌కు మనం కూడా వారసులమే. నల్లవారైనా, తెల్లవారైనా జీవించే హక్కును, స్వేచ్ఛను ఇవ్వాలి. కానీ, శ్వేతజాతేతరులకు, ముఖ్యంగా నల్లవారికి ఈ ప్రామిసరీ నోట్ విఫలమైంది. నీగ్రోలకు చెక్ బౌన్స్ అవుతుంది. కాని మనకి న్యాయాన్ని పంచాల్సిన బ్యాంకు దివాలా ఎత్తిందని మనం నమ్మట్లేదు. మన జాతి యొక్క అవకాశాల ఖజానాలు వట్టిపోయినాయని మనం నమ్మడానికి సిద్ధంగా లేము. స్వేచ్ఛను, స్వాతంత్ర్యాన్ని, న్యాయాన్ని మనం గట్టిగా డిమాండ్ చేసి వసూలు చేసుకోవాలి.

కొత్తపుంతలు తొక్కుతున్న నీగ్రో సమాజ మిలిటెన్సీ తెల్లవారందరినీ ద్వేషించే స్థాయికి చేరరాదు. నేడిక్కడ పాల్గొంటున్న ఎందరో "తెల్లసోదరులు తమ గమ్యం కూడా మన గమ్యంతో ముడిపడి ఉందని అర్థమైనవారే. వారి స్వేచ్ఛా స్వాతంత్ర్యాలు, మన స్వేచ్ఛా స్వాతంత్ర్యాల నుండి విడదీయరానివన్న భావనే నేడు వారినిక్కడికి నడిపించింది. మనం ఒంటరిగా నడవలేము.

సమస్య యొక్క తీవ్రత ఏ స్థాయిలో ఉందో అర్థం చేయించడానికే అతని అతి పవిత్ర స్థలంలో జమయినాము. నిద్రమాత్రలతో ప్రశాంతంగా విశ్రమించే సమయం కాదిది. నిర్జనమైన చీకటి కూపాల నుండి జాతి వివక్షత లేని సూర్యకాంతుల వెలుగుల్లోకి నడుద్దాం. జాతి వివక్షతా ఊబిలో నుండి శిలా సదృశమైన సోదరభావం వెల్లివిరిసే వ్యవస్థగా మన దేశాన్ని నిర్మించుకుందాం. దేవుని బిడ్డలందరికీ సమన్యాయం జరిగేలా చూసుకుందాం.

సమస్య తీవ్రత అర్థంకాకపోతే మన దేశానికి అది మరణాంతకమవుతుంది. ఉడికిపోతున్న ఈ ఎండాకాలపు నీగ్రోల న్యాయబద్ధమైన అసంతృప్తి... స్వేచ్ఛా, సమానత్వం వెల్లివిరిసే శరత్ కాలం వచ్చేదాకా ఆగదు. 1963 అంతం కాదు, ఆరంభం. నీగ్రోలకు పౌరసత్వ హక్కులిచ్చేదాకా అమెరికాలో

(అమెరికాలో పౌరహక్కుల ఉద్యమనేత, ముఖ్యంగా నల్లజాతి వారిపై జరుగుతున్న దాడులు, దౌర్జన్యాలపై జీవితమంతా పోరాడి నేలకొరిగిన మార్టిన్ లూథర్ కింగ్. 1963 ఆగస్టు 28న అమెరికా రాజధానికి "ఉపాధి కోసం, స్వేచ్ఛ కోసం (మార్చ్ ఆన్ వాషింగ్టన్ ఫర్ జాబ్స్ అండ్ ఫ్రీడమ్)" పేరుతో యాభైవేల మంది హాజరైన సభలో తాను కలకంటున్న అమెరికా గురించి చేసిన ప్రఖ్యాత ఉపన్యాసమిది. 60వ వార్షికోత్సవాన్ని 26 ఆగస్టు (శనివారం) ఆదేశంలో పెద్ద ఎత్తున జరుపుతున్నారు. ఇది "స్మారకోత్సవం కాదు, కొనసాగింపు" (నాట్ కమ్మెమొరేషన్, కంటిన్యుయేషన్) పేరుతో జరుగుతోంది ఈ సందర్భంగా వాషింగ్టన్ డిసిలో 1963 ఆగస్టు 28న లింకన్ మెమోరియల్‌లో చేసిన ఉపన్యాసం...)



ప్రశాంతత మనకు విశ్రాంతి ఉండదు. ప్రకాశవంతమైన న్యాయోదయం అయ్యేదాకా ఈ విప్లవాల సుడిగాలులు మనదేశంలో వీస్తూనే ఉంటాయి. దాని పునాదులను కదిలిస్తూనే ఉంటాయి. మనం నిలబడ్డ వెచ్చని గుమ్మం మనల్ని న్యాయ లోగిల్లోకి తోడ్కొనిపోతుంది. మన న్యాయమైన హక్కుల సాధనలో ఏవిధమైన తప్పులూ చేయొద్దని మీకు విజ్ఞప్తి చేస్తున్నాను. మన స్వాతంత్ర్య పిపాసను ద్వేషమనే కాలకూటం తాగి తీర్చుకోవద్దు. మన ఆత్మగౌరవం తగ్గకుండా, క్రమశిక్షణాయుతంగా మన ఉద్యమం సాగాలి. మన సృజనాత్మకత ఏనాడూ భౌతికదాడుల స్థాయికి దిగజారకుండా జాగ్రత్తలు తీసుకోవాలి.

కొత్తపుంతలు తొక్కుతున్న నీగ్రో సమాజ మిలిటెన్సీ తెల్లవారందరినీ ద్వేషించే స్థాయికి చేరరాదు. నేడిక్కడ పాల్గొంటున్న ఎందరో "తెల్లసోదరులు తమ గమ్యం కూడా మన గమ్యంతో ముడిపడి ఉందని అర్థమైనవారే. వారి స్వేచ్ఛా స్వాతంత్ర్యాలు, మన స్వేచ్ఛా స్వాతంత్ర్యాల నుండి విడదీయరానివన్న భావనే నేడు వారినిక్కడికి నడిపించింది. మనం ఒంటరిగా నడవలేము. మన ఉద్యమం వెనక్కి తిరిగిచూడరాదు. ముందుకే పురోగమించాలి. మీరు ఎప్పటికి తృప్తి చెందుతారని కొందరు మనల్ని ప్రశ్నిస్తూంటారు. పోలీసు దుర్మార్గాలు ఆగేదాకా ఏ నీగ్రో సంతృప్తి చెందడు. ఒక చిన్న వెలివాడ (ఘెట్టో) నుండి పెద్ద వెలివాడలోకి మార్చినంత మాత్రాన ఏ నీగ్రో సంతృప్తి చెందడు. "తెల్లవారికి మాత్రమే" అనే బోర్డుల ద్వారా మా పిల్లల బాల్యాన్ని దోచుకునే స్థితి ఈ దేశంలో ఉన్నంత వరకు ఏ నీగ్రో సంతృప్తి చెందడు. న్యాయంగా మాకు చెందాల్సినవి నీటి ప్రవాహంలాగా జలజలా మావైపు ప్రవహించేదాకా మాకు సంతృప్తి ఉండదు.

మీరు ఎన్నో కష్టాలు పడి ఇక్కడికి వచ్చారని నాకు తెలుసు. కొందరు ఇరుకైన జైలు గదుల నుండి వచ్చారు. మీ స్వాతంత్రేచ్ఛ మిమ్మల్ని పోలీసుల పీడనకు, వేటకు గురిచేశాయని నేనెరుగుదును. 'సృజనాత్మక' బాధలు అనుభవించడంలో మీరు పండిపోయారు. ఈ బాధల నుండి ఏదో ఒక రోజు విముక్తి పొందుతామన్న నమ్మకం

మీరు ఎప్పటికీ తృప్తి చెందుతారని కొందరు మనల్ని ప్రశ్నిస్తూంటారు. పోలీసు దుర్మార్గాలు ఆగేదాకా ఏ నీగ్రో సంతృప్తి చెందడు. ఒక చిన్న వెలివాడ (ఘెట్టో) నుండి పెద్ద వెలివాడలోకి మార్చినంత మాత్రాన ఏ నీగ్రో సంతృప్తి చెందడు. "తెల్లవారికి మాత్రమే" అనే బోర్డుల ద్వారా మా పిల్లల బాల్యాన్ని దోచుకునే స్థితి ఈ దేశంలో ఉన్నంత వరకు ఏ నీగ్రో సంతృప్తి చెందడు. న్యాయంగా మాకు చెందాల్సినవి నీటి ప్రవాహంలాగా జలజలా మావైపు ప్రవహించేదాకా మాకు సంతృప్తి ఉండదు.

మిమ్మల్ని నడిపిస్తోంది. మీమీ ప్రాంతాలకు, మీ మురికివాడలకు, మీ వెలివాడలకు తిరిగి వెళ్ళండి. ఈ పరిస్థితి తప్పనిసరిగా మారుతుందన్న నమ్మకంతో వెళ్ళండి.


నా మిత్రులారా! నిరాశనే కూపంలో పడిదొర్లకండి. నేడు ఎన్నో కష్టాలు, కడగండ్లు మనం ఎదుర్కొంటున్నా రేపు నాకో కల ఉంది. అమెరికా సమాజంలో లోతుగా వేళ్ళనుకున్న కల అది. ఏదో ఒకరోజు ఈ దేశం తన నిజమైన స్థానంలోకి, అంటే ప్రజలందరూ సమానంగా సృజియించబడ్డారన్న సత్యంలోకి, పునరుత్థానం మొందుతుందనేదే నా కల! ఏదో ఒకరోజు జార్జియాలోని ఎర్రకొండల్లో గత బానిసల పిల్లలు, బానిస యజమానుల పిల్లలు చెట్టా పట్టాలేసుకు తిరుగుతారనేది నా కల. ప్రస్తుతం శ్వేతజాతి దురహంకారంతో అట్టుడిగిపోతున్న అనేక రాష్ట్రాలు రంగు వివక్షతలేనివిగా సోదర భావం పరిఢవిల్లేవిగా మారతాయని నా కల!

ఇది నా ఆశ. ఈ విశ్వాసంతోనే నేను నా దక్షిణ ప్రాంతానికి తిరిగి వెళ్తున్నాను. ఈ నిరాశా పర్వతాల్లో నుండే ఆశల శిల్పాలు చెక్కుతామన్న నమ్మకం నాకుంది. ఘర్షణ పూరిత వాతావరణ మున్న మన దేశంలో ఒక శ్రావ్యమైన సౌభ్రాతృత్వ వాయిద్య బృందగానామృతం జాలు వారుతుందని నా కల.

ఈ విశ్వాసంతోనే మనం కలిసి పనిచేస్తాం. కలిసి ప్రార్థన చేస్తాం. కలిసి పోరాటం చేస్తాం. కలిసి జైళ్ళలో కెళ్తాం. స్వాతంత్ర్యం కోసం కలిసి నిలబడతాం. ఏదో ఒక రోజు విముక్తి సాధిస్తామన్న నమ్మకంతోనే ఇవన్నీ చేయగలుగుతాం.

అమెరికా నిజంగా గొప్ప దేశంగా విలసిల్లాలంటే ఇవన్నీ నిజం కావాలి. దేశంలోని అన్ని ప్రాంతాల నుండీ, కొండల నుండీ, కోనల నుండీ ఈ స్వేచ్ఛా గీతం ఆలపించబడాలి. అది జరిగినప్పుడే, అలా జరిగేలా మనం చూసినప్పుడే ప్రతి గ్రామం, ప్రతి పల్లె, ప్రతి పట్టణం, ప్రతి రాష్ట్రం నుండి ఆ స్వేచ్ఛా గీతం ఆలపించబడినప్పుడే, దేవుని బిడ్డలందరూ... నలుపు, తెలుపు, యూదులు, ఇతర ఏ దేశస్తులైనా, ప్రొటెస్టెంట్లైనా, కేథలిక్కులైనా అందరూ చెట్టాపట్టాలేసుకుని పురాతన నీగ్రో ప్రార్థన 'మేం విముక్తి చెందాం. ధన్యవాదాలు భగవంతుడా! చివరికి మేం విముక్తి చెందాం!' అని పాడుకోగలం. - అనువాదం: ఆర్. సుధాభాస్కర్.

విషపు రాజకీయాల విన్యాసం



77వ స్వాతంత్ర్య దినోత్సవ వేడుకల సందర్భంగా ఎర్రకోట వద్ద ప్రధాని నరేంద్ర మోడీ చేసిన ప్రసంగం... గత కొన్నేళ్ళుగా ఆయన చేస్తూ వచ్చిన స్వాతంత్ర్య దినోత్సవాల ప్రసంగాల మాదిరిగానే మూస పద్ధతిలో సాగిపోయింది. 2014 నుండి భారతదేశం అన్ని రంగాల్లో ఎలా అద్భుతంగా పురోగతి సాధించిందో ప్రధాని మోడీ చెప్పుకున్న గొప్పలే ఆ ప్రసంగంలో ఉన్నాయి. ముస్లిం పాలనతో ప్రారంభమై బ్రిటిష్ పాలనతో ముగిసిన వెయ్యి సంవత్సరాల బానిస పాలనతో పోలుస్తూ అమృత కాలం కూడా వెయ్యి సంవత్సరాలు ఉండాలని తాము ఎదురు చూస్తున్నామంటూ మోడీ పేర్కొన్నారు. అదొక్కటే ఈ ఏడాది ప్రసంగంలో కొత్త అంశంగా ఉంది. ఇకపోతే సర్వసాధారణంగా ఎప్పుడూ ఉండే మాదిరిగానే వివిధ రంగాల్లో ప్రభుత్వం సాధించిన విజయాల పట్టికతో ప్రసంగం నిండిపోయింది. ప్రధానిగా తాను పోషించిన కీలక పాత్ర మీదే మోడీ ప్రధానంగా దృష్టి సారించారు. ఆ ప్రగల్భాలతో కూడిన ప్రసంగాలను విమర్శనాత్మక దృష్టితో చూస్తూ, ప్రతి ఒక్క దాన్ని వాస్తవికతలతో సరిపోల్చడమనేది వృథా ప్రయాస అవుతుంది. గతంలోనూ ఇప్పుడు కూడా ఇటువంటి కీలకమైన, నిశిత పరిశీలనలు జరిగాయి. దీనికి బదులు, ప్రధాని ప్రసంగంలోని రాజకీయ కోణాలను పరిశీలించడం ఉపయుక్తంగా ఉండగలదు.

మోడీ తన పంద్రాగస్టు ప్రసంగం ప్రారంభం నుంచి మణిపూర్ పరిస్థితులనే ప్రస్తావిస్తూ వచ్చారు. అయితే ఆయన చెప్పిన విషయాలు మణిపూర్ ప్రజలను, దేశంలోని ఇతర ప్రజలను నిరాశపరిచాయి. అక్కడ ఘర్షణలు ఎలా చెలరేగాయి, మరణాలు ఎలా సంభవించాయి, మహిళలను ఎలా అవమానించారు అన్న అంశాలపై ఆయన పైపైన మాట్లాడారు. కానీ, గత కొద్ది రోజులుగా రాష్ట్రంలో శాంతి నెలకొందన్నారు. శాంతిని నెలకొల్పి, సమస్యలను పరిష్కరించేందుకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కలిసి కృషి చేస్తున్నాయని ఆయన చెప్పారు. ఇక్కడ సందేశం స్పష్టంగా ఉంది. జాతుల ఘర్షణ చెలరేగడానికి బాధ్యుడు, పక్షపాత ధోరణితో వ్యవహరిస్తున్న ముఖ్యమంత్రి బీరేన్ సింగ్‌ను దీనికంతటికీ జవాబుదారీగా చేయలేదు. వాస్తవానికి అత్యంత ఘోరమైన లైంగిక నేరాల్లోని బాధితులకు న్యాయం చేయడం గురించి ఒక్క మాట కూడా లేదు. అలాగే ఈ సున్నితమైన ఈశాన్య ప్రాంత రాష్ట్రం ఏ రీతిన జాతుల ఘర్షణలు, అల్లర్ల ఊబిలోకి కూరుకుపోయిందో వివరించనూ లేదు.

ఇక రాబోయే 2024 ఎన్నికల వల్ల మోడీ ప్రసంగంలోని రాజకీయాలకు రంగులద్దబడ్డాయి. గత స్వాతంత్ర్య దినోత్సవ ప్రసంగాల మాదిరిగా కాకుండా ప్రతిపక్షంపై పదునైన దాడి చేశారు. వారసత్వ రాజకీయాలు, అవినీతి, బుజ్జగింపు రాజకీయాలపై ఆయన తీవ్రంగా ధ్వజమెత్తారు. తనకెంతో ఇష్టమైన అంశాన్ని ప్రస్తావిస్తూ, భారతీయ ప్రజాస్వామ్యంలో వారసత్వ పార్టీలన్నీ వ్యాధులు, వైకల్యాల వంటివని విమర్శించారు. అయితే, వారసత్వ రాజకీయాలపై ప్రధాని జరిపే తిరుగుబాటు ఒక వాస్తవాన్ని విస్మరించింది. బీజేపీలో మరింతమంది రాజకీయ వారసులు రాష్ట్ర, జాతీయ స్థాయిల్లో కీలక పదవులు చేపడుతున్నారన్నదే ఆ వాస్తవం. అవినీతిపై సుదీర్ఘంగా సాగిన ఆయన ప్రసంగం ప్రతిపక్ష పార్టీలకు వ్యతిరేకంగా దాడి చేసే మరో ఆయుధంగా మారింది. ప్రతిపక్ష నేతలపై అణచివేతకు ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్‌ను ఆయుధంగా వాడుతున్నారు. గత తొమ్మిదేండ్లలో చోటు చేసుకున్న ఉన్నత స్థాయి అవినీతి రికార్డును, దాని పట్ల మోడీ ప్రభుత్వం వ్యవహరించిన తీరును మనం చూసినట్లైతే, అవినీతి అనేది కేవలం ప్రతిపక్షాలకు వ్యతిరేకంగా వాడే ఆయుధమని స్పష్టంగా అర్థమవుతోంది. రాఫెల్ ఒప్పందంలో కొట్టవచ్చినట్లు కనిపించే అవకతవకలను సమాధి చేయడం నుండి, హైవేల నిర్మాణంలోనూ, అలాగే పిఎంజెఎవై వంటి కేంద్ర ప్రభుత్వ వివిధ పథకాల అమలు వరకు విస్తృతంగా జరుగుతున్న అవినీతి గురించి కాగ్ తాజా నివేదిక బట్టబయలు చేసింది. బుజ్జగింపు రాజకీయాలపై ఆయన దాడి చేశారు. ఇది స్వాతంత్ర్య దినోత్సవ ప్రసంగంలో కొత్త అంశం, పైగా అరిష్ట సూచకం కూడా. ఇక్కడ బుజ్జగింపు అంటే మైనారిటీల బుజ్జగింపు. మోడీ అభిప్రాయం ప్రకారం, ఈ బుజ్జగింపు రాజకీయాలు జాతీయ స్వభావంపై చెరగని మచ్చ వేస్తున్నాయి, సామాజిక న్యాయానికి హాని కలిగిస్తున్నాయి. కొద్ది రోజుల క్రితమే విస్తృతంగా ఘర్షణలు, మత హింస చెలరేగిన కేవలం 70కిలోమీటర్ల దూరంలో ఎర్రకోట బురుజులపై నుండి మాట్లాడుతున్న ప్రధాని మోడీ ఈ మైనారిటీ బుజ్జగింపు ధోరణిని ఖండిస్తున్నారు. ఘర్షణల్లో హిందూత్వ గూండాల దాడులకు మియో ముస్లింలు బలయ్యారు. పైగా రాష్ట్ర ప్రభుత్వం కూడా వారినే లక్ష్యంగా చేసుకుంది. మోడీకి సంబంధించినంత వరకు, ముస్లింల ఇళ్ళను, దుకాణాలను ప్రభుత్వం కూలగొడుతున్న సమయంలో... మైనారిటీ బుజ్జగింపు ధోరణిని నిరసిస్తూ మాట్లాడటమంటే... లోక్‌సభ ఎన్నికల నేపథ్యంలో మతోన్మాద ధోరణులను రెచ్చగొట్టడమన్నది వారి ఎజెండాలో ఉందనడానికి స్పష్టమైన సంకేతంగా ఉంది. మొత్తంమీద, నరేంద్ర మోడీ పదవ స్వాతంత్ర్య దినోత్సవ ప్రసంగం బీజేపీ-ఆర్‌ఎస్‌ఎస్ కూటమి విషపు రాజకీయాల విన్యాసంగా ఉంది.

('పీపుల్స్ డెమోక్రసీ' సంపాదకీయం)

నూహ్‌లో హింస, విధ్వంసం వెనుక...

హర్యానాలోని నూహ్‌కు, ఢిల్లీ నుండి గంట ప్రయాణం. ముస్లింలు అధిక సంఖ్యలో ఉన్న నూహ్ జిల్లాలో, పేదరికం, నిరుద్యోగం, నిరక్షరాస్యత ఎక్కువ. ఇటీవలి కాలంలో సైబర్ నేరాలకు కేంద్రంగా ప్రసిద్ధికెక్కింది. ఈ ప్రాంతానికి మత ఉద్రిక్తతల చరిత్ర ఉంది. జూలై 31న కూడా ఘర్షణలు చోటు చేసుకున్నాయి. ధ్వంసమైన వాహనాలు, దగ్ధమైన దుకాణాలు, భయోత్పాతాన్ని గుర్తుచేస్తాయి. ఒకప్పుడు జిల్లాలో సందడిగా, హడావిడిగా ఉన్న గ్రామాల్లో నెలకొన్న భయంకర నిశ్శబ్దాన్ని, పరిస్థితిని అదుపు చేసేందుకు రాష్ట్రప్రభుత్వం వేల సంఖ్యలో దింపిన పోలీసుల బూట్ల శబ్దం ఛేదించింది.

ఇద్దరు హెూంగార్డులు, నలుగురు పౌరులు మొత్తం ఆరు గురు ఈ ఘర్షణల్లో చనిపోయారు. ఘర్షణల వార్తలు పల్వాల్, సోహ్నాతో పాటుగా నూహ్‌కు పొరుగునున్న గురుగ్రామ్, ఇతర ప్రాంతాల్లో ప్రతిధ్వనించాయి. మిలీనియం సిటీగా కూడా పేరున్న గురుగ్రామ్ నడిబొడ్డున ఒక మసీదును దగ్ధం చేశారు. అంతర్జాతీయ మీడియా హింసకు సంబంధించిన సమాచారాన్ని, సెప్టెంబర్ నెలలో ఢిల్లీలో జరిగే జీ20 దేశాల శిఖరాగ్ర సమావేశాన్ని దృష్టిలో ఉంచుకొని దేశ రాజధాని ప్రాంతంలో, నూహ్‌లో శాంతియుత వాతావరణాన్ని నెలకొల్పేందుకు అధికారులు కసరత్తు చేస్తున్నారు. పోలీసులు పెద్ద ఎత్తున ముస్లిం యువకుల్ని కట్టడి చేస్తూ చర్యలు చేపట్టి, మైనర్లను కూడా నిర్బంధించడం ప్రారంభించారని స్థానిక ముస్లింలు ఆరోపించారు. ఆగస్టు 3వ తేదీ వరకు, హింసకు సంబంధం ఉందన్న పేరుతో 176మందిని అరెస్ట్ చేసి, 90మందిని నిర్బంధించి, 93మంది పైన ఎఫ్ఐఆర్ నమోదు చేశారు. అరెస్టుల సమాచారం కోసం ఫ్రంట్ లైన్ ప్రతినిధి, నూహ్ ఎస్పీ, వరుణ్ సింగ్లాను కలిశాడు కానీ అధికారిక సమాచారం అందలేదు. నూహ్‌లో హింస చెలరేగిన కొన్ని రోజుల తరువాత, ఘర్షణలు జరిగినప్పుడు సెలవు పై వెళ్ళిన సింగ్లాను భివానీకి బదిలీ చేసి, నరేంద్ర బిజార్నియాను కొత్త ఎస్పీగా నియమించారు.



ఇస్మత్ ఆరా

పోలీసుల సమాచారం ప్రకారం, విశ్వహిందూ పరిషత్ (వీహెచ్‌పి) నిర్వహించిన బ్రిజ్ మండల్ జలాభిషేక్ యాత్ర, శివాలయం నుండి కొన్ని కిలోమీటర్ల దూరంలో ఉన్న ఖేడ్లా మోడ్ దగ్గరకు చేరినప్పుడు ఒక మతానికి చెందిన యువకులు ఆ యాత్ర పైన రాళ్ళు రువ్వడంతో సమస్య మొదలైంది. వాడివేడి మాటలతో మొదలైన ఘర్షణ, రాళ్ళ వర్షంగా మారిందని స్థానికులంటున్నారు. సామాజిక మాధ్యమంలో వైరలైన వీడియోల్లో ఇరువర్గాల వారు, కత్తులు, ఇనుప రాడ్లు, కర్రలు, తుపాకుల్లాంటి మారణాయుధాలతో కనిపించారు. యాత్రలో భాగస్వాములైన వందలాది మంది శివాలయంలో తలదాచుకున్నారు, తరువాత పోలీసులు వారిని బయటకు తీసుకొచ్చారు. ఆ వెంటనే సామాజిక మాధ్యమాల్లో, ముస్లింలు అధిక సంఖ్యలో ఉన్న నూహ్ లాంటి ప్రాంతాల్లో హిందువులకు రక్షణ లేదని, హిందూత్వ సంస్థల సభ్యులు కథనాలను వ్యాప్తి చేయడం ప్రారంభించారు.

ఆ రాత్రి గురుగ్రామ్ సెక్టార్ 57లోని అంజుమన్ జమా మసీద్‌కు డిప్యూటీ ఇమామ్‌గా ఉన్న హఫీజ్ సాద్, పోలీసులు పహారా కాస్తున్నప్పటికీ, మూక దాడిలో చనిపోయాడు. బీహార్ రాష్ట్రంలోని సితామర్హీకి చెందిన అతడు సంవత్సరం క్రితమే అక్కడికి వచ్చాడు. స్థానికుల కథనం ప్రకారం, అర్ధరాత్రి సమయంలో సాయుధ మూక మసీదుపై దాడి చేసి, నిప్పంటించింది. సాద్ సుమారు రాత్రి 2 గంటల సమయంలో చనిపోయాడని అతని సోదరుడు షాదాబ్ అన్నాడు. రాత్రి 11.30 గంటలకు సాద్ తన అక్కకు ఫోన్ చేస్తే, ఆమె బీహార్ తిరిగి వచ్చేయమని చెప్పగా, మసీదుకు రక్షణగా పోలీసులు చుట్టూ ఉన్నారని, భయపడాల్సినవసరం లేదని చెప్పాడు. దాడిలో ఛాతీపై అనేక కత్తిపోట్లు పొడవడంతో చనిపోయాడని షాదాబ్ ఫ్రంట్ లైన్‌కు చెప్పాడు. స్వరాష్ట్రానికి వెళ్ళేందుకు సాద్ ఆగస్ట్ 1వ తేదీనే టికెట్ బుక్ చేసుకున్నాడని అతనన్నాడు. డబ్ల్యూ.ప్రతీక్షా హాస్పిటల్‌కు పోలీసులు సాద్‌ను తీసుకొనిపోగా చనిపోయాడని చెప్పారు. మసీదులో ఉన్న మరో వ్యక్తిని కూడా తీవ్రంగా కొట్టి, అతని మోకాలును గాయపరిచారు. అతడింకా ఐసీయూలోనే ఉన్నాడు. నేరస్తులను గుర్తించే పనిలో ఉన్నామని, ఎఫ్ఐఆర్ నమోదు చేశామని పోలీసులంటున్నారు.

ఈ హింసకు ప్రధాన ఉత్ప్రేరకంగా రెండు వీడియోలు పని చేసినట్లు కనిపిస్తోంది. ఒకటి, ఇద్దరు ముస్లింలను చంపిన నేరంలో ప్రధాన నిందితుడు, పారిపోయిన గోరక్షక దళ సభ్యుడైన మోనూ మనేసార్ వాట్సాప్ ద్వారా పంపిన వీడియో, మరొకటి ఫరీదాబాద్ గోరక్షక బజరంగ్ ఫోర్స్ యూనిట్‌కు ఇన్చార్జ్ అయిన బిట్టూ బజరంగీ జూలై 31 ఉదయం 11 గంటలకు ఫేస్బుక్‌లో పోస్ట్ చేసిన లైవ్ వీడియో. వీహెచ్‌పి యాత్రలో మోనూ మనేసార్ పాల్గొంటున్న ఉద్దేశ్యాన్ని ప్రకటిస్తూ బిట్టూ ఆ వీడియోలో కనిపిస్తాడు.

"నేను మీకు (ముస్లింలకు)ముందుగానే చెపుతున్నాను. మీ బావగారు (మోనూ మనేసార్) ఇక్కడ సందర్శనకు వస్తున్నాడు. మేం మళ్ళీ మీకు చెప్పలేదని అనొద్దు. ఆయన కోసం పూలు, పూలదండలతో సిద్ధంగా ఉండండి" అని బిట్టూ బజరంగీ ఆ వీడియో ద్వారా చెప్పాడు.

మోనూ మనేసార్ హర్యానాలో స్వయం ప్రకటిత గోరక్షకుడు. ఆవుల్ని స్మగ్లింగ్ చేస్తున్నారన్న అనుమానంతో ఫిబ్రవరి 16న బజరంగ్ దళ్ సభ్యులు, నాసిర్, జునైద్‌లను కిడ్నాప్ చేసి,హత్య చేసిన నేరాల్లో మోనూ ప్రధాన నిందితుడు. కారులోకి ఎక్కించి, సజీవ దహనం చేయడానికి ముందు వారిని అనాగరికంగా కొట్టారు. వారిరువురూ రాజస్థాన్ రాష్ట్రంలో గోపాల్ ఘర్ గ్రామానికి చెందినవారు. మే నెలలో రాజస్థాన్ పోలీసులు నాసిర్, జునైద్‌లను హత్య చేసినందుకు మోనూపై కేసు మోపారు కానీ, అతన్ని పట్టుకోలేక పోయారు. రాజస్థాన్ రాష్ట్రంలో కొన్ని ప్రాంతాలకు విస్తరించిన మేవత్ ప్రాంతంలో ఈ కేసు ఒక సున్నితమైన సమస్యగా మిగిలింది. నూహ్‌ను సందర్శించాలన్న మోనూ నిర్ణయంతో ఆగ్రహించిన కొందరు ముస్లిం యువకులను(బిట్టూ సవాల్‌కు ప్రతిస్పందనగా) ఎదురు దాడి చేయడానికి సిద్ధంగా ఉండేట్లు అనివార్యంగా ఉసిగొల్పారు.

"సామాజిక మాధ్యమాల్లో వీడియోలు పోస్ట్ చేసినప్పుడు, ఆ ప్రాంత ప్రజల మానసిక స్థితి పూర్తిగా మారింది. జునైద్, నాసిర్‌ల హత్య కేసులో మోనూ నిందితుడు. ప్రజలు మానసిక ఉద్వేగాలకు లోనయ్యారు. అక్కడ ఏమీ జరగనట్టు, మోనూ, నూహ్ సందర్శిస్తానని చెప్పాడు" అని ఆగస్ట్ 1న వీహెచ్‌పి, బజరంగ్ దళ్, జమైత్ ఉలామా-ఈ-హింద్, ఇతర ప్రతినిధులు పాల్గొన్న శాంతి సమావేశానికి హాజరైన ఉలామా-ఈ- హింద్ సభ్యుడు ముఫ్తీ సలీం చెప్పాడు. జిల్లాలో అనేక ప్రాంతాల్లో ఉద్రిక్తతలు కొనసాగడంతో శాంతి సమావేశం నిష్ప్రయోజనమైంది.

ముస్లిం యువకులకు కోపం తెప్పించాలనీ, వారు ప్రతిస్పందించేట్లు చేయాలనేది లేకుంటే, నాసిర్, జునైద్‌ల హత్యా నేరంలో నిందితుడైన మోనూను



ఇక్కడికెందుకు ఆహ్వానించాలని, గాంధీ గ్రామ్ నివాసి, నూహ్‌లో టీకొట్టు నడుపుతున్న మహమ్మద్ అయూబ్ అనే పెద్ద మనిషి అన్నాడు. ఎన్నికల్లో లబ్దిపొందేందుకు ఘర్షణలు సృష్టించాలనే ఉద్దేశ్యం వీహెచ్‌పికి ఉందని, అదే ప్రాంత నివాసి మౌజ్ ఖాన్ అంటాడు. బీజేపీ హిందూత్వ అజెండాను ముందుకు తీసుకుపోయే లక్ష్యంతోనే ముస్లింలు అధిక సంఖ్యలో ఉండే ప్రాంతాల్లో ఇలాంటి ఘర్షణల్ని సృష్టించి, హిందువులు ప్రమాదంలో ఉన్నారనే కథనాలను వ్యాపింప చేస్తున్నారని ఆయన అన్నాడు.

వచ్చే సంవత్సరం జరగబోయే సాధారణ ఎన్నికలు, హర్యానా రాష్ట్ర అసెంబ్లీ ఎన్నికల్లో హిందువుల మద్దతు పొందే లక్ష్యంతోనే మేవాత్ ప్రాంతాన్ని మతతత్వీకరణ చేసే సుదీర్ఘ ప్రణాళికను బీజేపీ రచించిందని, శాంతి సమావేశ భాగస్వామి, స్వరాజ్ ఇండియా పార్టీ నాయకుడు యోగేంద్ర యాదవ్ అన్నాడు. వీడియోల ద్వారా హింసను ప్రేరేపించిన బజరంగ్ దళ్ సభ్యులకు వ్యతిరేకంగా చర్యలు చేపట్టాలని ఆయన అన్నారు.

హింస మొదలైనప్పుడు, అధికారులు తగిన రీతిలో స్పందించక పోయిన కారణంగానే పరిస్థితులు ఇక్కడి దాకా వచ్చాయనే అభిప్రాయాన్ని స్థానికులు వెలిబుచ్చారు. హింసను నివారించడంలో అధికారుల వైఫల్యం గురించి మాట్లాడుతూ... మహిళా జ్యుడీషియల్ మేజిస్ట్రేట్‌ను చుట్టుముట్టిన మూకల నుండి ఆమెను రక్షించడంలో తాను సహకరించానని నూహ్‌లో సీనియర్ న్యాయవాది అయిన రంజాన్ చౌదరీ అన్నారు. ఆమెను బయటకు తీసుకురావడానికి, రక్షణగా ఉండటానికి పోలీసులు నిరాకరించారు. ప్రచారంలో ఉన్న వీడియోలను పరిశీలించి, వాటిలో బహిరంగ బెదిరింపులకు దిగిన వారికి వ్యతిరేకంగా చర్యలు తీసుకోవాలని నూహ్ అడిషనల్ ఎస్పీ ఉషా కుందూకు చేసిన అభ్యర్థనలను పట్టించుకోలేదని చౌదరి అన్నాడు.

సామాజిక మాధ్యమాల్లో ఆ వీడియోలు ఇంకా చక్కర్లు కొడుతున్నాయి కాబట్టి అధికార యంత్రాంగానికి చర్యలు తీసుకునే ఉద్దేశం లేదనేది స్పష్టం అవుతుంది. సామాజిక మాధ్యమాల్లో బెదిరింపులకు గురిచేస్తున్న పోస్టుల్ని తీసేయలేదు, ఇబ్బందులకు గురిచేస్తున్న వారిని ముందు జాగ్రత్త చర్యగా నిర్బంధంలోకి తీసుకోలేదని విమర్శకులంటున్నారు. హింస చెలరేగిన తరువాత మాత్రమే ప్రభుత్వం ఆ ప్రాంతంలో ఇంటర్నెట్ సేవల్ని నిలిపివేసి, దానిని ఆగస్ట్ 5 వరకు పొడిగించింది.

ఈ క్రమంలో, పరిస్థితిని చక్కదిద్దడంలో అధికారుల తీరుపై బీజేపీ పాలకపక్షం సభ్యులు కూడా ఆందోళన వ్యక్తం చేశారు. గురుగ్రామ్ ఎంపీ, కేంద్ర మంత్రి రావు ఇంద్రజిత్ సింగ్, నూహ్ హింసపై మాట్లాడుతూ... యాత్రలో పాల్గొన్నవారు కత్తులు, కర్రలు చేబూనడం సరైంది కాదని అన్నాడు. "వారికి ఆయుధాలెవరిచ్చారు? కత్తులు, కర్రలు పట్టుకుని ప్రదర్శనకు ఎవరు వెళ్లారు? అవతలివైపు నుండి ప్రేరేపిత చర్యల్లేవని నేననడం లేదని" ఆయన అన్నాడు. యాత్రకు అనుమతిచ్చే సందర్భంలో, యాత్రలో ఖచ్చితంగా ఆయుధాలు లేకుండా చూడాలని నిర్వాహకులకు చెప్పినట్లు నూహ్ డిప్యూటీ కమీషనర్, ప్రశాంత్ పన్వర్ మీడియాతో అన్నాడు. 2016, ఫిబ్రవరిలో 10రోజులపాటు రాష్ట్రాన్ని బలహీనపరిచిన హింసాత్మక జాట్ నిరసనల సందర్భంలో కూడా మనోహర్ లాల్ ఖట్టార్ నాయకత్వంలోని ప్రభుత్వం మొద్దునిద్ర పోయింది. అప్పుడు చెలరేగిన హింసను అదుపుచేయడంలో కూడా ప్రభుత్వం విఫలం చెందిందనే ఆరోపణలున్నాయి. ఈసారి హర్యానాలో చెలరేగిన హింస, పేద ముస్లింలు నివసించే ప్రాంతాలకు విస్తరించింది. వారు అధికారుల ఒత్తిడిని కూడా ఎదుర్కొంటున్నారు. ఆగస్ట్ 4న, అధికారులు నూహ్‌లో ముస్లిం వలస కార్మికులకు చెందిన 250 గుడిసెలు, పాకలను కూల్చారు. ఇవి ప్రభుత్వ స్థలాల్లో అక్రమంగా నిర్మించిన కట్టడాలని అధికారులు ఆరోపిస్తున్నారు.

ముఖ్యమంత్రి ఖట్టార్, హింస వెనుకున్న కుట్రను బట్టబయలు చేసి, నేరస్తులను శిక్షిస్తామని అన్నాడు. ఆస్తుల్ని కోల్పోయిన వారికి నష్టపరిహారాన్ని ప్రకటించాడు. 5లక్షల రూపాయల నష్టం జరిగిన వారికి అందులో 80శాతం, 5 నుండి 10 లక్షల రూపాయల నష్టం వాటిల్లిన వారికి 70శాతం, 10 నుండి 20 లక్షల రూపాయల నష్టం జరిగిన వారికి 60శాతం పరిహారాన్ని అందజేస్తామని, మానేసార్‌ను పట్టుకునేందుకు వేట మొదలైందని ముఖ్యమంత్రి మీడియాతో అన్నాడు.

ఈ క్రమంలో ఆగస్ట్ 2న నూహ్, గురుగ్రామ్‌లలో అల్లర్లు జరిగిన తర్వాత వీహెచ్‌పి, బజరంగ్ దళ్‌లు తలపెట్టిన ప్రదర్శనలను నిలుపుదల చేయాలని సుప్రీంకోర్టులో ఓ దరఖాస్తు దాఖలైంది. "ప్రదర్శనల్లో ఎలాంటి ద్వేషపూరిత ప్రసంగాలు లేకుండా కేంద్రం హామీ ఇవ్వాలని, ప్రదర్శనలు నిర్వహించే సందర్భంలో భద్రతా కారణాల రీత్యా అదనపు బలగాలను మోహరింప చేయాలని" కోర్టు ఉత్తర్వులు జారీ చేసింది.

("ఫ్రంట్ లైన్" సౌజన్యంతో)

అనువాదం: బోడపట్ల రవీందర్, 9848412451

ట్రాన్స్‌జెండర్లకు రిజర్వేషన్లపై స్పందించండి

కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు సుప్రీం ఆదేశం



న్యూఢిల్లీ : ట్రాన్స్‌జెండర్లకు విద్య, ఉద్యోగాల్లో రిజర్వేషన్లు కోరుతూ దాఖలైన పిటిషన్‌పై సుప్రీంకోర్టు కేంద్రం, అన్ని రాష్ట్రాలు, కేంద్ర పాలిత ప్రాంతాలకు నోటీసులు జారీ చేసింది. వారికి రిజర్వేషన్లపై స్పందన తెలియచేయాల్సిందిగా ఆదేశించింది. రాజ్యాంగంలోని ఆర్టికల్ 16 (ప్రభుత్వ ఉద్యోగ విషయాల్లో సమానత్వం) ప్రకారం ట్రాన్స్‌జెండర్లు రిజర్వేషన్‌కు అర్హులని నొక్కి చెప్పిన పిటిషన్‌పై సీజేఐ జస్టిస్ డివై చంద్రచూడ్, జస్టిస్ జెబి పార్దివాలా, జస్టిస్ మనోజ్ మిశ్రాలతో కూడిన ధర్మాసనం శుక్రవారం ఈ నోటీసులు జారీ చేసింది. యునైటెడ్ నేషన్స్ డెవలప్‌మెంట్ ప్రోగ్రాం (యూఎన్‌డీపీ) సహకారంతో నేషనల్ ఎయిడ్స్ కంట్రోల్ ఆర్గనైజేషన్ (నాకో) నివేదికపై కేరళకు చెందిన సుబి కెసి అనే ట్రాన్స్‌జెండర్ దాఖలు చేసిన పిటిషన్‌ను ధర్మాసనం విచారించింది. ట్రాన్స్‌జెండర్లకు (లింగ మార్పిడి వ్యక్తుల కు) తగినంత శిక్షణ, ఉపాధి నైపుణ్య కార్యక్రమాలు లేక పోవడం వల్ల ఈ అట్టడుగు వర్గానికి ఉపాధి అవకాశాలు లేవని ఈ నివేదిక సూచించింది. ట్రాన్స్‌జెండర్ వ్యక్తుల (హక్కుల పరిరక్షణ) చట్టం–2019 లింగమార్పిడి వ్యక్తులకు వివిధ హక్కులను మంజూరు చేసినప్పటికీ, అది విద్య, ఉద్యోగాలలో రిజర్వేషన్‌లను అందించడం లేదని పిటిషన్‌లో పేర్కొన్నారు. అంతే కాకుండా, పిటిషన ర్లు కోరినట్లుగా ప్రభుత్వ ఉద్యోగాల్లో రిజర్వేషన్లు అమలు చేయాలని హైకోర్టులలో అనేక రిట్ పిటిషన్లు దాఖల య్యాయని పిటిషన్ స్పష్టం చేసింది. అయినప్పటికీ, లింగమార్పిడి వ్యక్తులకు అటువంటి రిజర్వేషన్లను నిర్ధారించడానికి ఇంతవరకు ఎటువంటి ఖచ్చితమైన చర్యలు తీసుకోలేదని పేర్కొంది. అదనంగా, లింగ మార్పిడి వర్గం సామాజికంగా, ఆర్థికంగా, విద్యాపరంగా వెనుకబడి ఉందని అనేక అధ్యయనాలు, నివేదికలు నిరూపిస్తున్నాయని పిటిషన్ పేర్కొంది. రిజర్వేషన్ల కోసం నిబంధనలను అమలు చేయడంతో వారి విపత్కర పరిస్థి తులను తక్షణమే పరిష్కరించాల్సిన అవసరం ఉందని పేర్కొంది. ఈ పిటిషన్‌ను న్యాయవాది తులసి కె రాజ్ డ్రా చేయగా, న్యాయవాది కాశీశ్వరం రాజ్ సెటిల్ చేశా రు. న్యాయవాది మహమ్మద్ సాదిక్ టిఎ ఈ పిటిషన్ దాఖలు చేశారు.

ఐఏఎస్ అధికారిణి శ్రీలక్ష్మికి సుప్రీం నోటీసులు

న్యూఢిల్లీ : ఓబుళాపురం మైనింగ్ కేసులో ఐఏఎస్ అధికారిణి, ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి శ్రీలక్ష్మికి అత్యున్నత న్యాయస్థానం నోటీసు జారీ చేసింది. గతంలో తెలంగాణ హైకోర్టు శ్రీలక్ష్మికి క్లీన్ చిట్ ఇస్తూ సీబీఐ నమోదు చేసిన అభియోగాలను కొట్టివేసింది. దీన్ని సవాల్ చేస్తూ సీబీఐ సుప్రీంకోర్టును ఆశ్రయించింది. ఈ పిటిషన్‌ను శుక్రవారం సుప్రీం కోర్టు న్యాయమూర్తులు జస్టిస్ ఎఎస్ బోపన్న, జస్టిస్ ఎంఎం సుందరేశ్‌లతో కూడిన ధర్మాసనం విచారించింది.

గనుల కేటాయింపుల్లో ఓబులాపురం మైనింగ్ కంపెనీకి లబ్ది చేశారని శ్రీలక్ష్మిపై ఆరోపణలు వచ్చాయి. జగన్మోహన్ రెడ్డి అక్రమాస్తుల కేసుల్లోనూ ఆరోపణలు ఎదుర్కొంటున్నారు. పెన్నా సిమెంట్స్‌కు అక్రమంగా లబ్ది చేకూర్చినట్టు అభియోగాలు నమోదైన కేసులో జగన్‌తో పాటు శ్రీలక్ష్మి నిందితురాలిగా ఉన్నారు. పెన్నా సిమెంట్స్ కేసులో జగన్, ధర్మాన ప్రసాదరావు , పెన్నా ప్రతాప్ రెడ్డి, సబితా ఇంద్రారెడ్డిలతో పాటు అభియోగాలు ఎదుర్కొంటున్నారు. వై. ఎస్ రాజశేఖర్ రెడ్డి ఉమ్మడి రాష్ట్ర ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడు 2007లో అనంతపురంలోని రిజర్వ్ ఫారెస్ట్ ఏరియాలో ఓబులాపురం మైనింగ్ కంపెనీ అక్రమ మైనింగ్ వ్యవహారాలపై సీబీఐ కేసులు నమోదు చేసింది. అక్రమంగా మైనింగ్ లైసెన్సులు మంజూరు చేశారని శ్రీలక్ష్మిపై అభియోగాలు మోపింది. గాలి జనార్దన్ రెడ్డికి చెందిన ఓఎంసీ కంపెనీకి లైసెన్సుల మంజూరులో శ్రీలక్ష్మి తన అధికారాన్ని దుర్వినియోగం చేశారని ఆరోపించింది. 1988 బ్యాచ్‌కు చెందిన శ్రీలక్ష్మి అక్రమ మైనింగ్ కేసులో 2011లో అరెస్ట్ అయ్యారు. సీబీఐ ట్రయల్ కోర్టులో శ్రీలక్ష్మికి వ్యతిరేకంగా తీర్పు వచ్చింది. ఆ తీర్పును ఆమె తెలంగాణ హైకోర్టులో సవాల్ చేయగా ఆమెపై అభియోగాలు కొట్టివేస్తూ హైకోర్టు తీర్పును ఇచ్చింది. హైకోర్టును తీర్పును సీబీఐ సుప్రీంకోర్టులో సవాల్ చేసింది. ధర్మాసనం ఐఏఎస్ అధికారిణి శ్రీలక్ష్మికి నోటీసులు జారీ చేసింది.

డ్రోన్ల తయారీలో ఓయూ విద్యార్థుల సత్తా

- యురేక, ఫాల్కన్ పేరుతో అటానమస్ డ్రోన్లు
- విపత్తుల వేళ అండగా..
- విద్యార్థులకు పలువురి ప్రశంసలు



నవతెలంగాణ-ఓయూ

విపత్తుల వేళ ఉపయోగించేలా రెండు రకాల "అటానమస్ డ్రోన్లను" హైదరాబాద్ ఉస్మానియా యూనివర్సిటీ ఇంజినీరింగ్ కళాశాల విద్యార్థులు తయారు చేసి సత్తా చాటారు. ఓయూలో వీటిని తయారు చేయడం ఇదే మొదటిసారి కావడం విశేషం. తాజాగా ఈ డ్రోన్లను తమిళనాడు చెన్నయ్‌లోని కేసీజీ ఇంజినీరింగ్ కళాశాలలో నిర్వహిస్తున్న అటానమస్ డ్రోన్ డెవలప్‌మెంట్ చాలెంజ్ - 2023 (ఏడీడీసీ)లో ప్రదర్శించారు. ప్రొ.ఉమామహేశ్వర్ పర్యవేక్షణలో కళాశాలలోని సొసైటీ ఆఫ్ ఆటోమేటివ్ ఇంజినీర్స్, ఇండియా (ఎస్‌ఏఈ ఇండియా) క్లబ్ సభ్యులైన విద్యార్థులు ఈ డ్రోన్(యురేకా, ఫాల్కోన్స్)లను రూపొందించారు. సీఎస్ఈ, ఈసీఈ, ఈఈఈ, మెకానికల్, మైనింగ్ విభాగాలకు చెందిన మూడు, నాలుగో సంవత్సరానికి చెందిన 10 మంది విద్యార్థులతో కూడిన బృందం పాల్గొంది. ఈ సందర్భంగా విద్యార్థులను కళాశాల ప్రిన్సిపల్ ప్రొ.శ్రీరాం వెంకటేశ్, క్లబ్. ఫ్యాకల్టీ అడ్వైజర్ డాక్టర్ ఈ.మధుసూదన్ రాజు, డాక్టర్ లింగస్వామి, ఆయా విభాగాల హెడ్‌లు విద్యార్థులను అభినందించారు.

అనేక ప్రయోజనాలు..

ప్రిన్సిపాల్ ప్రొ.శ్రీరాం వెంకటేష్ ఈ డ్రోన్ల గురించి వివరిస్తూ.. ఎలక్ట్రికల్ లిపియం పాలిమర్ బ్యాటరీస్‌తో రూ.40 వేలు వెచ్చించి 15 రోజులపాటు శ్రమించి రూపొందించిన ఈ డ్రోన్స్ జీపీఎస్ లొకేషన్ ద్వారా ఎలాంటి మానవ సంబంధం లేకుండా ఆకాశ మార్గంలో ప్రయాణిస్తాయని తెలిపారు. ఇక వివిధ విపత్తులు, ఉపద్రవాల సమయంలో వస్తువులను సరఫరా చేస్తాయని చెప్పారు. కో ఆర్డినేటర్ ప్రొ.ఉమామహేశ్వరరావు మాట్లాడుతూ.. భవిష్యత్తులో అమెజాన్, ఫ్లిప్ కార్ట్ లాంటి సంస్థలు కూడా ఇలాంటి డ్రోన్స్ ద్వారా వస్తువులు డెలివరీ చేస్తాయన్న ఆశాభావం వ్యక్తం చేశారు. కొన్ని సంవత్సరాలుగా ఇంజినీరింగ్ కళాశాల విద్యార్థుల్లో ఉన్న సృజనాత్మకత, ఆలోచనల శక్తిని పెంపొందించి వారిని పరిశోధనల వైపుకు ప్రిన్సిపాల్, అధ్యాపకులు ప్రోత్సహిస్తున్నారు. దాంతో విద్యార్థులు దేశవ్యాప్తంగా జరిగే వివిధ పోటీల్లో పాల్గొని సత్తా చాటుతున్నారు.

ఉమ్మడి నల్గొండలో కాంగ్రెస్ క్లీన్ స్వీప్

- కమ్యూనిస్టులను కేసీఆర్ మోసం చేశారు : ఎంపీ ఉత్తమ్ కుమార్ రెడ్డి

నవతెలంగాణబ్యూరో-హైదరాబాద్

సీఎం కేసీఆర్ కమ్యూనిస్టు పార్టీలను మోసం చేశారని ఎంపీ ఎన్ ఉత్తమ్‌కుమార్‌రెడ్డి విమర్శించారు. ఈ విషయం తమకు ముందే తెలుసని చెప్పారు. ఎమ్మెల్యే టికెట్ కోసం దరఖాస్తు చేసుకునేందుకు గురువారం గాంధీభవన్‌కు వచ్చిన ఆయన...పార్టీ కార్యనిర్వాహక అధ్యక్షులు మహేష్‌కుమార్‌గౌడ్‌తో కలిసి విలేకర్లతో మాట్లాడారు. వచ్చే ఎన్నికల్లో ఉమ్మడి నల్గొండ జిల్లాలో కాంగ్రెస్ పార్టీ క్లీన్ స్వీప్ చేస్తుందని ధీమా వ్యక్తం చేశారు. లిక్కర్ వినియోగం, అవినీతిలో తెలంగాణ నంబర్ వన్‌లో ఉందన్నారు. రాష్ట్రంలో అతిపెద్ద సామాజిక వర్గాలైన మాదిగ, ముదిరాజ్‌లకు మంత్రివర్గంలో చోటు లేదని విమర్శించారు.

నియోజకవర్గాలను బీఆర్‌ఎస్ ఎమ్మెల్యేలు తమ సామ్రాజ్యంగా భావించి అవినీతికి పాల్పడుతున్నారని ఆరోపించారు. హుజూర్‌నగర్‌లో దళిత బంధు అర్హుల వద్ద అధికార పార్టీ పెద్దలు కమిషన్ తీసుకున్న విషయాన్ని కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లినట్టు తెలిపారు. రాష్ట్రంలో వచ్చేది కాంగ్రెస్ ప్రభుత్వమేనని ఉత్తమ్ విశ్వాసం వ్యక్తం చేశారు.

కాంట్రాక్ట్ ఏఎన్‌ఎంల సర్వీసులను రెగ్యులర్ చేయాలి

- డీహెచ్‌కు టీయుఎంహెచ్‌ఇయూ వినతి

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

కాంట్రాక్ట్ ఏఎన్‌ఎంల సర్వీసులను క్రమబద్ధీకరించాలని తెలంగాణ యునైటెడ్ మెడికల్, హెల్త్ ఎంప్లాయీస్ యూనియన్ (టీయుఎంహెచ్‌ఇయూ- సీఐటీయూ అనుబంధం) కోరింది. ఈ మేరకు శుక్రవారం సీఐటీయూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పాలడుగు భాస్కర్, కార్యదర్శి జె.వెంకటేష్, టీయుఎంహెచ్‌ఇయూ గౌరవాధ్యక్షులు భూపాల్, రాష్ట్ర ఉపాధ్యక్షులు కె.బలరాం, కోశాధికారి ఎ.కవిత, రాష్ట్ర ఆఫీస్ బేరర్లు కిరణ్మయి, హైదరాబాద్ కార్యదర్శి లక్ష్మీబాయి తదితరులు రాష్ట్ర ప్రజారోగ్య సంచాలకులు డాక్టర్ జి.శ్రీనివాసరావుకు వినతిపత్రం సమర్పించారు.

తమ యూనియన్ ఆధ్వర్యంలో ఆగస్టు 15 నుంచి ఎంపీహెచ్‌ఏ(ఎఫ్)లు తమ సర్వీసులను రెగ్యులర్ చేయాలని కోరుతూ ఆగస్టు 15 నుంచి సమ్మె చేస్తున్నారని తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం జారీ చేసిన నోటిఫికేషన్ ద్వారా రాత పరీక్ష నిర్వహించి కాంట్రాక్ట్ ఉద్యోగులకు సర్వీసు వెయిటేజీ ఇస్తామని నిర్ణయించిందని చెప్పారు.

దీన్ని కాంట్రాక్టు పద్ధతిలో పని చేస్తున్న 4,115 మంది 2వ ఏఎన్‌ఎంలు, దాదాపు 700 మంది అర్బన్ హెల్త్ సెంటర్ల ఏఎన్‌ఎంలు, 733 మంది ఈసీ ఏఎన్‌ఎంలు, 47 మంది హెచ్‌ఆర్‌డీ, 20 మంది 104 ఏఎన్‌ఎంలు, ఆర్ బీఎస్ కే ఏఎన్‌ఎం తదితరులు రాత పరీక్ష విధానాన్ని అంగీకరించడం లేదని తెలిపారు.

రాత పరీక్ష రద్దు చేసి ప్రత్యామ్నాయ మార్గాల ద్వారా తమ సర్వీసులను యధావిధిగా రెగ్యులర్ చేయాలని కోరారు. ఉద్యోగుల మనోభావాలను దృష్టిలో పెట్టుకుని రెగ్యులర్ చేసేందుకు చర్యలు తీసుకుని సమ్మె నివారణకు కృషి చేయాలని విజ్ఞప్తి చేశారు.

ప్రభుత్వంతో మాట్లాడుతా...

సమ్మెను పరిష్కరించడానికి ప్రభుత్వంతో మాట్లాడి అవసరమైతే ఉన్నతాధికారులతో ఒక కమిటీని ఏర్పాటు చేసి, సమస్యలన్నింటినీ పరిష్కరించడానికి కృషి చేస్తానని డీహెచ్ డాక్టర్ శ్రీనివాసరావు తెలిపారు. కమిటీ వేసిన తర్వాత ఏఎన్‌ఎంల సమస్యలను కమిటీకి విజ్ఞప్తి చేయాలని కోరారు. సమ్మె విరమణకు సానుకూలంగా ఆలోచించాలని సూచించారు.

తెలుగు భాషా సాహిత్యాభివృద్ధిలో రామానుజరావు కృషి

జయంతి సభలో వక్తలు

- రచయిత దిలీప్‌రెడ్డికి దేవులపల్లి రామానుజరావు పురస్కారం ప్రదానం



నవతెలంగాణ -సుల్తాన్ బజార్

కవిగా, విమర్శకుడిగా, విద్యావేత్తగా, సారస్వత పరిషత్తు, సాహిత్య అకాడమీల సారథిగా తెలుగు భాషా సాహిత్యాలకు అనితర సాధ్యమైన సేవలందించిన దేవులపల్లి రామానుజరావు కారణజన్ములని వక్తలు అన్నారు. తెలంగాణ సారస్వత పరిషత్‌లో శుక్రవారం డాక్టర్ దేవులపల్లి రామానుజరావు 106వ జయంతి కార్యక్రమం, ప్రముఖ పత్రికా రచయిత ఆర్.దిలీప్ రెడ్డికి రామానుజరావు పురస్కార ప్రదానోత్సవం నిర్వహించారు. దిలీప్‌రెడ్డిని రూ.25 వేలు, జ్ఞాపిక, శాలువాతో సత్కరించారు.

ఈ సందర్భంగా తెలంగాణ ప్రభుత్వ సలహాదారు డాక్టర్ కెవి.రమణాచారి ప్రసంగిస్తూ.. ఉస్మానియా విశ్వవిద్యాలయాన్ని కేంద్ర ప్రభుత్వం స్వాధీనం చేసుకొని హిందీ విశ్వవిద్యాలయంగా చేయాలనుకున్నప్పుడు దేవులపల్లి రామానుజరావు అప్పటి కేంద్ర విద్యామంత్రి అబుల్ కలామ్ ఆజాద్, ప్రధానమంత్రి నెహ్రూను కలిసి ఎంతో కృషి చేసి మనకు విశ్వవిద్యాలయం దక్కేలా చేశారని చెప్పారు. మాడపాటి హనుమంతరావు, సురవరం ప్రతాపరెడ్డి, దేవులపల్లి రామానుజరావు, రాజా బహదూర్ వెంకటరామారెడ్డి వంటి పెద్దల కృషి వల్ల ఆధునిక తెలంగాణ రూపుదిద్దుకుందని చెప్పారు. పాత్రికేయునిగా సమాచార హక్కు చట్టం తొలి కమిషనర్‌గా వినయ సంపన్నుడిగా పేరుపొందిన దిలీప్‌రెడ్డికి రామానుజరావు పురస్కారం అందజే యడం సముచితమన్నారు. పరిషత్ అధ్యక్షులు ఆచార్య ఎల్లూరి శివారెడ్డి మాట్లాడుతూ.. రామానుజ రావు లేనిదే పరిషత్ లేదని, అంతగా పరిషత్‌తో మమేకమై జీవనం సాగించారని తెలిపారు. పరిషత్తు ప్రధాన కార్యదర్శి డాక్టర్ జె చెన్నయ్య మాట్లాడుతూ.. రామానుజరావు సారస్వత పరిషత్తు వేదికగా తెలుగు భాషా సంస్కృతుల వికాసానికి కేంద్ర బిందువై నిలిచారని కొనియాడారు. పరిషత్ కోశాధికారి మంత్రి రామారావు మాట్లాడుతూ.. రామానుజరావ్ స్వార్థమెరుగని సారస్వత కృషీవలుడు అన్నారు. సాహిత్య విమర్శకులు ఆచార్య ఎస్వీ రామారావు, ప్రముఖ రచయిత్రి డాక్టర్ ముదిగంటి సుజాతా రెడ్డి, తెలుగు జానపద సాహిత్య పరిషత్తు అధ్యక్షులు డాక్టర్ సి.వసుంధరరెడ్డి మాట్లాడారు. పురస్కార గ్రహీత దిలీప్ రెడ్డి స్పందన ప్రసంగం చేశారు.

తెలంగాణలో బీజేపీతో కలిసి పోటీ చేస్తాం

నక్సలైట్లు జనజీవన స్రవంతిలోకి రావాలి

- ఇండియాకు ప్రధాన మంత్రి అభ్యర్థి ఎవరు? : విలేకరుల సమావేశంలో కేంద్ర మంత్రి రాందాస్ అథవలే

నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్

తెలంగాణలో బీజేపీతో కలిసి 12 స్థానాల్లో పోటీ చేస్తామని కేంద్రమంత్రి, ఆర్‌పీఐ అధినేత రాందాస్ అథవలే వెల్లడించారు. హైదరాబాద్ టూరిజం ప్లాజాలో శుక్రవారం విలేకరుల సమావేశంలో మాట్లాడారు. గద్దర్ మరణం తమ ఉద్యమానికి తీరని లోటన్నారు. తమ పార్టీ సభలకు గద్దర్ వచ్చి..చాలా సార్లు మాట్లాడారని, పాటలు కూడా పాడారని తెలిపారు. శాంతి, బుద్ధిజం కోసం ఆయన పని చేశారని తెలిపారు. అంబేడ్కర్ ఆశయాలను ప్రజల్లోకి తీసుకెళ్ళారన్నారు. నక్సలైట్లు..జన జీవన స్రవంతిలోకి రావాలని, గద్దర్ తరహాలో దళిత, గిరిజనుల కోసం పోరాటం చేయాలని సూచించారు. నేపాల్‌లో మావోయిస్ట్ నేత ప్రచండ రెండు సార్లు ఆ దేశానికి ప్రధాన మంత్రి అయ్యారని గుర్తుచేశారు.

తమ పార్టీ లక్ష్యాలు, ఆశయాలను ప్రజల్లోకి తీసుకెళ్లడానికి సెప్టెంబర్ 6న ఖమ్మంలో సభ నిర్వహించనున్నామని, అక్టోబర్ 3న నాంపల్లి ఎగ్జిబిషన్ గ్రౌండ్స్‌లో భారీ బహిరంగ సభ పెట్టబోతున్నామని వివరించారు. బీఆర్‌ఎస్ తెలంగాణకే పరిమితమైన పార్టీ మాత్రమేనని, కానీ మహారాష్ట్రలోని నాందేడ్, ఔరంగాబాద్‌ల్లో కేసీఆర్ ప్రయత్నాలు చేస్తున్నారని తెలిపారు. ఢిల్లీలో ప్రతిపక్షాలు ఇండియా పేరును బద్నాం చేస్తున్నాయని, ఆ కూటమికి ప్రధాని అభ్యర్థిని ప్రకటించలేని పరిస్థితి నెలకొందని విమర్శించారు. ఎన్‌డీఏ ప్రధాని అభ్యర్థి నరేంద్రమోడీనేనని తెలిపారు. ఈ సమావేశంలో ఆర్‌పీఐ జాతీయ నేతలు నాగేశ్వర్‌రావు, ప్రభుదాస్, ఏపీ అధ్యక్షులు బ్రహ్మానందరెడ్డి, తెలంగాణ అధ్యక్షులు రవికుమార్, వేలూరి వీణ, తదితరులు పాల్గొన్నారు.

గురుకులాల్లో 567 మంది

కాంట్రాక్టు టీచర్ల క్రమబద్ధీకరణకు ఆమోదం

రాష్ట్ర ప్రభుత్వ కీలక నిర్ణయం

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

తెలంగాణ రాష్ట్ర సాంఘిక సంక్షేమ గురుకుల విద్యాలయాల సంస్థ (టీఎస్‌డబ్ల్యూఆర్‌ఈఐఎస్) పరిధిలో పనిచేస్తున్న 567 మంది కాంట్రాక్టు టీచర్ల క్రమబద్ధీకరణపై రాష్ట్ర ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. వారి క్రమబద్ధీకరణకు సంబంధించి ప్రభుత్వం ఆమోదించింది.

రాష్ట్రంలో 567 మంది కాంట్రాక్టు ఉపాధ్యాయుల క్రమబద్ధీకరణకు సంబంధి ంచిన ఉత్తర్వులు ఒకటి, రెండు రోజుల్లో విడుదల య్యే అవకాశమున్నది. 16 ఏండ్లుగా వారు కాం ట్రాక్టు పద్ధతిలో విధులు నిర్వహిస్తున్న విషయం తెలి సిందే. దీంతో ఆ ఉపాధ్యాయులను క్రమబద్ధీకరించా లని ముఖ్యమంత్రి కేసీఆర్ నిర్ణయం తీసుకున్నారు.

మంత్రి కొప్పుల ఈశ్వర్ హర్షం

సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాలల్లోని కాంట్రాక్టు ఉపాధ్యాయుల క్రమబద్ధీకర ణకు సంబంధించి సీఎం కేసీఆర్ నిర్ణయం తీసుకోవడం పట్ల ఆ శాఖ మంత్రి కొప్పుల ఈశ్వర్ హర్షం ప్రకటించారు. దేశంలోనే మెరుగైన విద్యను తెలంగాణలోని గురుకుల విద్యార్థులకు అందిస్తున్నామని తెలిపారు.

టీఎస్‌యూటీఎఫ్ హర్షం

సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాలల్లో పనిచేస్తున్న 567 మంది కాంట్రాక్టు ఉపాధ్యాయుల సర్వీసులను రెగ్యులరైజ్ చేయడం పట్ల తెలంగాణ రాష్ట్ర ఐక్య ఉపాధ్యాయ ఫెడరేషన్ (టీఎస్ యూటీఎఫ్) రాష్ట్ర కమిటీ హర్షం ప్రకటించింది. ఈ మేరకు ఆ సంఘం రాష్ట్ర అధ్యక్షులు కె జంగయ్య, ప్రధాన కార్యదర్శి చావ రవి, గురుకుల ఉపాధ్యాయుల విభాగం కన్వీనర్లు డి ఎల్లయ్య, ఎస్ శ్రీజన, జి రాంబాబు, పి హరీందర్‌రెడ్డి శుక్రవారం ఒక ప్రకటన విడుదల చేశారు. 2007 నుంచి కాంట్రాక్టు పద్ధతిలో నామ మాత్రపు వేతనాలతో వారు పని చేశారని గుర్తు చేశారు. సర్వీసులను క్రమబద్ధీకరించాలంటూ దశాబ్ద కాలంగా ఆందోళన చేస్తున్నారని తెలిపారు. 2017లో 18 రోజులపాటు సమ్మె చేశారని వివరించారు. ఆ సందర్భంగా వారిని రెగ్యులరైజ్ చేస్తామంటూ రాష్ట్ర ప్రభుత్వం హామీ ఇచ్చిందని పేర్కొన్నారు. ఇంత కాలానికి ప్రభుత్వం హామీ నెరవేర్చినందుకు సాంఘిక సంక్షేమ శాఖ మంత్రికి, ముఖ్యమంత్రికి కృతజ్ఞతలు తెలిపారు. గురుకులాల్లో 567 మంది కాంట్రాక్టు ఉపాధ్యాయులను క్రమబద్ధీకరించడం పట్ల సాంఘిక సంక్షేమ గురుకుల ఉపాధ్యాయ, ఉద్యోగుల సంఘం రాష్ట్ర అధ్యక్షులు సిహెచ్ బాలరాజు, ప్రధాన కార్యదర్శి ఎన్ దయాకర్ హర్షం వ్యక్తం చేశారు. సీఎం కేసీఆర్‌కు కృతజ్ఞతలు తెలిపారు.

నేడు టీటీసీ పరీక్షలు


నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

రాష్ట్రంలో టెక్నికల్ టీచర్స్ సర్టిఫికెట్ (టీటీసీ) లోయర్‌గ్రేడ్ పరీక్షలు శనివారం జరగనుంది. ఈ మేరకు ప్రభుత్వ పరీక్షల విభాగం సంచాలకులు ఎ కృష్ణారావు శుక్రవారం ఒక ప్రకటన విడుదల చేశారు. వేసవిలో 42 రోజులపాటు శిక్షణ ఇచ్చిన వారితోపాటు ఫెయిలైన వారు ఈ పరీక్షలకు హాజరు కావాలని కోరారు. హైదరాబాద్, హన్మకొండ, నిజామాబాద్, నల్లగొండ, కరీంనగర్ జిల్లాల్లో ఈ పరీక్షలను నిర్వహిస్తున్నామని తెలిపారు. శనివారం ఉదయం 11 నుంచి ఒంటి గంట వరకు ఎడ్యుకేషనల్ సైకాలజీ అండ్ స్కూల్ అడ్మినిస్ట్రేషన్, మధ్యా హ్నం రెండు నుంచి మూడు గంటల వరకు మెథడ్స్ ఆఫ్ టీచింగ్ (జనరల్), మధ్యాహ్నం 3.30 నుంచి సాయంత్రం 4.30 గంటల వరకు మెథడ్స్ ఆఫ్ టీచింగ్ (స్పెషల్) పరీక్షలుంటాయని వివరించారు. అభ్యర్థులు హాల్ టికెట్ల కోసం www.bse.telangana. gov.in వెబ్‌సైట్‌ను సంప్రదించాలని సూచించారు.

సర్కారు బడుల్లో ఉపాధ్యాయుల కొరత

పాఠశాలల్లో పారిశుధ్య సమస్య

- తెలంగాణ పౌర స్పందన వేదిక సర్వేలో వెల్లడి
- సర్వీసు పర్సన్లను నియమించాలని డిమాండ్



నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

రాష్ట్రంలోని ప్రభుత్వ పాఠశాలల్లో ఉపాధ్యాయుల కొరత ఉన్నది. ఇంకోవైపు వాటిలో పారిశుధ్యం సమస్య వెంటాడుతున్నది. అయితే తెలంగాణ పౌర స్పందన వేదిక (టీపీఎస్‌వీ) ఆధ్వర్యంలో రాష్ట్రంలోని 1,217 ప్రభుత్వ పాఠశాలల్లో ఉపాధ్యాయుల కొరత, పారిశుధ్యం పరిస్థితులపై సర్వే నిర్వహించింది. 1,217 పాఠశాలల్లో 246 ఎస్జీటీ పోస్టులు, 74 స్కూల్ అసిస్టెంట్ (గణితం), 111 స్కూల్ అసిస్టెంట్ (తెలుగు), 106 స్కూల్ అసిస్టెంట్ (హిందీ), 75 స్కూల్ అసిస్టెంట్ (ఇంగ్లీష్), 52 స్కూల్ అసిస్టెంట్ (ఫిజికల్ సైన్స్), 127 స్కూల్ అసిస్టెంట్ (బయోసైన్స్), 187 స్కూల్ అసిస్టెంట్ (సాంఘికశాస్త్రం) పోస్టులు అవసరమని తేలింది. 567 పాఠశాలల్లో పారిశుధ్యం గ్రామపంచాయతీ, మున్సిపాల్టీ, మున్సిపల్ కార్పొరేషన్లు నియమించిన సిబ్బంది అప్పుడప్పుడు వచ్చి శుభ్రం చేస్తున్నారు. 246 బడుల్లో స్థానిక సంస్థలు నియమించిన సర్వీసు పర్సన్ల ద్వారా పారిశుధ్యం పనులను నిర్వహిస్తున్నారు. 404 పాఠశాలల్లో ప్రధానోపాధ్యా యులు, ఉపాధ్యాయులు సొంత డబ్బులతో సర్వీసు పర్సన్లను నియమించుకుని పారిశుధ్యం పనులను చేయిస్తున్నారు.

ప్రభుత్వం వెంటనే స్పందించాలి : టీపీఎస్‌వీ

సర్వే వివరాలను టీపీఎస్‌వీ అధ్యక్షులు, ఎమ్మెల్సీ అలుగుబెల్లి నర్సిరెడ్డి, ప్రధాన కార్యదర్శి ఎం రాధేశ్యాం శుక్రవారం మీడియాకు విడుదల చేశారు. వాస్తవ పరిస్థితులపై రాష్ట్ర ప్రభుత్వం వెంటనే స్పందించి పాఠశాలల్లో అవసరమున్న ఉపాధ్యాయ పోస్టులను భర్తీ చేయాలని డిమాండ్ చేశారు. పారిశుధ్యం పనులను స్థానిక సంస్థల ద్వారా కాదని అనుభవంలో తేలిందని తెలిపారు. కావున ప్రత్యేకంగా సర్వీసు పర్సన్లను నియమించాలని డిమాండ్ చేశారు.

సర్వే వివరాలు	ఉపాధ్యాయుల కొరత
అవసరం లేదు	: 653 (53.7 శాతం)
ఎస్జీటీ	: 246 (20.2 శాతం)
ఎస్ఏ మ్యాథ్స్	: 74 ((6.1 శాతం)
ఎస్ఏ తెలుగు	: 111 (9.1 శాతం)
ఎస్ఏ హిందీ	:106 (8.7 శాతం)
ఎస్ఏ ఇంగ్లీష్	: 75 (4.3 శాతం)
ఎస్ఏ ఫిజికల్ సైన్స్	: 52 (4.3 శాతం)
ఎస్ఏ బయోసైన్స్	: 127 (10.4 శాతం)
ఎస్ఏ సోషల్	: 187 (15.4 శాతం)

బిజినెస్

మరో భారత కార్పొరేట్ కంపెనీపై బాంబు..!

హిండెన్‌బర్గ్ తరహా రిపోర్ట్

న్యూఢిల్లీ : అమెరికాకు చెందిన షార్ట్ సెల్లింగ్ సంస్థ హిండెన్‌బర్గ్ తరహాలోనే మరో అంతర్జాతీయ సంస్థ భారత కార్పొరేట్ల ఆర్థిక అవకతవకలపై త్వరలో నివేదికను విడుదల చేయనున్నట్లు సమాచారం. అదాని మోసాలపై ఈ ఏడాది ప్రారంభంలో హిండెన్‌బర్గ్ కీలక ఆరోపణలు చేసిన విషయం తెలిసిందే. మరో భారత కార్పొరేట్ దిగ్గజం అవకతవకలపై ప్రముఖ బిలియనీర్ జార్జ్ సోరోస్, రాక్‌ఫెల్లర్స్ బ్రదర్స్ వంటి దిగ్గజాలతో నడుస్తున్న ఆర్గనైజ్డ్ క్రైమ్ అండ్ కరప్షన్ రిపోర్టింగ్ ప్రాజెక్ట్ (ఒసిసిఆర్‌పి) ఓ నివేదికను వెల్లడించనుందని ఆంగ్ల పత్రికలు కథనం ప్రచురించాయి. ఈ సంస్థ వ్యవస్థీకృత నేరాలపై నివేదికలు ఇస్తుంది. అయితే అది ఏ కార్పొరేట్ దిగ్గజంపైనా ఉండొచ్చనే విషయం తెలియాల్సి ఉంది. భారత కార్పొరేట్ కంపెనీల్లో విదేశీ పెట్టుబడులపైనే ఈ నివేదిక దృష్టి సారించనుందని సమాచారం.

టెస్లాకు తలొగ్గిన కేంద్రం..!

ఇవి కార్ల దిగుమతిపై సుంకం 15 శాతమే



న్యూఢిల్లీ : టెస్లా, ట్విట్టర్ అధినేత ఎలన్ మస్క్ డిమాండ్లకు కేంద్ర ప్రభుత్వం తలొగ్గినట్లు స్పష్టమవుతోంది. విదేశాల నుంచి దిగుమతయ్యే విద్యుత్ కార్లపై సుంకాన్ని భారీగా తగ్గిస్తూ కొత్త ఇవి పాలసీని తీసుకురానుందని రిపోర్ట్‌లు వస్తోన్నాయి. అదే జరిగితే టెస్లాతో పాటు పలు విదేశీ కార్ల కంపెనీలకు భారీగా లబ్ది చేకూరనుంది. కొత్త పాలసీలో దేశీయంగా కార్ల తయారీ చేపడితే 100 శాతం నుంచి 15 శాతానికి దిగుమతి సుంకం తగ్గించే ప్రతిపాదన చేస్తున్నట్లు సమాచారం. కాగా.. ప్రస్తుతం దిగుమతి అవుతోన్న కార్లపై 70–100 శాతం పన్ను అమల్లో ఉంది. ఈ పన్ను శాతానికి భారీగా తగ్గించాలని అమెరికన్ పెట్టుబడిదారుడు ఎలన్ మస్క్ చాలా కాలం నుంచి భారత్‌ను డిమాండ్ చేస్తూ వస్తోన్నారు. అందుకు అనుగుణంగా కొత్త పాలసీని రూపొందిస్తోందని తెలుస్తోంది. కార్లకు సంబంధించి దేశీయంగా కొన్ని విడి భాగాలు తయారు చేసినా దిగుమతి సుంకాన్ని 15 శాతానికి తగ్గించాలని కేంద్ర ప్రభుత్వం భావిస్తోందని సమాచారం. దీనిపై ప్రభుత్వం అధికారికంగా స్పందించాల్సి ఉంది. ప్రతిపాదిత కొత్త పాలసీ అమల్లోకి వస్తే టాటా మోటార్స్, మహీంద్రా అండ్ మహీంద్రా లాంటి దేశీయ సంస్థలపై ఒత్తిడి నెలకొననుంది.

కోటి మంది విక్రేతల డిజిటలైజ్ లక్ష్యం : మీషో

హైదరాబాద్: వచ్చే ఐదేళ్లలో కోటి మంది విక్రేతలను డిజిటలైజ్ చేయాలని లక్ష్యంగా పెట్టుకున్నట్లు మీషో తెలిపింది. 2027 నాటికి ఎంఎస్‌ఎంఇలను డిజిటల్ యుగంలోకి నడిపించాలని నిర్దేశించుకున్నట్లు పేర్కొంది. చిన్న వ్యాపారాలను ఆన్‌బోర్డ్ చేయడం, వాటిని ఆన్‌లైన్‌లో విజయవంతం చేయడంలో సహాయ పడాలని లక్ష్యంగా చేసుకున్నట్లు ఇ-కామర్స్ మార్కెట్‌ప్లేస్ అయిన మీషో తెలిపింది. ఇటీవల ఢిల్లీలో జరిగిన ఓ కార్యక్రమంలో ప్రస్తుత విక్రయదారుల సంఖ్య 13 లక్షలను పది రెట్లు పెంచుకోవాలని నిర్దేశించుకుంది.

ఉద్యోగాల కోసం

18 లక్షల అభ్యర్థనలు : అప్నా.కో

హైదరాబాద్ : నగరంలో ఉపాధి అవకాశాలు పెరుగుతున్నాయని జాబ్, ప్రొఫెషనల్ నెట్‌వర్కింగ్ ప్లాట్‌ఫారమ్ అయిన అప్నా.కో పేర్కొంది. గడిచిన ఆరు నెలల్లో 18 లక్షల పైగా కొత్త ఉద్యోగాల కోసం దరఖాస్తులు వెల్లువెత్తాయని ఆ సంస్థ ఓ ప్రకటనలో పేర్కొంది. ఇందులో మహిళల నుండి 7 లక్షల అభ్యర్థనలు వచ్చాయని తెలిపింది. హైదరాబాద్‌లో గత 6 నెలల్లో, హైదరాబాద్‌లో 30,000 తాజా ఉద్యోగ పోస్టులు వచ్చాయని పేర్కొంది. ఉద్యోగార్థులు, యజమానులను కనెక్ట్ చేయడంలో తాము విశ్వసనీయ భాగస్వామిగా ఉన్నట్లు పేర్కొంది. తమ సంస్థలో 12వేల మంది యాజమానులు రిజిస్టర్ అయ్యారని అప్నా.కో వ్యవస్థాపకుడు, సిఇఒ నిర్మిత్ పారిఖ్ తెలిపారు.

నగరంలో బ్రాండెడ్ దుస్తుల మెగా సేల్

ఎఆర్‌జి క్రియేషన్స్ వెల్లడి

హైదరాబాద్ : నగరంలోని నారాయణగూడలోని వైఎంసిఎ వద్ద ఐదు రోజుల పాటు బ్రాండెడ్ దుస్తుల మెగా సేల్‌ను నిర్వహిస్తున్నట్లు ఎఆర్‌జి క్రియేషన్స్ తెలిపింది. ఆగస్ట్ 26 నుండి ఆగస్టు 30 వరకు ఇది కొనసాగనుందని పేర్కొంది. అన్ని వయస్సుల వారి వివిధ ఉత్పత్తులు అమ్మకానికి లభిస్తాయని పేర్కొంది. ఫ్యాక్టరీ నుండి నేరుగా వినియోగదారులకు 91 శాతం వరకు తగ్గింపులను అందిస్తోన్నట్లు తెలిపింది. 25వేల కంటే ఎక్కువ రకాల దుస్తులు ఒకే వేదిక వద్ద లభించనున్నాయని పేర్కొంది.

భారీగా పెరిగిన కరెంటు డిమాండ్

నవతెలంగాణ-హైదరాబాద్‌బ్యూరో

రాష్ట్రంలో విద్యుత్ డిమాండ్ భారీగా పెరిగింది. తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన తర్వాత ఖరీఫ్ సీజన్లో తొలిసారిగా శుక్రవారం ఉదయం 11 గంటల 21 నిముషాలకు 14,361 మెగావాట్లకు చేరింది. ఇదే ఏడాది మార్చి 30న 15497 మెగావాట్ల అత్యధిక డిమాండ్ నెలకొంది. స్వరాష్ట్రంలో ఇదే అత్యధిక డిమాండ్ కావడం గమనార్హం. అయితే గతంలో ఎన్నడూ ఖరీఫ్ సీజన్లో రూఫ్‌టాప్ సోలార్‌తో సహా 14,361 మెగావాట్ల డిమాండ్ నమోదు కాలేదని టీఎస్‌ట్రాన్స్‌కో సీఎమ్‌డీ దేవులపల్లి ప్రభాకరరావు తెలిపారు. అలాగే గ్రేటర్ హైదరాబాద్‌లో కూడా కరెంటు డిమాండ్ బాగా పెరిగింది. గత వేసవి సీజన్‌లో గరిష్ట డిమాండ్ 3వేల మెగావాట్లుగా ఉండేది. కానీ ఈ ఏడాది వర్షాకాలంలో ఆగస్టు నెల మొత్తం రోజూ 3వేల మెగావాట్ల విద్యుత్ డిమాండ్ నమోదు అవుతున్నట్టు టీఎస్–ఎస్పీడీసీఎల్ సీఎమ్‌డీ జీ రఘుమారెడ్డి తెలిపారు. డిస్కం పరిధిలో ఈ ఏడాది మార్చిలో 9,360 మెగావాట్ల డిమాండ్ రికార్డ్ కాగా, శుక్రవారం దాన్ని అధిగమిస్తూ 9,579 మెగావాట్ల ఆల్ టైం రికార్డ్ నమోదు అయ్యిందని వివరించారు.

'కేసీఆర్‌కు ఎల్లప్పుడూ రుణపడి ఉంటారు'



నవతెలంగాణ- చైతన్యపురి

సాంఘిక సంక్షేమ గురుకుల విద్యాలయాల్లో కొన్ని సంవత్సరాలుగా ఒప్పంద ప్రాతిపదికన పని చేస్తున్న ఉపాధ్యాయ, ఉపాధ్యాయినీలను రెగ్యులర్ చేసినందుకు గాను వారు ఎల్లప్పుడూ సీఎం కేసీఆర్‌కు రుణపడి ఉంటారని తెలంగాణ సోషల్ వెల్ఫేర్ రెసిడెన్షియల్ ఎడ్యుకేషనల్ ఇన్స్టిట్యూషన్ సొసైటీ(టీఎస్ డబ్ల్యూ ఆర్ ఈ ఐ) స్టాఫ్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి వడ్డేపల్లి ప్రభుదాస్ అన్నారు. శుక్రవారం ప్రభుదాస్ మాట్లాడుతూ 566(506 మహిళలు, 60 మంది పురుషులు) మందిని రెగ్యులర్ చేసినందుకు సీఎంకు, మంత్రి కొప్పుల ఈశ్వర్, ప్రిన్సిపల్ సెక్రెటరీ రాహుల్ బొజ్జ, కార్యదర్శి డాక్టర్ నికోలస్‌లకు సిబ్బంది తరపున ధన్యవాదాలు తెలిపారు. కృతజ్ఞతలు తెలిపిన వారిలో గౌరవ అధక్షులు ఏవి రంగారెడ్డి, చైర్మన్ వెంకటేశ్వర్లు, మహిళా విభాగం కార్యదర్శి శ్రీలత, ప్రిన్సిపాల్ సంఘం సలహాదారుడు తీగల అంజయ్య ఉన్నారు.

మానవతా వాది సీఎం కేసీఆర్



నవతెలంగాణ-అబ్దుల్లాపూర్ మెట్

మానవతా వాది సీఎం కేసీఆర్ అని బీఆర్ఎస్ మండల మాజీ అధ్యక్షుడు పూజారి చక్రవర్తి గౌడ్ అన్నారు. ఇబ్రహీంపట్నం కేంద్రంలో దివ్యాంగుల పింఛన్లను ఎమ్మెల్యే మంచిరెడ్డి కిషన్ రెడ్డి శుక్రవారం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సీఎం కేసీఆర్ ఇస్తున్న పథకాలకు ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారన్నారు. ప్రభుత్వానికి మనమంతా అండగా నిలబడాల్సిన అవసరం ఉందని ఎమ్మెల్యే మంచి రెడ్డి కిషన్ రెడ్డి పిలుపునిచ్చారన్నారు. నియోజకవర్గ అభివృద్ధి ప్రదాత ఎమ్మెల్యే మంచి రెడ్డి కిషన్ రెడ్డి అని కొనియాడారు. ప్రజలు మరోసారి బీఆర్ఎస్ ప్రభుత్వాన్ని కోరుకుంటున్నట్లు చెప్పారు.

కేంద్ర ఓబీసీ జాబితాలో చేర్చాలి

- వీరశైవ లింగాయత్ లింగ బలిజ సంఘం





నవతెలంగాణ-సిటీబ్యూరో

రాష్ట్రంలోని వీరశైవ లింగాయతులను, లింగ బలిజలను కేంద్ర ఓబీసీ జాబితాలో చేర్చాలని వీరశైవ లింగాయత్ లింగ బలిజ సంఘం రాష్ట్ర అధ్యక్షులు వెన్న ఈశ్వరప్ప కేంద్ర ప్రభుత్వాన్ని కోరారు. హైదరాబాద్‌లో కేంద్ర మంత్రి ప్రకాష్ జవదేకర్, రాజ్యసభ సభ్యులు డాక్టర్ కె.లక్ష్మణ్‌లతో రాష్ట్ర అధ్యక్షులు వెన్న ఈశ్వరప్ప, కేంద్ర కమిటీ సభ్యులు డాక్టర్ కె.శివప్ప, ఆవిటి మధుసూదన్, గణపతి చించోలే భేటీ అయ్యారు. ఈ సందర్భంగా ఓబీసీలో కలపడానికి కృషి చేయాలని వారు వినతిపత్రం అందించారు. అనంతరం వెన్న ఈశ్వరప్ప మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్రంలో 90శాతం వీరశైవ లింగాయత్‌ల చాలా వెనుకబడి ఉన్నారని, విద్యార్థులు విద్య ఉపాధి అవకాశాలను కోల్పోతు న్నారన్నారు. తెలంగాణలో వీరశైవ లింగాయతులను 2009లో బీసీల్లో కలిపినా కానీ 14 ఏండ్లుగా ఇప్పటికీ కేంద్రం ఆ దిశగా చర్యలు తీసుకోకపోవడం బాధాకరమన్నారు. ఇప్పటికైనా కేంద్ర ప్రభుత్వం ఆ వైపుగా చర్యలు చేపట్టాలనే ఉద్దేశంతో మంత్రుల దృష్టికి తీసుకువచ్చామని వారు తెలిపారు.

లింగాయత్‌లకు టికెట్లు కేటాయించాలి

లింగాయతులు రాజకీయంగా అభివృద్ధి చెందడానికి అన్ని రాజకీయ పార్టీలు 40 ఎమ్మెల్యే స్థానాలు, 8 పార్లమెంట్ స్థానాలు కేటాయించాలని వెన్న ఈశ్వరప్ప డిమాండ్ చేశారు. వీరశైవ లింగాయత్‌లు ఎమ్మెల్యే ఎంపీ అభ్యర్థులుగా పోటీ చేయడానికి అర్హత కలిగి ఉన్నారని, ఆయా పార్టీలు అవకాశం కల్పించాలని కోరారు. బీఆర్ఎస్ పార్టీ లోనూ లింగాయత్‌లకు ఎమ్మెల్యే టికెట్లు కేటాయించాలని, లేనిపక్షంలో రానున్న అసెంబ్లీ ఎన్నికల్లో వీరసేవ లింగాయతుల తడాఖా చూపిస్తామని ఆయన హెచ్చరించారు.

సొంత నిధులతో బోర్ వేయించిన మల్‌రెడ్డి



నవతెలంగాణ -వనస్థలిపురం

బీఎన్‌రెడ్డి డివిజన్ సాహెబ్ నగర్, అజ్మీయగూడలోని పోచమ్మ దేవాలయంలో ఎల్బీనగర్ ఎస్సీ సెల్ చైర్మన్ బోడ రాజశేఖర్ ఆధ్వర్యంలో ఎల్బీనగర్ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జి మల్ రెడ్డి రాంరెడ్డి తన సొంత నిధులతో బోర్ వేయించారు. ఈ మేరకు శుక్రవారం బీఎన్‌రెడ్డి నగర్ డివిజన్ అధ్యక్షులు మకుటం సదాశివుడు, కాంగ్రెస్ సీనియర్ నాయకులు గుర్రం శ్రీనివాస్ రెడ్డి, ఎల్బీనగర్ ఎస్టీ సెల్ చైర్మన్ రమేష్ నాయక్, మాణిక్ రెడ్డిలతో కలిసి ఆయన ఆలయాన్ని సందర్శించారు. ఈ సందర్భంగా బోడ రాజశేఖర్ మాట్లాడుతూ ఎల్బీనగర్ లో ఎలాంటి అభివృద్ధి కార్యక్రమాలకైనా ముందుండే నాయకుడు మన మల్ రెడ్డి రాంరెడ్డి అని కొనియాడారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ చైర్మన్ పారంద కృష్ణ, వైస్ చైర్మన్ కొంగరి రమేష్, కమిటీ సభ్యులు పారంద జంగయ్య, కొంగరి బాలకృష్ణ, పారంద రాజు, కొంగరి నవీన్, పారంద బాలు, దీప్లా నాయక్, సోలిపురం వెంకటరాంరెడ్డి, పారంద స్వామి, నరేష్, మహేష్, వీరేష్, నరసింహ, శ్రీను, నరసింహ, పి. నరసింహ, పి. జగ్ మోహన్, పి. లక్ష్మయ్య, కే. మహేష్ తదితరులు పాల్గొన్నారు.

యాదవుల కోసం పాటుపడతాను

- యాదవ సంఘాల డిమాండ్



నవతెలంగాణ - నాగోల్

తెలంగాణ రాష్ట్రంలో యాదవుల జనాభా ప్రకారం రాజకీయ పార్టీలు అవకాశాలు కల్పించాలని పలు యాదవ సంఘాలు ముక్త కంఠంతో డిమాండ్ చేశాయి. అఖిల భారత యాదవ మహాసభ యాదవ విద్యావంతుల వేదిక, యాదవ సంఘాల ఐక్య కార్యాచరణ కమిటీల సంయుక్త ఆధ్వర్యంలో శుక్రవారం నాగోల్‌లోని శుభం కన్వెన్షన్ హాల్లో యాదవ యుద్ధభేరి బహిరంగ సభ నిర్వహించారు. యాదవ విద్యావంతుల వేదిక రాష్ట్ర అధ్యక్షుడు చలకాని వెంకట్ యాదవ్ అధ్యక్షతన నిర్వహించిన ఈ సమావేశానికి పలు రాజకీయ పార్టీలు, యాదవ సంఘాల నేతలు, వివిధ జిల్లాల నుంచి భారీ సంఖ్యలో తరలివచ్చారు. ఈ సందర్భంగా ఢిల్లీ విశ్వ విద్యాలయం ప్రొఫెసర్ సూరజ్ మండల్ యాదవ్ మాట్లాడుతూ యాదవులు ఐక్యంగా రాజ్యాధికార సాధన దిశగా ముందుకు సాగాలని పిలుపునిచ్చారు. దేశంలో అత్యధిక జనాభా గల ఏకైక కులం యాదవులదని, దేశంలో 20 శాతం ఉన్న యాదవ నాయకుడు ప్రధాన మంత్రి కావాల్సిన అవసరముందని అన్నారు. తెలంగాణ రాష్ట్రంలో 18 శాతం జనాభా ఉన్నప్పటికీ రాజకీయ ప్రాతినిధ్యం నామమాత్రమని ఆందోళన వ్యక్తం చేశారు. రాష్ట్ర పశు సంవర్ధక శాఖ మంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్ మాట్లాడుతూ బీఆర్ఎస్ ప్రభుత్వం చిత్తశుద్ధితో పని చేస్తుందని, ఐదు మందిని ఎమ్మెల్యేలను, ఒకరిని రాజ్యసభ సభ్యుడిగా చేసిందని గుర్తు చేశారు. కోకాపేటలో రూ.400కోట్ల విలువైన ఐదెకరాల స్థలం కేటాయించి యాదవ భవన నిర్మాణం పూర్తి చేసిందని తెలిపారు. రానున్న ఐదేళ్లలో యాదవుల సంక్షేమానికి అనేక కార్యక్రమాలు చేపట్టాల్సిన అవసరం ఉందని, అందుకు రాష్ట్ర ప్రభుత్వంలో యాదవులు భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. యాదవులలో ఐక్యత కోసం ప్రతి జిల్లా కేంద్రంలో జన్మాష్టమి, దీపావళి, సదర్ వేడుకలను పెద్ద ఎత్తున నిర్వహించాలని కోరారు. త్వరలో హైదరాబాద్ లో 25లక్షల మంది యాదవులతో భారీ బహిరంగ సభ నిర్వహించి సత్తా చూపెట్టనున్నట్లు వెల్లడించారు.

బీజేపీ ఎన్నికల కమిటీ చైర్మన్ ఈటల రాజేందర్ మాట్లాడుతూ..రాష్ట్రంలో బీజేపీ బీసీల లైన్ తీసుకుంటుందని, వచ్చే ఎన్నికలలో టికెట్ల కేటాయింపులో గొల్ల కురుమలతో పాటు అన్నీ బీసీ, ఎంబీసీ కులాలకు సముచిత ప్రాధాన్యం కల్పిస్తుందని వెల్లడించారు. రాజకీయ పార్టీల బీ-ఫామ్ కోసం బిక్కు బిక్కుమనే పరిస్థితి దాపురించిందని, బీసీలే బీ-ఫామ్ లు ఇచ్చే పరిస్థితి రావాలని ఆకాంక్షించారు. అధికార బీఆర్ఎస్ పార్టీ కురుమలు, ముదిరాజ్, ఎంబీసీలకు ఒక్క స్థానాన్ని ఇవ్వలేదని గుర్తు చేశారు. దరఖాస్తు పెట్టి దండం పెట్టే పరిస్థితి మారాలని అభిప్రాయపడ్డారు. పార్టీలు అర్థం చేసుకోకుంటే తిరుగుబాటు చేస్తారని అన్నారు. బడుగుల బాధలు బడుగులకే తెలుస్తాయని, వారే పరిష్కరించుకుంటారని రాష్ట్రంలో బడుగులకు రాజ్యాధికార ఆశలు చిగురిస్తున్నాయని ఆశాభావం వ్యక్తం చేశారు.

మాజీ ఎంపీ, కాంగ్రెస్ పార్టీ నేత వి.హనుమంతరావు మాట్లాడుతూ రాష్ట్రంలో బీసీలు విడిపోయి ఉన్నారని, "బలగం" సినిమాలో మాదిరిగా బీసీలందరూ ఏకమై రాజ్యాధికారం సాధించాలని పిలుపునిచ్చారు. యాదవులు టిక్కెట్లు సాధించుకోవడం కాదని.. గెలిపించుకోవాలని కోరారు. అంబర్ పేట నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ టికెట్‌ను యాదవ సంఘ నేత ఆర్.లక్ష్మణ్ యాదవ్‌కు ఇస్తామని, ఐక్యంగా గెలిపించుకోవాలని కోరారు.

బీఆర్ఎస్ పార్టీ రాజ్యసభ సభ్యుడు బడుగు లింగయ్య యాదవ్ మాట్లాడుతూ రాష్ట్రంలోని బీఆర్ఎస్ ప్రభుత్వం యాదవులను ఆర్థికంగా, సామాజికంగా అభివృద్ధి చేయడంతో పాటు అనేక రాజకీయ అవకాశాలు కల్పించిందని చెప్పారు. యాదవుల సంక్షేమానికి రాష్ట్ర ప్రభుత్వం చిత్తశుద్ధితో పని చేస్తుందని వెల్లడించారు. అనంతరం యాదవ విద్యావంతుల వేదిక రాష్ట్ర అధ్యక్షుడు చలకాని వెంకట్ యాదవ్ మాట్లాడుతూ యాదవుల అభివృద్ధి, రాజకీయ ప్రాతినిధ్యంపై యాదవ డిక్లరేషన్ విడుదల చేశారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్సీ రాములు నాయక్, సమాచార హక్కు చట్టం మాజీ ప్రధాన కమిషనర్ వర్రే వెంకటేశ్వర్లు, యాదవ సంఘాల నాయకులు చింతల రవీంద్రనాథ్ యాదవ్, ఆర్.లక్ష్మణ్ యాదవ్, బలరాజ్ యాదవ్, మురళి యాదవ్, చిన్న శ్రీశైలం యాదవ్, జాజయ్య యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

ప్రజా గర్జన సభను విజయవంతం చేయాలి

- మల్‌రెడ్డి రాంరెడ్డి



నవతెలంగాణ-ఎల్బీనగర్

చేవెళ్లలో నేడు నిర్వహించబోయే కాంగ్రెస్ పార్టీ ప్రజా గర్జన సభను జయప్రదం చేయాలని ఎల్బీనగర్ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జి మల్ రెడ్డి రాంరెడ్డి పిలుపునిచ్చారు. ఎల్బీనగర్ పార్టీ కార్యాలయంలో నియోజకవర్గం నాయకులు, కార్యకర్తలతో శుక్రవారం విస్తృత స్థాయి సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మల్‌రెడ్డి మాట్లాడుతూ చేవెళ్లలోని కేవి గ్రౌండ్‌లో సాయంత్రం 4 గంటలకు జరగబోయే ప్రజాగర్జన సభకు పార్టీ జాతీయ అధ్యక్షులు మల్లిఖార్జున ఖర్గే ముఖ్య అతిథిగా హాజరవుతున్నట్లు తెలిపారు. ఈ సభలో దళిత, గిరిజన డిక్లరేషన్‌ను మల్లిఖార్జున ఖర్గే ప్రకటిస్తారని చెప్పారు. రాష్ట్రంలోని దళిత, గిరిజన సోదరులు అధిక సంఖ్యలో పాల్గొనాలని కోరారు. అనంతరం ప్రతి డివిజన్ నుండి 500 మందికి పైగా జన సమీకరణ చేసి సభకు తీసుకొస్తామని ఈ సమావేశంలో పాల్గొన్న డివిజన్ అధ్యక్షులు తెలిపారు.

ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ సీనియర్ నాయకులు గుర్రం శ్రీనివాస్ రెడ్డి, బద్దుల వెంకటేష్ యాదవ్, చంపాపేట్ డివిజన్ అధ్యక్షులు దాచర్లపల్లి శ్రీపాల్ రెడ్డి, బీఎన్‌రెడ్డి నగర్ డివిజన్ అధ్యక్షులు మకుటం సదాశివుడు, గడ్డి అన్నారం డివిజన్ అధ్యక్షులు బద్దుల వేణుగోపాల్ యాదవ్, కొత్తపేట్ డివిజన్ అధ్యక్షులు లింగాల కిషోర్ గౌడ్, నాగోల్ డివిజన్ అధ్యక్షులు ఎర్రవెల్లి మంజులా రెడ్డి, లింగోజిగూడ డివిజన్ అధ్యక్షులు మల్లారపు శ్రీనివాస్, వనస్థలిపురం డివిజన్ అధ్యక్షులు కుట్ల నర్సింహా యాదవ్, ఎల్బీనగర్ కాంగ్రెస్ పార్టీ మహిళా అధ్యక్షురాలు స్వర్ణ మాధవి, యూత్ కాంగ్రెస్ నాయకులు పన్యాల జైపాల్ రెడ్డి, ఎల్బీనగర్ మైనార్టీ సెల్ చైర్మన్ మక్సూద్ అలీ, ఎల్బీనగర్ ఎస్సీ సెల్ చైర్మన్ బోడ రాజశేఖర్, ఎల్బీనగర్ ఎస్టీ సెల్ చైర్మన్ రమేష్ నాయక్, సామ మహేశ్వర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

నగరంలో వెలుగులోకి మరో దందా

- అనాథలు, అంగవైకల్యం చెందిన వారే టార్గెట్
- ఛారిటీ పేరుతో రద్దీప్రాంతాలు, కూడళ్లలో భిక్షాటన
- వచ్చిన ఆదాయంలో 20 శాతం కమిషన్
- నిందితుడి అరెస్టు
- ద్విచక్రవాహనం, సెల్‌ఫోన్లు, ఛారిటీ డాక్యుమెంట్లు, వివిధ పత్రాల స్వాధీనం





నవతెలంగాణ-సిటీబ్యూరో

నగరంలో భిక్షాటన చేయిస్తున్న మాఫియా ఆగడాల నుంచి ఇంకా తేరుకోక ముందే మరో దందా వెలుగు చూసింది. ఛారిటీ ముసుగులో మరికొన్ని ముఠాలు భిక్షాటన చేయిస్తూ పెద్దఎత్తున డబ్బులు సంపాదిస్తున్న వైనం సంచలనం రేపుతోంది. సమాచారం అందుకున్న సెంట్రల్‌జోన్ టాస్క్‌ఫోర్స్ పోలీసులు బేగంబజార్ పోలీసులతో కలిసి సంయుక్తంగా దాడి చేసి ప్రధాన నిందితుడిని అరెస్టు చేశారు. నిందితుడి నుంచి ద్విచక్రవాహనం, స్టాంప్స్, సెల్‌ఫోన్లు, ఛారిటీకి డాక్యుమెంట్లు, వివిధ పత్రాలతోపాటు రూ.1000 నగదును స్వాధీనం చేసుకున్నారు. శుక్రవారం సెంట్రల్‌జోన్ డీసీపీ ఎం.వెంకటేశ్వర్లు, టాస్క్‌ఫోర్సు డీసీపీ పీ.రాధాకిషన్ రావు తెలిపిన వివరాల మేరకు సూర్యాపేట్‌కు చెందిన బాణావత్ రామ కృష్ణా ఉపాధికోసం 2017లో నగరానికి వచ్చాడు. బోడుప్పల్‌లోని 'గుడ్ వే ఫౌండేషన్' చైర్మెన్ షణ్ముఖ్‌రావు వద్ద కారుడ్రైవర్‌గా చేరాడు. ఛారిటీ పేరుతో షణ్ముఖ్‌రావు చేస్తున్న దందాను, ఆయన సంపాదిస్తున్న డబ్బులను చూసిన బాణావత్ తానుకూడా సులువుగా డబ్బులు సంపాదించాలంటే ఓ ఛారిటీని స్థాపించాలని నిర్ణయించుకున్నాడు. ఇందులో భాగంగా రవీ, గణేష్ అనే స్నేహితులతో కలిసి 'శ్రీ క్రిష్ణా ఫౌండేషన్'పేరుతో ఓ ఛారిటీని రిజిస్ట్రేషన్ చేయించి బోడుప్పల్‌లో సంస్థను ప్రారంభించాడు. కొందరు అనాథలను, అంగవైకల్యం గల వారిని చేరదీస్తున్న నిందితులు వారికి కొన్ని స్టీల్ డబ్బాలిచ్చి (కలెక్షన్ బాక్స్‌లు) నగరంలోని ప్రధాన కూడళ్లు, మార్కెట్లు, రద్దీప్రాంతాలతో పాటు తదితర ప్రాంతాలల్లో భిక్షాటన చేయిస్తున్నారు. ఫౌండేషన్‌కు ఆర్థిక సహాయం చేయాలంటూ, ఆనాథలను ఆదుకోవాలంటూ మాయ మాటలతో ప్రయాణీకులు, వాహనదా రుల నుంచి కలెక్షన్ చేయిస్తున్నారు. కలెక్షన్ చేస్తున్న వారి నుంచి రాత్రి డబ్బాలు తీసుకుని వచ్చిన సంపాదనలో కలెక్షన్ చేసిన వారికి 20శాతం ఇవ్వగా, మిగిలిన 80శాతం డబ్బులు దండుకుంటున్నారు. అలా వచ్చిన డబ్బులతో నిందితులు జల్సాలు చేస్తున్నారు. ఇదిలావుండగా గత ఆరు నెలల క్రితం రామకృష్ణా నుంచి విడిపోయిన రవి, గణేష్‌లు మన్సూరాబాద్‌లో 'అమ్మా చేయూత ఫౌండేషన్' పేరుతో మరో సంస్థను ప్రారంభించారు. సమాచారం అందుకున్న పోలీసులు బోడుప్పల్, మన్సూరాబాద్‌లో దాడులు చేశారు. రామకృష్ణాను అరెస్టు చేసిన పోలీసులు పరారీలోవున్న రవి, గణేష్ కోసం గాలిస్తున్నారు. కొన్ని స్టీల్ బాక్స్‌లను కొనుగోలు చేసి రామకృష్ణా వాటిపై ఫౌండేషన్ స్టిక్కర్లు, క్యూఆర్‌కోడ్‌లను అతికించి పలువురి చేత భిక్షాటన చేస్తున్నాడని డీసీపీలు ఎం.వెంకటేశ్వర్లు, పీ.రాధాకిషన్‌రావు తెలిపారు. కొందరు అనాథలను, అంగవైకల్యంతో బాధపడుతున్న వారి ఛారిటీలో చేర్చుకుంటున్నారని, వారికి (కలెక్షన్ బాక్స్‌లు) డబ్బాలిచ్చి భిక్షాటన చేయిస్తున్నారని తెలిపారు. ఇలాంటి వారిపట్ల అప్రమత్తంగా ఉండాలని నగరవాసులను కోరారు. ఈ కార్యక్రమంలో అదనపు డీసీపీ ఏ.వీ.ఆర్ నర్సింహారావు, ఏసీపీ చంద్రశేఖర్, ఇన్‌స్పెక్టర్లు బీ.రాజునాయక్, ఎన్.శంకర్, డీఐ.కే.ఏడుకొండలు, ఎస్ఐలు సాయితేజా రెడ్డి, ప్రతాప్ రెడ్డి, ఎం.నర్సింహాతోపాటు తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ భూములు ఆక్రమిస్తే కఠిన చర్యలు

- తహసీల్దార్ రవీందర్

నవతెలంగాణ -అబ్దుల్లాపూర్‌మెట్

ప్రభుత్వ భూములను ఆక్రమిస్తే కఠిన చర్యలు తీసు కుంటామని తహసీల్దార్ రవీ ందర్ దత్తు హెచ్చరించారు. మండలంలోని తట్టిఅన్నారం గ్రామ రెవెన్యూ సర్వేనెం.73లో గుర్తు తెలియని వ్యక్తులు కబ్జాకు పాల్పడడంతో రెవెన్యూ అధి కారులు అప్రమత్తమై పోలీసులు బందోబస్తు మధ్య శుక్రవారం నిర్మాణాలను తొలగించారు. ఈ సందర్భంగా తహసీల్దార్ రవీందర్ మాట్లాడుతూ తట్టి అన్నారం గ్రామ రెవెన్యూ సర్వే నెం.73 సుమరుగా రెండు ఎకరాల స్థలాన్ని గత ంలో మార్కెట్ యార్డుకు కేటాయించినట్లు తెలిపారు. ఈ స్థలం ఆక్రమణకు గురైనట్లు తమ దృష్టికి రావడంతో వెంటనే అక్కడికి చేరుకొని అక్కడ ఏర్పాటు చేసిన నిర్మాణాలను తొలగించి.. ఆ భూమిని స్వాధీనం చేసుకున్నామన్నారు. ప్రభుత్వ భూములను ఆక్రమించుకొని అక్రమాలకు పాల్పడితే ఎంతటి వారైనా విడిచి పెట్టేది లేదని, వారిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చ రించారు. ఈ కార్యక్రమంలో ఆర్ ఐ. భిక్షపతి, రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

రాష్ట్ర సర్కార్‌కు వైన్స్ టెండర్ల మీదనే ఎక్కువ శ్రద్ధ



ఏబీవీపీ కోఠి జిల్లా కన్వీనర్ సభావట్ కళ్యాణ్

నవతెలంగాణ - ధూల్ పేట్

రాష్ట్రంలో బీఆర్ఎస్ ప్రభుత్వానికి ఎమ్మెల్యే టికెట్లు, వైన్స్ షాపుల టెండర్ల మీద ఉన్న శ్రద్ధ.. విద్యారంగ సమస్యల పరిష్కారం మీద లేదని ఏబీవీపీ కోఠి జిల్లా కన్వీనర్ సభావట్ కళ్యాణ్ విమర్శించారు. అఖిల భారతీయ విద్యార్థి పరిషత్ చార్మినార్ శాఖ ఆధ్వర్యంలో శుక్రవారం విలేకరుల సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రత్యేక తెలంగాణ వస్తే.. నీళ్ల, నిధులు, నియామకాలు వస్తాయని రైతులు, విద్యార్థులు, నిరుద్యోగులు తమ ప్రాణాలను సైతం లెక్కచేయకుండా తెలంగాణ ఉద్యమంలో పోరాడారని గుర్తుచేశారు. ఎంతో మంది ప్రాణ త్యాగాల ఫలితంగానే తెలంగాణ రాష్ట్రం ఏర్పడిందన్నారు. అలాంటి తెలంగాణలో నీళ్ల సీఎం కేసీఆర్ ఫాంహౌస్ కు, నిధులు కేసీఆర్ ఇంట్లోకి, నియామకాలు కేసీఆర్ కుటుంబానికి మాత్రమే దక్కాయని మండిపడ్డారు. నాలుగు సంవత్సరాలుగా పెండింగ్‌లో ఉన్న రూ.5300 కోట్ల స్కాలర్ షిప్‌లు, ఫీజు రీయింబర్స్ మెంట్ బకాయిలను విడుదల చేయాలని డిమాండ్ చేశారు. తొమ్మిది సంవత్సరాలుగా రాష్ట్రంలో ఉన్న 1, 91వేల ఉద్యోగ పోస్టులను భర్తీ చేయాలని కోరారు. గతంలో 10.50 శాతం ఉన్న రాష్ట్ర విద్యా బడ్జెట్ ఇప్పుడు 5.67 శాతానికి దిగజార్చారు అని విమర్శించారు. ఇప్పటికైనా ఎలక్షన్‌కు ముందు ఖాళీగా ఉన్న అన్ని పోస్టులను భర్తీ చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో కళాశాల కార్యదర్శి సజన్, నగర కార్యదర్శి సందీప్, విష్ణు, జిల్లా సోషల్ మీడియా కన్వీనర్ శ్రీకాంత్, ఎస్ఎఫ్డీ కన్వీనర్ రాహుల్, రేఖ, భవ్య, విగ్నేష్, సౌశిక్, లక్ష్మణ్, సందీప్ తదితరులు పాల్గొన్నారు.

'కాంట్రాక్ట్ ఉద్యోగుల సమస్యలను పరిష్కరించాలి'



నవతెలంగాణ - ధూల్ పేట్

కాంట్రాక్ట్ ఉద్యోగుల సమస్యలను పరిష్కరించాలని జీహెచ్ఎంసీ ఎంప్లాయిస్ యూనియన్ కార్యదర్శి ఎం. శ్రవణ్ కుమార్, తెలంగాణ మున్సిపల్ స్టాఫ్ వర్కర్స్ ఫెడరేషన్ రాష్ట్ర కార్య దర్శి జైపాల్ రెడ్డిలు డిమాండ్ చేశారు. జీహెచ్ఎంసీ ఉద్యోగ, కార్మిక సంఘాల జేఏసీ ఆధ్వర్యంలో సౌత్ జోన్ పరిధి కార్యాలయంలో శుక్రవారం మీడియా సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మున్సిపల్ కార్మికులకు కనీసవేతనం రూ.24వేలు ఇవ్వాలన్నారు. సుప్రీం కోర్టు తీర్పు ప్రకారం సమాన పనికి సమాన వేతనం అమలు చేయాలని డిమాండ్ చేశారు. పండుగ సెలవులు, బోనస్‌లు ఇవ్వాలన్నారు. ఇండ్లు లేని కార్మికులకు డబుల్ బెడ్ రూమ్ ఇండ్లు కేటాయించాలన్నారు. జీహెచ్ఎంసీలో సంవత్సరాల తరబడి కాంట్రాక్ట్ పద్ధతిలో పని చేస్తున్న కార్మికులకు మాత్రం పర్మినెంట్ కాలేదన్నారు. ప్రభుత్వం స్పందించి కార్మికులను వెంటనే పర్మినెంట్ చేయాలని కోరారు. లేనిపక్షంలో కార్మికులను కలుపుకొని పెద్ద ఎత్తున ఆందోళనలు, పోరాటాలు చేస్తామని హెచ్చరించారు. ఈ నెల 28న సర్కిల్ ఆఫీస్ ఎదుట జరిగే జీహెచ్ఎంసీ కార్మికుల ధర్నాను విజయవంతం చేయాలని కార్మికులకు పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ఎస్. కిషన్, ఆనంద్, శంకర్, మీనా, నాగేశ్వరరావు, కోటయ్య తదితరులు పాల్గొన్నారు.

బహిరంగ ప్రదేశాల్లో చెత్త వేస్తే జరిమానా



నవతెలంగాణ-మీర్‌పేట్

పరిసరాలను అపరిశుభ్రంగా చేస్తూ.. బహిరంగ ప్రదేశాల్లో, రోడ్ల పక్కన చెత్త వేస్తే రూ.2వేలు జరిమానా విధిస్తామని మీర్‌పేట్ మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్ అల్లూరి వాణి హెచ్చరించారు. శానిటేషన్ ఇన్‌స్పెక్టర్ నర్సింహ ఆధ్వర్యంలో శుక్రవారం కార్పొరేషన్ పరిధిలో మంత్రాల చెరువు పక్కన ఆర్సీఐ రోడ్డు పక్కన చెత్త వేస్తున్న ఓ వ్యక్తిని పట్టుకుని రూ.2 వేలు జరిమానా విధించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ బహిరంగ ప్రదేశాల్లో చెత్త వేయకూడదన్నారు. కాలనీలోకి చెత్త బండి వచ్చినప్పుడు అందులో చెత్త వేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో శానిటేషన్ సిబ్బంది మహేందర్, రాజు తదితరులు ఉన్నారు.

ఆ గట్టునుంటారా..? ఈ గట్టుకొస్తారా..?

- ఎమ్మెల్యే రఘునందన్ రావు



నవతెలంగాణ-హయత్ నగర్

బీఆర్ఎస్ ఎమ్మెల్యే సుధీర్ రెడ్డి మాత్రం తనకు టికెట్ వచ్చిన సంబరాల్లో ఉంటే..బీజేపీ మాత్రం పేదల కోసం పోరాటం చేస్తుందని..ఈ విషయాన్ని దృష్టిలో పెట్టుకొని ప్రజలు ఆ గట్టునుంటారో..ఈ గట్టుకొస్తారో తెల్చుకోవాలని దుబ్బాక శాసనసభ్యులు రఘునందన్ రావు అన్నారు. గంజాయి, డ్రగ్స్ రహిత (సేవ్ ఎల్బీనగర్) ఎల్బీనగర్ కోసం బీజేపీ అర్బన్ జిల్లా అధ్యక్షుడు సామ రంగారెడ్డి చేపట్టిన 48 గంటల నిరసన దీక్షకు దుబ్బాక శాసనసభ్యులు రఘునందన్ రావు శుక్రవారం సంఘీభావం తెలిపి.. సామ రంగారెడ్డికి నిమ్మరసం ఇచ్చి దీక్షను విరమింపజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే రఘు నందన్ రావు మాట్లాడుతూ ఎల్బీనగర్ పోలీసుల చేత గిరిజన మహిళ దాటికి గురైౖ ఘటన మర్చిపోకముందే నందనవనంలో దళిత మైనర్‌పై సామూహిక లైంగిక దాడి జరగడం చాలా బాధకరమన్నారు. నిందితులను కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. ప్రజలు ఓటు వేసేటప్పుడు బీరు, బిర్యానీకి అమ్ముడుపోతే ఆగం అవుతారని హెచ్చరించారు. ముఖ్యమంత్రి ప్రకటించిన 105 టికెట్స్ లాస్ట్ వరకు కన్ఫర్మ్ అవుతాయో లేదో తెలియదు గానీ ఓటు వేసేటప్పుడు ప్రజలు ఆలోచించి ఓటు వేయాలని కోరారు.

బీజేపీ పార్టీ పేద ప్రజల పక్షాన పోరాడుతుందన్నారు. బార్లు, బీర్లు, గంజాయిలను అడ్డు పెట్టుకొని అధికారంలోకి రావాలని చూస్తున్న పార్టీ బీఆర్ఎస్ అని విమర్శించారు. నాలుగున్నర ఏళ్ళు గడుస్తున్నా ఎల్బీనగర్‌కు ముఖ్యమంత్రి రాలేదు అన్నారు. ఇప్పటి వరకు రాష్ట్రంలో అధికారంలోకి రాని పార్టీ బీజేపీ అని ..ఒక్కసారి అవకాశం ఇస్తే పేద ప్రజల బ్రతుకులు మారతాయన్నారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్ కొప్పుల నరసింహా రెడ్డి, కళ్లెం నవజీవన్ రెడ్డి, వెంకటేశ్వర రెడ్డి, ప్రేమ మహేందర్ రెడ్డి, పవన్ కుమార్, బీజేపీ నేతలు రవీందర్ రెడ్డి, సామ ప్రభాకర్ రెడ్డి, వనపల్లి శ్రీనివాస్ రెడ్డి, కొత్త రవీందర్ గౌడ్, కృష్ణవేణి, విజయ్ కుమార్, రామేశ్వర్ తదితరులు పాల్గొన్నారు.

యాచించే స్థితి నుంచి శాసించే స్థాయికి ఎదగాలి

- మీర్‌పేట్ ఇన్‌స్పెక్టర్ కిరణ్ కుమార్



నవతెలంగాణ - మీర్ పేట్

ట్రాంజెండర్స్ యాచించే స్థాయి నుండి శాచించే స్థాయికి ఎదగాలని మీర్‌పేట్ పోలీస్ స్టేషన్ ఇన్‌స్పెక్టర్ కే.కిరణ్ కుమార్ అన్నారు. మీర్‌పేట్ పోలీస్ స్టేషన్ పరిధిలో ఉన్న ట్రాంజెండర్స్ తో శుక్రవారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ట్రాంజెండర్స్‌లో చాలామంది ప్రతిభావంతులు ఉన్నారన్నారు. మంచి ఉన్నత చదువులు కూడా అభ్యసించి.. కొన్ని పరి సరాల ప్రభావం రిత్యా ట్రాంజెండర్స్‌గా మారారని తెలి పారు. ప్రభుత్వం, ప్రజ్వల సహకారంతో వికల్ప్ కౌన్సెలింగ్ కేంద్రాన్ని ప్రారంభించామని తెలిపారు. ట్రాంజెండర్స్ విధి లేని పరిస్థితుల్లో ఎక్కడపడితే అక్కడ యాచకులుగా, వ్యభి చారం చేయడం మంచిది కాదనే ఉద్దేశంతో ఉపాధి శిక్షణ ఇచ్చి ఉద్యోగం, వ్యాపారం కల్పించాలని మంచి సంకల్పంతో ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ప్రతి ఒక్కరూ ఆత్మగౌరవంతో సమాజంలో తలెత్తుకొని బతకాలని సూచించారు. సమా జాభివృద్ధిలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలన్నారు. దేశంలోనే ఎక్కడాలేని విధంగా ట్రాంజెండర్స్ కు మీర్‌పేట్‌లో వికల్ప్ కౌన్సెలింగ్ కేంద్రాన్ని ప్రారంభించినట్లు పేర్కొన్నారు. ట్రాంజెండర్స్ బలవంతంగా కాకుండా స్వచ్ఛందంగా కౌన్సెలింగ్ సెంటర్ వచ్చి ఉపాధి అవకాశాలు పొందాలన్నారు. చట్ట వ్యతిరేక పనులు ఎవరు చేసినా శిక్షకు అర్హులవుతారని పేర్కొన్నారు.

అనంతరం పలువురు ట్రాంజెండర్స్ మాట్లాడుతూ.. ఏదో తెలియని పరిస్థితుల వలన మేము ట్రాంజెండర్స్‌గా మారామని చెప్పారు. ఈ కారణంతో మా కుటుంబాలు ఇబ్బందులు పడకుండా ఉండేందుకు మేం బయటికి వచ్చామని అన్నారు. ప్రభుత్వం మాకు అన్ని విధాలుగా సహకరించి, ఆదుకోవాలని కోరారు. అవకాశం ఉన్న ప్రతి ఒక్కరూ వికల్ప్ సెంటర్ కు వచ్చి వివరాలు తెలుసుకోవాలని ప్రజ్వల స్వచ్ఛంద సంస్థ సభ్యులు ఆలీ చెప్పారు. ఈ కార్యక్రమంలో ఎస్ఐ గోవింద్ స్వామి, సుధాకర్, యేసయ్య తిరుపతిరెడ్డి, ట్రాంజెండర్స్ సోనాక్షి, ఆర్తి యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

వచ్చే నెల7లోపు కేసీఆర్ ఇచ్చిన హామీలన్నీ నెరవేర్చాలి

- లేకుంటే రాష్ట్ర వ్యాప్తంగా ధర్నాలు, రాస్తారోకోలు చేస్తాం : బీజేపీ రాజ్యసభ సభ్యులు డాక్టర్ లక్ష్మణ్



నవతెలంగాణ-సిటీబ్యూరో

వచ్చేనెల 7వ తేదీలోపు ముఖ్యమంత్రి కేసీఆర్ ఇచ్చిన హామీలన్ని నెరవేర్చాలని బీజేపీ రాజ్యసభ సభ్యులు డాక్టర్ లక్ష్మణ్ డిమాండ్ చేశారు. లేనిపక్షంలో రాష్ట్రవ్యాప్తంగా ధర్నాలు, రాస్తారోకోలకు పిలుపునిస్తామని ప్రభుత్వాన్ని హెచ్చరించారు. పేదలకు డబుల్ బెడ్ రూమ్ ఇండ్లు, దళిత బంధు, బీసీ బంధు, గృహాలక్ష్మి పథకాలు అర్హులైన అందరికి ఇవ్వాలని డిమాండ్ చేస్తూ.. శుక్రవారం ఆ పార్టీ భాగ్యనగర్ జిల్లా అధ్యక్షులు ఎస్.సురేందర్ రెడ్డి, సెంట్రల్ సిటీ అధ్యక్షులు గౌతమ్ రావు, సికింద్రాబాద్ జిల్లా అధ్యక్షులు శ్యామ్ సుందర్ గౌడ్, ఓల్డ్ సిటీ అధ్యక్షులు పాండు యాదవ్ ఆధ్వర్యంలో కలెక్టరేట్ ముట్టడి చేపట్టారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టరేట్ ఎదుట బీజేపీ ఎంపీ లక్ష్మణ్ సహా బీజేపీ నాయకులు, కార్యకర్తలు ధర్నాకు దిగారు. అనంతరం ఎంపీ లక్ష్మణ్ మాట్లాడుతూ సీఎం కేసీఆర్ హామీలిస్తూ ప్రజల్ని మోసం చేస్తున్నాడని, దళితబంధు, డబుల్ బెడ్ రూమ్ ఇండ్లు వంటి పథకాలు ప్రవేశపెట్టి ప్రజలకు అన్యాయం చేస్తున్నారని విమర్శించారు. ప్రజలకు సేవ చేయడం మానేసి.. అందినకాడికి దోచుకుంటున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రశ్నించిన వారిపై తప్పుడు కేసులు పెట్టి జైలుకు పంపుతున్నారని, తెలంగాణలో నియంత పాలన నడుస్తోందని మండిపడ్డారు. వచ్చే ఎన్నికల్లో కేసీఆర్‌కు ప్రజలంతా బుద్ధి చెప్పాలని సూచించారు. కాంగ్రెస్, బీఆర్ఎస్ రెండు ఒక్కటేనని, ఢిల్లీలో దోస్తీ.. గల్లీలో కుస్తీ అనేలా బీఆర్ఎస్, కాంగ్రెస్ ప్రవర్తన ఉందని చెప్పారు. కేసీఆర్ మెడలు వంచి.. హక్కుల్ని సాధించుకుంటామనితెలిపారు. అంతకుముందు లక్ష్మణ్‌తో సహా బీజేపీ నాయకులు, కార్యకర్తలు అరెస్టు చేసి.. రాష్ట్ర ఆఫీసు వద్ద వదిలేశారు. ఈ కార్యక్రమంలో నాలుగు జిల్లాల పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

శ్రీ చక్రి విద్యానికేతన్ హైస్కూల్‌లో 27న మెడికల్ క్యాంప్

నవతెలంగాణ-కాప్రా
బీపీ, షుగర్ పేషెంట్స్ కోసం మెడికల్ క్యాంపును జన విజ్ఞాన వేదిక కాప్రా, మల్కాజిగిరి, కీసర మండల కమిటీల ఆధ్వర్యంలో చక్రిపురం క్రాస్ రోడ్డు శ్రీ చక్రి విద్యానికేతన్ హై స్కూల్‌లో ఈ నెల 27న నిర్వహిస్తు న్నామని జన విజ్ఞాన వేదిక కాప్రా మండల కార్యదర్శ సీహెచ్ ప్రభాకర్, కోశాధికారి జన్నిషా షేక్ తెలియజే శారు. ఈ మెడికల్ క్యాంపులో బీపీ షుగర్ రోగులకు పరీక్షలు నిర్వహించి డాక్టర్ల సూచనల మేరకు మందుల పంపిణీ కార్యక్రమం ఉంటుందని చెప్పారు. ఈ అవకాశాన్ని చక్రిపురం, కుషాయిగూడ, చర్లపల్లి, నాగారం, దమ్మాయిగూడ, రాంపల్లి తదితర ప్రాంతాల వారు ఉపయోగించుకోవాలని వారు కోరారు. ఇతర వివరాల కోసం ఫోన్ నెంబర్‌లు 9989925997, 9700616679, 9959536083 లో సంప్రదించా లన్నారు.

యాదవులు రాజకీయంగా రాణించాలి



నవతెలంగాణ-జవహర్‌నగర్
యాదవులు చదువుతోపాటు రాజకీయంగా రాణించా లని జవహర్ నగర్ యాదవ సంఘం నాయకులు అన్నా రు. 'యాదవ యుద్ధభేరి' యాదవులు విద్యావంతులు వేది క ఆధ్వ ర్యంలో నాగోల్‌లో నిర్వహిస్తున్న కార్యక్రమానికి జవహర్‌నగర్ కార్పొరేషన్ యాదవ సంఘం నాయకులు శుక్రవారం వెళ్లారు. బీసీల్లో అధిక జనాభా కలిగిన యాదవులకు కార్పొరేషన్ ఏర్పాటు చేసి 18శాతం నిధులు కేటాయించాలన్నారు. కార్పొరేటర్ మేక లలిత, రాజుయాదవ్, నర్సింహాయాదవ్, సిద్దులుయాదవ్, అశోకాదవ్, నవీన్యాదవ్, కృష్ణయాదవ్, యాదగిరియాదవ్ తదితరులు వెళ్లారు.

ఓటరు జాబితాలో పేర్లు నమోదు చేసుకోవాలి

- జిల్లా వ్యాప్తంగా బూత్ లెవల్ అధికారులతో ప్రత్యేక క్యాంపెయిన్
- ఈ నెల 26, 27న, సెప్టెంబర్ 2, 3 తేదీల్లో అందుబాటులో బీఎల్వోలు
- మేడ్చల్-మల్కాజిగిరి జిల్లా కలెక్టర్ అమోయ్ కుమార్



నవతెలంగాణ-సిటీబ్యూరో
జిల్లా వ్యాప్తంగా ఓటర్ల జాబితా ప్రత్యేక సంక్షిప్త పునరీక్షణ కార్యక్రమంలో భాగంగా అర్హులైన ప్రతి ఒక్కరూ ఓటరు జాబితాలో తమ పేర్లను తప్పకుండా నమోదు చేసుకోవాలని, ఓటు హక్కు ఎంతో విలువైనదని మేడ్చల్-మల్కాజిగిరి జిల్లా ఎన్నికల అధికారి, జిల్లా కలెక్టర్ అమోయ్ కుమార్ అన్నారు. శుక్రవారం ఆయన తన కార్యాలయంలో మాట్లాడుతూ రాష్ట్ర ఎన్నికల కమిషన్ సూచనల మేరకు జిల్లా వ్యాప్తంగా 18 ఏండ్లు నిండిన యువతీ యువకులతో పాటు 2023 అక్టోబర్ 1వ నాటికి 18 ఏండ్లు నిండబోయే యువత ఓటర్లుగా నమోదు చేసుకోవడానికి అర్హులని పేర్కొన్నారు. దీనికి సంబంధించి ఓటర్లుగా తమ పేర్లను నమోదు చేసుకోవడానికి జిల్లా వ్యాప్తంగా బూత్ లెవల్ అధికారి (బీఎల్వో)లతో ఈనెల 26, 27 తేదీలతో పాటు సెప్టెంబర్ 2, 3వ తేదీల్లో ప్రత్యేక క్యాంపెయిన్ కార్యక్రమాలు నిర్వహించి ఇంటింటికీ వెళ్లి అర్హులైన వారి పేర్లను ఓటర్లుగా నమోదు చేయనున్నట్టు తెలిపారు. ఆయా తేదీల్లో జిల్లాలోని అన్ని పోలింగ్ కేంద్రాల వద్ద బూత్ లెవల్ అధికారులు అందుబాటులో ఉంటారని తెలిపారు. ఓటరు నమోదుతో పాటు ఏమైనా మార్పులు, చేర్పులు చేయాల్సి ఉంటే స్థానికంగా ఉండే బూత్ లెవల్ అధికారిని సంప్రదించాలని, వారి వద్ద నూతనంగా ఓటరు నమోదుకు సంబంధించి ఫారం 6లో, సవరణలు ఉంటే ఫారం 8లో చేసుకోవచ్చని తెలిపారు.
అలాగే voters.eci.gov.in yîuÙ™dÕ{Ù <'Çs voter Helpline Mobile App ద్వారా ఆన్‌లైన్ వెబ్‌సైట్ ద్వారా కూడా నమోదు, సవరణలు చేసుకోవడానికి అవకాశం ఉందని, దీన్ని వినియోగించు కోవాలని తెలిపారు. ఓటరు నమోదుతో పాటు మిగిలిన వివరాలకు జిల్లాలోని అన్ని పోలింగ్ కేంద్రాల్లో బూత్ స్థాయి అధికారి, ఏఈఆర్వో, ఈఆర్వో, జిల్లా ఎన్నికల అధికారి కార్యాలయంలో సంప్రదించాలని వివరించారు. ప్రత్యేకంగా టోల్ ఫ్రీ నెంబర్ 1950 ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు అందుబాటులో ఉంటుందని తెలిపారు. ఓటు హక్కు ఎంతో విలువైనదని, ఇప్పటికీ ఓటర్లుగా తమ పేర్లు నమోదు చేసుకోని వారు తప్పకుండా నమోదు చేసుకోవాలని కోరారు.

కాంగ్రెస్ ఉప్పల్ అసెంబ్లీ ఎస్టీ సెల్ అధ్యక్షుడిగా రమేష్ నియామకం



నవతెలంగాణ-కాప్రా
కాంగ్రెస్ ఉప్పల్ అసెంబ్లీ ఎస్టీసెల్ అధ్యక్షులుగా రమేష్, డివిజన్ ఎస్టీ సెల్ అధ్యక్షుడిగా లింగానాయక్‌లను నియమిస్తూ మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా ఎస్టీ సెల్ చైర్మెన్ గణేష్ నాయక్ నియామక పత్రాన్ని విడుదల చేశారు. కార్య క్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన కాంగ్రెస్ ఉప్పల్ నియోజకవర్గం నాయకు లు రాగిడి లక్ష్మారెడ్డి, ఉప్పల్ నియోజకవర్గంలో బీ బ్లాక్ అధ్యక్షులు సింగిరెడ్డి సోమశేఖర్‌రెడ్డి చేతుల మీదుగా నియామక పత్రాలను లింగా నాయక్‌కు అందజేశారు. నియామక పత్రాన్ని అందుకున్న డి. లింగాల నాయక్‌కు రాగిడి లక్ష్మారెడ్డి శుభాకాంక్షలు తెలియజేశారు. ఎస్టీ సెల్ అభ్యున్నతికి తోడ్పడాలని, కాంగ్రెస్ బలోపేతానికి కృషి చేయాలన్నారు. కార్యక్రమంలో తీజ్ ఉత్సవ కమిటీ రాష్ట్ర కన్వీనర్ మాలు నాయక్, కాంగ్రెస్ హబ్సిగూడ డివిజన్ వైస్ ప్రెసిడెంట్ కిషన్ నాయక్, హీరోలాల్ నాయక్, శీను నాయక్, కాంగ్రెస్ మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా యువజన ప్రధాన కార్యదర్శి వంజరి సంతోష్, కాసుల సతీష్ గౌడ్, యూత్ కాంగ్రెస్ నాయకులు ప్రేమ్ కుమార్ గౌడ్, రాష్ట్ర ఎస్సీ సెల్ కార్యదర్శి సాల్మన్ బాబు, ఎండీ రిజ్వాన్ తదితరులు పాల్గొన్నారు.

మాల ఐక్యవేదిక జిల్లా అధ్యక్షుడిగా ప్రవీణ్



నవతెలంగాణ-ఘట్కేసర్
తెలంగాణ మాల ఐక్యవేదిక మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా అధ్యక్షుడిగా వెల మల్ల ప్రవీణ్‌ను నియమిస్తున్నట్టు ఐక్యవేదిక వ్యవస్థాపక అధ్యక్షులు బేరా బాల కిషన్ (బాలన్న) ఉత్తర్వులు జారీ చేశారు. ఈ సందర్భంగా బాల కిషన్ మాటా డుతూ పోచారం మున్సిపాల్టీ, ఇస్మాయిల్ ఖాన్ గూడకు చెందిన వెలమల్ల ప్రవీణ్ మాల జాతి అభివృద్ధికి కృషి చేస్తున్నందుకు జిల్లా అధ్యక్షుడిగా నియ మించామన్నారు. ప్రతి మాల బస్తీలో రాష్ట్ర, కేంద్ర ప్రభుత్వాలు అందజేస్తున్న సంక్షేమ పథకాలను ప్రతీ మాల వ్యక్తికి అందేలా, మాల బిడ్డలు ఉన్నత చదువు లు చదువుకోడానికి, ఉద్యోగ, వ్యాపారాల్లో స్థిరపడడానికి ఐక్యవేదిక సభ్యులు కృషి చేయాలని విజ్ఞప్తి చేశారు. అంబేద్కర్, భాగ్యరెడ్డి వర్మ, మాల మహానాడు వ్యవస్థాపకుడు పీవీరావు ఆశయాలను ప్రజలకు వివరించాలన్నారు. మాల మాదిగల మధ్య చిచ్చుపెట్టి రాజకీయాలు చేయాలనుకునే బీజేపీ రాష్ట్ర అధ్యక్షులు కిషన్ రెడ్డి ఆటలు కొనసాగకుండా చైతన్యం కావాలన్నారు. కార్యక్రమంలో మాలల ఐక్యవేదిక నాయకులు నాలుకల నర్సింగ్‌రావు, జంగ్లీ కిషన్, చెంగల్ చంద్రమోహన్, సంతోష్, మురళీ తదితరులు పాల్గొన్నారు.

డ్రయినేజీ పనులకు కార్పొరేటర్ శంకుస్థాపన



నవతెలంగాణ-కాప్రా
కాప్రా డివిజన్‌లోని శ్రీ శివసాయి నగర్‌లో రూ.10 లక్షల వ్యయంతో అండర్ గ్రౌండ్ డ్రయినేజీ పనులకు కార్పొరేటర్ స్వర్ణ రాజు, మీర్‌పేట్ హెచ్ బీ కాలనీ డివిజన్ కార్పొరేటర్ జెర్రిపోతుల ప్రభుదాస్‌తో కలిసి శుక్రవారం శంకుస్థాపన చేశారు. అనంతరం శాలి వాహన ఎంక్లేవ్ కమ్యూనిటీ హాల్ ప్రారంభించారు. వినాయక్ నగర్ కాలనీ ఫేజ్-2లో ఉప్పల్ ఎమ్మెల్యే బేతి సుభాష్‌రెడ్డి మంచినీటి సరఫరా ప్రారంభించారు. కార్యక్రమంలో జలమండలి అధికారులు సతీశ్, రోహిత్, కాప్రా డివిజన్ బీఆర్‌ఎస్ అధ్యక్షుడు మహేందర్ రెడ్డి, ప్రధాన కార్యదర్శి గిల్బర్ట్, మహిపాల్ రెడ్డి, బాలరాజు, రవీందర్‌రెడ్డి, మహేష్, కొండల్ గౌడ్, చంద్రారెడ్డి, గణేష్, శివకుమార్, సాయిరామ్, చందు, సోమనాథ్, శ్రీనివాస్, మల్లారెడ్డి, రాజు, రవి, నవీన్, గిరి తదితరులున్నారు.

చలో విశ్వరూప్‌సభ పై సమావేశం



నవతెలంగాణ-కాప్రా
ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపకులు మంద కృష్ణ మాదిగ ఆదేశాలతో మీర్‌పే ట్ హౌసింగ్ బోర్డ్ డివిజన్‌లోని రాజీవ్‌నగర్ కమిటీ హాల్‌లో చలో విశ్వరూప్ మహా సభ విధి విధానాలపై మేడ్చల్ జిల్లా మాజీ అధ్యక్షుడు పోలపాక అంజ య్య మాదిగ ఆధ్వర్యంలో శుక్రవారం సమావేశం నిర్వహించారు. ఈ సమా వేశానికి రాష్ట్ర అధ్యక్షుడు గోవింద్ నరేష్ మాదిగ హాజరై చలో విశ్వరూప మహాసభకు జన సమీకరణపై చర్చించారు. మాదిగలను ప్రతి జిల్లా నుంచి భారీ సంఖ్యలో హైదరాబాద్‌కు వచ్చి కేంద్ర ప్రభుత్వంపై ఒత్తిడి తెచ్చి వర్గీకరణ సాధించుకోవాలన్నారు. ఈ సమావేశానికి ఉప్పల్ కాంగ్రెస్ నాయకులు రాగిడి లక్ష్మారెడ్డి చలో విశ్వరూప్ మహాసభకు సంఘీభావం తెలిపారు. లక్ష్మారెడ్డికి ఎమ్మార్పీఎస్ నాయకులు కృతజ్ఞతలు తెలిపారు. ఈ సమావేశంలో యాదన్న మాదిగ, ప్రణయ్, శివకుమార్, నింజా మల్లేష్ మాదిగ హాజరయ్యారు.

మహేందర్‌రెడ్డిని కలిసిన నాగారం నేతలు



నవతెలంగాణ-కీసర
తెలంగాణ రాష్ట్ర భూగర్భ గనుల, సమాచార శాఖ మంత్రిగా పట్నం మహేందర్‌రెడ్డి ప్రమాణ స్వీకారం చేయడంతో శుక్రవారం ఆయన నివాసం లో నాగారం మున్సిపల్ చైర్మెన్ కౌకుంట్ల చంద్రారెడ్డి, వైస్ చైర్మెన్ మల్లేష్ యాదవ్ కౌన్సిలర్, బిజ్జ శ్రీనివాస్‌గౌడ్, అన్నం రాజు సురేష్ తదితరులు మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందజేశారు.

వికలాంగులకు రాష్ట్ర ప్రభుత్వం ప్రాధాన్యం

- ఉప్పల్ ఎమ్మెల్యే బేతి సుభాష్ రెడ్డి



నవతెలంగాణ-ఉప్పల్
తెలంగాణ ప్రభుత్వం వికలాంగులకు అధిక ప్రాధాన్యం ఇస్తున్నదని ఉప్పల్ ఎమ్మెల్యే బేతి సుభాష్‌రెడ్డి అన్నారు. శుక్రవారం రామంతపూర్ డివిజన్‌లోని జీహెచ్ఎంసీ మల్టీపర్పస్ ఫంక్షన్ హాల్‌లో వికలాంగులకు రూ.4016/-చొప్పున పెరిగిన పెన్షన్ల ప్రొసీడింగ్ పత్రాలను లబ్దిదారులకు అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం అన్ని వర్గాలకు అండగా ఉంటుందన్నారు. దేశంలోనే తెలంగాణ ప్రభుత్వం వికలాంగులకు రూ.4016 పెన్షన్ పెంచి ఆదర్శంగా నిలిచిందన్నారు. కార్యక్రమంలో ఉప్పల్ మున్సిపల్ సర్కిల్ డిప్యూటీ కమిషనర్ శ్రీనివాస్, రామంతపూర్ కార్పొరేటర్ బండారు శ్రీవాణి వెంకటరావు, ప్రాజెక్ట్ ఆఫీసర్ రమాదేవి, ఎస్‌డబ్ల్యూ డీఈ చందన, శానిటేషన్ సూపర్‌వైజర్ సుదర్శన్, బీఆర్ఎస్ నాయకులు జనుంపల్లి వెంకటేశ్వర్‌రెడ్డి, గరిక సుధాకర్, బద్దం భాస్కర్ రెడ్డి, రామంతపూర్ డివిజన్ బీఆర్ఎస్ అధ్యక్షుడు ఎండీ. ముస్తాక్, ప్రధాన కార్యదర్శి జేసీబీ రాజు, ఆర్గనైజర్లు తదితరులు పాల్గొన్నారు.

సీఎం సహాయనిధి పేదలకు వరం

సీఎం సహాయనిధి పేద ప్రజలకు వివరం లాంటిదని ఉప్పల్ ఎమ్మెల్యే సుభాష్ రెడ్డి అన్నారు. సీఎం సహాయ నిధి క్రింద లబ్దిదారులకు మంజూరైన చెక్కులను శుక్రవారం ఎమ్మెల్యే ఆయన నివాసంలో అందజేశారు. శ్యామలమ్మకు రూ. 60వేలు, పురుషోత్తంకు రూ.36వేల చెక్కులను అందజేశారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ సీనియర్ నాయకులు జనుంపల్లి వెంకటేశ్వర రెడ్డి, బద్దం భాస్కర్ రెడ్డి, గరిక సుధాకర్, వనంపల్లి గోపాల్ రెడ్డి, శ్రీధర్ , వినీష్ రెడ్డి, భాజీ బాషా, రమేష్, నర్సింహ, రాజు, నరేష్, శివ, బీ ఆర్ఎస్ నాయకులు తదితరులు పాల్గొన్నారు.



ఏడోరోజుకు చేరిన కార్మికుల సమ్మె



నవతెలంగాణ-కాప్రా
జీహెచ్ఎంసీ కాప్రా సర్కిల్ కార్మికు లు చేస్తున్న సమ్మె శుక్రవారం నాటికి ఏడో రోజుకు చేరింది. శ్రావణ శుక్రవా రం అయినా మున్సిపల్ మహిళా కార్మికులంద రూ సమ్మెలో పాల్గొన్నారు. ఉదయం నుంచి సాయంత్రం వరకు మున్సిపల్ కార్యాలయం ప్రాంగణంలో సమ్మె చేశారు. ఈ సందర్భంగా కార్మికులను ఉద్దేశించి కాంగ్రెస్ ఉప్పల్ బీ బ్లాక్ అధ్యక్షులు సింగిరెడ్డి సోమశేఖర్ రెడ్డి మాట్లాడుతూ.. జీహెచ్ఎంసీలోని 25 వేల మంది కార్మికు లు ఏడు రోజులుగా సమ్మె చేస్తున్నప్పటికీ ప్రభుత్వం స్పందించక పోవడం విచారకర మన్నారు. ఎన్నికల సందర్భంగా కేసీఆర్ ఇచ్చిన హామీనే అమలు చేయమంటున్నా మని చెప్పారు. జీహెచ్ఎంసీ పరిధిలో పనిచేస్తున్న కాంట్రాక్ట్, అవుట్ సోర్సింగ్ ఉద్యోగులను అధికారంలోకి రాగానే పర్మినెంట్ చేస్తామని 2014 ఎన్నికల సందర్భంగా హామీ ఇచ్చారని గుర్తు చేశారు.
కార్మికులందరినీ పర్మినెంట్ చేసే వరకు ఆందోళన కొనసాగిస్తామన్నారు. శు క్రవారం ఏఎస్ రావునగర్ డివిజన్ బీజేఆర్ కాలనీ అధ్యక్షుడు షేక్ అబ్దుల్ రహీం సంఘీభావం ప్రకటించి సమ్మెలో పాల్గొన్నారు. అంత కుముందు వంటావా ర్పు నిర్వహించారు. కార్యక్రమంలో వివిధ యూనియన్ల నాయకులు కె. శివ కృష్ణ, సునీల్ మనోహర్, రామరాజేశ్వర్, యాకస్వామి, కుర్మన్న, సుజాత, మంజుల, అంజలి, శ్యామల, శివయ్య, సాయిలు, బి. పరమేష్, ఎస్. నరసింహ పాల్గొన్నారు.

బీఆర్ఎస్‌కు గడ్డం సాయికిరణ్ రాజీనామా

- బీసీలను విస్మరిస్తున్న బీఆర్ఎస్
- ఓట్లు మావి..సీట్లు మీవా?

నవతెలంగాణ-ఉప్పల్
బీఆర్ఎస్‌లో పదేండ్లుగా పార్టీ అభి వృద్ధికి పనిచేస్తున్నా తనను బీసీ కావడం తో గుర్తింపు ఇవ్వడం లేదని గడ్డం సాయి కిరణ్ బీఆర్ఎస్‌కు రాజీనామా చేశారు. శు క్రవారం రామంతపూర్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. బీఆర్ఎస్ పార్టీ బీసీలను అణిచి వేయాల ని చూస్తోందన్నారు. దీంతో బీసీ వ్యతిరేక బీఆర్ఎస్ పార్టీకి రాజీనామా చేస్తున్నానని చెప్పారు.పార్టీ అభివృద్ధికి బీసీలను వాడుకుంటూ బీసీలను ఓటు బ్యాంకుగానే చూస్తుందన్నారు. ఓట్లు మావి.. సీట్లు మీవా అని ప్రశ్నించారు. ఈనెల 27న 6000 మందితో బీజేపీలో చేరబోతున్నట్టు స్పష్టం చేశారు. భారీ బహిరంగ సభను త్వరలో ఏర్పాటు చేస్తామని తెలిపారు. బీసీలను విస్మరించే బీఆర్ఎస్‌కు వచ్చే ఎన్నికల్లో ప్రజలు తగి న బుద్ధి చెప్తారన్నారు. బీఆర్ఎస్ అభివృద్ధి కి ఎలా పనిచేశానో దానికి రెట్టింపు బాధ్య తతో బీజేపీ కోసం పనిచేసి ఉప్పల్ నియో జకవర్గంలో జెండా ఎగురవేస్తామని ధీమా వ్యక్తం చేశారు. కార్యక్రమంలో లక్ష్మణ్ ప్ర సాద్ శర్మ, రాగిడి వెంకటరెడ్డి, గడ్డం వెంకట్ సాయి, శ్రీనివాస్, ప్రకాష్, రాంబా బు, చంద్రశేఖర్, సత్యనారాయణ, నాగరా జు, రంగనాథ్, తదితరులు పాల్గొన్నారు



శామీర్‌పేట సీహెచ్‌సీ జిల్లా వైద్యాధికారి తనిఖీ



నవతెలంగాణ-సిటీబ్యూరో
శామీర్‌పేట సీహెచ్‌సీని మేడ్చల్-మల్కాజిగిరి జిల్లా వైద్య, ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ పుట్ల శ్రీనివాస్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భం గా హాజరు, ఓపీ, స్టాక్, ఏఎన్‌సీ, ఇమ్యునైజేషన్ రిజిస్టర్‌లను తనిఖీ చేశారు. హాస్పిటల్ పారిశుధ్యం, ఫార్మసీ, ల్యాబ్‌ను కూడా తనిఖీ చేశారు. జాతీయ, రాష్ట్ర ఆరోగ్య కార్యక్రమాలకు సంబంధించిన అన్ని రికార్డులను పరిశీలించి, ఆరోగ్య సంరక్షణ సదుపాయ ంలోని స్థానిక ప్రజలను చైతన్యపర్చాలని సిబ్బందిని ఆదేశించారు. సమగ్ర ప్రాథమిక ఆరోగ్య సంరక్షణ సేవలను అందించడంపై దృష్టి సారించాలని, తద్వా రా ప్రభుత్వ ఆరోగ్య సంరక్షణ కార్యక్రమాలను ప్రసూతి, శిశు ఆరోగ్య సేవలను, నాన్-కమ్యూనికేబుల్ డిసీజెస్‌కు అవసరమైన ఔషధాల ఉచిత సరఫరా, తెలంగాణ డయాగ్నస్టిక్ సేవలతో సహా హాస్పిటల్ పరిశుభ్రత, నిర్వహణ, మెరుగుపర్చడానికి ఆదేశాలు ఇచ్చారు.

ఓటు హక్కును బాధ్యతగా తీసుకోవాలి : కమిషనర్



నవతెలంగాణ-జవహర్‌నగర్
ప్రతి ఒక్కరూ ఓటు హక్కు ను బాధ్యతగా తీసుకోవా లని జవహర్‌నగర్ కమిషనర్ రామ లింగం శుక్రవారం ఒక ప్రకటన లో తెలిపారు. ఈ నెల 26, 27వ, సెప్టెంబర్2,3 తేదీలలో బీఎల్వోలు అందుబాటులో ఉంటారని తెలిపారు. ప్రజలందరూ ఓటు ఉందా లేదా అని సరిచూసు కోవాలని కోరారు. 18ఏండ్లు నిండిన యువతీ, యువకులు ఓటును నమోదు చేసుకోవాలని కోరారు. ఈ అవకాశాన్ని ప్రజలు వినియోగించుకోవాలన్నారు.

పుస్తె, మెట్టెలు అందజేత



నవతెలంగాణ-మేడ్చల్
మేడ్చల్ మండల పరిధిలోని శ్రీరంగవరం గ్రామానికి చెందిన కమ్మరి లక్ష్మీ కుమార్తె సంతోషిని వివాహం వెంకేష్ చారితో నిశ్చయమైంది. కాగా శు క్రవారం జెడ్పీటీసీ శైలజ విజయానందారెడ్డి దంపతు లు పుస్తె, మెట్టెలను కుటుంబ సభ్యులకు అందజేశా రు.ఈ సందర్భంగా మాట్లాడుతూ తమవంతు సహాయంగా పుస్తె, మెట్టెలు అందజేసినట్లు తెలిపా రు. కార్యక్రమంలోఎంపీటీసీ కటిక ప్రకాష్, ఉప సర్పంచ్ నర్సింహ,వార్డు సభ్యులు నాగర్జునరెడ్డి, కో ఆప్షన్ సభ్యులు, తదితరులు పాల్గొన్నారు.

చీర్యాల లక్ష్మీ నృసింహ్మా ఆలయంలో వరలక్ష్మి వ్రతం



నవతెలంగాణ-కీసర
చీర్యాల లక్ష్మీనరసింహ స్వామి ఆలయంలో శ్రావణమాసం రెండో శుక్రవారం సందర్భంగా ఆలయంలో సామూహిక వరలక్ష్మీ వ్రతాలు ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆలయ ఫౌండర్ చైర్మెన్ మల్లారపు లక్ష్మీ నారాయణ , కీసర మండల ఎంపీపీ మల్లారపు ఇందిరా , ధర్మకర్తశ్రీ హరి భక్తులు పాల్గొన్నారు.

కాంగ్రెస్ టికెట్ కేటాయించాలని దరఖాస్తులు



టీపీసీసీ కార్యదర్శి ప్రభాకర్ రెడ్డి దరఖాస్తు

వచ్చే అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్ అభ్యర్థిగా ఉప్పల్ నియోజకవర్గం నుంచి ఎమ్మెల్యేగా పోటీ చేయడానికి అవకాశం కల్పించాలంని రామంతాపూర్‌కు చెందిన టీపీసీసీ కార్యదర్శి పసుల ప్రభాకర్‌రెడ్డి శు క్రవారం గాంధీభవన్‌లో దరఖాస్తు సమ ర్పించారు. ఈ సందర్భంగా ఆయన మా ట్లాడుతూ.. 30ఏండ్లుగా పార్టీకి సేవ చేస్తు న్నానని తెలిపారు.
ప్రజల మధ్యలో ఉంటూ పార్టీ ఆదేశాల ప్రకారం పలు కార్యక్రమాలు నిర్వహించినట్లు తెలిపారు. ఉప్పల్ నియోజకవర్గంలో ఎంతోమంది పార్టీలు ఫిరాయించి ఇతర పార్టీలకు వెళ్లినా తాను మాత్రం కాంగ్రెస్‌ను నమ్ము తూనే ఉన్నానని పేర్కొన్నారు. అధిష్టానం తన సేవలను గుర్తించి టికెటు ఇవ్వాలని కోరారు. కార్యక్రమంలో రాగడి లక్ష్మారెడ్డి, సుధాకర్ రెడ్డి, రంజిత్ రెడ్డి, మహమ్మద్ రఫీక్ , మురళీగౌడ్, శ్రీనివాస్ యాదవ్, బాలయ్య తదితరులు పాల్గొన్నారు.

నవతెలంగాణ - ఉప్పల్
ఉప్పల్ ప్రజల సమస్యలపై అవగా హన, సర్పంచ్, మున్సిపల్ చైర్మెన్‌గా సమర్థవంతమైన పాలన అందించిన తనకు ఉప్పల్ అసెంబ్లీ టికెట్ కేటాయిం చాలని మేకల శివారెడ్డి కోరారు. శుక్రవా రం ఉప్పల్‌లో ఏర్పాటు చేసిన సమావేశం లో ఆయన మాట్లాడుతూ.. ఎమ్మెలే టికెట్ కోసం గాంధీ భవన్‌లో కాంగ్రెస్ ఇన్‌చార్జికి తన రాజకీయ జర్నీ, బయోడేటాతో వినతి పత్రం అందజేసినట్లు తెలిపారు. 1978 లో విలేజ్ ఆఫీసర్‌గా, 1981 నుంచి 87 వరకు సర్పంచ్‌గా, 1988 నుంచి 1992 వరకు మున్సిపల్ చైర్మెన్‌గా పదవీని సమ ర్థవంతంగా నిర్వహించినట్లు తెలిపారు. గ్రామం నుంచి అర్బన్ మున్సిపల్‌గా అప్‌గ్రేడ్ చేయించి పట్టణంలోని సమస్యల ను పరిష్కరించానని వివరించారు. ఉప్పు నీళ్లతో ప్రజలు ఇబ్బందులు పడుతుం టే అప్పట్లో మంజీరా నీటి సౌకర్యాన్ని కల్పించ డానికి కృషి చేశానన్నారు. అప్పటి ముఖ్య మంత్రి మర్రి చెన్నారెడ్డి సహకారంతో పైప్ లైన్లను ఏర్పాటు చేసి ఒకరోజు మంజీ రా, మరుసటి రోజు ఉప్పు నీళ్ల సరఫరా చేసి నీటి సమస్యను పరిష్కరించనన్నారు. రోడ్లు, డ్రయినేజీని ఏర్పా టు చేశానని పేర్కొన్నారు. నగర శివారు తొమ్మిది మున్సి పాల్టీలో ఉప్పల్‌ను అభివృద్ధిలో నెంబర్‌వన్ గా నిలపడం తో అప్పటి ప్రభుత్వం అవార్డు ఇచ్చినట్లు శివారెడ్డి వివరిం చారు. తనను అప్పటి టీడీపీ హెూం మినిస్టర్ దేవేందర్ గౌడ్ టీడీపీలోకి రమ్మని చెప్పినా వెళ్లలేదన్నారు. తాను కాంగ్రెస్ వాదిని కాబ ట్టే ఏ పార్టీలోనూ చేరలేదన్నారు. మేడ్చల్ బీ- బ్లాక్ అధ్యక్షుడిగా, ఉపాధ్యక్షుడిగా, ప్రస్తుతం పీసీసీ డెలిగేట్‌గా పనిచేస్తున్నాన ని చెప్పారు. 2004లో టీఆర్ఎస్ అలయ న్స్‌తో కొర్రెముల సురేందర్ రెడ్డికి, తర్వాత బండారి రాజిరెడ్డి, ఆ తర్వాత లక్ష్మారెడ్డికి టికెట్ ఇచ్చారని చెప్పారు. ఈ సారి తనకు టికెట్ ఇస్తే భారీ మెజార్టీతో విజయం సాధి స్తానని ధీమా వ్యక్తం చేశారు.



సమస్యలు పరిష్కరించడమే ప్రభుత్వ ధ్యేయం : ఎమ్మెల్యే

నవతెలంగాణ-కుత్బుల్లాపూర్



ప్రజా సమస్యలు పరిష్కరించడమే బీఆర్‌ఎస్ ప్రభుత్వ ధ్యేయమని ఎమ్మెల్యే కేపీ వివేకానంద్ పేర్కొన్నారు. శుక్రవారం కుత్బుల్లాపూర్ నియోజక వర్గం పరిధిలోని వివిధ కాలనీలకు చెందిన సంక్షేమ సంఘాల ప్రతినిధులు మరియు బీఆర్‌ఎస్ పార్టీ నాయకులు ఎమ్మెల్యేని తన నివాస కార్యాలయంలో కలిసి పలు సమస్యలపై వినతి పత్రాలు అందజేశారు. ఎమ్మెల్యే వెంటనే సంబంధిత అధికారులతో ఫోన్‌లో మాట్లాడి వాటి పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ఎటువంటి సమస్యలు ఉన్నతన దృష్టికి తీసుకురావాలని వాటి పరిష్కారంలో ఎల్లవేళలా అందుబాటులో ఉంటానని ఎమ్మెల్యే తెలిపారు.

ప్రజా సమస్యల పరిష్కారానికి కృషి :శంభీపూర్ క్రిష్ణ

నవతెలంగాణ-దుండిగల్



కుత్బుల్లాపూర్ నియోజకవర్గ, బీఆర్ఎస్ నేత, కౌన్సిలర్ శంభీపూర్ క్రిష్ణ శుక్రవారం నియోజకవర్గ పరిధిలోని ప్రజలు శంభీపూర్‌లోని కార్యాలయంలో కలిశారు. వారు సమస్యలను పరిష్కరించాలని కోరారు. వెంటనే సంబంధిత అధికారులతో ఫోన్‌లో మాట్లాడి వాటి పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ఎటువంటి సమస్యలు ఉన్నతన దృష్టికి తీసుకురావాలని వాటి పరిష్కారంలో ఎల్లవేళలా ప్రజలకు అందుబాటులో ఉంటానని తెలిపారు.

పారదర్శకంగా 'డబుల్' ఇండ్ల కేటాయింపు

- రాష్ట్ర కార్మిక, ఉపాధికల్పన శాఖ మంత్రి సీహెచ్.మల్లారెడ్డి
- టాంపర్ ఫ్రీ ప్రత్యేక సాఫ్ట్‌వేర్ సహకారంతో అర్హుల ఎంపిక
- మేడ్చల్-మల్కాజిగిరి జిల్లా కలెక్టర్ అమోయ్ కుమార్
- 4 నియోజకవర్గాల్లో నియోజకవర్గానికి 500 మంది చొప్పున ఇండ్లు కేటాయింపు



నవతెలంగాణ-సిటీబ్యూరో

రాష్ట్ర ప్రభుత్వం నిరుపేదలు, ఇండ్లులేని అర్హులైన వారు ఆత్మగౌరవంతో ఉండాలనే సదుద్దేశంతో జిల్లా వ్యాప్తంగా డబుల్ బెడ్‌రూం ఇండ్లు కట్టించి వాటిని ఎంతో పారదర్శకంగా కేటాయిస్తోందని, ఈ విషయంలో ఎలాంటి పైరవీలు, జోక్యం లేకుండా లబ్దిదారులకు అందజేస్తున్నామని రాష్ట్ర కార్మిక, ఉపాధి కల్పన శాఖ మంత్రి చామకూర మల్లారెడ్డి అన్నారు. శుక్రవారం మేడ్చల్-మల్కాజిగిరి జిల్లా కలెక్టరేట్ సమావేశ మందిరంలో మంత్రి మల్లారెడ్డి, జిల్లా కలెక్టర్ అమోయ్ కుమార్ సమక్షంలో ఆన్ లైన్ లాటరీ ద్వారా డబుల్ బెడ్ రూం ఇండ్ల కేటాయింపు 'రాండమైజేషన్' సాఫ్ట్ వెర్ ద్వారా ఆన్ లైన్ డ్రా నిర్వహించి లబ్దిదారులను ఎంపిక చేశారు. జిల్లాలోని మల్కాజిగిరి, ఉప్పల్, కూకట్‌పల్లి, కుత్బుల్లాపూర్ నియోజకవర్గాలకు చెందిన అర్హులైన లబ్దిదారులకు నియోజకవర్గానికి 500 మందిని ప్రత్యేక సాఫ్ట్‌వేర్ (టాంపర్ ఫ్రీ) ద్వారా ఎంపిక చేసి వారికి డబుల్ బెడ్రూమ్ ఇండ్ల కేటాయింపు కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ జిల్లా వ్యాప్తంగా డబుల్ బెడ్ రూంలకు మొత్తం 1,75,959 దరఖాస్తులు వచ్చాయని, శుక్రవారం వరకు అర్హత గల లబ్దిదారులు 24,717 ఉన్నారని తెలిపారు. ఈ మేరకు ప్రతి నియోజకవర్గం నుంచి మొదటి విడతగా 500 మంది లబ్దిదా రులను ఎంపిక చేసి వారికి ఇండ్లను కేటాయిస్తామని తెలిపారు. అర్హులకు ముందుగా ప్రాధాన్యతనిస్తూ జిల్లా కలెక్టర్ సమక్షంలో టాంపర్ ఫ్రీ ప్రక్రియ ద్వారా ఇండ్లను కేటాయిస్తున్నట్టు మంత్రి స్పష్టం చేశారు. ఈ విధానం ద్వారా ఇండ్లను కేటాయించడం ద్వారా ఎంతో నాణ్యత, పారదర్శకత, జవాబుదారీతనాన్ని సూచిస్తో ందని, ఇలాంటి ప్రక్రియ దేశంలోనే మొదటిసారిగా ప్రవేశపెట్టినట్టు తెలిపారు. ఈ ప్రక్రియ అర్హులైన పేదలందరికీ ఇండ్ల కేటాయింపు జరిగేంత వరకు నిరంతరం కొనసాగుతుందని చెప్పారు. జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లా వ్యాప్తంగా అర్హులైన పేదలకు సొంత ఇంటి కల సాకారం చేసే విధానంలో ఎంతో పారదర్శకంగా వ్యవహరించామన్నారు. ఇందకుగాను జాతీయ సమాచార కేంద్రం (ఎన్ఐసీ) వారి సహకారంతో ఎలాంటి విధంగా తారుమారు చేయలేకుండా ఉండేలా (టాంపర్ ఫ్రీ) సాఫ్ట్‌వేర్ ద్వారా ప్రజాప్రతిని ధుల సమక్షంలో అర్హులైన వారికి ఇండ్లను కేటాయిస్తామని చెప్పారు. ఈ విషయంలో ఎలాంటి అనుమానాలు, అపోహలకు తావులేకుండా లాటరీ పద్ధతిన కేటాయింపు చేసే విధానం కంటే ప్రస్తుతం అన్ని రకాలుగా నాణ్యత, పారదర్శకత, జవాబుదారీతనాన్ని సూచించడం వల్ల ఈ ప్రక్రియను ఎంచుకున్నట్టు తెలిపారు. తక్కువ సమయంలో అర్హులైన లబ్దిదారుల ఎంపిక జరిగేలా సాఫ్ట్‌వేర్‌ను అభివృద్ధి చేసినట్టు చెప్పారు. ఈ సాఫ్ట్ వేర్‌ను ఒకసారి ఎంపికైన లబ్దిదారులు మళ్లీ ఎంపిక కాకుండా ఉండడానికి ఆధార్ నెంబరు ప్రాతిపదికన రూపొందించినట్టు తెలిపారు. ఈ విధానం వల్ల కేటాయింపు సమయంతో పాటు తేదీ సైతం సాఫ్ట్ వేర్‌లో నమోదు అవుతుందని, ఎంపిక జరిగిన తర్వాత అందుకు సంబంధించిన డేటాను ఎట్టి పరిస్థితుల్లో తారుమారు చేయడానికి వీల్లేకుండా రహస్య కోడ్ ద్వారా నమోదు చేసినట్టు చెప్పారు. ప్రస్తుతం ఈ ప్రక్రియ వల్ల లబ్దిదారుల ఎంపిక సులభతరంగా జరగడంతోపాటు పారదర్శకంగా ఉంటుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా అదనపు కలెక్టర్లు విజయేందర్‌రెడ్డి, అభిషేక్ అగస్త్య, జిల్లా రెవెన్యూ అధికారిణి హరిప్రియ, రోడ్లు భవనాల శాఖ కార్యనిర్వహణాధికారి శ్రీనివాసమూర్తి, సీపీవో మోహన్‌రావు, జిల్లా ఇండస్ట్రీస్ అధికారి రవీందర్, ఆర్డీవోలు రాజేష్ కుమార్, శ్యామ్ ప్రకాశ్, డిప్యూటీ కమిషనర్‌లు, జిల్లా స్థాయి అధికారులు, ఆయా శాఖల అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

బూర్జువా పార్టీలతో సమస్యలు పరిష్కారం కావు



- సీపీఐ నియోజకవర్గ కార్యదర్శి ఉమా మహేష్

నవతెలంగాణ-కుత్బుల్లాపూర్

బూర్జువా పార్టీలు ఉన్నంత కాలం ప్రజలు మోసపోతుంటారని సీపీఐ నియోజకవర్గ కార్యదర్శి ఉమా మహేష్ అన్నారు. అవుట్ సోర్సింగ్ ఉద్యోగాలను పర్మినెంట్ చెయ్యాలని, కనీస వేతనంగా రూ.24 వేలు ఇవ్వాలని, డబుల్ బెడ్ రూమ్ ఇవ్వాలని, వేతనం కల్పించాలని తదితర డిమాండ్లతో గత 3 రోజులుగా కుత్బుల్లాపూర్, గాజులరామారం జంట సర్కిలా పరిధిలోని కార్మికులు విధులు బహిష్కరించి, కుత్బుల్లాపూర్ కార్యాలయం ఎదుట బైఠాయించి పర్మినెంట్ చేయాలని డిమాండ్ చేశారు. జీహెచ్ఎంసీ కార్మికులకు మద్దతుగా శుక్రవారం ఉమా మహేష్ సమ్మెలో పాల్గొని మద్దతు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తెలంగాణ ఉద్యమంలో మొద టి వరుసలో నిలిచి హైదరాబాద్‌లో ఉద్యమాన్ని తారా స్థాయికి తీసుకెళ్లింది మున్సిపల్ కార్మికులేనన్నారు. ఎన్నికల సమయంలో మాత్రమే కార్మికులు, కార్మిక సమస్యలు గుర్తుకు వస్తాయని, కావున అలాంటి పార్టీలు ఉన్నంత కాలం ప్రజలు మోసపోతుంటారని కార్మికులు ఎల్లప్పుడూ అప్రమత్తంగా వ్యవహరిస్తూ తమ సమస్యల కోసం ఎల్లప్పుడూ పోరాడే కమ్యూనిస్టులను గుర్తు ఉంచుకోవాలన్నారు. ఈ ప్రపంచంలో దేశంలో కార్మికుల సమస్యలు పరిష్కారం కావాలంటే కార్మికులే అధికారం చెప్పటాలని చెప్పే ఏకైక పార్టీ కమ్యూనిస్టు పార్టీ మాత్రమేనని కార్మికులు చేసే పోరాటానికి సంపూర్ణ మద్దతు ఇస్తుందని ప్రకటించారు. ఈ కార్యక్రమంలో జీహెచ్ఎంసీ రాష్ట్ర అధ్యక్షుడు ఏసురత్నం, జిల్లా అధ్యక్షుడు రాములు, బాబు, నరేందర్ కార్మికులు పెద్ద ఎత్తున హాజరయ్యారు.

బాలానగర్: జీహెచ్ఎంసీ పారిశుధ్య కార్మికులు చేస్తున్న ధర్నాకు ధర్మసమాజ్ పార్టీ మండల కమిటీ మద్దతు తెలిపింది. కూకట్‌పల్లి సర్కిల్ మున్సిపల్ కార్యాలయం ప్రాంగణంలో గత ఎనిమిది రోజులుగా ధర్నా చేస్తున్న పారిశుద్ధ కార్మికుల సమ్మెకు శుక్రవారం మద్దతు తెలుపుతూ బాలానగర్ మండల ధర్మ సమాజ్ పార్టీ ప్రచార కమిటీ అధ్యక్షులు, కమిటీ సభ్యులు పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో బాలానగర్ మండల ధర్మ సమాజ పార్టీ కార్యదర్శి శ్రీనివాస్ మహారాజ్, రాములు మహారాజ్, శ్రీనివాస్ మహారాజ్ తదితరులు పాల్గొన్నారు.



కేపీహెచ్‌బీ/ కూకట్‌పల్లి : కార్మికుల డిమాండ్లను ముఖ్యమంత్రి కేసీఆర్ దృష్టికి తీసుకెళ్ళి పరిష్కరిస్తానని కూకట్‌పల్లి ఎమ్మె ల్యే మాధవరం కృష్ణారావు అన్నారు. ఇటీవల జీహెచ్ఎంసీ కార్మికులను శాశ్వత నియామకాలు కింద తీసుకోవాలని ఉ ద్దేశ్యంతో చేపట్టిన సమ్మెలో భాగంగా శుక్రవారం కూకట్‌ప ల్లి జోన్ మున్సిపల్ కార్యాలయం మూసాపేటలోని కార్మికు లు వద్దకు ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు వెళ్లారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కార్మికుల బాధను అర్థం చేసుకున్న వ్యక్తిగా తమ న్యాయమైన డిమాండ్లను ముఖ్యమంత్రి కేసీఆర్, మంత్రి కేటీఆర్ దృష్టికి తీసుకెళ్తానని అన్నారు. తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన తర్వాత కార్మికులను అన్ని విధాలాగ ఆదుకున్న గొప్ప నాయకుడు ముఖ్యమంత్రి కేసీఆర్ అన్నారు. ఇతర పార్టీల వారి మాటలు నమ్మొద్దని కార్మికులకు కచ్చితంగా న్యాయం చేస్తామని హామీ ఇచ్చారు.

కూకట్‌పల్లి: పారిశుధ్య కార్మికులకు అండగా ఉంటాం అని టీపీసీసీ సభ్యులు గొట్టిముకల వెంగళ రావు అన్నారు. కూకట్‌పల్లి నియోజకవర్గం, మూసాపేట్ జీహెచ్ఎంసీ కార్యాలయంలో పారిశుధ్య కార్మికులు నిర్వహిస్తున్న నిరసన సమ్మె కార్యక్రమంలో పాల్గొని, తమ మద్దతు తెలిపారు. ఈ సందర్భంగా గొట్టిముకల వెంగళ రావు మాట్లాడుతూ పారిశుధ్య కార్మికుల నిరసన ఎన్ని రోజులు చేస్తే అని రోజులు భోజనాలా ఖర్చు నాది అని హామీ ఇచ్చారు. ప్రత్యేక తెలంగాణ రాష్ట్రం వస్తే మన బ్రతుకులు మారుతాయి అనుకున్నామని కానీ, కేవలం కేసీఆర్ కుటుంబం మాత్రమే బాగుపడిందని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ సీనియర్ నాయకులు బషీర్, బి బ్లాక్ అధ్యక్షులు గోపీసెటి రాఘవేందర్,డివిజన్ అధ్యక్షులు సతీష్ గౌడ్, మేకల రమేష్, సుధాకర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



జగద్గిరిగుట్ట: మాయ మాటలు చెప్పి పబ్బం గడుపుకోవడంలో బీఆర్ఎస్ సర్కార్, పాలకులు ఆరితేరి పోయారని టీపీసీసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి, కుత్బుల్లాపూర్ నియోజకవర్గం కాంగ్రెస్ నాయకులు సొంటి రెడ్డి పున్నారెడ్డి విమర్శించారు. జీహెచ్ఎంసీ తాత్కాలిక కార్మికుల న్యాయమైన పోరాటాలను నిరసిస్తూ శుక్రవారం కుత్బుల్లాపూర్, గాజులరామారం జంట సర్కిళ్ల ఆవరణలో చేపట్టిన దీక్ష కార్యక్రమానికి హాజరై బైఠాయించి సంఘీభావం తెలిపారు. జీహెచ్ఎంసీ కార్మికులను వెంటనే పర్మినెంట్ చేయాలని, డిమాండ్ చేశారు. జీహెచ్ఎంసీ తాత్కాలిక కార్మికులకు న్యాయం జరిగేంత వరకు అండగా కాంగ్రెస్ పార్టీ, తాను ఉంటామని భరోసా ఇచ్చారు. ఈ కార్యక్రమంలో సీనియర్ కాంగ్రెస్ నాయకులు లాల్ మొహమ్మద్ , చింతల్ డివిజన్ ఇన్చార్జ్ ఎండి. ఫలహుర్ రహమాన్, సురేష్ ,సతీష్, కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు పాల్గొని సంఘీభావం తెలిపారు.





నియోజకవర్గ అభివృద్ధికి నిధుల కొరత లేదు



- ఎమ్మెల్యే కె.పి. వివేకానంద్

నవతెలంగాణ-కుత్బుల్లాపూర్

కుత్బుల్లాపూర్ నియోజకవర్గం, 130 డివిజన్ సుభాష్ నగర్ పరిధిలోని రాజీవ్ గృహకల్పలో 3 కోట్ల వ్యయంతో భూగర్భ డ్రయినేజీ నిర్మాణ పనులను ఈరోజు ఎమ్మెల్యే కె.వి. వివేకానంద్ ముఖ్య అతిథిగా పాల్గొని శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ఏక కాలంలో 3 కోట్ల నిధులతో భూగర్భ డ్రయినేజీ పనులను ప్రారంభించుకోవడం ఎంతో సంతోషంగా ఉందన్నారు. నియోజకవర్గాని అన్ని రంగాల్లో అభివృద్ధిలో ముందుంచ డమే లక్ష్యంగా పని చేస్తున్నామన్నారు. ముఖ్యమంత్రి కేసీఆర్ నాయకత్వంలో, కేటీఆర్ సహకారంతో ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా మౌలిక సదుపాయాల కల్పనకు ప్రత్యేక దృష్టి వహిస్తున్నామని తెలిపారు. రాబోయే రోజుల్లో మరెన్నో కార్యక్రమాలు చేపడతామన్నారు. ప్రజలకు ఏ కష్టం వచ్చినా నిత్యం అందుబాటులో ఉండి , పరిష్కరిస్తానని హామీ ఇచ్చారు. బీఆర్‌ఎస్ ప్రభుత్వ హయాంలో ప్రతి కాలనీలో మెరుగైన మౌలిక సదుపాయాలు కల్పిస్తున్నామని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో వాటర్ వర్క్స్ జనరల్ మేనేజర్ శ్రీధర్ రెడ్డి, డి.జి.ఎం. అప్పర్ నాయుడు, జీహెచ్ఎంసీ ఏఈ. సురేందర్ నాయక్, మేడ్చల్ జిల్లా ఫిషరీస్ కో ఓపెరటివే సొసైటీ చైర్మెన్ మన్నే రాజు, మాజీ కౌన్సిలర్ బొబ్బా రంగ రావు, బీఆర్‌ఎస్ పార్టీ యూత్ అద్యేక్షులు సోమేశ్ యాదవ్, బిఆర్ఎస్ పార్టీ డివిజన్ అద్యేక్షులు పోలె శ్రీకాంత్, వెంకట్ స్వామి, తార సింగ్, ప్రభాకర్, రాజ్ కుమార్, నాయకులు, కాలనీ వాసులు పాల్గొన్నారు.

నిరుపేదలకు ఆరోగ్యశ్రీ వరం



- బీఆర్ఎస్ అధ్యక్షులు ఎర్వ.శంకరయ్య

నవతెలంగాణ-జగద్గిరిగుట్ట

ఆరోగ్యశ్రీ పేద మధ్యతరగతి ప్రజలకు వరమని రంగారెడ్డి నగర్ డివిజన్ బీఆర్ఎస్ పార్టీ అధ్యక్షులు, ఆదర్శనగర్ హౌసింగ్ - బిల్డింగ్ కోఆపరేటివ్ సొసైటీ అధ్యక్షులు ఎర్వ శంకరయ్య అన్నారు. ప్రభుత్వం వైద్యశాఖ (ఆరోగ్యశ్రీ హెల్త్ కేర్ ట్రస్ట్) ఆధ్వర్యంలో ఆరోగ్య శ్రీ డిజిటల్ కార్డుల ప్రక్రియ కార్యక్రమంలో భాగంగా శుక్రవారం డివిజన్ పరిధి ఆదర్శనగర్ కమిటీ హాల్ లో ఏర్పాటు చేసిన కేంద్రాన్ని ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ముఖ్యమంత్రి కేసీఆర్, వైద్యఆరోగ్య శాఖ మంత్రి తన్నీరు హరీష్ రావులు పేద, మధ్యతరగతి ప్రజల కు మెరుగైన వైద్య సేవలు అందాలనే లక్ష్యంతో ప్రత్యేక దృష్టి సారించారని తెలిపారు. రాష్ట్రంలోని పేద ప్రజలకు గతంలో ఆరోగ్య శ్రీ పై 2 లక్షల వరకే పరిమితి ఉండేదని ఇప్పుడు రెండు నుండి 3 లక్షలు పెంచి 5 లక్షల పరిమితి వరకు పెంచడం పట్ల ప్రజల తో పాటు ఆయన హర్షం వ్యక్తం చేశారు. పేద,సామాన్య ప్రజలు సైతం కార్పొరేట్ వైద్య సేవలు కార్పొరేట్ ఆసుపత్రులలో ఆరోగ్యశ్రీ కార్డు పై పొందవచ్చునన్నారు. ఆరోగ్య శ్రీ కేంద్రాలలో ఆరోగ్య శ్రీ డిజిటల్ కార్డు పొందాల నుకునేవారు తెల్ల రేషన్ కార్డు (నెట్ ధృవపత్రము) కార్డులో నమోదు చేసుకునే వారి ఆధార్ జిరాక్స్ ధ్రువపత్రాలను అందజేయాలని తెలిపారు. ఈ కేంద్రాలు ఉదయం 10 గంటల నుండి సాయంత్రం 5 గంటల వరకు కొనసాగుతాయని ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఆరోగ్యశ్రీ హెల్త్ కేర్ ట్రస్ట్ ప్రతినిధి రేణుక, సహాయకురాలు బిందు స్థానిక కమిటీ నాయకులు జె. శ్రీనివాస్, కోటేశ్వరరావు, కే శ్రీనివాస్,నారాయణ గౌడ్ పాల్గొన్నారు.

సెయింట్ పీటర్ కళాశాలలో రక్తదాన శిబిరం

- కళాశాల సెక్రటరీ టి.వి రెడ్డి

నవతెలంగాణ-మేడ్చల్



రక్తదానం కంటే పుణ్యం మరొకటి ఉండదని, ప్రాణాపాయ స్థితిలో రక్తమందిస్తే వారి ప్రాణాలు కాపాడిన వారవుతారని సెయింట్ పీటర్ కళాశాల సెక్రటరీ టి.వి. రెడ్డి అన్నారు. మేడ్చల్ మైసమ్మగూడలోని సెయింట్ పీటర్స్ ఇంజినీరింగ్ కళాశాలలో, శుక్రవారం ఎన్ఎస్ఎస్ క్లబ్, మహావీర్ ఇంటర్నేషనల్ తలసేమియా సిక్లీ సెల్ సొసైటీ వారి ఆధ్వర్యంలో, కళాశాల సెమినార్ హాల్‌లో "రక్త దాన" శిబిరం నిర్వహించారు. ఈ రక్తదాన శిబిరంలో కళాశాలలోని అనేకమంది విద్యార్థులు సిబ్బంది పాల్గొని, తల సేమియా రోగుల కొరకు విరివిగా రక్తదానం చేశారు. ఈ సందర్భంగా సెక్రటరీ మాట్లాడుతూ ప్రాణాపాయ స్థితిలో ఉన్నవారికి, తల సేమియా రోగులకు అత్యవసర పరిస్థితిలో రక్తం అందిస్తే వారి ప్రాణాలు నిలబెట్టిన వారు అవుతారని ఉద్దేశంతో తమ కళాశాలలో రక్తదాన శిబిరం ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. రక్తదానం చేసిన విద్యార్థులకు అభినందిస్తూ ప్రశంసా పత్రం అందజేశారు. ఈ కార్యక్రమాన్ని ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం అధికారి డా.అసాం రాజేష్ అధ్యక్షతన నిర్వహించారు. ఈ కార్యక్రమంలో కళాశాల సెక్రటరీ టివి రెడ్డి, డైరెక్టర్ సరోజ రెడ్డి, ప్రిన్సిపాల్ డా. కె.శ్రీలత, పీఆర్‌ఓ రవి సుధాకర్, విద్యార్థులు సిబ్బంది పాల్గొన్నారు.

విద్యార్థులు పండుగల విశిష్టతలను తెలుసుకోవాలి



- నారాయణ పాఠశాల డీజీఎం. గోపాల్ రెడ్డి

నవతెలంగాణ-జగద్గిరిగుట్ట

నేటితరం విద్యార్థులు మన పండగల విశిష్టతతో పాటు సంస్కృతి, సాంప్రదాయాల గూర్చి తెలుసుకోవాలని చింతల్ బ్రాంచ్ నారాయణ పాఠశాల డీజీఎం. గోపాల్ రెడ్డి , ఏజీఎం. వైజయంతి లు సూచించారు. శుక్రవారం వరలక్ష్మి వ్రత మహోత్సవం పురస్కరించుకుని కుత్బుల్లాపూర్ సర్కిల్ చింతల్ లోని నారాయణ పాఠశాలలో యాజమాన్యం, అధ్యాపక బృందం, విద్యార్థుల నడుమ వేడుకలు ఘనంగా జరుపుకున్నారు. ఈ కార్యక్రమానికి వారు ముఖ్య నారాయణ పాఠశాల డీజీఎం. గోపాల్ రెడ్డి అతిథులుగా హాజరై ప్రత్యేక పూజలు చేశారు. అమ్మవారిని అష్టలక్ష్మి దేవిల 8 రూపాలలో అలంకరించడం ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ విద్యార్థులు చదువుతోపాటు విలువలతో కూడిన జీవన విధానాన్ని అలవర్చుకోవాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపల్ స్వరాజ్యలక్ష్మి, వైస్ ప్రిన్సిపల్ కలిశెట్టి రాజరాజేశ్వరి, ఉపాధ్యాయులు, సిబ్బంది పాల్గొన్నారు.

పెలికాన్ సిగ్నల్ సిస్టమ్ ప్రారంభం



- అడిషనల్ ట్రాఫిక్ డీసీపీ సి.వేణుగోపాల్

నవతెలంగాణ-బాలానగర్

నగరంలోని కమిషనరేట్‌ల పరిధిలో రోడ్డు దాటే పాదాచారులు సురక్షితంగా వెళ్ళేందుకు తెలంగాణ ట్రాఫిక్ పోలీసులు వినూత్న ప్రయోగాలు చేస్తున్నారు. నగరంలో ట్రాఫిక్ మధ్యలో రోడ్డు దాటేందుకు ప్రజలు తీవ్ర ఇబ్బందలు పడుతూ ప్రమాదాల బారిన పడుతున్న సంగతి తెలిసిందే. నగరంలో రోడ్డు దాటాలంటే కత్తిమీద సాము లాంటిదేనని, ఇక దీన్ని చెక్ పెట్టేందుకు మన సైబరాబాద్ ట్రాఫిక్ పోలీసులు శుక్రవారం మూసాపేట్ చౌరస్తా శ్రీ రాములు థియేటర్ , ఎర్రగడ్డ జేక్ పాయింట్ హోటల్ వద్ద పెలికాన్ సిగ్నల్ సిస్టమ్‌ను అడిషనల్ ట్రాఫిక్ డీసీపీ సి.వేణు గోపాల్ రెడ్డి, బాలానగర్ ఏసీపీ. శ్రీనివాసులు ప్రారంభించారు. ఈ సందర్భంగా ట్రాఫిక్ అడిషనల్ డీసీపీ సి.వేణు గోపాల్ రెడ్డి మాట్లాడుతూ పాదచారులు, ప్రజలు రోడ్లపై సురక్షితంగా దాటడానికి ఇది ఎంతగానో సహాయపడుతుందన్నారు. శిక్షణ పొందిన ట్రాఫిక్ వాలంటీర్లు ఈ వ్యవస్థను ఆపరేట్ చేస్తారని ఈ సందర్భంగా తెలిపారు. జనం గుంపులుగా రోడ్డు దాటాల్సి వచ్చినప్పుడు అటువైపు వాహనాలను నిలిపివేస్తారని, హైదరాబాద్‌లో రోడ్డు ప్రమాదాలు ఎక్కువగా పాదచారులు రోడ్లు దాటుతున్న సమయంలోనే జరుగుతున్నాయని అడిషనల్ డీసీపీ తెలిపారు. ఈ ఏడాది ఇప్పటి వరకు హైదరాబాద్‌లో జరిగిన రోడ్డు ప్రమాదాల్లో 50 మంది పాదచారులు ప్రాణాలు కోల్పోయారన్నారు. నగరంలో కొన్ని చోట్ల ఫుట్ ఓవర్ బ్రిడ్జిలు ఉన్నప్పటికీ పాదచా రులు వాటిని వినియోగించడం లేదని తెలిపారు. పాదచారులు రోడ్లు దాటడానికి సురక్షితమైన, సౌకర్యవంతమైన సదుపాయాలు పెలికాన్ సిగ్నల్ ద్వారా అందుబాటులోకి వచ్చిందన్నారు. పెలికాన్ సిగ్నల్ సిస్టమ్ హైదరాబాద్‌లో రోడ్డు ప్రమాదాల సంఖ్యను గణనీయంగా తగ్గించడంలో సహాయపడనుందని అడిషనల్ డీసీపీ ట్రాఫిక్ వేణుగోపాల్ రెడ్డి తెలిపారు. ఈ కార్యక్రమంలో బాలానగర్ ట్రాఫిక్ ఏసీపీ శ్రీనివాసులు, బాలానగర్ ట్రాఫిక్ ఇన్స్పెక్టర్ నరహరి, కూకట్ పల్లి ట్రాఫిక్ ఇన్స్పెక్టర్ నరేష్ ఇతర సిబ్బంది పాల్గొన్నారు.

పార్కులను అన్ని హంగులతో సుందరీకరిస్తాం : కార్పొరేటర్

నవతెలంగాణ-కేపీహెచ్‌బీ



పార్కులను అన్ని హంగులతో సుందరికరిస్తామని కేపీహెచ్‌బీ డివిజన్ కార్పొరేటర్ మందడి శ్రీనివాస్ రావు అన్నారు. డివిజన్ పరిధిలోని కేపీహెచ్‌బీ కాలనీ 9వ ఫేజ్ లో జరుగుతున్న పార్కు అభివృద్ధి పనులను కార్పొరేటర్ మందడి శ్రీనివాస్ రావు, మూసాపేట సర్కిల్ ఉప కమిషనర్ ఎ.రమేష్ లు పర్యటించి పరిశీలించారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ మాట్లాడుతూ పార్క్ పరిసర ప్రాంతాల్లో చెత్తాచెదారం లేకుండా చేయాలన్నారు. అభివృద్ధి పనులను వేగవంతం చేయాలని సూచించారు. పనులలో జాప్యం వహించకుండ త్వరితగతిన పూర్తి చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎస్ఆర్పీ శ్రీనివాస్, రాంకీ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

ప్రజలకు సేవచేసేందుకు రాందేవ్ ఆస్పత్రి మరో అడుగు

నవతెలంగాణ-కేపీహెచ్‌బీ



ప్రజలకు సేవ అందించేందుకు రాందేవ్ ఆస్పత్రి మరో అడుగు ముందుకు వేసింది. కూకట్‌పల్లి లోని రాందేవ్ రావ్ హాస్పిటల్ 15వ వార్షికోత్సవం సందర్భంగా సర్వేకల్ క్యాన్సర్ (గర్భాశయ ముఖద్వారానికి వచ్చే) క్యాన్సర్‌ను అరికట్టేందుకు అతి తక్కువ ధరల్లో (4000) రూ.1000 వ్యాక్సిన్ ప్రారంభోత్సవానికి విక్రమ్ దేవ్ రావు, మీరా రావులు పాల్గొని శుక్రవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా డాక్టర్ ఛాయాదేవి మాట్లాడుతూ ఈ వ్యాక్సిన్ను కూకట్ పల్లి, పరిసర ప్రాంతాల ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు. ఈ వ్యాక్సిన్ తీసుకున్నందువలన గర్భాశయ ముఖ ద్వార క్యాన్సర్‌ను పూర్తిగా నిర్మూలించవచ్చుని తెలిపారు. డాక్టర్ భవానీ దివ్య పిల్లల వైద్య నిపుణురాలు మాట్లాడుతూ ప్రతి శనివారం హాస్పిటల్ ఆవరణలో మూడో అంతస్తులో ఓడీపీ వద్ద కార్యక్రమం జరుగుతుందన్నారు. వ్యాక్సిన్ తీసుకున్న తర్వాత గంట వైద్యుల పర్యవేక్షణలో ఉండాలని సూచించారు. ఈ కార్యక్రమాన్ని ముందుకు తీసుకెళ్లడానికి అంగీకరించిన రాందేవ్ రావ్ ఆస్పత్రి యాజమాన్యానికి అభినందనలు కృతజ్ఞతలు తెలిపారు. డాక్టర్ కమలాకర్ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో ఆసుపత్రి సీఈఓ ఎస్. యోబు, హాస్పిటల్ డాక్టర్లు , నర్సులు, హాస్పిటల్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

కేబీఆర్ పార్కు అభివృద్ధికి చర్యలు తీసుకోవాలి

- జీహెచ్ఎంసీ కమిషనర్ రోనాల్డ్ రోస్
- కేబీఆర్ పార్కును సందర్శించిన కమిషనర్



నవతెలంగాణ-సిటీబ్యూరో

కేబీఆర్ పార్కు అభివృద్ధికి చర్యలు తీసుకోవాలని జీహెచ్ఎంసీ కమిషనర్ రోనాల్డ్ రోస్ అధికారులను ఆదేశించారు. శుక్రవారం కేబీఆర్ పార్కును సందర్శించిన కమిషనర్ పార్క్ మొత్తాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా కమిషనర్ వాకర్స్‌తో మాట్లాడారు. పార్కులో కావాల్సిన సౌకర్యాలు, వసతులను అడిగి తెలుసు కున్నారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ వాకర్స్ సూచి ంచిన విధంగా పనులను వెంటనే చేపట్టేందుకు తగిన చర్యలు తీసుకోవాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. ముఖ్యంగా వాకింగ్ ట్రాక్ మరమ్మత్తులు, మురుగు నీరు రాకుండా చేయాలని, వర్షపు నీరు బయటికి పోకుండా ఇంకుడు గుంతలు ఏర్పాటు చేయాలని తెలిపారు. గ్రీనరీ, ఇతరత్ర వేస్ట్‌ను వేర్వేరు చేసి కంపోస్ట్ చేసే విధంగా చర్యలు తీసుకోవాలని యూబీడీ, ఇంజనీరింగ్ అధికారులను ఆదేశించారు. పార్క్‌లో అవసరమైన స్ట్రీట్ లైట్‌లు ఏర్పాటు చేయాలన్నారు. కమిషనర్ వెంట ఖైరతా బాద్ జోనల్ కమిషనర్ వెంకటేష్ దొత్రే, యూబీడీ అదనపు కమిషనర్ వి.కృష్ణ, డైరెక్టర్ శ్రీనివాస్, డిప్యూటీ కమిషనర్ ప్రశాంతి పాల్గొన్నారు.

ఓటరు జాబితా తయారీకి ప్రత్యేక క్యాంపెయిన్ : జిల్లా ఎన్నికల అధికారి రోనాల్డ్ రోస్

పటిష్టమైన ఓటరు జాబితా తయారీలో భాగంగా ఈ నెల 26, 27, సెప్టెంబర్ 2, 3 తేదీల్లో ప్రత్యేక క్యాంపెయిన్ నిర్వహించ నున్నట్టు హైదరాబాద్ జిల్లా ఎన్నికల అధికారి, జీహెచ్ఎంసీ కమిషనర్ రోనాల్డ్ రోస్ ఒక ప్రకటనలో తెలిపారు. స్పెషల్ సమ్మరీ రివిజన్ కార్యక్రమంలో భాగంగా 18 సంవత్సరాలు నిండిన వారందరూ, ఇప్పటి జాబితాలో పేరు నమోదు కాని వారు, 1 అక్టోబర్ 2023 నాటికి 18 సంవత్సరాలు నిండబోయే వారు కూడా ఓటరు నమోదుకు అర్హులని కమిషనర్ తెలిపారు. ఈ ప్రత్యేక క్యాంపెయిన్ సందర్భంగా ఇటీవల విడుదల చేసిన ముసాయిదా ఓటరు జాబితా మీ సమీపంలోని పోలింగ్ బూత్‌లో బీఎల్ఓ వద్ద ఉంటుందని, జాబితాలో మీ పేరు ఉందో లేదో, ఉ న్నా ఏమైనా తప్పులు ఉన్న అక్కడికక్కడే పరిష్కరించుకోవచ్చని పేర్కొన్నారు. నూతన ఓటరు నమోదు, ఫారం-6 ద్వారా, ఓటరు జాబితాలో మార్పులు చేర్పుల కోసం ఫారం-8 ద్వారా ఆఫ్ లైన్ అయితే మీ దగ్గరలో ఉన్న పోలింగ్ బూత్ వద్ద బూత్ లెవెల్ అధికారి ఈ నెల 26, 27 తేదీల్లో వచ్చే నెల 2, 3 తేదీల్లో నిర్వహించే ప్రత్యేక క్యాంపెయిన్ ఉదయం 10.30 నుంచి సా యంత్రం 5 గంటల వరకు అందుబాటులో ఉంటారని తెలిపారు. ఆన్‌లైన్‌లో 'ఓటర్స్.ఈసీఐ.జీఓవీ.ఇన్' 'ఓటర్ హెల్ప్‌లై న్' మొబైల్ యాప్‌ను డౌన్ లోడ్ చేసుకొని ఫారం-6ను నింపి నూతన ఓటరుగా నమోదు, ఫారం-8 ద్వారా ఓటరు జాబితాలో సవరణ లు చేసుకోవచ్చున్నారు. వారి వారి పోలింగ్ స్టేషన్‌ల దగ్గర ప్రత్యేక క్యాంపెయిన్‌లో బీఎల్ఓలు తప్పని సరిగా హాజరై అవసరమైన ఫారాలు సిద్ధంగా ఉంచుకోవాలన్నారు. బూత్ స్థాయి అధికారి హాజరు కాని పక్షంలో క్రమ శిక్షణ చర్యలు తీసుకోవాలని నియోజక వర్గం ఈఆర్.ఓలను ఆదేశించారు. పూర్తి వివరాలకు, ఇతర సందేహాలకు ఎన్నికల సంఘం టోల్ ఫ్రీ నెంబర్ 1950 ఉదయం 10.30 నుంచి సాయంత్రం 5 గంటలకు సంప్రదించవచ్చని తెలిపారు. ఈ అవకాశాన్ని ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకో వాలని రోనాల్డ్ రోస్ తెలిపారు.



మల్కాజిగిరి మండల డిప్యూటీ తాసిల్దార్‌గా ఎం.రోజా గురువారం బాధ్యతలు స్వీకరించారు. ఇక్కడ పని చేసిన తాసిల్దారు బదిలీ అయ్యారు. ఉప్పల్ నుండి డిప్యూటీగా వచ్చిన ఎం.రోజా మాట్లాడుతూ తన బాధ్యతల ను సక్రమంగా నిర్వహించి ప్రజలకు అందుబాటులో ఉంటానని తెలిపారు. నవతెలంగాణ-దుండిగల్

చెరువులో ఈతకు వెళ్లి ఇద్దరు మృతి

నవతెలంగాణ-దుండిగల్

చెరువులో స్నానానికి వెళ్లిన ఇద్దరు వ్యక్తులు నీట మునిగి మృతి చెందిన సంఘటన బాచుపల్లి పోలీస్ స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం ఢిల్లీ ప్రాంతానికి చెందిన ఇద్దరు వ్యక్తులు రాజు(35) ప్రకాష్ (45) లు పొట్ట కూటి కోసం హైదరాబాద్‌కు వలస వచ్చి నిజాంపేట్ మున్సిపల్ కార్పొరేషన్ బాచుపల్లి పరిధిలోని ఇందిరానగర్ లో. నివాసముంటున్నారు. వారు గణపతి విగ్రహాలు తయారీ చేస్తూ వాటిని అమ్ముకొని ఉపాధి కొనసాగిస్తున్నారు. గురువారం సాయంత్రం బాచుపల్లి బైరోని చెరువులో ఈతకు వెళ్లిన ప్రకాష్, రాజు లు ఆ.. స్నానం కోసం లోనికి వెళ్లి నీట మునిగి మృతి చెందారు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు బాచుపల్లి పోలీసులు వెంటనే గాలింపు చర్యలు చేపట్టారు. శుక్రవారం ప్రకాష్, రాజుల మృతదేహాలు బయటపడడంతో వెంటనే పోస్ట్ మార్టం నిమిత్తం మృతదేహాలను పోలీసులు గాంధీ ఆస్పత్రికి తరలించారు. కేసు నమోదు చేసుకున్న పోలీసులు దర్యాప్తు కొనసాగిస్తున్నట్టు తెలిపారు.

ముషీరాబాద్ నుంచి నగేష్ ముదిరాజ్ దరఖాస్తు

నవతెలంగాణ-సిటీబ్యూరో



రానున్న అసెంబ్లీ ఎన్నికల్లో పోటీ చేసేందుకు కాంగ్రెస్ పార్టీ ముషీరాబాద్ అసెంబ్లీ నియోజకవర్గం టికెట్ కోరుతూ శుక్రవారం గాంధీభవన్‌లో నగేష్ ముదిరాజ్ దరఖాస్తు సమర్పించారు. ఈ సందర్భంగా నగేష్ ముదిరాజ్ మాట్లాడుతూ 29 ఏండ్ల నుంచి పార్టీకి కట్టుబడి పనిచేస్తున్నానని, పార్టీకి విధేయతగా ఉన్నానని గుర్తుచేశారు. యూత్ కాంగ్రెస్‌లో ప్రధాన కార్యదర్శిగా, ఉమ్మడి రాష్ట్రంలో సెక్రటరీగా, తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన తరువాత ప్రధాన కార్యదర్శిగా 6ఏండ్లుగా కొనసాగుతున్నానని తెలిపారు. ఈసారి టికెట్ తప్పకుండా తనకే వస్తుందని నగేష్ ముదిరాజ్ ఆశాభావం వ్యక్తం చేశారు.

ఆంకాలజీ నర్సులకు ప్రత్యేక నైపుణ్యత అవసరం

- బసవతారకం ఆస్పత్రి చైర్మెన్ నందమూరి బాలకష్ణ
- అడ్వాన్స్ ఆంకాలజీ నర్సింగ్‌పై జాతీయ సింపోజియమ్



నవతెలంగాణ-బంజారాహిల్స్

ఆంకాలజీ నర్సులకు ప్రత్యేక నైపుణ్యత అవసరమని బసవతారకం ఆస్పత్రి చైర్మెన్ నందమూరి బాలకష్ణ అన్నారు. బసవ తారకం ఇండో అమెరికన్ క్యాన్సర్ హాస్పిటల్, రీసెర్చి ఇన్స్టిట్యూట్, ఆంకాలజీ నర్సెస్ అసోసియేషన్ ఆఫ్ ఇండియా వారు సంయుక్తంగా రెండు రోజుల పాటూ అడ్వాన్స్ ఆంకాలజీ నర్సింగ్ సింపోజియం ను నిర్వహించారు. బంజారా హిల్స్‌లోని రోడ్ నెం 10లో గల కొమరం భీం ఆదివాసి భవన్‌లో జరుగుతున్న రెండు రోజుల సింపోజియంలో భాగంగా శుక్రవారం ఉదయం జరిగిన ప్రత్యేక కార్యక్రమాన్ని ముఖ్య అతిథిగా హాజరైన నందమూరి బాలకష్ణ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మానవత్వానికి మారు పేరుగా నిలిచే నర్సింగ్ వృత్తిని ఎంచుకొన్న వారిని ప్రత్యేకంగా అభినందించారు. ప్రతి ప్రొఫెషన్‌లో ఉన్నట్లే నర్సింగ్‌లో కూడా ప్రతి రోజూ సరికొత్త పద్ధతులు, ఆధునిక సాంకేతక పరిజ్ఞానం అందుబాటులోకి వస్తోందని ఇలా అందుబా టులోనికి వస్తున్న నూతన అంశాలను నేర్చుకోవాల్సిన అవసరం ఉంటుందని చెప్పారు. ఎంతో భాదలో ఉండే రోగులకు అత్యంత దగ్గరగా ఉంటూ సేవలు అందించే భాగ్యం నర్సులకు దొరుకుతుం దన్నారు.క్యాన్సర్ రోగులు ముఖ్యంగా జీవిత చివరి దశలో ఉన్న వారికి సేవలు అందించడానికి ఎంతో సహనం, ప్రేమ చూపించ గలగాలని చెప్పారు. బసవతారకం ఇండో అమెరికన్ క్యాన్సర్ హాస్పిటల్ వారు స్థాపించిన నాటి నుంచే నైపుణ్యం కలిగిన నర్సింగ్ సిబ్బంది తయారు చేసుకోవాల్సిన అవసరం గుర్తించిందని, తదనుగుణంగానే నర్సింగ్ కాలేజి, నర్సింగ్ స్కూలు ఏర్పాటు చేశామని చెప్పారు. తద్వారా అత్యంత తక్కువ ధరలలోనే అంతర్జాతీయ స్థాయిలో క్యాన్సర్ రోగులకు సేవలు అందించడానికి వీలు కలిగిందని తెలిపారు.

రెండు రోజుల పాటూ నిర్వహిస్తున్న ఈ సదస్సులో ఆంకాలజీ నర్సింగ్‌కు సంబంధించిన పలు అంశాలపై చర్చించడమే కాకుండా అందుబాటులోనికి వస్తున్న ఆధునిక పద్ధతులపై శిక్షణ ఇవ్వనున్నారు. తెలంగాణలోని పలు వైద్య శాలలు, వైద్య కళాశాలలు, నర్సింగ్ కాలేజీలు, నర్సింగ్ స్కూల్స్ నుండి వచ్చిన వందలాది నర్సింగ్ సిబ్బంది ఈ కార్యక్రమంలో బీఐఏసీహెచ్ అండ్ ఆర్ఐ సీఈఓ డా. ఆర్ వి ప్రభాకర రావు, మెడికల్ డైరెక్టర్ డా. టియస్ రావు, అసోసియేట్ డైరెక్టర్ డా. కల్పనా రఘునాథ్, అకడమిక్స్, యాడ్ లైఫ్ నాగమణి వైద్యులు, సిబ్బంది పాల్గొన్నారు.



స్క్రాప్ వ్యాపారం చేసేవారు జాగ్రత్తలు తీసుకోవాలి

- చిక్కడపల్లి ఏసీపీ యాదగిరి

నవతెలంగాణ-ముషీరాబాద్

ముషీరాబాద్ నియోజకవర్గంలో భోలక్ పూర్ డివిజన్‌లో స్క్రాప్ వ్యాపారం చేసే వారు ప్రత్యేక జాగ్రత్తలు తీసుకోవాలని చిక్కడపల్లి ఏసీపీ యాదగిరి తెలిపారు. శుక్రవారం నియోజకవర్గంలోని అంజుమాన్ ఫంక్షన్ హాల్‌లో అంజుమాన్ కమిటీ ఆధ్వర్యంలో భోలక్‌పూర్‌లో స్క్రాప్, తోళ్ల వ్యాపారం నిర్వహిస్తున్న వ్యాపారస్తులతో ముషీరాబాద్ పోలీస్ స్టేషన్ ఇన్‌స్పెక్టర్ జహంగీర్ యాదవ్ సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి ఏసీపీ హాజరై మాట్లాడుతూ నియోజకవర్గంలో స్క్రాప్ వ్యాపారం చేసేవారు సరైన జాగ్రత్తలు తీసుకోకపోవడం వల్ల భారీ ప్రమాదాలు సంభవిస్తున్నాయన్నారు. ఇటీవల గాంధీ నగర్‌లో స్క్రాప్ గోడౌన్‌లో అగ్ని ప్రమాదం సంభవించి 11 మంది దుర్మరణం చెందారని తెలిపారు. కొన్ని స్క్రాప్ గోడౌన్‌లు పాఠశాలలకు అతి సమీపంలో ఉన్నాయన్నారు. ఒక సంవత్సర కాలంలోనే అనేక అగ్ని ప్రమాదాలు పేలుళు సంభవించాయని... అందువలన స్క్రాప్ వ్యాపారం చేసేవారు ప్రత్యేక జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. వ్యాపారస్తులు రోడ్లను ఆక్రమించి వ్యాపారం చేయడం వల్ల వాహనాల రాకపోకలకు ప్రజలకు తీవ్ర ఇబ్బందులు ఎదురవుతుందన్నారు. అర్ధరాత్రి వరకు వ్యాపారం నిర్వహించకూడదని రాత్రిలు రోడ్లపై తిరగడం అసాంఘిక కార్యకలామాలకు పాల్పడడం చేస్తే ఎట్టి పరిస్థితిలో ఉపేక్షించేది లేదని హెచ్చరించారు. ప్రమాదకరమైన కెమికల్ డబ్బాలను ఎట్టి పరిస్థితిలో తెరవకూడదని తెలిపారు. ఈ కార్యక్రమంలో భోలక్‌పూర్ కార్పొరేటర్ గౌస్ ఉద్దీన్, అంజుమాన్ కమిటీ అధ్యక్షులు, ప్లాస్టిక్ కమిటీ అధ్యక్షులు రెహమాన్, వైస్ ప్రెసిడెంట్ జహీరుద్దీన్, జనరల్ సెక్రెటరీ నూర్, జాఫిర్, షర్ఫుద్దీన్ తదితర నాయకులు పాల్గొన్నారు.

సమస్యలు పరిష్కరించకుంటే త్వరలో వైద్య గర్జన



- ప్రభుత్వ వైద్యుల సంఘాన్ని చర్చలకు పిలవాలి
- తెలంగాణ ప్రభుత్వ వైద్యుల సంఘం నాయకులు డాక్టర్ పల్లం ప్రవీణ్ కుమార్, డాక్టర్ బొంగు రమేష్
- వైద్యుల పెండింగ్ సమస్యలపై సమావేశం

నవతెలంగాణ -సుల్తాన్ బజార్

ప్రభుత్వ డాక్టర్‌ల దీర్ఘకాలంగా పెండింగ్‌లో ఉన్న వైద్యుల సమస్యలు పరిష్కరించాలని రాష్ట్ర ప్రభుత్వ వైద్యుల సంఘం నాయకులు డాక్టర్ పల్లం ప్రవీణ్ కుమార్, డాక్టర్ బొంగు రమేష్ లు డిమాండ్ చేశారు. కోఠి ఉస్మానియా మెడికల్ కళాశాల ఆవరణలోని అల్యూమిని ఆడిటోరియంలో శుక్రవారం డిఎం ఈ. టీవీ వీపి. డీపీహెచ్, ఈఎస్ఐ వైద్యుల పెండింగ్ సమస్యలపై సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో వారు మాట్లాడుతూ...వైద్య ఆరోగ్య శాఖ పరిధిలో వైద్య విధాన పరిషత్‌లో పనిచేసే వైద్యులను, సిబ్బందిని ప్రభుత్వంలో విలీనం చేసి వారికి ట్రెజరీ ద్వారా వేతనాలు అందించాలని డిమాండ్ చేశారు. వైద్య విధాన పరిషత్ లో పనిచేసే ఉద్యోగులకు హెల్త్ కార్డులు లేకపోవడం దారుణమన్నారు. మెడికల్ కళాశాలలో పనిచేసే వైద్యులకు 2016 పి.ఆర్సి ఏరియల్స్ బకాయిలు వెంటనే విడుదల చేయాలని కోరారు. ఆరు నెలలుగా పీఆర్సి ఏరియల్ చెల్లించకుండా ఫైల్ పెండింగ్‌లో పెట్టడం సబబు కాదని అన్నారు. రూరల్ మెడికల్ కళాశాలల్లో పనిచేస్తున్న బోధన వైద్యులకు రూరల్ అలవెన్సులు వెంటనే విడుదల చేయాలని అన్నారు. తెలంగాణ ఉద్యమంలో కీలక భూమిక పోషించిన ప్రభుత్వ వైద్యుల సంఘాన్ని చర్చలకు పిలిచి సమస్యలు సత్వరమే పరిష్కరించాలని డిమాండ్ చేశారు. డాక్టర్ల పట్ల ప్రభుత్వ నిర్లక్ష్య వైఖరిని విడనాడాలని అన్నారు. డి.హెచ్ పరిధిలో టైం బౌండ్ ప్రమోషన్లను వెంటనే కల్పించాలని సీనియారిటీ ప్రాతిపదికన జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారులను 33 జిల్లాలకు తీసుకోవాలని, ఎడిషనల్ డి.ఎం.హెచ్.ఓ పోస్టులను డి.ఎం.హెచ్.ఓ లుగా మార్చుతూ విడుదల చేసిన జీవోని వెంటనే వెనక్కు తీసుకోవాలని, వారి స్థానంలో సీనియారిటీ ప్రాతిపదికన నింపాలని డిమాండ్ చేశారు. ఎస్. పి. ఎం పూర్తి చేసిన వారికి ఆ పోస్టులు లేటరల్ ఎంట్రీ ద్వారా ఇవ్వడానికి వీలు లేదని వారిని జిల్లాలలో ఉన్న డీ.ఎస్.ఓ (ఐ.డి.యస్.పి) లుగా నియమించాలని డిమాండ్ చేశారు.

2016 పీఆర్సి వేతన బకాయిలు 2023 వరకు వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేశారు. రూరల్ మెడికల్ కళాశాలల్లో బోధన వైద్యులకు రూరల్ అలవెన్స్, మెడికల్ కళాశాలలో తగిన వసతులు కల్పించాలన్నారు వైద్య విధాన పరిషత్ వైద్యులు కు వైద్య సిబ్బందికి 010 ద్వారా ట్రెజరీ వేతనాలు ఇవ్వాలని కోరారు. నూతన డీసీహెచ్ఎస్ పోస్టులు 33 జిల్లాలకు ఇవ్వాలని డిమాండ్ చేశారు.డైరెక్టరేట్ ఆఫ్ పబ్లిక్ హెల్త్ పరిధిలోని వైద్యులకు ప్రమోషన్లు కల్పించాలన్నారు. ఆరు సంవత్సరాలు పూర్తి చేసుకున్న వారికి డిసిగ్నేటెడ్ డిప్యూటీ సివిల్ సర్జన్, 12 సంవత్సరాలు పూర్తి చేసుకున్న వారికి డిసిగ్నేటెడ్ సివిల్ సర్జన్లుగా హోదా కల్పించి అన్ని జిల్లాలకు సీనియారిటీ ప్రాతిపదికన రెగ్యులర్ డిఎంహెచ్ఓల నియామకం చేయాలని కోరారు.కొత్త గా నియామకం చేసిన ఐదు డి.ఎం.హెచ్.ఓ పోస్టులను జోనల్ పరిధిలో కాకుండా జిల్లా కలెక్టర్ పరిధిలో ఉంచాలని అన్నారు. వాటిని సీనియార్టీ ప్రకారం భర్తీ చేయాలి అన్నారు. ఆరోగ్య మహిళ చేస్తున్న మహిళా వైద్యులకు ప్రత్యేక గౌరవ పారితోషకం ఇవ్వాలన్నారు. కాంట్రాక్టు వైద్యులుగా పనిచేస్తున్న వారిని రెగ్యులర్ చేయాలని కోరారు పల్లె దవాఖానాలలో ఉన్న వైద్యుల కనీస వేతనాన్ని 60 వేలకు పెంచాలని ప్రభుత్వాన్ని కోరారు. సమస్యలు పరిష్కరించకుంటే వైద్య ఆరోగ్యశాఖలోని అన్ని సంఘాలు కలిసి త్వరలో వైద్య గర్జన నిర్వహిస్తామని ప్రభుత్వాన్ని హెచ్చరించారు. ప్రతినిధులు డాక్టర్ పల్లం ప్రవీణ్, డాక్టర్ బొంగు రమేష్, డాక్టర్ లాలూ ప్రసాద్ రాథోడ్, డాక్టర్ నరహరి, డాక్టర్ కళ్యాణ్ చక్రవర్తి , డాక్టర్ అజ్మీరా రంగ, డాక్టర్ ఉమా కాంత్ , డాక్టర్ రాజు, డాక్టర్ వినోద్ , డాక్టర్ శ్రీనివాస్, డాక్టర్ శేఖర్, డాక్టర్ భూపేందర్ , డాక్టర్ రవి , డాక్టర్ రమేష్, డాక్టర్ అబ్బయ్య , డాక్టర్ వసంత్ తదితరులు ఉన్నారు.



సనత్‌నగర్ అభ్యర్థిగా అవకాశం కల్పించండి

- కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు నాగేందర్ రాజ్

నవతెలంగాణ-సిటీబ్యూరో

వచ్చే శాసనసభ ఎన్నికల్లో పోటీ చేసేందుకు కాంగ్రెస్ పార్టీ సనత్ నగర్ అభ్యర్థిగా పోటీ చేసే అవకాశం కల్పించాలని ఆ పార్టీ సీనియర్ నాయకులు నాగేందర్ రాజ్ అధిష్టానాన్ని విజ్ఞప్తి చేశారు. ఈమేరకు శుక్రవారం సనత్ నగర్ అసెంబ్లీ నియోజకవర్గం టికెట్ కోరుతూ గాంధీభవన్‌లో నాగేందర్ రాజ్ దరఖాస్తు సమర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ తనకు అవకాశం కల్పిస్తుందని ఆశాభావం వ్యక్తం చేశారు.



రవీంద్రుని కవిత్వం అజరామరం

నవతెలంగాణ-సిటీబ్యూరో

తెలంగాణ మట్టికి అమోఘమైన శక్తి ఉందని, ఈ మట్టి నుంచి ఎందరెందరో జీవకవిత్వాన్ని రాసిన జీవకవులు ఉద్భవించారని పలువురు వక్తలు పేర్కొన్నారు.రవీంద్రభారతి సమావేశ మందిరంలో శుక్రవారం విశ్వకవి రవీంద్రనాథ ఠాగూర్ విరచిత గీతాంజలి కావ్యాన్ని"రఘువర్మ", డా.టి.లక్ష్మీనారాయణ అనువదించిన స్వేచ్ఛానువాద గ్రంథాన్ని బీ.సీ సంక్షేమశాఖ ముఖ్య కార్యదర్శి బుర్రావెంకటేశం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సమాజంలో లక్షలాది కవులు రావాలని, సాహిత్య అకాడమీ అందుకు పనిచే యాలని, కవులు సామాజిక చైతన్యానికి అవసరమైన ఆలోచనలు అందిస్తారని చెప్పారు.

రఘువర్మ విశ్వకవి రవీంద్రుని గీతాంజలిని తెలుగులో అనువదించడం తెలుగు సాహిత్యంలో చాలా గొప్ప విషయమని తెలంగాణ సాహిత్య అకాడమీ చైర్మన్ జూలూరు గౌరీశంకర్ అన్నారు. విశిష్టఅతిథిగా హాజరైన తెలంగాణ గ్రంథాలయ పరిషద్ చైర్మన్ డా. అయాచితం శ్రీధర్ మాట్లాడుతూ అనువాదాల ప్రాశస్త్యం గురించి చెప్పారు. ఈ సభకు ప్రత్యేక అతిథిగా హాజరైన ముఖ్యమంత్రి కార్యాలయం ఓఎస్‌డీ డా. టి. గంగాధర్ మాట్లాడుతూ తాను చిన్నప్పటి నుంచి రఘువర్మను చూస్తున్నానని రచనలు చేస్తూ, చిత్రలేఖనం చేస్తూ బాల్యం నుంచి తనకు ఒక స్ఫూర్తిగా ఉండేవారని చెప్పారు. సభ కవి యాకూబ్ స్వాగతోపన్యాసంతో ప్రారంభమయ్యింది. రచయిత రఘువర్మ మాట్లాడుతూ పుస్తక ప్రచురణకు తోడ్పాటు అందించిన జూలూరు గౌరీశంకర్, డా. గంగాధర్, సాహిత్య అకాడమీ కార్యదర్శి డా.నామోజు బాలాచారి తదితరులకు ధన్యవాదాలు తెలియజేశారు.డా.నామోజు బాలాచారి సభానిర్వహణ బాధ్యతను నిర్వర్తించారు. తెలంగాణ బుక్ అకాడమీ కి చెందిన కోయా చంద్రమోహన్, డా. నారా కిశోర్, రఘువర్మ మిత్రులు తదితరులు పాల్గన్నారు.

జ్ఞాన సరస్వతి దేవికి నూతన ఆభరణాలు

నవతెలంగాణ-కల్చరల్



శ్రావణ వరలక్ష్మి వ్రతం పురస్కరించుకొని ముషీరాబాద్ వద్ద నున్న శృంగేరి పీఠ జ్ఞాన సరస్వతి ఆలయానికి శుక్రవారం భక్తులు అసంఖ్యాకంగా దేవి దర్శనానికి వచ్చారు. ఆలయ దర్మాధికారి కళా జనార్ధన మూర్తి పలువురు భక్తుల సహకారంతో రూపొందించిన దేవి కి స్వర్ణ ముఖం, రజిత జడ, రజిత వస్త్రం, ధార పాత్రతో పాటు రెండు వెండి ఏనుగుల ను అర్చకులకు అందజేసి అలంకరింప జేశారు.ఈ సందర్భం ఆయన మాట్లాడుతూ భక్తులు తమకు తోచిన రీతిలో అలంకారానికి సహకరించారని తెలిపారు శృంగేరి పీఠాధిపతి భారతీ తీర్థ స్వామి, విదుశేఖర భారతిస్వామి ఆశీస్సులు తో దేవాలయాన్ని మరింత అభివృద్ధి చేసి భక్తులకు సదుపాయాలు కల్పిస్తామని చెప్పారు.ఈ కార్యక్రమంలో జ్వాల నరసింహేశ్వర్ వైకుంతం, పిరాట్ల కామేశ్వరమ్మ, బండి శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు

విద్యాశాఖలో కారుణ్య నియామకాలు



- టీఎన్జీవో జిల్లా నాయకులకు సన్మానం

నవతెలంగాణ-సిటీబ్యూరో

హైదరాబాద్ జిల్లా విద్యాశాఖలో కొత్తగా 13మందికి కారుణ్య నియామకం ద్వారా ఉద్యోగం కల్పించారు. ప్రభుత్వ ఆదేశాల మేరకు విధి నిర్వహణలో, ఇతర అనారోగ్య కారణాల వల్ల మరణించిన వారి కుటుంబ సభ్యులకు కారుణ్య నియామకాల కింద నియమించేం దుకుగాను డీఈవో ఆర్.రోహిణి, ఏడీ శ్రీనివాస్ రెడ్డి, సూపరిటెండెంట్ జి.రాజ్‌కుమార్, సీనియర్ అసిస్టెంట్ ఖాజా సోహెల్ అహ్మద్ మొత్తం 13మందికి సంబంధిం చిన కారుణ్య నియామక ప్రతిపాదనను కలెక్టర్ అనుదీప్ దురిశెట్టికి పంపగా ఆయన ఆమోదం తెలిపారు. కొత్తగా 34 మంది జూనియర్ అసిస్టెంట్‌లను విద్యాశాఖకు కేటాయించారు. ఉద్యోగంలో మరణించిన వారి కటుంబ సభ్యులకు కారుణ్య నియామకాల కింద అవకాశం కల్పించే విషయంలో టీఎన్జీవో రాష్ట్ర అధ్యక్ష, కార్యదర్శుల మామిళ్ల రాజేందర్, జగదీష్‌తో పాటు జిల్లా అధ్యక్షుడు ఎస్.ఎం. హుస్సేని(ముజీబ్) ఎంతో కృషి చేశారు. ఈ సందర్భంగా అధ్యక్షుడు ముజీబ్, కార్యదర్శి విక్రమ్ కుమార్, సహాధ్యక్షుడు, స్కూల్ ఎడ్యుకేషన్ యూనిట్ అధ్యక్షుడు కె.ఆర్.రాజ్‌కుమార్‌లను శుక్రవారం జిల్లా కార్యవర్గం సమక్షంలో వారంతా బొకే అందించి ఘనంగా సన్మానించి వారికి కృతజ్ఞతలు తెలిపారు. ఉపాధ్యక్షులు కె.శ్రీనివాస్, జాయింట్ సెక్రటరీ ఖలీద్ అహ్మద్, ఈసీ శంకర్, ముఖీద్, ఎం.ఏ ముజీబ్, స్కూల్ ఎడ్యుకేషన్ కార్యదర్శి ఎం.భాస్కర్, ఎం.రవి, తదితరులు పాల్గొన్నారు.

నటి కృష్ణవేణికి జమున వంశీ జీవిత సాఫల్య పురస్కారం

నవతెలంగాణ-కల్చరల్



అలనాటి సినీ నటి నిర్మాత కృష్ణవేణికి ప్రముఖ నటి జమునా రమణా రావు జీవిత సాఫల్య పురస్కారం వంశీ సంస్థల పక్షాన బహుకరిస్తున్నట్టు వంశీ రామ రాజు, జమున కుమార్తె స్రవంతి జూలూరి, మనుమడు అవిష్ తో కలసి పత్రికా విలేకరులకు తెలిపారు. వయస్సు రీత్యా కృష్ణవేణి బహిరంగ సభలకు రాలేనందున ఈ నెల 27 న ఫిల్మ్ నగర్ లోని ఆమె స్వగృహంలో పురస్కారం అందజేస్తామని ప్రముఖ దర్శకుడు రేలంగి నరసింహారావు, నిర్మాత రామ సత్యనారాయణ అతిథులుగా పాల్గొంటారని వారు చెప్పారు

మహారాజశ్రీ జిల్లా ప్రధాన న్యాయస్థానం
స్థలం : నల్లగొండ(జిల్లా కోర్టు)
IA.NO. : 298 / 2023
IN
AS.NO. 3 / 2021
(కోర్టు వారి అనుమతితో)
పిటిషన్ తరపు న్యాయవాది
మహ్మద్ షౌకత్అలీ,
అడ్వకేట్, దేవరకొండ,
నల్లగొండ జిల్లా.
సెల్: 9640204764.
9440885683.

పేదల ఆరోగ్యానికి ప్రభుత్వం పెద్దపీట : దూసరి శ్రీనివాస్‌గౌడ్



నవతెలంగాణ-అంబర్‌పేట

పేదల ఆరోగ్యానికి తెలంగాణ ప్రభుత్వం కృషి చేస్తుందని బీఆర్‌ఎస్ సీనియర్ నాయకులు దూసరి శ్రీనివాస్ గౌడ్ అన్నారు. శుక్రవారం గోల్నాక డివిజన్ పరిధిలోని శంకర్ నగర్ లో కార్పొరేటర్ క్యాంపు కార్యాలయంలో బాగ్ అంబర్ పేట డివిజన్ చెందిన అపర్ణ యాదవ్‌కు మంత్రి హరీష్‌రావు సహకారంతో మంజూరైన రూ.53 వేల చెక్కును కుటుంబ సభ్యులకు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పేద, మధ్య తరగతి ప్రజలకు సీఎం రిలీఫ్ ఫండ్ వరం లాంటిదని తెలిపారు. ఈ కార్యక్రమంలో శ్రీనివాస్ యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

సనత్‌నగర్ సీటుకు మర్రి ఆదిత్యరెడ్డి దరఖాస్తు



నవతెలంగాణ-బేగంపేట్

రానున్న అసెంబ్లీ ఎన్నికల్లో సనత్ నగర్ నియోజకవర్గం నుంచి కాంగ్రెస్ పార్టీ తరపున పోటీ చేసేందుకు ఎంసీఆర్‌ఎఫ్ ఛైర్మెన్, టీపీసీసీ సభ్యులు మర్రి ఆదిత్యరెడ్డి దరఖాస్తు సమర్పించారు. సనత్‌నగర్ కాంగ్రెస్ సీనియర్ నాయకులు, కార్యకర్తలతో కలిసి గాంధీభవన్ చేరుకొని దరఖాస్తును అందజేశారు. మర్రి ఆదిత్య రెడ్డి మాట్లాడుతూ..తాత మర్రి చెన్నారెడ్డి ప్రాతినిథ్యం వహించిన నియోజకవర్గం నుంచే బరిలోకి దిగి విజయం సాధిస్తానని, సనత్ నగర్ గడ్డపై కాంగ్రెస్ జెండాను ఎగురవేస్తానని ధీమా వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో ఎస్.విఠల్, త్రికాల మనోజ్, శైలేష్, నసీర్(అడ్డు), కృష్ణ యాదవ్, రమాదేవి, చక్రం ప్రభాస్, నర్సింహ్మా ఖాజా, రమ ణ, శివకుమార్ లాల్, సిద్ధిఖ్ ఖాన్, సాయి, ప్రవీణ్,ఎం.రాజు, ఎం.నవీన్ రాజు, గోవిందరాజు, వీఎస్ నారాయణ, శ్రీనివాస్ ముదిరాజ్, బి.రమేశ్, సి.సురేశ్, జగదీశ్, విలాస్, పాల్గొన్నారు.

ఉద్యోగులను మానసిక క్షోభకు గురిచేస్తున్నవారిపై
చర్యలు తీసుకోవాలి

- ట్రెజరీస్, పే అండ్ అకౌంట్స్ డైరెక్టర్‌కు డాక్టర్ ముజీబ్ విజ్ఞప్తి



నవతెలంగాణ-సిటీబ్యూరో

ట్రెజరీస్, పే అండ్ అకౌంట్స్ ఉద్యోగు లపైన పని ఒత్తిడి ఎక్కువయ్యిందని, కొందరు పనికట్టుకొని ఉద్యోగులను వేధిస్తూ.. అనామక పిటిషన్లు, ఫిర్యాదులతో వారిని మానసిక క్షోభకు గురి చేస్తున్నారని తెలంగాణ నాన్ గెజిటెడ్ అధికారుల సంఘం హైదరాబాద్ జిల్లా అధ్యక్షుడు డాక్టర్ ఎస్ ఎం హుస్సేనీ (ముజీబ్) మండిపడ్డారు. ఈ మేరకు శుక్రవారం ట్రెజరీస్ అండ్ అకౌంట్స్ డైరెక్టర్ కే.ఎస్.ఎన్ మూర్తిని కలిసి ఉద్యోగుల సమస్యలపై చర్చించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ అనవసరమైన ఫిర్యాదులను పట్టించుకోవద్దని, అలాంటి పనులు చేస్తున్నవారిపైన తక్షణమే చర్యలు తీసుకోవాలని కోరారు. అందుకు సానుకూలంగా స్పందించిన డైరెక్టర్ సదరు ఫిర్యాదులను తాను లెక్క చేయనని, ఉద్యోగులను వేధిస్తున్న వారిపైన తప్పనిసరిగా చర్యలు తీసుకుంటానని హామీ ఇచ్చారు. జిల్లా ఉపాధ్యక్షుడు పల్లేటి వరద రాజు, నాలుగవ తరగతి ఉద్యోగుల సంఘం రాష్ట్ర కార్యదర్శి ఖాదర్ బిన్ హస్సన్, యూనిట్ అధ్యక్షుడు రామి రెడ్డి పాల్గొన్నారు.

మనబస్తీ-మనబడి కార్యక్రమంతో
మారనున్న సర్కారు బడుల రూపురేఖలు

- అభివృద్ధి కోసం సుమారు రూ.2 కోట్లు మంజూరు



నవతెలంగాణ-బేగంపేట్

సనత్‌నగర్‌లోని పలు ప్రభుత్వ పాఠశాలలు కొత్త అందాలను రూపుదిద్దుకోనున్నాయి. మంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్ ప్రత్యేక కృషితో సనత్‌నగర్ డివిజన్‌లోని ప్రభుత్వ ప్రాథమిక, ఉన్నత పాఠశాలలతో పాటు ఉర్దూ మీడియం పాఠశాలల అభివృద్ధి, విద్యార్థులకు మౌలిక వసతుల కల్పన కోసం మనబస్తీ-మనబడి కార్యక్రమం క్రింద ప్రభుత్వం సుమారు రూ.2 కోట్లలను మంజూరు చేసిందని తెలిపారు. ఈ మేరకు మేడ్చల్ జిల్లా కలెక్టర్ ఉత్తర్వులను జారీ చేశారు. సెప్టెంబర్, 4వ తేదీన మంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్ ఈ పనులను ప్రారంభి.స్తారని తెలిపారు. సనత్ నగర్‌లోని అశోక్‌కాలనీలో గల ప్రభుత్వ పాఠశాలలలో ఈ నెల 5 వ తేదీన ఏర్పాటు చేసిన ఒక కార్యక్రమంలో మంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్ ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా విద్యార్థులు, పాఠశాల సిబ్బంది పలు సమస్యలను మంత్రి దృష్టికి తీసుకొచ్చారు. అన్ని సమస్యలు పరిష్కరిస్తామని, అభివృద్ధికి కృషి చేస్తానని హామీ ఇచ్చారు. ఇచ్చిన హామీ మేరకు మంత్రి సబితా ఇంద్రారెడ్డి ఒకే ఆవరణ లో ఉన్న ప్రాథమిక, ఉన్నత పాఠశాలలతో పాటు ఉర్దూ మీడియం పాఠశాలలను మన బస్తీ మన బడి కార్యక్రమం క్రింద అభివృద్ధి చేసేందుకు చర్యలు తీసుకుంటామని ప్రక టించారు. ఆ ఆదేశాలలో భాగంగా అధికారులు వివిధ అభివృద్ధి పనులు చేపట్టేందుకు అనుమతులను మంజూరు చేస్తూ ఆదేశాలు జారీ చేసినట్లు ఈ సందర్భంగా తెలియజేశారు.

ఆటో ట్రాలీల డ్రైవర్ల సమస్యలను పరిష్కరించాలి



- తెలంగాణ ప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ ప్రధాన కార్యదర్శి డాక్టర్ కోట నీలిమ

నవతెలంగాణ-బేగంపేట్

బేగంపేటలోని ఆటో ట్రాలీ డ్రైవర్ల సమస్యలను పరిష్కరించాలని తెలంగాణ ప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ ప్రధాన కార్యదర్శి డాక్టర్ కోట నీలిమ డిమాండ్ చేశారు. ఆటో ట్రాలీ డ్రైవర్లపై పోలీసుల వేధింపులు మానుకోవాలని హితవు పలికారు. బేగంపేటలోని ట్రాలీ ఆటో యూ నియన్ నాయకులతో శుక్రవారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా డ్రైవర్లు తమ సమస్యలను ఆమెకు విన్నవించారు పరిష్కారం కోసం కృషి చేయాలని విజ్ఞప్తి చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఎంతో కాలంగా ఆటో ట్రాలీ నడుపుకుంటూ జీవనం సాగిస్తున్న బడుగు బలహీనవర్గాల డ్రైవర్లను వేధించడం మానుకోవాలని, వారికి వాహనాలు నిలుపుకునే అందుకు స్థలం చూపిం చాలని కోరారు. పార్కింగ్ స్థలంలో ఇప్పుడు నో పార్కింగ్ బోర్డు పెట్టడం దారుణమని సూచించారు. పోలీసులు అధికారులు అలా ప్రవర్తించడంతో డ్రైవర్ మనుగడ ప్రశ్నార్థకంగా మారుతుందని ఆవేదన వ్యక్తం చేశారు. మాన వత దృక్పథంతో వారి సమస్యలను తక్షణమే పరిష్కరించాలని డిమాండ్ చేశారు. ఇదే అంశంపై ఆటో డ్రైవర్ల సమస్య పరిష్కారం కోసం వారిపై వేధింపులు తగ్గించడం కోసం కోర్టులో పిటిషన్ వేస్తామని ప్రకటించారు. అనం తరం ప్రకాష్ నగర్ తబేలాలోనిముస్లిం మైనారిటీ సోదరిమణులతో సమావేశం నిర్వహించారు. వారి సమస్యలను తెలుసుకున్నారు. తనను వచ్చే ఎన్నికల్లో గెలిపిస్తే ప్రకాష్‌నగర్‌లో షాదీ ఖానా నిర్మాణం చేస్తామని, అంతర్గత డ్రయినేజీ రోడ్లను ఆధునికరిస్తామని, అంగన్వాడి పాఠశాల నిర్మాణం చేస్తామని హామీ ఇచ్చారు.

పలు అభివృద్ధి నిర్మాణ పనులు ప్రారంభం



నవతెలంగాణ-ఓయూ

సికింద్రాబాద్ పరిధిలోని వివిధ ఫంక్షన్ హాల్స్‌ను పేద, మధ్య తరగతుల వారికీ అందుబాటులో నిలిచేలా తీర్చిదిద్దామని, పేదలు సైతం ఆత్మగౌ రవంతోకార్యక్రమాలను నిర్వహించేలా కృషి చేస్తున్నా మని డిప్యూటీ స్పీకర్ తీగుల్ల పద్మారావు గౌడ్ అన్నారు. సితాఫలమండీలోని మధురానగర్ కాలనీలో నిర్మించిన నూతన కమ్యూనిటీ హాల్‌లో రూ.50 లక్షల ఖర్చుతో చేపడుతున్న అదనపు అంతస్తుల నిర్మాణం పనులను, లైఫ్ స్ప్రింగ్ ఆస్పత్రి వద్ద వద్ద రూ.10 లక్షల ఖర్చుతో చేపడుతున్న మంచి నీటి పైప్‌లైన్ నిర్మాణం పనులను డిప్యూటీ స్పీకర్ పద్మా రావుగౌడ్ శుక్రవారం ప్రారంభించారు.ఆయన మాట్లాడుతూ వివిధ అభివృద్ధి కార్యక్రమాలన్నీ తుది దశకు చేరుకున్నాయని, పనులను వేగవంతం చేయాలని అధికారులను ఆయన ఆదేశించారు. ఈ కార్యక్రమంలో కార్పొ రేటర్ సామల హేమ, అధికారులు కృష్ణ, కౌశిక్, అన్విత్, బీఆర్‌ఎస్ యువ నేత రామేశ్వర్ గౌడ్, నాయకులు పవన్ కుమార్ గౌడ్, జహంగీర్, ఆంజనేయులు, పాల్గొన్నారు.

కార్పొరేట్ వ్యాపార రాజకీయాలు నడుపుతున్న 'పార్టీలు'

- దళిత బహుజన పార్టీ జాతీయ అధ్యక్షులు వడ్లమూరి కృష్ణ స్వరూప్



నవతెలంగాణ-హిమాయత్‌నగర్

తెలంగాణలో కార్పొరేట్ వ్యాపార రాజకీయాలు నడుపుతున్న బీఆర్‌ఎస్, బీజేపీ, కాంగ్రెస్ పార్టీల పట్ల ప్ర జలు అప్రమత్తంగా ఉండాలని దళిత బహుజన పార్టీ జాతీ య అధ్యక్షులు వడ్లమూరి కృష్ణ స్వరూప్ శనివారం ఒక ప్రకట నలో విమర్శించారు. రానున్న అసెంబ్లీ ఎన్నికల్లో ఒక్కొక్క సీటును కోట్ల రూపాయలకు ఈ మనువాద పార్టీ లు అమ్ముకుంటున్నాయని, ఇప్పటికే అడ్వాన్సులు తీసుకున్నాయని ఆరోపించారు.వచ్చే ఎన్నికల్లో ఆ పార్టీ అభ్యర్థులను గెలిపించుకోవడానికి లక్ష కోట్ల రూపాయల బ్లాక్ మనీతో బీఆర్‌ఎస్, బీజేపీ, కాంగ్రెస్ పార్టీలు సిద్ధంగా ఉన్నాయని, ప్రజాస్వామిక ఎన్నికల ప్రక్రి యను ఖూనీ చేస్తున్నా యని ఆరోపిం చారు. ఇటీవల బీఆర్‌ఎస్ ప్రకటించిన అభ్య ర్థుల జాబితాలో 2 శాతం జనాభా లేని దొరలు, పటేళ్లకు 90శాతం టికెట్లు కేటాయించారని, 62 శాతం జనాభా కలిగిన బీసీ జనాభాకు మొండి చెయ్యి చూపించిందని ధ్వజమెత్తారు.జాతీయ ప్రజాస్వామిక లౌకిక కూటమి ఆధ్వ ర్యంలో పలుఎస్సీ,ఎస్టీ,బీసీ పార్టీలు, వామపక్ష విప్లవ పార్టీ లతో కలిసి మూడవ రాజకీయ ప్రత్యామ్నాయంగా కొనసా గుతామన్నారు.వచ్చే ఎన్నికల్లో రాజకీయ విష పాములైన బీఆర్‌ఎస్, బీజేపీలను ఓడించకపోతే దళిత బ హుజ నులకు బానిసత్వం తప్పదని ఆయన హెచ్చరించారు.

చెస్ చాంపియన్‌షిప్‌లో మెరిసిన కవలలు



నవతెలంగాణ-బంజారాహిల్స్

నగరానికి చెందిన సూపర్ కవల పిల్లలు కిడ్స్ ఇంటర్నేషనల్ చెస్ ఛాంపియన్‌షిప్‌లో సత్తాచాటారు. ఈ సం దర్భంగా శుక్రవారం సోమాజీగూడ ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో ఛాంపియన్‌షిప్‌కు సంబంధించిన వివరాలను కోచ్‌లు చైతన్య సురేష్ స్రవంతి, సందీప్ నాయుడు, గరినాథ్‌లు వెల్లడించారు. ఈ సందర్భంగా కోచ్‌లు చైతన్య, స్రవంతిలు మాట్లాడుతూ అమయఅగర్వాల్, అనయ్ అగర్వాల్ అండర్-8 కేటగిరిలో ఇప్పటికే నేషనల్స్ ఛాంపియన్స్ నిలిచి గత వారం స్పెయిన్ టోర్నమెంట్‌లో ఆడి ఛాంపియన్స్‌గా నిలిచారన్నారు. అక్టోబర్ 15 నుండి ఈజిప్ట్ జరిగే వరల్డ్ ఛాంపియన్ షిప్‌కు అర్హత సాధించడం చాలా ఆనందంగా ఉందన్నారు. ఛాంపి యన్స్ అమయ,అనయ్‌లు మాట్లాడుతూ వరల్డ్ ఛాంపియన్ షిప్‌కి వెళ్ళడం చాలా సంతోషంగా ఉందని, కోచ్‌లు, తల్లిదండ్రుల సహకారం మరులేనిదని, వారి ప్రోత్సహంతోనే ఛాంపియన్స్‌గా నిలిచామన్నారు. అందరి సపోర్ట్‌తో వరల్డ్ ఛాంపియన్ షిప్‌లో గెలిచి అందరి మన్ననలు పొందుతామని పేర్కొన్నారు. ఇద్దరు వరల్డ్ ఛాంపియన్స్ గా తప్పక విజయం సాధిస్తారని వారి తల్లిదండ్రులు తనాషా అగర్వాల్, వరుణ్ అగర్వాల్ ఆనందాన్ని వ్యక్తం చేశారు.

డా. కందిమళ్ళ భారతికి తెలుగు విశ్వవిద్యాలయం కీర్తి పురస్కారం



నవతెలంగాణ-ఓయూ

ఉస్మానియా విశ్వ విద్యాల యం గ్రంథాలయశాఖ పూర్వ అధ్యక్షురాలు డా. కందిమళ్ళ భారతికి తెలుగు విశ్వవిద్యాలయం, గ్రంథాలయ సమాచార శాస్త్రంలో చేస్తున్న విశిష్టమైన కృషికి గుర్తింపుగా కీర్తి పురస్కారాన్ని ప్రకటించింది. తెలుగు విశ్వవిద్యాలయం ఉపాధ్యక్షులు ఆచార్య తంగెడ కిషన్‌రావు అధ్యక్షతన సమావేశమైన నిపుణుల కమిటీ ఆమెను ఈ పురస్కారానికి ఎంపిక చేసినట్లు, విశ్వవిద్యా లయ రిజిస్ట్రార్ ఆచార్య భట్టు రమేశ్ ఒక ప్రటకనలో తెలియజేశారు.వివిధ ప్రత్యేక సంచికల్లో పదహారు పరిశోధన పత్రాలు ప్రచురింపబడిన డా. భారతి సంపాద కత్వంలో 'తెలంగాణ వీరనారి. ఆరుట్ల కమలాదేవి', 'ఆత్మీయం', 'యలమంచిలి విజయకుమార్ రచనలు' గ్రంథాలు వెలువడ్డాయి. అనేక సంస్థల నుండి పురస్కారాలు, సత్కారాలు పొందిన డా. భారతి తమ యావత్ కుటుంబాన్ని డాక్టరేట్ల కుటుంబంగా తీర్చిదిద్దామన్నారు.

కృష్ణ స్వామి ముదిరాజు సేవలు మరువలేనివి

- నగరాన్ని ఆదర్శనగరంగా తీర్చిదిద్దడంలో ఆయన పాత్ర ఎనలేనిది : ఎమ్మెల్యే కాలేరు వెంకటేశ్



నవతెలంగాణ-అంబర్‌పేట

హైదరాబాద్ నగరాన్ని నాడు దేశంలోనే అత్యుత్తమ రాజధానిగా తీర్చిదిద్దడంలో నగర మొదటి మేయర్‌గా కృష్ణస్వామి ముదిరాజ్ సేవలు చిరస్మరణీయమని అని అంబర్ పేట ఎమ్మెల్యే కాలేరు వెంకటేశ్ అన్నారు. శుక్రవారం గోల్నాక డివిజన్ పరిధిలోని ఎస్.కె ఫంక్షన్‌హాల్‌లో కృష్ణస్వామి ముదిరాజ్ జయంతి సందర్భంగా తెలం గాణ ముదిరాజ్ సంక్షేమ సంఘం అధ్యక్షులు పుట్టి యాదగిరి ముదిరాజ్ రాష్ట్ర ఉపాధ్యక్షులు సతీష్ ముదిరాజ్ ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఆయన హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మా ట్లాడుతూ, కృష్ణస్వామి ముదిరాజ్ చరిత్ర జన్మతహా గొప్ప నాయకత్వ లక్షణాలు మూర్తీభవించిన మహనీయుడని కొనియాడారు. 1917లో హైదరాబాద్ నగరాన్ని విషజ్వరాలు పీడించినప్పుడు ఆయన నగరవాసులకి ఎనలేని సేవలు చేశాడని గుర్తుచేశారు. ఈ సందర్భంగా మాజీ మంత్రి సి కృష్ణ యాదవ్ మాట్లాడుతూ బీసీల చైతన్యానికి నాంది పలికిన కొరివి కృష్ణస్వామి ముదిరాజ్ నిజాం నిరంకుశ పాలనలోనే బీసీలను ఐక్యం చేయడానికి ఎన్నో ప్రయత్నాలు చేశారని అందులో భాగంగానే అణగారిన బీసీ వర్గాలను చైతన్యం చేయడానికి ముదిరాజ్ మహాసభ మున్నూరుకాపు పద్మశాలి యాదవులు తదితర వర్గాలను ఏకం చేసి వారికి సంఘాలంటూ ఉండాలని ఆనాడే నిర్ణయించాడని వారు పేర్కొన్నారు. హైదరాబాదు నగర మొదటి మేయర్‌గా ప్రస్తుతం హైదరాబాదు రూపు రేఖలను తీర్చిదిద్దడంలో ఆయన చేసిన కృషి ఇప్పటికీ మరువలేదని వారు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ అంబర్‌పేట కార్పొరేటర్ ఇ.విజయ్ కుమార్ గౌడ్, వివిధ పార్టీల సీనియర్ నాయకులు ఆనంద్ గౌడ్,దూసరి శ్రీనివాస్ గౌడ్, శ్రీరాములు ముదిరాజ్, రోహిత్ ముదిరాజ్, లల్లు ముదిరాజ్,లలిత, మహేందర్,దీపక్,లవంగు ఆంజనేయులు,లింగారావు, ఆర్కే బాబు,జడ్డి వెంకటేశ్వర్లు, ముదిరాజ్ సంక్షేమ సంఘం నాయకులు,మహిళా నాయకులు రమా ముదిరాజ్,దివ్య ముదిరాజ్, లక్ష్మీ ముదిరాజ్,తులసి ముదిరాజ్, తదితరులు పాల్గొన్నారు.

బీసీలకు జనాభా ప్రకారం అసెంబ్లీ టికెట్లు కేటాయించాలి

- రాజ్యసభ సభ్యులు ఆర్.కృష్ణయ్య



నవతెలంగాణ-అంబర్‌పేట

బీఆర్‌ఎస్ పార్టీ టికెట్లు కేటాయింపులో బీసీలకు తీవ్ర అన్యాయం చేసిందని, రాబోయే ఎన్నికల్లో బీఆర్‌ఎస్ పార్టీకి తగిన బుద్ధి చెప్పాలని జాతీయ బీసీ సంక్షేమ సంఘం అధ్యక్షులు రాజ్యసభ సభ్యులు ఆర్ కృష్ణయ్య అన్నారు. శుక్రవారం కాచిగూడ అభినందన్ హెూటల్‌లో వీరశైవ లింగాయత్ అధ్యక్షులు వెన్నె ఈశ్వరప్ప, గౌరవ అధ్యక్షులు సంఘమేశ్వర్ బీసీ సంక్షేమ జాతీయ కన్వీనర్ గుజ్జ కృష్ణ ఆధ్వర్యంలో నిర్వహించిన వివిధ కుల సంఘాల రాష్ట్ర నాయకులతో ఏర్పాటు చేసిన సమావేశానికి రాజ్యసభ సభ్యులు ఆర్ కృష్ణయ్య ముఖ్య అతిథిగా హాజరై ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ బీఆర్‌ఎస్ పార్టీ ప్రకటించిన 115 సీట్లు బీసీలకు కేవలం 21 సీట్లు మాత్రమే కేటాయించారు. ఒకవైపు బీసీలకు 50 శాతం టికెట్లు పెంచాలని బీసీ సంఘాలు, బీసీలు డిమాండ్ చేస్తుంటే బీఆర్‌ఎస్ పార్టీ గతం కంటే నాలుగు సీట్లు తగ్గించి 21 సీట్లు మాత్రమే కేటాయించారు. గతంలో కేటాయించిన కామారెడ్డి, హుజురాబాద్, మలక్ పేట్, యాకత్ పూర్ సీట్లు ఇప్పుడు వాటిని బీసీలకు ఇవ్వలేదు. బీసీల పట్ల ఇంత నిర్లక్ష్యం చేస్తారని ఏ నాయ కుడు ఊహించలేదు. జనాభాలో అత్యధిక జనాభా గల బీసీలకు కేవలం 10 శాతం సీట్లు కేటాయించి అవమాన పరిచారు. జనాభాలో 10 శాతం ఉన్న అగ్రకులాలకు 60 శాతం సీట్లు కేటాయించారు. ఓట్లు బీసీలవి జనాభా బీసీలది అయినా సీట్లు కేటాయింపులో బీసీలకు చారిత్రక అన్యాయం జరుగుతుంది అని ప్రతి పార్టీలో ప్రతి నియోజకవర్గంలో ఎమ్మెల్యే స్థాయి నాయకులు బీసీల నుంచే 10 నుంచి 20 మంది ఉన్నారు కానీ వారిని రాజకీయంగా అణచి పెడుతున్నారు. రాష్ట్రంలో బీసీ వాదం బలంగా ఉందని 50 శాతం టికెట్లు ఇవ్వకపోతే ఆ పార్టీలను ఓడిస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో శివకుమార్, దినేష్ పటేల్, శివ, తదితరులు పాల్గొన్నారు.

తాగునీటి సమస్యకు శాశ్వత పరిష్కారం

-60 లక్షల నిధులతో మంచి నీటి పైప్ లైన్ పనులకు శంకుస్థాపన

ఎమ్మెల్యే కాలేరు వెంకటేశ్



నవతెలంగాణ-అంబర్‌పేట

తాగునీటి పరిష్కారానికి శాశ్వత పరిష్కారం కృషి చేస్తున్నానని అంబర్‌పేట ఎమ్మెల్యే కాలేరు వెంకటేశ్ అన్నారు. శుక్రవారం బాగ్ అంబర్ పేట డివిజన్ పరిధిలోని అయ్యప్ప స్వామి ఆలయం ఎదురుగా ఉన్న బ్యాంకు లైన్‌లో రూ.60 లక్షల వ్యయంతో నూతనంగా వేయనున్న మంచి నీటి పైప్ లైన్ పనులను అంబర్‌పేట ఎమ్మెల్యే కాలేరు వెంకటేశ్, కార్పొరేటర్ పద్మా వెంకటరెడ్డితో కలిసి శంకుస్థాపన చేశారు. ఆ పక్కనే ఉన్న జామ్యా మసీదు రోడ్డులో రూ.40 లక్షల నిధులతో నిర్మిస్తున్న సీసీ రోడ్డు పనులను పరిశీలించి, ఈ సందర్భంగా ఆయన అభివృద్ధి పనుల్లో పురోగతి గురించి అధికారులతో మాట్లాడి, నాణ్యతా ప్రమాణాల్లో ఎటువంటి లోపం లేకుండా నిర్ణీత గడువులోగా రోడ్డు పనులు పూర్తి చేయాలని ఆదేశించారు. బీఆర్‌ఎస్ డివిజన్ అధ్యక్షులు చంద్రమోహన్ సీనియర్ నాయకులు మోర శ్రీరాములు ముదిరాజ్, శివాజీ యాదవ్, రమేష్ నాయక్, మిరియాల శ్రీనివాస్, వెంకటేష్, సుధాకర్, బాలకృష్ణ గౌడ్ పాల్గొన్నారు.

ఉద్యమకారుల సంక్షేమ బోర్డు ఏర్పాటు చేయాలి



- తెలంగాణ ఉద్యమకారుల ఫోరం రాష్ట్ర కమిటీ చైర్మెన్ డాక్టర్ చీమ శ్రీనివాస్
- 27న ఛలో 'ఇందిరాపార్క్' కార్యక్రమం

నవతెలంగాణ-హిమాయత్ నగర్

తెలంగాణ ఉద్యమకారుల సంక్షేమ బోర్డును ఏర్పాటు చేసి రూ.10 వేల కోట్ల బడ్జెట్ కేటాయించాలని తెలం గాణ ఉద్యమకారుల ఫోరం రాష్ట్ర కమిటీ (టీయూఎఫ్) చైర్మెన్ డాక్టర్ చీమ శ్రీనివాస్ డిమాండ్ చేశారు.శనివారం బషీర్ బాగ్ ప్రెస్ క్లబ్ లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఈనెల 27న ఇందిరా పార్క్ వద్ద నిర్వహించే తెలంగాణ ఉద్యమకారుల ఆత్మ గౌరవ సదస్సుకు సంబంధించిన వాల్‌పోస్టర్‌ను ఆవిష్కరిం చారు.ఈ సందర్భంగా చీమ శ్రీనివాస్ మా ట్లాడుతూ రాబోయే అసెంబ్లీ ఎన్నికలలో అన్ని రాజకీయ పార్టీలు తెలంగాణ ఉద్యమకారులకు టిక్కెట్లు కేటాయిం చాలని డిమాండ్ చేశారు. ఉద్యమకారుల డిమాండ్ల సాధన కోసం ఈ నెల 27న 'తెలంగాణ ఉద్యమకారుల ఆత్మ గౌరవ సద స్సు' ఇందిరా పార్క్‌ధర్నా చౌక్‌లో నిర్వహించనున్నట్లు తెలిపారు.ఉద్యమకారుల సంక్షేమ బోర్డ్ ఏర్పాటు చేస్తామని అన్ని రాజకీయ పార్టీలు తమ మేనిఫెస్టోలో చేర్చాలని కోరారు. ఉద్యమకారులను స్వాతంత్ర్య సమరయో ధులుగా గుర్తించాలన్నారు.27 ఆదివారం నిర్వహించే 'ఉద్యమకారుల ఆత్మ గౌరవ సదస్సుకు' 33 జిల్లాల నుంచి అన్ని వర్గాల ప్రజలు, నాయకులు వేలాదిగా తరలివచ్చి, విజయవంతం చేయాలని ఆయన పిలుపునిచ్చారు.ఈ సమావేశంలో ఫోరం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సురేందర్ రెడ్డి, ఉపాధ్య క్షులు రవీంద్ర చారి, వీరస్వామి, శ్రీనివాస్ గౌడ్, కోశాధికారి జంగా సుదర్శన్, మత్తయ్య పాల్గొన్నారు.

పుట్టపాగ శ్రీనివాస్‌పై కఠిన చర్యలు తీసుకోవాలి




- న్యాయం జరగకపోతే ఆత్మహత్యే శరణ్యం
- సీఎం కేసీఆర్‌కు బాధితుల విజ్ఞప్తి

నవతెలంగాణ-హిమాయత్ నగర్

డిక్కీ సంస్థ పేరుతో దళితులను లక్ష్యంగా చేసుకుని ఉపాధి కల్పిస్తానని ఎస్‌బీఐ బ్యాంకు రుణాలు ఇప్పిస్తానని సుమారు 60 మంది బాధితుల నుంచి ఒక్కొక్కరి దగ్గర రెండు నుంచి మూడు లక్షలు వసూలు చేసి మోసం చేసిన పుట్టపాగ శ్రీనివాస్‌పై ప్రభుత్వం కఠిన చర్యలు తీసుకుని, తమ డబ్బులు తమకు ఇప్పించి న్యా యం చేయాలని బాధితులు శ్రీరాం సత్యనారాయణ, కం దుల రాములు, చంద్రశేఖర్, నవీన్, చేతన్, ఎర్ర వెంక టేష్, లత, రమాదేవిలు సీఎం కేసీఆర్‌ను వేడుకున్నారు. ఈ మేరకు శుక్రవారం బషీర్‌బాగ్ ప్రెస్‌క్లబ్ లో ఏర్పాటు చేసిన మీడి యా సమావేశంలో వారు మాట్లాడుతూ 2019 లోఎస్‌బీఐ బ్యాంక్, ఎస్సీ కార్పొరేషన్ అధికా రులతో ఒక సమా వేశం ఏర్పాటు చేసి వ్యాపారం చేసు కునేందుకు బ్యాంకుల నుంచి సబ్సిడీపై రుణాలు ఇప్పిస్తానని, సమాజంలో గౌరవంగా బతికేలా చేస్తానని తమకు మోసపూరితమైన మాటలు చెప్పి తమ ప్రమే యం లేకుండా తమ పేరుపైబ్యాంకుల నుండి ఒక్కొక్కరిపై రూ.10లక్షల వరకు లోన్లు తీసుకుని మోసం చేశారని ఆరోపించారు. బ్యాంక్ అధికారులు తమ ఇంటికి వచ్చి మీరు లోన్లు తీసుకున్నారని, డబ్బులు కట్టకపోతే కోర్టులకు ఈడుస్తామని, నోటీసు లిచ్చి బ్యాంకు అధికారు లు బెదిరిస్తున్నారని వారు వాపోయారు. ఈ విషయంపై స్థానిక పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసినా పట్టించుకో లేదని ఆరోపిం చారు. ఇదే విషయంపై మానవ హక్కుల కమిషన్‌కు ఫిర్యాదు చేసినట్లు తెలిపారు.ఈ మోసాలపై సీఎం కేసీఆర్ వెంటనే స్పందించి సీబీ, సీఐడీ చేత విచా రణ జరిపించి, తమకు న్యాయం చేయాలని కోరారు. లేకుంటే తమకు ఆత్మహత్యే శరణ్యమని ఆవేదన వ్యక్తం చేశారు.

మారేడ్‌పల్లి తహసీల్దార్‌ను కలిసిన కార్పొరేటర్ దీపిక

- డబుల్ బెడ్ రూమ్ ఇండ్ల మంజూరుపై చర్చ



తెలంగాణ-కంటోన్మెంట్

మారేడ్‌పల్లి మం డలానికి నూతనంగా వచ్చిన తహసీల్దార్ శాంతా కుమారిని శుక్రవారం మోండా డివిజన్ కార్పొరేటర్ కొంతం దీపికా నరేష్‌ను మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా డివిజన్‌లోని పలు సమస్య లను కార్పొరేట్ దీపిక తహసీల్దార్ దృష్టికి తీసుకెళ్లారు. ముఖ్యంగా మారేడ్‌పల్లి మండలంలో మంజూరైన డబుల్ బెడ్ రూమ్ ఇండ్ల విషయాన్ని అడిగి తెలుసుకున్నట్లు వారు తెలిపారు. అర్హులైన వాళ్ళందరికీ త్వరితగతిన ఇండ్లు మంజూరు చేయాలని, కార్పొరేటర్ తహసీల్దార్‌ను కోరినట్లు తెలిపారు.



వరలక్ష్మీ వ్రతాన్ని పురస్కరించుకొని ఖైరతాబాద్ నియోజకవర్గంలోని స్థానిక కార్పొరేటర్ నియోజకవర్గ టీపీసీసీ ప్రధాన కార్యదర్శి పి.విజయరెడ్డి కార్యాల యంలో మహిళలకు పసుపు, కుంకు మలు అందజేసి ఆశీర్వాదాలు తీసుకున్నారు.

నవతెలంగాణ-బంజారాహిల్స్




వరలక్ష్మీ వ్రత ప్రత్యేక పూజలను నగర మేయర్ గద్వాల్ విజయలక్ష్మి కుటుంబ సమేతంగా ఆమె నివాసంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు.

నవతెలంగాణ-బంజారాహిల్స్

ముఠా గోపాల్ ప్రత్యేక ప్రార్థనలు

నవతెలంగాణ-అడిక్‌మెట్



ముషీరాబాద్ నియోజకవర్గం లోని శంకర్ మట్ దర్గా షరీఫ్‌లో ఎమ్మెల్యే ముఠా గోపాల్ ప్రత్యేక ప్రార్థనలు చేశారు. అడిక్‌మెట్ మైనారిటీ అధ్యక్షులు అబ్బు, బషీర్ ఖాన్ వైస్ ప్రెసిడెంట్ ఆధ్వర్యంలో పూలమాలలు వేసి దర్గా కు చాదర్ సమర్పించారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ రాష్ట్రం రాష్ట్ర ప్రజలు సుఖసంతోషాలతో ఉండాలని ఎన్నికల్లో బీఆర్‌ఎస్ పార్టీ అత్యధిక మెజారిటీతో గెలవాలని ఆకాంక్షించినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ట్రస్ సీనియర్ నాయకులు మనోహర్‌సింగ్ , మహ్మద్ ఖాదీర్, సయ్యద్‌యూనస్, మహ్మద్, జునైద్‌భోక్దాది, ఖాజా, ఆజం సాహెబ్, ఎంఏ.వహాబ్, ఇక్బాల్‌భాయ్, ఘోష్, అజరు, తదితరులు పాల్గొన్నారు.

క్రీడాకారులకు అరకొర ఏర్పాట్లు

- తమ సహకారాన్ని ప్రకటించిన ప్రణవ గ్రూప్



నవతెలంగాణ-బంజారాహిల్స్

చంద్రయాన్-3 తర్వాత క్రికెట్ వరల్డ్ కప్ పోరులో భారత్ దూకుడు పెంచిందని, ప్రఖ్యాతిగాం చిన రియల్ ఎస్టేట్ రంగానికి చెందిన ప్రణవ గ్రూప్ కూడా వీరికి ఆర్థిక సహాయాన్ని యూకేలో అందిస్తున్నట్లు, తమ వంతు సేవ కార్యక్రమాలను నిర్వహి స్తున్నదని సంస్థ అధినేత రాజ్ కుమార్ తెలిపారు. యావ త్ భారతావని చంద్ర యాన్-3 విజయాన్ని ఆస్వాదిస్తున్న వేళ చంద్రునిపై భారత మువ్వన్నెల పతాకం గర్వంగా రెపరెపలాడిన వేళ ప్రపంచ వ్యాప్తంగా చంద్రయాన్-3 సాఫ్ట్ ల్యాండ్ అనంతరం అందరూ ఉత్కంఠతో ఆ అద్భు తాన్ని వీక్షించినట్లుగా, భారతీయ ప్రతిభకు ప్రపంచం మొత్తం జేజేలు పలుకుతున్న సందర్భంగా భారతీయ అంధ క్రీడాకారులు బ్రిటన్‌లోని బర్మిం గ్హమ్‌లో ప్రపంచ అంధ క్రీడా సమాఖ్య ఆధ్వర్యంలో జరుగుతున్న క్రీడాకా రుల పోటీలలో తమ సత్తా చాటారు. గత వారం రోజు లుగా జరుగుతున్న ఈ పోటీలలో భారత క్రీడాకారులు క్రికెట్, జూడో, అథ్లెటిక్స్ విభాగంలో పాల్గొంటున్నారు. పురుషుల క్రికెట్‌లో భారత్, ఇంగ్లాండ్, పాకిస్తాన్, బంగ్లాదేశ్ ఆస్ట్రేలియా జట్లు, మహిళల క్రికెట్ విభాగంలో భారత్, ఇంగ్లాండ్, ఆస్ట్రేలియా దేశాలు తలపడనున్నాయనీ తెలియజేస్తూ, ఫైనల్ మ్యా చోలో తన చిరకాల ప్రత్యర్థి పాకిస్థాన్తో తలపడేందుకు సిద్ధమైనట్లు ప్రణవ గ్రూప్ సంస్థ సభ్యులు ప్రకటించారు. ఈ క్రికెట్ జట్టు సభ్యులందరికీ కావాల్సిన భోజనా-వసతి సదుపాయాలని సమకూరుస్తూ చేదోడు వాదోడుగా నిలుస్తున్నట్లు ప్రఖ్యాతిగాంచిన రియల్ ఎస్టేట్ రంగానికి చెందిన ప్రణవ గ్రూప్ వారు కూడా ఆర్థిక సాయం ఎప్పుడూ అంది స్తున్నామని సంస్థ అధినేత రాజ్ కుమార్ తెలిపారు.

అదొక్కటే లక్ష్యం కాదు...



బరువు తగ్గడానికి చాలానే మార్గాలు ఉన్నాయి. అయితే సరైన విధానంలోనే బరువు తగ్గాలి. ఇంటర్నెట్‌లో వెతికి ఎలా అయినా బరువు తగ్గాలని ప్రతి ఒక్కటి పాటించొద్దు. ఈ నేపథ్యంలోనే ఫిటెనెస్ నిపుణులు బరువు తగ్గేటప్పుడు కొన్ని తప్పులు చేయొద్దని చెబుతున్నారు. అవేంటంటే.

- బరువు తగ్గడం మాత్రమే గోల్ పెట్టుకోకూడదు. ఫిట్‌గా మారుతూనే ఆరోగ్యంగా కూడా ఉండాలి. బలం, ఫ్లెక్సీబిలిటీ, నడుము చుట్టుకొలత ఇవన్నీ కూడా చూడాలి. ఇవన్నీ బ్యాలెన్స్‌డ్‌గా ఉంటేనే బరువు తగ్గినట్లని చెబుతున్నారు.
- గత అనుభవాన్ని ప్రస్తుత అనుభవంతో పోల్చొద్దు. గతంలో తీసుకున్న డైట్ అప్పుడు వర్కౌట్ అవ్వలేదని మంచి డైట్‌ని పక్కన పెట్టొద్దు. ఎప్పుడైనా సరే, మంచి డైట్ పాటించాలి. అదే విధంగా రోజులు మారే కొద్దీ కొన్ని మార్పులు వస్తాయి. ప్రస్తుతం మీ బాడీ టైప్‌ని బట్టి ఎలాంటి డైట్ అనేది సెట్ అవుతుందో న్యూట్రిషనిస్ట్ అడిగి కచ్చితంగా ఫాలో అవ్వాలి. దీని వల్ల ఒత్తిడి తగ్గి బరువు కూడా తగ్గుతారు.
- డైట్‌ని ఫాలో అవుతున్నప్పుడు వెంటనే బరువు తగ్గాలని ట్రై చేయొచ్చు. మెల్లిమెల్లిగా బరువు తగ్గాలి. ఏ రిజల్ట్ అయినా రావడానికి కనీసం మూడు నెలల టైమ్ పడుతుంది.
- ఎప్పుడైనా సరే బరువు తగ్గడం, డైట్ ఫాలో అవ్వడం అనేది ఏదో శిక్షలా ఫీల్ అవ్వొద్దు. వీటిని ఎంజాయ్ చేస్తూ చేయాలి. వర్కౌట్ అనేది కూడా హ్యాపీగా ఎంజాయ్ చేస్తూ చేయండి. డైట్‌లో కూడా తినే ఫుడ్‌ని రుచిగా చేసుకుని ఎంజాయ్ చేస్తూ తినండి. అప్పుడే మీరు వాటిని కంటిన్యూ చేసి హ్యాపీగా బరువు తగ్గుతారు.

మెరుపు కచ్చితం



కొంతమంది అందంగా కనిపించేందుకు బ్యూటీ పార్లర్స్‌లో డబ్బు ఖర్చు పెట్టి ఖరీదైన బ్యూటీ ప్యాక్స్ వేసుకుంటారు. కానీ ఇంట్లోనే ఉండే కొన్ని పదార్థాలతో ప్యాక్ వేసుకుంటే మెరుపు కచ్చితంగా వస్తుంది. అలాగే మీ మోము కాంతిని పెంచి ఛాయని మెరుగుపరచడంలో ఇంట్లోనే తయారు చేసే ఫేస్ మాస్క్ గురించి చూద్దాం.

- బియ్యం పిండిలో చాలా మంచి గుణాలు ఉన్నాయి. దీనిని అప్లై చేస్తే చర్మంలో మృత కణాలను ఎక్స్‌ఫోలియేట్ చేసేందుకు సాయపడతాయి. చర్మంలో కొల్లాజెన్‌ని పెంచేందుకు కూడా ఈ ప్యాక్ చాలా మంచిది. సూర్యుని యూవీ కిరణాల నుండి రక్షించడంలో కూడా ఇది బాగా పనిచేస్తుంది.
- చర్మ సంరక్షణలో పసుపు కూడా బెస్ట్‌గా పని చేస్తుంది. పసుపులో యాంటీ ఇన్ ఫ్లమేటరీ గుణాలు చర్మానికి చాలా మంచిది. ఇందులోని కర్క్యుమిన్ చర్మ సమస్యలన్నింటినీ దూరం చేస్తుంది. అదనపు మెలనిన్ ఉత్పత్తిని తగ్గిస్తుంది. రంగుని మెరుగ్గా చేస్తుంది.
- తేనే బెస్ట్ యాంటీ బ్యాక్టీరియల్, యాంటీ ఆక్సిడెంట్ లక్షణాలని కలిగి ఉంటుంది. దీనిని వాడడం వల్ల చర్మ రంధ్రాలు శుభ్రమవుతాయి. చర్మ సహజ రంగుని మెరుగ్గా చేసి మెరుపుని తీసుకురావడంలో తేనె ఎంతో సహాయం చేస్తుంది. అందుకోసం ఫేస్ ప్యాక్స్, మాస్క్‌ల్లో తేనెని యాడ్ చేయండి.

ఆ మాటలు భరించలేక...

అప్పటి వరకు పుట్టింట్లో పెరిగిన అమ్మాయిలకి పెండ్లి తర్వాత అత్తింట్లో వాతావరణం కాస్త కొత్తగా ఉంటుంది. దాన్ని అలవాటు చేసుకోవడానికి కాస్త సమయం పట్టడం సహజం. అయితే అక్కడి పరిస్థితులు తాను పెరిగిన వాతావరణానికి పూర్తి భిన్నంగా ఉంటే మాత్రం కొన్ని సమస్యలు తప్పవు. వాటిని భరించడం కాస్త కష్టమే. అలాంటి ఇబ్బందులనే కొన్ని ఏండ్లు భరించి ఇక ఓపిక లేక చివరకు ఐద్వా లీగల్‌సెల్‌కు వచ్చింది పల్లవి. అసలు ఆమె అక్కడ ఎదుర్కొన్న సమస్యలేంటో ఈ వారం ఐద్వా అదాలత్‌లో...

పల్లవికి 28 ఏండ్లు ఉంటాయి. ముగ్గురు అన్నలు, తండ్రి లేడు. చెల్లెల్ని అన్నలు అల్లారు ముద్దుగా పెంచుకున్నారు. వాళ్ళు ఉండేది పోలీస్ క్వార్టర్స్‌లో. దాంతో చుట్టు పక్కల వాతావరణం ఎంతో ఆహ్లాదంగా ఉంటుంది. ఇంట్లో కూడా ఎప్పుడూ ప్రశాతంగా ఉంటుంది. చుట్టూ అందరూ చదువుకున్న కుటుంబాలే. అందరూ ఎంతో పద్ధతిగా ఉంటారు. ఇంట్లో ఒకరినొకరు గౌరవించుకుంటారు. అలాంటి వాతావరణంలో పెరిగిన పల్లవి ఎంబీఏ పూర్తి చేసింది. తర్వాత అన్నలు ఆమెకు పెండ్లి చేయాలనుకున్నారు.

నందు సంబంధం వచ్చింది. అబ్బాయి ఉద్యోగంతో పాటు బిజినెస్ కూడా చేస్తున్నాడని చెప్పారు. తండ్రి గవర్నమెంట్ ఉద్యోగం చేసి రిటైర్ అయ్యాడు, పెన్షన్ వస్తుంది. సొంత ఇల్లు దానికి అద్దె 40వేల వరకు వస్తుందని చెప్పారు. అయితే నందు తల్లి తన చిన్నతనంలోనే చనిపోవడంతో తండ్రి రెండో పెండ్లి చేస్తున్నాడు. ఇదేమీ వాళ్ళకు పెద్ద సమస్యగా అనిపించలేదు. మంచి సంబంధం, చెల్లెలు సంతోషంగా ఉంటుందని అన్నలు పెండ్లి చేశారు.

పెండ్లి చేసుకుని పల్లవి ఆ ఇంట్లో అడుగు పెట్టింది. వెళ్ళిన వారంలోనే అక్కడి వాతావరణం ఆమెకు చాలా కొత్తగా, వింతగా అనిపించింది. మామ రెండో భార్యను అస్సలు గౌరవించడు. ఆమెకు ఎవరూ లేరు. అనాథను చూసి కావాలని పెండ్లి చేసుకున్నారు. ఆ ఇంట్లో పేరుకు మాత్రమే ఆమె భార్యగా, తల్లిగా ఉంటుంది. కనీసం ఆమెను ఓ మనిషిగా కూడా చూడరు. ఆమె కూడా ఎప్పుడూ నోరు విప్పి మాట్లాడదు. పొరపాటున ఎప్పుడైనా మాట్లాడితే విపరీతమైన బూతులు తిడితూ కొడతాడు మామ. ఇదంతా పల్లవికి నచ్చలేదు. అలాంటి వాతావరణంలో పెరిగిన నందు కూడా అలాగే తయారయాడు. అంతే కాదు పెండ్లికి ముందు ఉద్యోగం ఉందని చెప్పిన మాట కూడా అబద్ధం అని తెలిసింది. పైగా పల్లవిని కూడా బూతులు తిట్టేవాడు. కనీసం పేరు పెట్టి పిలవాడు. ఏమే, ఒసేయ్ అనేవాడు. ఇలాంటి భాషను పల్లవి జీర్ణించుకోలేకపోయేది. 'ఇక్కడ ఇలాంటివి మామూలే, మనమే సర్దుకుపోవాలి' అంటూ అత్త సర్దిచెప్పేది.

ఇలా బూతులు మాట్లాడడం మంచిది కాదని పల్లవి వాళ్ళకు చెప్పడానికి ప్రయత్నించేది. కానీ ఎలాంటి ఫలితం లేదు. ఆమె చెప్పిన ప్రతి సారి మరింత ఎక్కువగా తిట్టేవారు. దాంతో వాళ్ళతో మాట్లాడటమే మానేసింది. తన పనేదో తాను చేసుకునేది. కానీ మనసులో మాత్రం కుమిలిపోయేది. దాంతో ఓ రోజు అత్త 'మీరు ఇలా బూతులు తిడుతుంటే కోడలు చాలా బాధపడుతుంది. తన కోసమైనా కాస్త మీ బూతులు తగ్గించుకోవచ్చు కదా' అని అడిగింది. దాంతో 'ఎవరిని చూసుకునే నీకు ఇంత ధైర్యం' అంటూ విపరీతంగా కొట్టి వర్షం వస్తున్నా పట్టించుకోకుండా ఇంట్లో నుండి నెట్టేశాడు. ఆమె రాత్రంతా బయటే కూర్చుని ఉదయం ఇంట్లోకి వచ్చింది. అప్పటి నుండి ఇక ఆమె నోరు తెరవడమే మానేసింది. కానీ కోడలికి మాత్రం తోడుగా ఉండేది. అలాంటి పరిస్థితుల్లోనే పల్లవికి ఇద్దరు పిల్లలు పుట్టారు.



మహిళలను గౌరవించాలి. భార్య అయినంత మాత్రానా ఆమె మనిషి కాదా. నువ్వు నీ తల్లిని కూడా అలాగే మాట్లాడుతున్నావు. నిన్ను నీ భార్య బూతులు తిడితే భరించగలవా? మరి నీపై చనువు నీ భార్యకు కూడా ఉండాలిగా? నీ పిల్లలు కూడా బూతులు మాట్లాడుతున్నారంటా స్కూల్లో టీచర్ కంప్లెయింట్ ఇచ్చారు. నువ్వు మారకపోతే నీ ఇష్టం.

నందు ఉద్యోగం చేయడం లేదు. జీతం లేదు. ఇంటి కిరాయిలు 30 వేలు వస్తాయి. వాటిలోనే మొత్తం ఇల్లు చూసుకోవాలి. పిల్లలకు జ్వరం వస్తే ఆస్పత్రికి తీసుకెళ్ళాలన్నా పల్లవి దగ్గర డబ్బు ఉండేది కాదు. ఆమె అన్నలు వచ్చి పిల్లల్ని ఆస్పత్రికి తీసుకుపోయేవారు. చివరకు ఆమె ఫోన్ రీచార్జ్ కూడా వాళ్ళే చేయించాలి. నందు అస్సలు పట్టించుకోడు. చివరకు అన్నలే నందుకు ఓ ఉద్యోగం ఇప్పించారు. కానీ ఉద్యోగం చేసి వచ్చిన జీతం మొత్తం తాగుడికే ఖర్చు పెట్టేవాడు. దాంతో పల్లవి మరింత కుమిలిపోయేది. చివరకు చనిపోవాలనుకుంది. 'నేనంటే ఏమీ చదువుకోలేదు. తప్పక ఇక్కడ పడి వుంటున్నాను. నువ్వు బాగా చదువుకున్నావు. మంచి ఉద్యోగం చూసుకోవచ్చు కదా, అప్పుడు ఎవరిపైనా ఆధారపడాల్సినపని ఉండదు. పిల్లల్ని నేను చూసుకుంటాను' అంటూ అత్త ఆమెకు ధైర్యం చెప్పింది.

కానీ పల్లవి ఉద్యోగం చేయడానికి మామ ఒప్పుకోలేదు. 'మా ఇంటి కోడలు ఉద్యోగం చేస్తే మాకు ఎంత అవమానం' అంటూ ఆమెను ఉద్యోగ ప్రయత్నం చేయనీయలేదు. చివరకు పిల్లలు కూడా బూతులు మాట్లాడడం నేర్చుకున్నారు. పల్లవిని అమ్మా అని కాకుండా తాతయ్య, తండ్రి పిలిచినట్టు ఒసేయ్, ఏమే అని పిలిచేవారు. పెద్ద పాపకు 5ఏండ్లు నిండాయి. స్కూల్‌కి వెళుతుంది. స్కూల్లో కూడా ఆ పాప బూతులు మాట్లాడుతుందని టీచర్ పల్లవిని పిలిచి మందలించింది. దాంతో పల్లవికి బాధ మరింత పెరిగింది. తీవ్రమైన ఒత్తిడికి గురై మానసికంగా కుంగిపోయింది. చివరకు తన పేరు కూడా చెప్పలేని స్థితిలో ఐద్వా అదాలత్‌కు వచ్చింది. ఆమెకు తోడుగా అన్నలు వచ్చారు. ఆమె పరిస్థితి చూసి మేము ముందు పల్లవికి రెండు నెలలు మంచి ఆహారం ఇచ్చి, పూర్తిగా రెస్ట్ ఇవ్వమని చెప్పాము.

రెండు నెలల తర్వాత వాళ్ళు మళ్ళీ మా దగ్గరకు వచ్చారు. మేము నందుని, వాళ్ళ నాన్నను పిలిపించి మాట్లాడితే 'ఆమెకు మేము బూతులు మాట్లాడడం ఇష్టం లేదు. మాకు మొదటి నుండి ఇలాగే అలవాటు. మా నాన్న మా అమ్మతో ఇలాగే మాట్లాడతాడు. అందుకే నేను నా భార్యను అలాగే పిలుస్తున్నాను. అయినా భార్యను చనువుగా ఏమే, ఒసేయ్ అని పిలిస్తే తప్పేంటి. ఇక ఇంట్లో డబ్బులు ఇవ్వడం లేదు అంటారు. నాకు వచ్చే జీతం నా ఖర్చులకే సరిపోవడం లేదు. ఇక ఇంట్లో ఎలా ఇస్తాను? అయినా ఇంట్లో ఆమెకు ప్రత్యేకంగా ఖర్చులు ఏముంటాయి. పిల్లలకు ఏమైనా అవసరాలుంటే వాళ్ళ మేనమామలు వచ్చి చూసుకుంటారు, ఇక నేనెందుకు ఇవ్వాలి. అయినా మా బంధువులు అందరూ ఇలాగే ఉంటారు. వాళ్ళెవరికీ లేని సమస్య ఈమె ఒక్కదానికే వచ్చిందా' అన్నాడు.

దాంతో మేము నందు తండ్రిని కూర్చోబెట్టి 'చిన్నతనం నుండి మీ మాటలు వింటూ పెరిగిన మీ కొడుకు మీలాగే తయారయాడు. భార్యను ఇష్టం వచ్చినట్టు మాట్లాడుతున్నాడు. మీ కాలం వేరు, ఇప్పటి కాలం వేరు. ఇప్పటి పిల్లలు బాగా చదువుకుని గౌరవంగా బతకాలనుకుంటున్నారు. కానీ మీ వల్ల మీ అబ్బాయి కుటుంబం ముక్కలవుతుంది. చివరకు మీ మనువరాళ్లు కూడా స్కూల్లో బూతులే మాట్లాడుతున్నారంటా. ఇక ఆ పిల్లలు పెరిగిన తర్వాత ఇంకెలా తయారవుతారో ఆలోచించుకోండి. ఇంట్లో భార్య కోడలు మీకు అలుసుగా కనిపిస్తున్నారు. మీ ఇష్టం వచ్చినట్టు మాట్లాడితే వాళ్ళ కాపురం ఇక నిలబడదు, మీరే ఆలోచించుకోండి' అన్నారు. దాంతో అతను ఆలోచనలో పడ్డాడు.

తర్వాత నందుని కూర్చోబెట్టి 'నువ్వు చదువుకున్నవాడివి. మహిళలను గౌరవించాలి. భార్య అయినంత మాత్రానా ఆమె మనిషి కాదా. నువ్వు నీ తల్లిని కూడా అలాగే మాట్లాడుతున్నావు. నిన్ను నీ భార్య బూతులు తిడితే భరించగలవా? మరి నీపై చనువు నీ భార్యకు కూడా ఉండాలిగా? నీ పిల్లలు కూడా బూతులు మాట్లాడుతున్నారంటా స్కూల్లో టీచర్ కంప్లెయింట్ ఇచ్చారు. నువ్వు మారకపోతే నీ ఇష్టం. నీకంటూ ఓ కుటుంబం లేకుండా పోతుంది. బాగా ఆలోచించుకో. పల్లవిని చూసుకోవడానికి వాళ్ళ అన్నలు ఉన్నారు. ఆమెకు మంచి చదువు ఉంది. ఉద్యోగం చేసుకుంటూ తన బతుకు తాను బతకొచ్చు. కానీ మిమ్మల్ని ఎందుకు భరిస్తుందో ఒక్కసారి ఆలోచించు. ఇప్పటికైనా మీరు మారకపోతే మీకే కష్టం. ఆమెకు ఇప్పుడు తోడుగా మేము కూడా ఉన్నాము' అన్నారు. దాంతో నందూ కూడా పరిస్థితి చేయిజారిపోతుందని ఆలోచించాడు. ఇకపై మారతానని మాట ఇచ్చాడు.

ఇలా బూతులు మాట్లాడడం మంచిది కాదని పల్లవి వాళ్ళకు చెప్పడానికి ప్రయత్నించేది. కానీ ఎలాంటి ఫలితం లేదు. ఆమె చెప్పిన ప్రతి సారి మరింత ఎక్కువగా తిట్టేవారు. దాంతో వాళ్ళతో మాట్లాడటమే మానేసింది. తన పనేదో తాను చేసుకునేది. కానీ మనసులో మాత్రం కుమిలిపోయేది.

పల్లవినీ, నందూనీ మళ్ళీ నెల రోజుల తర్వాత రమ్మనమని పంపించాము. ఇప్పుడు నందులో కొంత మార్పు వచ్చింది. గతంలో మాదిరిగా లేడు. ఉద్యోగం కూడా చక్కగా చేసుకుంటున్నాడని పల్లవి చెప్పింది. ఆమె కూడా చాలా ఉత్సాహంగా కనిపించింది. 'మేడమ్ నేను ఉద్యోగం చేయడానికి ఇంట్లో ఒప్పుకున్నారు. చాలా సంతోషంగా ఉంది. ఇదంతా మీ వల్లనే జరిగింది' అంటూ సంతోషంగా చెప్పి వెళ్ళిపోయింది.

- వై.వరలక్ష్మి, 9948794051

రాజీ కుదిరింది..

(మొదటిపేజీ తరువాయి)

సందర్భంగా తొలిసారి... గవర్నర్ సచివాలయంలో అడుగు పెట్టారు. అక్కడ ఆమెకు సీఎం సాదర స్వాగతం పలికారు. ఆమె అక్కడికి వచ్చేదాకా నిరీక్షించి... ఆ తర్వాతే ప్రారంభోత్సవాల క్రతువును చేపట్టారు. సచివాలయంలోని మందిరం, మసీదు, చర్చిని సీఎం దగ్గరుండి మరీ ఆమెకు చూపించారు. ఆ సందర్భంగా సీఎస్ శాంతికుమారి, ఇతర ఉన్నతాధికారులతో ఘన సన్మానం చేయించారు. అనంతరం సచివాలయం మొత్తం వారిద్దరూ కలియదిరిగారు. ఆ సందర్భంగా సీఎం సెక్రెటేరియట్ నిర్మాణ విశేషాలను ప్రత్యేకంగా తెలపటం విశేషం. గతేడాది రాష్ట్రంలో వరదలు సంభవించినప్పుడు సీఎంకు పోటాపోటీగా గవర్నర్ పలు జిల్లాల్లో పర్యటించారు. మారుమూల ప్రాంతాల్లో పర్యటించేందుకు హెలికాప్టర్ కావాలని అడిగితే ప్రభుత్వం ఇవ్వలేదంటూ ఆమె ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ క్రమంలో ఆమె రైల్లోనే భద్రాచలం వరకూ వెళ్లివచ్చారు. ఆ తర్వాత ఈ యేడాది కూడా తమిళి సై వరద ప్రభావిత ప్రాంతాల్లో పర్యటించారు. రాజ్‌భవన్‌లో మహిళా దర్బార్ నిర్వహించారు. ప్రజలు తమ సమస్యలను తెలుపుకునేందుకు వీలుగా రాజ్‌భవన్ ప్రధాన ద్వారం వద్ద ఫిర్యాదుల పెట్టెను కూడా ఏర్పాటు చేశారు.

ఈ నేపథ్యంలో గవర్నర్... సమాంతర ప్రభుత్వాన్ని నడుపుతున్నారంటూ ప్రభుత్వం, బీఆర్ఎస్ విమర్శలు గుప్పించాయి. పలు సందర్భాల్లో సీఎం సహా పలువురు మంత్రులు, ఎమ్మెల్యేలు, ఎంపీలు... తీరు మార్చుకోవాలంటూ గవర్నర్‌కు సూచించారు. ఆ తర్వాత రాష్ట్ర ప్రభుత్వం పంపిన పలు బిల్లుల విషయంలోనూ తమిళిసై తాత్సారం చేశారు. వాటిని ఆమోదించకుండా పక్కనబెట్టారు. ఆర్టీసీని ప్రభుత్వంలో విలీనం చేసే బిల్లు విషయంలో వివాదం ముదిరి పాకాన పడ్డట్టు కనబడింది. ఆ సందర్భంగా అధికార పార్టీ అనుబంధ కార్మిక సంఘాలు రాజ్‌భవన్ ముట్టడి చేపట్టాయి. అనూహ్య పరిణామాల నేపథ్యంలో ఆ బిల్లును అసెంబ్లీలో ప్రతిపాదించేందుకు గవర్నర్ ఓకే చెప్పారు. అక్కడి నుంచి సీన్ మారిపోయింది.

ఆ తర్వాత ప్రగతి భవన్‌కు, రాజ్‌భవన్‌కు దూరం క్రమంగా తగ్గుతూ వచ్చింది. గురు, శుక్రవారాల్లో జరిగిన పరిణామాలతో అసలు దూరమే లేకుండా పోవటం గమనార్హం. రాష్ట్రంలో మారిన రాజకీయ సమీకరణాలు, కేంద్ర పెద్దల ఆదేశాలు, ఢిల్లీ నుంచి వచ్చిన సూచనలు, సలహాల నేపథ్యంలో ఈ దూరం తగ్గుతూ వచ్చి...క్రమక్రమంగా మాయమైపోయిందని విశ్లేషకులు భావిస్తున్నారు. ఇప్పుడు ఇలా దగ్గరైన ప్రగతి భవన్.. రాజ్‌భవన్ మైత్రి భవిష్యత్తులో కూడా ఇలాగే కొనసాగే అవకాశాలు సుస్పష్టంగా కనబడుతున్నాయని,బీఆర్ఎస్, బీజేపీ మైత్రికి ఇది నిదర్శమని అభిప్రాయపడుతున్నారు. ఈ పరిణామాల నేపథ్యంలో ఇప్పుడు గవర్నర్ వద్ద పెండింగ్‌లో ఉన్న బిల్లులన్నింటికీ ఆమె ఓకే చెప్పనున్నారని సమాచారం.

కారుకు షాక్ ?

(మొదటిపేజీ తరువాయి)

తెలిసింది. పార్టీ అధికారంలోకి వచ్చిన తర్వాత ఎమ్మెల్సీ లేదా దానికి సరి సమానమైన కార్పొరేషన్ పదవి ఇస్తామని పార్టీ హామీ ఇచ్చినట్టు పార్టీ వర్గాలు చెప్పాయి. మరో నేత శశిధర్‌రెడ్డికి పార్టీలో కీలకమైన పదవి ఇస్తామని ఒప్పించారు. పార్టీ ఆదేశాలమేరకు వారిద్దరు మైనంపల్లి రాకను ఆహ్వానించినట్టు తెలిసింది. మల్కాజిగిరి నుంచి కాంగ్రెస్ టికెట్ ఆశిస్తున్న మాజీ ఎమ్మెల్యే నందికంటి శ్రీధర్‌తో కూడా చర్చలు జరుపుతున్నారు. అయితే మూడు, నాలుగు రోజుల్లో మైనంపల్లి, ఆయన కుమారుడు కాంగ్రెస్ కండువా కప్పుకోనున్నట్టు మైనంపల్లి అనుచరులు అంటున్నారు.

అదానీ కోసమే బీజేపీ స్కెచ్

(మొదటిపేజీ తరువాయి)

భూభాగం గురించి.. ప్రధాని చెప్పేవన్నీ అసత్యాలే అని రాహుల్ పేర్కొన్నారు. కొద్దినెలల కిందట తాను చేపట్టిన భారత్ జోడో యాత్రలో భాగంగా లద్దాక్‌కు చేరుకోవాలనుకున్నా. అప్పుడు హిమపాతం కారణంగా ఈ ప్రాంతాన్ని సందర్శించలేకపోయినట్టు రాహుల్ చెప్పారు. అయితే ఈసారి బైక్‌పై లద్దాక్‌కు చేరుకుని యాత్ర కొనసాగించినట్టు రాహుల్ చెప్పారు.

దేశవ్యాప్త ఉద్యమానికి శ్రీకారం

(మొదటిపేజీ తరువాయి)

బ్యాంకుగానే ఉపయోగించుకుంటున్నాయి. ఇప్పటికీ అది కొనసాగుతున్నది. బీజేపీ అధికారంలోకి వచ్చాక ప్రభుత్వ మద్దతుతో ఆర్ఎస్ఎస్ ఆధ్వర్యంలో దళితుల హక్కుల మీద, వారికి అనుకూలమైన రాజ్యాంగ అంశాలపైన దాడి చేస్తూ వాటిని విధ్వంసం చేస్తున్నారు. ఈ విధ్వంసం సాధారణమైనది కాదు. ప్రభుత్వరంగాన్ని విధ్వంసం చేయడమంటే దళితులకు రిజర్వేషన్లు లేకుండా వారికి ఉన్న అవకాశాలను రద్దు చేయడమే. క్రమంగా ఆధిపత్య తరగతుల దౌర్జన్యాలను ప్రతిఘటించకుండా చూడడం. వ్యవసాయ కార్పొరేటీకరణ అంటే చిన్న, సన్నకారు రైతుల చేతుల్లోని భూమి కంపెనీల చేతుల్లోకి పోతుంది. దీంతో దళితులకే ఎక్కువ నష్టం. ప్రభుత్వ భూములన్ని కంపెనీల చేతుల్లోకి పోతాయి. దళితులు, వ్యవసాయ కార్మికులు నూతన వెట్టి కార్మికులుగా వెట్టిచాకిరీకి గురవుతారు. దాంతో దళితుల్లో నిరుద్యోగం, వలసలు పెరుగుతాయి. ఇప్పుడున్న కొనుగోలు శక్తి కూడా ఉండదు. రాజ్యాంగం దళితులకు కల్పించిన హక్కులన్నీ రద్దవుతాయి. సెక్యులర్ రాజ్యాంగాన్ని మనువాద, హిందుత్వ రాజ్యాంగంగా మార్చి, నూతన రూపంలో దళితులపై కుల ఆధిపత్యాన్ని కొనసాగిస్తారు. దళితులపై మూడు వైపుల నుంచి దాడి జరుగుతున్నది. ఆర్థిక పరమైన దోపిడీ, సామాజిక దాడి, హిందుత్వ దాడి. ఈ నేపథ్యంలో వాటిని ప్రతిఘటించాల్సిన అవసరం ఉంది. అందుచేత సమ్మిట్‌కు ప్రాధాన్యత ఉంది.

ప్రశ్న...ఎంత మంది పాల్గొంటారు? ఎన్ని రోజులు చర్చిస్తారు?

బి.వెంకట్ .... హిందుత్వాన్ని, కేంద్ర బీజేపీ విధానాలను వ్యతిరేకించే వారై ఉండాలి.దళితుల సమస్యలపై పని చేసే వారై ఉండాలి. అలాంటి వారితో సమ్మిట్ నిర్వహణ ఉంటుంది. 25 రాష్ట్రాలు, కేంద్ర పాలిత ప్రాంతాల నుంచి వంద సంఘాలు, సంస్థల నుంచి 350 మంది ప్రతినిధులు హాజరు కావచ్చు. రిటైర్డ్ ఐఏఎస్ అధికారి కాకి మాధవరావు ఆధ్వర్యంలో ఆహ్వాన సంఘం ఏర్పడింది. సెంటర్ ఫర్ దళిత్ స్టడీస్ డైరెక్టర్ మల్లేపల్లి లక్ష్మయ్య జాతీయ సమ్మిట్‌ను హైదరాబాద్‌లో నిర్వహిస్తే సముచితంగా ఉంటుందని సూచించారు. సామాజిక ఉద్యమాలు, అభ్యుదయ భావాలకు హైదరాబాద్‌కు చారిత్రక నేపథ్యం ఉన్నది. ఆ వారసత్వాన్ని కొనసాగించాలి. దళిత చైతన్యానికి, దళిత ఐక్యతకు, ఇతర ప్రజా ఉద్యమాల్లో భాగస్వాములైన అనుభవం ఉంది. భారత దేశంలో మొదటి సారిగా ఎస్సీ, ఎస్టీ సబ్ ప్లాన్ సాధించిన చరిత్ర తెలుగు ప్రజలది. ఎస్సీ, ఎస్టీ సబ్ ప్లాన్ పోరాట సాధన సమితికి సబ్ ప్లాన్ గురించి మల్లేపల్లి లక్ష్మయ్య సూచనలు చేశారు. దళితుల విముక్తి పోరాటాల్లో అభ్యుదయవాదులు భాగస్వాములైన చరిత్ర తెలుగు ప్రజలది. దళితుల హక్కులు, రాజ్యాంగానికి సవాలుగా నిలిచిన హిందుత్వ శక్తులు తెలంగాణలోనూ విధ్వంసం చేయడానికి ప్రయత్నిస్తున్న సమయంలో హైదరాబాద్‌లో సమ్మిట్ నిర్వహించాలని నిర్ణయించాం.

ప్రశ్న...రెండు రోజుల పాటు షెడ్యూల్ ఎలా ఉంటుంది..?

బి.వెంకట్... దళిత ఎజెండా తయారు చేయడమే లక్ష్యంగా జరిగే రెండు రోజుల సమ్మిట్లో మొదటి రోజు ప్రారంభ సభ ఉంటుంది. వ్యవసాయ కార్మికుల నుంచి సంఘటిత కార్మికుల వరకు సమస్యలు - పరిష్కారాలు, దళిత ఎజెండా చర్చాపత్రంపై చర్చిస్తాం. హర్యానా ప్రభుత్వ అడిషనల్ చీఫ్ సెక్రెటరీ రాజశేఖర్ ఒంద్రూ డిస్కషన్ పేపర్‌ను ప్రవేశపెడతారు. చర్చ అనంతరం అందరి అభిప్రాయాలతో ఎజెండా రూపొందిస్తాం. ఒంద్రుతో పాటు రాష్ట్ర ఉన్నత విద్యా మండలి చైర్మెన్ ప్రొఫెసర్ లింబాద్రి పాల్గొంటారు. 27న మధ్యాహ్నం ముగింపు సమావేశంలో యుజీసీ చైర్మెన్ ప్రొఫెసర్ థొరాట్ ముఖ్య అతిథిగా హాజరవుతారు. దళిత ఎజెండా, దేశవ్యాప్త ఉద్యమ కార్యాచరణ, ఐక్య ప్రజా ఉద్యమంపై చర్చిస్తాం.

గోల్‌మాల్ భారత్‌మాల

(మొదటిపేజీ తరువాయి)

ఏమైనప్పటికీ, నేషనల్ హైవేస్ అథారిటీ ఆఫ్ ఇండియా(ఎన్‌హెచ్‌ఏఐ) 2019 మార్చిలో రూ. 1,566.30 కోట్ల బిడ్ ప్రాజెక్ట్ వ్యయంతో ఎటువంటి అభ్యంతరాలు లేకుండా బిడ్డర్ సాంకేతికంగా అర్హత సాధించినట్టు ప్రకటించించటం గమనార్హం. హైబ్రిడ్ యాన్యుటీ మోడల్ కింద, ప్రాజెక్ట్‌పై మొత్తం వ్యయంలో 40 శాతం ఎన్‌హెచ్‌ఏఐ చెల్లించింది. మిగిలిన 60 శాతం రోడ్ డెవలపర్ ద్వారా సమకూరుతుంది. కాగ్ నివేదికలో ఉన్న ఆరోపణలను అదానీ గ్రూప్ అధికార ప్రతినిధి తోసిపుచ్చారు.

బీజేపీ నేతకు సంబంధించిన కంపెనీ

2019, మార్చి 7న లక్నో రింగ్ రోడ్ ప్యాకేజీ 1 కోసం రూ. 904.31 కోట్ల అంచనా వ్యయంతో బిడ్‌లు జరిగాయి. విచిత్రమేమిటంటే, పీఎన్‌సీ ఇన్ఫోటెక్‌కు రూ. 1,062 కోట్లకు కాంట్రాక్టు లభించింది. ఇది అసలు అంచనా కంటే 17.44 శాతం ఎక్కువ. ఎన్‌హెచ్ఏఐ అసలు అంచనాలు 2016-17 షెడ్యూల్ రేట్ల ఆధారంగా ఉన్నాయి. ప్రాజెక్ట్ అంచనా వ్యయం తదనంతరం 2019 రేట్ల ఆధారంగా సవరించబడింది. అయితే, కాగ్ నివేదికలో వివరించిన విధంగా, జైన్ కంపెనీ బిడ్ అంచనాలను 2.02 శాతం మించిపోయింది.

ఐఆర్‌బీ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ నుంచి బీజేపీకి రూ.65 కోట్లు విరాళం

హాపూర్ బైపాస్-మొరాదాబాద్ హైవే ప్రాజెక్ట్ కోసం 68 శాతం తక్కువ ప్రీమియంతో ఎన్‌హెచ్‌ఏఐ కాంట్రాక్ట్‌ను గెలుచుకున్న ఐఆర్‌బీ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ డెవలపర్స్.. 2013 నుంచి బీజేపీకి సుమారు రూ. 65 కోట్లు విరాళంగా అందించింది. 97.77 కోట్ల వార్షిక ప్రీమియం, 22 సంవత్సరాల రాయితీ వ్యవధితో ఎన్‌హెచ్‌ఏఐ ప్రాజెక్ట్ కోసం బిడ్లను ఆహ్వానించారు. అయితే, 2018 మార్చిలో, ప్రభుత్వ ఏజెన్సీ కేవలం రూ. 31.50 కోట్ల వార్షిక ప్రీమియంతో ఐఆర్‌బీ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ బిడ్‌ను ఆమోదించించటం గమనార్హం. ఐఆర్‌బీ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ 2020-21లో బీజేపీకి రూ. 20 కోట్లు విరాళంగా అందించగా, దాని సంబంధిత మూడు కంపెనీలు 2013 నుంచి 2021 మధ్య కాలంలో బిజెపికి దాదాపు రూ. 45 కోట్లు విరాళంగా అందించాయి.

జే కుమార్ ఇన్‌ఫ్రాప్రాజెక్ట్స్ నుంచి బీజేపీకి రూ.6.46 కోట్లు విరాళం

2018, డిసెంబర్ 2018లో జే కుమార్ ఇన్‌ఫ్రాప్రాజెక్ట్స్ ద్వారకా ఎక్స్‌ప్రెస్‌వే ప్యాకేజీ 1 కోసం రూ. 1,349 కోట్ల కాంట్రాక్ట్‌ను గెలుచుకున్నది. ప్రతిపాదిత షరతు అభ్యర్థనను నెరవేర్చడంలో కంపెనీ విఫలమైనప్పటికీ ఇది జరిగిందని కాగ్ నివేదిక పేర్కొన్నది. 2013 నుంచి 2018 మధ్య, జే కుమార్ ఇన్‌ఫ్రాప్రాజెక్ట్స్ బీజేపీకి దాదాపు రూ. 6.46 కోట్లు విరాళంగా అందించింది. 2017-18లో రూ.5.25 కోట్లు, 2015-16లో రూ.కోటి, 2013-14లో రూ.21 లక్షలు ఇచ్చింది. 2015 రోడ్డు స్కామ్‌కు సంబంధించి జే కుమార్ ఇన్‌ఫ్రాప్రాజెక్ట్‌ను 2016లో బృహన్‌ముంబయి మున్సిపల్ కార్పొరేషన్ బ్లాక్‌లిస్ట్ చేసింది.

ఎంకేసీ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్, లార్సెన్ అండ్ టూబ్రో ద్వారా విరాళాలు

ఢిల్లీ-వడోదర ఎక్స్‌ప్రెస్‌వేకి సంబంధించి చోటు చేసుకున్న అవకతవకలను కూడా కాగ్ ఎత్తి చూపింది. బిడ్‌లు తప్పుడు అంచనాల ఆధారంగా ఆహ్వానించబడ్డాయని వివరించింది. ఈ ప్రాజెక్టుతో సంబంధమున్న కంపెనీల నుంచి కూడా బీజేపీకి విరాళాలు అందాయి. 2014-15లో లార్సెన్ అండ్ టూబ్రో బీజేపీకి రూ. 5 కోట్లు విరాళంగా ఇచ్చిందని తేలింది. 2018 నుంచి 2020 మధ్యకాలంలో ఎంకేసీ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ లిమిటెడ్ కాషాయ పార్టీకి రూ.75 లక్షలు విరాళంగా అందించింది. బీహార్‌లోని కిషన్‌గంజ్‌లో నిర్మాణంలో ఉన్న వంతెన కూలిపోవడంతో జీఆర్ ఇన్‌ఫ్రాప్రాజెక్ట్ గతేడాది జూన్‌లో వెలుగులోకి వచ్చింది.

అమెరికా మాజీ అధ్యక్షుడు ట్రంప్ అరెస్ట్

(మొదటిపేజీ తరువాయి)

ఫుల్టన్ కౌంటీ జైలుకు వెళ్లి ట్రంప్ లొంగిపోయారు. రెండు లక్షల డాలర్ల విలువైన బాండ్‌ను సమర్పించి బెయిల్ తీసుకొనేందుకు అట్లాంటా ఫుల్టన్ కౌంటీ డిస్ట్రిక్ట్ అటార్నీ ఫాని విల్లీస్ అనుమతించారు. దీంతో ఆ ప్రక్రియను పూర్తి చేసేందుకు ట్రంప్ జైలుకు వెళ్లారు. ట్రంప్ జైలులో 20 నిమిషాలు గడిపారు. ఖైదీగా ట్రంప్ మగ్ షాట్స్ ను అధికారులు తీసుకున్నారు. అనంతరం బెయిల్ పై ట్రంప్ బయటకొచ్చారు. ట్రంప్‌పై నమోదైన నాలుగు క్రిమినల్ కేసుల్లో ఇదొకటి. అమెరికా అధ్యక్ష ఎన్నికలకు సంబంధించి ఫలితాల్లో జోక్యం, కుట్ర వంటి కేసుల్లో ఆరోపణలు ఎదుర్కొంటున్న వ్యక్తులు తమంతట తాముగా పోలీసులు ఎదుట లొంగిపోయినా ఆ దేశంలో దాన్ని అరెస్ట్ కిందే పరిగణిస్తారు.

పోటీ చేసి తీరుతా..

(మొదటిపేజీ తరువాయి)

మీదుగా ఖమ్మం, వైరా, తల్లాడ, సత్తుపల్లి, మీదుగా తుమ్మల స్వగ్రామం దమ్మపేట మండలం గండుగులపల్లి వరకు ర్యాలీ సాగింది. దారిపొడవునా కార్యకర్తలు 'జై తుమ్మల...జై కాంగ్రెస్...ఖమ్మం జిల్లా తుమ్మల అడ్డా...' అంటూ నినాదాలు చేశారు.

ఓపెన్ టాప్ జీపు పైనుంచి దారిపొడవునా తుమ్మల అభివాదం చేస్తూ ముందుకు కదిలారు. ఖమ్మంలో విలేకరుల సమావేశంలో తుమ్మల మాట్లాడారు. ఏ పార్టీ అనేది స్పష్టం చేయకపోయినా కచ్చితంగా పోటీ చేస్తానని అన్నారు. తనకు పదవి అహంకారం...అలంకారం..ఆధిపత్యం కోసం కాదన్నారు. ప్రజలకు సేవ చేసేందుకేనని అన్నారు. నాగలి దున్నుకునే తనను మంత్రిని చేసిన ఖమ్మం జిల్లా ప్రజలకు రుణపడి ఉంటానన్నారు. అభిమానుల కోసమే తప్ప తనకు పాలిటిక్స్‌తో పనిలేదన్నారు. చివరిసారి శాసనసభలో అడుగుపెట్టి రాజకీయాల నుంచి వైదొలుగుదామని అనుకున్నానని తెలిపారు. తన రాజకీయ లక్ష్యాన్ని దెబ్బతీసేందుకు కొందరు పరాన్నభుక్కులు అడ్డుపడొచ్చు...జిల్లా ప్రజలు తనను గుండెల్లో పెట్టుకుని గెలిపిస్తారని చెప్పారు. తనను తప్పించామని కొందరు తాత్కాలిక శునకానందం పొందొచ్చని విమర్శించారు. 'నేను ఎన్నోసార్లు కిందపడ్డా...మళ్లీ మీ చేతులతో లేపి నన్ను ఎక్కడో నిలబెట్టారు..' అని అభిమానులను ఉద్దేశించి మాట్లాడారు. గోదావరి జలాలతో జిల్లా ప్రజల పాదాలు కడిగాక తాను రాజకీయ జీవితం నుంచి వైదొలుగుతానని చెప్పారు. తుమ్మల వల్ల ఈ ఉభయజిల్లాల్లో ఏ ఒక్కరూ తలవంచుకోవాల్సిన పరిస్థితి రాదన్నారు.

కాంగ్రెస్ వైపేనంటున్న అనుచరులు... నేడో రేపో నిర్ణయం

తుమ్మల ప్రధాన అనుచరులు మాట్లాడుతూ 'ఆయన కాంగ్రెస్‌లోకి వెళ్తారు...పాలేరు లేదా ఖమ్మం నుంచి పోటీ చేస్తారు...ఆయన ఏ నిర్ణయం తీసుకున్నా మేము ఆయన వెంటే ఉంటాం' అని ప్రకటించారు. తన వర్గీయులతో చర్చించిన తర్వాత శని లేదా ఆదివారాల్లో తుమ్మల నాగేశ్వరరావు తుది నిర్ణయం తీసుకుంటారని విశ్వసనీయ సమాచారం. ఇప్పటికే పీసీసీ అధ్యక్షులు రేవంత్‌రెడ్డి ఆయనకు టచ్‌లోకి వచ్చారనే వార్తలు వినిపిస్తున్నాయి. కేంద్రమాజీ మంత్రి రేణుకాచౌదరి కూడా తుమ్మల రాకను స్వాగతించారు. మరోవైపు బీజేపీ కూడా గాలం వేస్తోంది. తమ పార్టీలోకి రావాలని బీజేపీ నేతలు ఈటల రాజేందర్, పొంగులేటి సుధాకర్‌రెడ్డి వేర్వేరు చోట్ల ప్రెస్‌మీట్లలో తుమ్మలను ఆహ్వానించారు. అయితే తుమ్మల అభిమానులు మాత్రం ఎట్టిపరిస్థితుల్లో బీజేపీలో చేరేది లేదని తెగేసి చెబుతున్నారు. అనారోగ్యంతో బాధపడుతున్న తుమ్మలకు బీఆర్ఎస్ చేసిన భంగపాటు మరింతగా కుంగదీసినా...ఆయన కార్యకర్తల్లో మనోధైర్యం నింపేందుకు జిల్లాకు వచ్చారని అనుచరులు తెలిపారు. 40 ఏళ్ల సుదీర్ఘ రాజకీయ చరిత్ర ఉన్న తమ నేత ఈ ఎన్నికలతో రాజకీయాల నుంచి వైదొలగాలనే నిర్ణయాన్ని కేసీఆర్ దృష్టికి తీసుకెళ్లినా టిక్కెట్ కేటాయించకపోవడంపై ఆగ్రహం వ్యక్తం చేశారు.

ద్వైపాక్షిక వాణిజ్యాన్ని రెట్టింపు చేస్తాం

(మొదటిపేజీ తరువాయి)

శుక్రవారం చేరుకున్నారు. బ్రిక్స్ సమావేశాల కోసం దక్షిణాఫ్రికా వెళ్లిన మోడీ అక్కడ నుంచి నేరుగా ఏథెన్స్‌కు వెళ్లారు. ఆ దేశ విదేశాంగ మంత్రి జార్జ్ గెరాపెట్రిటిస్ మోడీకి స్వాగతం పలికారు. గ్రీక్‌లో భారత ప్రధాని పర్యటించడం 40 ఏళ్లలో ఇదే మొదటిసారి. శుక్రవారం గ్రీక్ ప్రధానమంత్రి కిరియాకోస్ మిత్సోటాకిస్‌తో భేటీ అయ్యారు. ఈ సందర్భంగా మోడీ మాట్లాడుతూ.. వాణిజ్యం, పెట్టుబడులు, రక్షణ, భద్రత, సాంకేతికత, మౌలిక సదుపాయాలు, విద్య, డిజిటల్ చెల్లింపులు, ఫార్మా, పర్యాటకం, వ్యవసాయం తదితర రంగాల్లో పరస్పర సహకారాన్ని పెంచుకోవాలని ఇరు దేశాలు నిర్ణయించినట్లు చెప్పారు. 'ఇరుదేశాల మధ్య రక్షణ పారిశ్రామిక సహకారాన్ని బలోపేతం చేసేందుకు అంగీకరించాం. జాతీయ భద్రతా సలహాదారుల స్థాయిలో చర్చల వ్యవస్థ ఏర్పాటుకు ముందుకొచ్చాం. ఉగ్రవాదాన్ని ఎదుర్కోవడంపైనా దృష్టి సారించాం. భారత్-గ్రీక్ మధ్య నైపుణ్య వలసలను సులభతరం చేసేందుకు ఒక ఒప్పందాన్ని కుదుర్చుకోవాలని నిర్ణయించాం' అని మోడీ తెలిపారు. గ్రీకు ప్రధానమంత్రి కిరియాకోస్ మిత్సోటాకిస్ మాట్లాడుతూ కొన్నేళ్లుగా భారత్‌తో తమ సంబంధాలు చాలా మెరుగుపడ్డాయని.. రెండు దేశాల మధ్య ఆర్థిక, రక్షణ, పర్యాటక రంగాల్లో విస్తృత సహకారానికి అవకాశం ఉందని అన్నారు.

రాష్ట్రానికి మరో భారీ పెట్టుబడి

- రూ.800కోట్లతో తన కార్యకలాపాలను
- విస్తరించనున్న మార్స్ గ్రూప్ సంస్థ
- పెట్స్ ఆహార ఉత్పత్తుల్లో ప్రసిద్ధి



నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్

తెలంగాణ రాష్ట్రానికి తాజాగా మరో భారీ పెట్టుబడి వచ్చి చేరింది. అంతర్జాతీయంగా పెంపుడు జంతువులు (పెట్స్) తినే ఆహార ఉత్పత్తుల్లో సుప్రసిద్ధమైన మార్స్ గ్రూప్ తెలంగాణలో అదనంగా మరో ఎనిమిది వందల కోట్ల రూపాయల పెట్టుబడి పెట్టేందుకు సంసిద్ధత వ్యక్తం చేసింది. మంత్రి కేటీఆర్‌తో మార్స్ సంస్థ చీఫ్ డేటా అండ్ అనలిటిక్స్ ఆఫీసర్ శేఖర్ కష్ణమూర్తి బందం శుక్రవారం సమావేశమైంది. ఈ సందర్భంగా సంస్థ తన విస్తరణ ప్రణాళికలను, నూతన పెట్టుబడి గురించిన వివరాలను ప్రకటించింది. ఈ సందర్భంగా సంస్థ ప్రతినిధి బందం తెలంగాణ రాష్ట్రంలో తమ పెట్టుబడి, కార్యకలాపాల అనుభవాలను వివరించి సంతప్తిని వ్యక్తం చేసింది. ఇప్పటికే తమ సంస్థ సిద్దిపేటలో ఉన్న పెంపుడు జంతువుల (పెట్స్) ఫుడ్ తయారీ ప్లాంట్ ద్వారా పెద్ద ఎత్తున కార్యకలాపాలను నిర్వహిస్తున్నామని తెలిపింది. తొలుత కేవలం రూ.200 కోట్ల పెట్టుబడితో సంస్థ సిద్దిపేటలో కార్యకలాపాలను ప్రారంభించింది. ఆ తర్వాత 2021 డిసెంబర్‌లో తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వంతో మార్స్ సంస్థ ఒక అవగాహన ఒప్పందాన్ని కుదుర్చుకుని ఇందులో భాగంగా రూ.500కోట్లతో తమ కార్యకలాపాలను విస్తరిస్తామని ప్రకటించింది. ఒప్పందం మేరకు రూ.500 కోట్ల పెట్టుబడిని పూర్తి చేసింది. తెలంగాణ రాష్ట్రంలో తమ కార్యకలాపాల అనుభవాలు, పెట్టుబడి స్నేహపూర్వక వాతావరణం, ప్రభుత్వ విధానాల వంటి అనేక సానుకూల కారణాల వలన తాజాగా మరో రూ.800 కోట్ల పెట్టుబడి విస్తరణ ప్రణాళికలను ప్రకటించింది.

భారతదేశంలో తమ సంస్థ ఉత్పత్తులకు అద్భుతమైన స్పందన వస్తుందని పెట్ కేర్, పెట్ ఆహార ఉత్పత్తుల డిమాండ్ మరింత పెరుగుతుందన్న ఆలోచనలకు అనుగుణంగా తెలంగాణ కేంద్రంగా సంస్థలు మరింతగా విస్తరించనున్నట్టు తెలిపింది. కేవలం ఉత్పత్తి తయారీ ప్లాంట్ విస్తరణ మాత్రమే కాకుండా రీసెర్చ్ అండ్ డెవలప్‌మెంట్, డిజిటల్ ట్రాన్స్‌ఫర్మేషన్, అగ్రికల్చర్ సప్లైచైన్, ఇన్నోవేషన్ అండ్ సస్టైనబిలిటీ వంటి వివిధ రంగాల్లోనూ తమ విస్తరణకు ఉన్న అవకాశాలను మంత్రి కేటీఆర్‌తో జరిగిన ఈ సమావేశంలో కష్ణమూర్తి బందం విస్తతంగా చర్చించింది. ఇప్పటికే సిద్దిపేటలో తయారీ ప్లాంట్ ఉన్న మార్స్ సంస్థ భారీగా పెట్టుబడి పెట్టి మరింతగా విస్తరిస్తుండటం పట్ల మంత్రి కేటీఆర్ హర్షం వ్యక్తం చేశారు. తెలంగాణ రాష్ట్రానికి కొత్త కంపెనీల పెట్టుబడులు రావడం ఎంత ముఖ్యమైన అంశంగా భావిస్తామో, ఇక్కడే కార్యకలాపాలు నిర్వహిస్తున్న కంపెనీలు కూడా తిరిగి తెలంగాణలో పెట్టుబడి పెట్టాలన్నది తమ ఆలోచనగా ఉన్నదని తెలిపారు . ఈ దిశగా ఇప్పటికే తెలంగాణ కేంద్రంగా కార్యకలాపాలు నిర్వహిస్తున్న అనేక కంపెనీలు పెద్ద ఎత్తున తిరిగి రాష్ట్రంలో పెట్టుబడులు పెట్టుతున్నాయని, తద్వారా భారీగా ఉపాధి అవకాశాలు లభిస్తున్న విషయాన్ని ఈ సందర్భంగా కేటీఆర్ ప్రస్తావించారు. ఒక కంపెనీ తాను కార్యకలాపాలు నిర్వహిస్తున్న ప్రాంతంలో తిరిగి పెట్టుబడులు పెట్టడం అంటే ఆ ప్రాంతంలో ఉన్న పారిశ్రామిక అనుకూల వాతావరణానికి సూచిక అని తెలిపారు. భారీ ఎత్తున పెట్టుబడి పెట్టి తమ సంస్థను విస్తరిస్తున్న మార్స్ గ్రూప్ సంస్థకు మంత్రి కేటీఆర్ ధన్యవాదాలు తెలిపారు. కేవలం రూ.200 కోట్ల పెట్టుబడితో ప్రారంభమైన సంస్థ ప్రస్థానం నేటి రూ.800కోట్ల విస్తరణ ప్రణాళికలతో రూ.1500 కోట్ల స్థాయికి చేరిందని, ఇది తెలంగాణ రాష్ట్రంలో పరిశ్రమల ఏర్పాటుకు ఉన్న అనుకూలతను వివరిస్తుందన్నారు. భవిష్యత్తులోనూ సంస్థ మరింతగా తెలంగాణ కేంద్రంగా విస్తరిస్తున్నదన్న ఆశాభావాన్ని వ్యక్తం చేశారు.

హైదరాబాద్‌లో

ఓమ్నికాం గ్రూప్ గ్లోబల్ కేపబిలిటీ సెంటర్

అంతర్జాతీయంగా పేరుగాంచిన ప్రఖ్యాత ఓమ్నికాం గ్రూప్ హైదరాబాద్ నగరంలో తన గ్లోబల్ క్యాపిటల్‌ను ఏర్పాటు చేసేందుకు ముందుకొచ్చింది. శుక్రవారం మంత్రి కేటీఆర్ న్యూయార్క్ నగరంలో ఓమ్నికాం సీనియర్ ప్రతినిధి బందంతో సమావేశమయ్యారు. సంస్థ తన గ్లోబల్ కేపబిలిటీ సెంటర్‌ను హైదరాబాద్ నగరంలో ఏర్పాటు చేయాలని ప్రకటించడం పట్ల మంత్రి కేటీఆర్ హర్షం వ్యక్తం చేశారు. మే నెలలో సంస్థతో జరిగిన ప్రాథమిక చర్చల్లో ఈ కేంద్రం ఏర్పాటు కోసం కంపెనీకి విజ్ఞప్తి చేశామన్నారు. హైదరాబాద్ నగరంలో మీడియా అనుబంధ రంగాల్లో అందుబాటులో ఉన్న మానవ వనరుల నైపుణ్యాన్ని, మౌలిక వసతుల అంశాన్ని వివరించామని ఈ సందర్భంగా గుర్తు చేశారు. దీంతోపాటు కంపెనీ గ్లోబల్ కేపబిలిటీ సెంటర్లకు అవసరమైన అన్ని రకాల సహాయ సహకారాలను అందిస్తామని తెలిపామని, మీడియా అనుబంధ రంగాల్లో ఇన్నోవేషన్, వృద్ధికి తెలంగాణ ప్రభుత్వం కట్టుబడి ఉన్నదని తెలిపారు. ఈ దిశగా ఓమ్నికాం సంస్థ ప్రకటన ఎంతగానో దోహదం చేస్తుందని కేటీఆర్ అన్నారు. ఈ కేంద్రం ఏర్పాటు చేయడం ద్వారా 2500 మందికిపైగా ఉద్యోగ అవకాశాలు రానున్నాయని, ఇది తనకు అత్యంత సంతోషాన్ని ఇస్తుందని తెలిపారు.

భారతదేశంలో పాటు అంతర్జాతీయంగా అనేక ఇతర నగరాలను పరిశీలించిన తర్వాత హైదరాబాద్‌లో తమ గ్లోబల్ కేపబిలిటీ సెంటర్‌ను ఏర్పాటు చేయాలని నిర్ణయించుకున్నట్టు సంస్థ గ్లోబల్ ఎగ్జిక్యూటివ్ వైస్ ప్రెసిడెంట్ జైద్ ఆల్ రషీద్ తెలిపారు. తమ సంస్థ కార్యకలాపాలు 100 దేశాల్లో కొనసాగుతున్నాయని, ఇదే దిశగా భారత దేశంలోనూ తమ కార్యకలాపాలను మరింత విస్తరించేందుకు ఈ గ్లోబల్ కేపబిలిటీ సెంటర్ ఏర్పాటు సహకరిస్తుందన్నారు. ఈ కేంద్రం కార్యకలాపాల ద్వారా తమ సంస్థ మీడియా రంగంలో లక్ష్యాలకు అనుగుణంగా అనుకున్న వృద్ధిని సాధిస్తుందన్న ఆశాభావాన్ని వ్యక్తం చేశారు. మే నెల నుంచి నిరంతరం తెలంగాణ ప్రభుత్వంలోని స్వయంగా మంత్రి కార్యాలయం నుంచి ఈ గ్లోబల్ కేపబిలిటీ సెంటర్ ఏర్పాటు కోసం చర్చలు కొనసాగాయని తెలిపారు. తమ సంస్థ గ్లోబల్ కేపబిలిటీ సెంటర్ ఏర్పాటుకు సహకరిస్తున్న తెలంగాణ ప్రభుత్వానికి ఈ సందర్భంగా ధన్యవాదాలు తెలిపారు.

సరికొత్త చరిత్ర

అథ్లెటిక్స్ ప్రపంచ చాంపియన్‌షిప్స్

- జావెలిన్ పతక పోరుకు ముగ్గురు అథ్లెట్స్
- అర్హత రౌండ్‌లో సత్తా చాటిన నీరజ్ చోప్రా
- 88.77 మీ త్రోతో ఒలింపిక్ బెర్త్ కైవసం
- డిపి మను, కిశోర్ జెనాలు సైతం అర్హత

అథ్లెటిక్స్ సూపర్‌స్టార్, బల్లెం వీరుడు నీరజ్ చోప్రా సత్తా చాటాడు. ప్రపంచ అథ్లెటిక్స్ చాంపియన్‌షిప్స్ అర్హత రౌండ్లోనే అదరగొట్టే ప్రదర్శన చేశాడు. అర్హత రౌండ్‌లో సింగిల్ త్రో విసిరిన నీరజ్ చోప్రా 88.77 మీటర్లతో 2024 పారిస్ ఒలింపిక్స్ బెర్త్‌తో పాటు ఈవెంట్ పతక పోరుకు చేరుకున్నాడు. మరో ఇద్దరు భారత అథ్లెట్లు డిపి మను, కిశోర్ జెనాలు సైతం ఫైనల్స్‌కు చేరుకున్నారు.

బుడాపెస్ట్ (అజర్‌బైజాన్) : భారత స్టార్ జావెలిన్ త్రో అథ్లెట్ నీరజ్ చోప్రా ప్రపంచ అథ్లెటిక్స్ చాంపియన్‌షిప్స్‌లో డబుల్ డిలైట్ అందించాడు. పురుషుల జావెలిన్ త్రో అర్హత రౌండ్‌లో సింగిల్ త్రోతో అదరగొట్టిన నీరజ్ చోప్రా.. ఒకే త్రోతో ఫైనల్లోకి అడుగుపెట్టడంతో పాటు 2024 పారిస్ ఒలింపిక్స్‌కు అర్హత సాధించాడు. ఒలింపిక్స్ అర్హత మార్క్‌ను 85.50 మీటర్లుగా నిర్ణయించగా, జులై 1 నుంచి అర్హత ప్రక్రియ మొదలైంది. అర్హత రౌండ్‌లో 88.77 మీటర్లు బల్లెంను విసిరిన నీరజ్ చోప్రా.. అగ్రస్థానంలో నిలిచి పతక పోరుకు చేరుకున్నాడు. తాజా సీజన్‌లో నీరజ్ చోప్రా అత్యుత్తమ ప్రదర్శన ఇదే కావటం గమనార్హం. అథ్లెటిక్స్ ప్రపంచ చాంపియన్‌షిప్స్ ఫైనల్లో ముగ్గురు భారతీయ అథ్లెట్లు పతక వేటలో నిలువటం ఇదే తొలిసారి. భారత అథ్లెటిక్స్‌లో ఇదో చారిత్రక మైలురాయిగా అభివర్ణించవచ్చు!.

మరో ఇద్దరు : అర్హత రౌండ్‌లో నీరజ్ చోప్రా పెద్దగా చెమటోడ్చలేదు. కేవలం ఒకే ఒక్క ప్రయత్నంలో ఫైనల్లో బెర్త్ ఖాయం చేసుకున్నాడు. 25 ఏండ్ల నీరజ్ చోప్రా.. తొలి ప్రయత్నంలో 88.88 మీటర్ల త్రో విసిరాడు. పతక పోరుకు ఆటోమెటిక్ అర్హత మార్క్ 83 మీటర్లు కాగా.. మరో ప్రయత్నం చేయకుండానే నీరజ్ చోప్రా నిష్క్రమించాడు. గ్రూప్-ఏలో నీరజ్ చోప్రాతో పాటు పోటీపడిన డిపి మను రెండో ప్రయత్నంలో 81.31 మీటర్లతో మూడో స్థానంలో నిలిచాడు. గ్రూప్-బిలో పోటీపడిన కిశోర్ జెనా 80.55 మీటర్ల దూరంతో పతక పోరుకు అర్హత సాధించాడు. ఓవరాల్‌గా ఫైనల్స్‌కు అర్హత సాధించిన జాబితాలో సైతం నీరజ్ చోప్రా అగ్రస్థానంలో నిలిచాడు. పాకిస్థాన్ అథ్లెట్ అర్షద్ నదీమ్ 86.79 మీటర్లతో రెండో స్థానంలో నిలువగా.. చెక్ రిపబ్లిక్ అథ్లెట్ జాకుబ్ (83.50 మీటర్లు), జులెన్ వెబర్ (జర్మనీ) 82.39 మీటర్లు, ఎడిస్ (లూథియాన) 82.35 మీటర్లు, డిపి మను 81.31 మీటర్లు, డెవిడ్ వెగ్నర్ (పోలాండ్) 81.25 మీటర్లు, ఇహబ్ (ఈజిప్ట్) 80.75 మీటర్లు, కిశోర్ జెనా 80.55 మీటర్లు, ఒలీవర్ (ఫిన్లాండ్) 80.19 మీటర్లు, హెర్మన్ (బెల్జియం) 80.11 మీటర్లు, ఆండ్రియన్ (మల్డోవ) 79.78 మీటర్లు టాప్-12లో నిలిచి ఫైనల్స్‌కు అర్హత సాధించారు.



తగ్గేదేలే.. : 2024 ఒలింపిక్స్‌కు నీరజ్ చోప్రా అర్హత

ఇక అర్హత రౌండ్లో అగ్రస్థానంలో నిలిచిన నీరజ్ చోప్రా.. సింగిల్ త్రోతో ఒలింపిక్స్‌కు అర్హత సాధించటంతో పాటు సీజన్‌లో ఉత్తమ ప్రదర్శన కనబరిచాడు. అర్హత రౌండ్ అనంతరం మీడియాతో మాట్లాడిన నీరజ్ చోప్రా.. చంద్రయాన్-3, ప్రజ్ఞానంద నుంచి స్ఫూర్తి పొందుతానని వెల్లడించాడు. 'చంద్రయాన్-3 భారత్ గర్వపడేలా చేసింది. చంద్రయాన్ విజయం నుంచి స్ఫూర్తి పొందుతాను. అలాగే చెస్ ప్రపంచకప్ ఫైనల్లో రమేశ్‌బాబు ప్రజ్ఞానంద చాలా బాగా ఆడాడు. మాగ్నస్ కార్ల్‌సన్‌కు గట్టి పోటీ ఇచ్చాడు. అతడి ఆట నుంచీ స్ఫూర్తి పొందుతాను' అని నీరజ్ చోప్రా అన్నాడు.

పసిడి త్రయం

- ప్రపంచ చాంపియన్‌షిప్స్



న్యూఢిల్లీ : భారత షూటర్లు టియాన, సాక్షి సూర్యవన్షి, కిరణ్‌దీప్ కౌర్ త్రయం పసిడి పతకం సాధించారు. ఐఎస్ఎస్ఎఫ్ ప్రపంచ చాంపియన్‌షిప్స్ మహిళల 50 మీటర్ల పిస్టల్ ఈవెంట్‌లో భారత త్రయం బంగారు మెడల్ కైవసం చేసుకుంది. పసిడి వేటలో 1573 పాయింట్లు సాధించిన భారత్ స్వర్ణం సాధించగా.. 1567 పాయింట్లతో చైనా సిల్వర్, 1566 పాయింట్లతో మంగోలియా కాంస్యం దక్కించుకున్నాయి. ఈ పసిడితో ఓవరాల్‌గా ఆరు స్వర్ణాలు, ఎనిమిది కాంస్యాలతో 14 పతకాలు సాధించిన భారత్ పతకాల పట్టికలో రెండో స్థానంలో నిలిచింది.

సాత్విక్ జోడీ ఓటమి


ప్రపంచ చాంపియన్‌షిప్స్

కోపెన్‌హాగన్ : ప్రపంచ బ్యాడ్మింటన్ చాంపియన్‌షిప్స్‌లో వరల్డ్ నం.2 సాత్విక్‌సాయిరాజ్ రాంకిరెడ్డి, చిరాగ్ శెట్టి పతక వేటకు తెరపడింది. పురుషుల డబుల్స్ క్వార్టర్‌ఫైనల్లో సాత్విక్, చిరాగ్ జోడీ నిరాశపరిచింది. రెండో సీడ్ మన షట్లర్లు.. క్వార్టర్స్‌లో 11వ సీడ్ డెన్మార్క్ షట్లర్లు కిమ్, ఆండర్స్ చేతిలో వరుస గేముల్లో ఓటమి పాలయ్యారు. 18-21, 19-21తో సాత్విక్, చిరాగ్‌లు అనూహ్య ఓటమి చవిచూశారు.

భారత్ జంబో జట్టు!

- ఆసియా క్రీడలకు 634 అథ్లెట్లు
- ప్రకటించిన క్రీడామంత్రిత్వ శాఖ

నవతెలంగాణ-న్యూఢిల్లీ



19వ ఆసియా క్రీడల సెంట్రల్ వెలోడ్రోమ్ స్టేడియం

2022 హాంగ్జౌ ఆసియా క్రీడలకు టీమ్ ఇండియా జంబో జట్టును పంపుతోంది. సెప్టెంబర్ 23 నుంచి అక్టోబర్ 8 వరకు చైనా వేదికగా జరుగున్న ప్రతిష్టాత్మక మల్టీస్పోర్ట్స్ ఈవెంట్‌కు భారత్ 634 మంది అథ్లెట్లను పంపిస్తోంది. ఈ మేరకు భారత క్రీడా మంత్రిత్వ శాఖ శుక్రవారం అధికారికంగా వెల్లడించింది. భారత ఒలింపిక్ సంఘం (ఐఓఏ) 850 మంది అథ్లెట్లను ఆసియా క్రీడలకు అర్హులని సిఫారసు చేయగా.. ఆసియా క్రీడల్లో పాల్గొనేందుకు సరికొత్త రూల్స్ రూపొందించిన సాయ్, క్రీడాశాఖ 219 మంది అథ్లెట్లను ఆసియా క్రీడలకు పంపించేందుకు నిరాకరించింది. 38 క్రీడాంశాల్లో 634 మంది అథ్లెట్లు పతక పోటీలో నిలుస్తారని భారత క్రీడా మంత్రిత్వ శాఖ శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపింది. 2018 జకర్తా ఆసియా క్రీడల్లో భారత్ నుంచి 572 మంది క్రీడాకారులు పోటీపడ్డారు. 16 స్వర్ణాలు సహా 70 పతకాలు స్వదేశానికి తీసుకొచ్చారు. క్రీడాశాఖ రూల్స్ కారణంగా టీమ్ ఈవెంట్స్, వ్యక్తిగత విభాగాల్లో ప్రతిభావంతులైన అథ్లెట్లు 19వ ఆసియా క్రీడలకు దూరమయ్యారు. తెలంగాణ సాఫ్ట్‌బాల్ క్రీడాకారిణి మమత సైతం క్రీడాశాఖ నిబంధనలతో.. ఆసియా క్రీడల్లో పోటీపడటం లేదు.

రేసులో మనోళ్లు : 19వ ఆసియా క్రీడల్లో తెలుగు రాష్ట్రాల నుంచి గణనీయ సంఖ్యలో క్రీడాకారులు పోటీపడుతున్నారు. బ్యాడ్మింటన్‌లో పి.వి సింధు, కిదాంబి శ్రీకాంత్, సాత్విక్‌సాయిరాజ్ రాంకిరెడ్డి, సాయి ప్రతీక్ కృష్ణ ప్రసాద్, పుల్లెల గాయత్రి, సిక్కి రెడ్డి రేసులో నిలువగా.. జ్యోతి సురేఖ, వృతి అగర్వాల్, నందిని అగసర, జ్యోతి ఎర్రాజి పతక వేటలో ఉన్నారు. నిఖత్ జరీన్, ఇషా సింగ్, ఆకుల శ్రీజ, హరికృష్ణ, కోనేరు హంపి, ద్రోణవల్లి హరిక, సౌమ్య గగులోతు, తిలక్ వర్మ, శివ కుమార్, బాతుల సంజన, అంజలి శర్వాణి, బారెడ్డి అనూష, కొంగర ప్రీతి, జి గీతాంజలిలు ఆసియా క్రీడల్లో పోటీపడనున్న జాబితాలో ఉన్న తెలుగు క్రీడాకారులు.

నవచిత్రం

మాకే కాదు.. తెలుగు చిత్ర సీమకీ గర్వకారణమే

'అల్లు అర్జున్‌కి జాతీయ ఉత్తమ నటుడు అవార్డ్ రావడం ఆనందంగా ఉంది. 69ఏళ్లలో తొలిసారి ఒక తెలుగు హీరోకి జాతీయ అవార్డు రావడం, అందులోనూ మేము నిర్మించిన 'పుష్ప' చిత్రానికి ఈ అవార్డు అందుకోవడం చాలా గర్వంగా ఉంది. ఇదొక చరిత్రగా నిలిచిపోతుంది' అని మైత్రీ మూవీ మేకర్స్ నిర్మాతలో ఒకరైన నవీన్ యెర్నేని అన్నారు.



నవీన్ యెర్నేని, బుచ్చిబాబు సానా, వై.రవిశంకర్

కేంద్రప్రభుత్వం ప్రకటించిన 69వ జాతీయ చలనచిత్ర అవార్డుల్లో మైత్రీ మూవీ మేకర్స్ నిర్మించిన 'పుష్ప: ది రైజ్', ఉప్పెన చిత్రాలు 2021 సంవత్సరానికిగానూ మూడు జాతీయ జాతీయ వార్డులని కైవశం చేసుకున్నాయి.

'పుష్ప: ది రైజ్'లో నటనకు గానూ జాతీయ ఉత్తమ నటుడు అవార్డును అల్లు అర్జున్ సొంతం చేసుకున్నారు. అలాగే ఈ చిత్రానికి సంగీతం అందించిన దేవిశ్రీ ప్రసాద్ ఉత్తమ సంగీతం దర్శకుడిగా అవార్డ్‌ని సొంతం చేసుకున్నారు. ఇక జాతీయ ఉత్తమ తెలుగు చిత్రంగా 'ఉప్పెన' చిత్రం అవార్డ్‌ని దక్కించుకుంది.

ఈ సందర్భంగా నిర్మాత నవీన్ యెర్నేని మాట్లాడుతూ, 'పుష్ప సినిమా షూటింగ్ సమయంలోనే అల్లు అర్జున్ తప్పకుండా నేషనల్ అవార్డ్ కొడతారని సుకుమార్ అనేవారు. అది ఈ రోజు నిజమైంది. అలాగే దేవిశ్రీ ప్రసాద్‌కి జాతీయ అవార్డ్ రావడం ఆనందంగా ఉంది. 'ఉప్పెన' సినిమాకి ఉత్తమ తెలుగు సినిమాగా జాతీయ అవార్డ్ రావడం గర్వంగా ఉంది' అని తెలిపారు. 'పుష్ప, ఉప్పెన మా బ్యానర్‌లో చాలా ప్రతిష్టాత్మక చిత్రాలు. చిరంజీవి 'ఉప్పెన' కథ విని, బావుందని చెప్పి ఎంతో ప్రోత్సహించారు. బుచ్చిబాబు సానా అద్భుతంగా తీశారు. 70 ఏళ్ల చరిత్రలో జాతీయ అవార్డ్ అందుకున్న తొలి తెలుగు నటుడిగా పుష్పతో అల్లు అర్జున్ చరిత్ర సృష్టించారు. మాకే కాదు తెలుగు సినిమా చరిత్రలో ఇది ఇది చిరకాలం గుర్తుండిపోతుంది' అని మరో నిర్మాత వై రవిశంకర్ చెప్పారు.

> నా తొలి సినిమాకే జాతీయ అవార్డు రావడం ఆనందంగా ఉంది. చిరంజీవి 'ఉప్పెన' కథ విన్న తర్వాత తప్పకుండా దీనికి జాతీయ అవార్డ్ వస్తుందని చెప్పారు. ఆయన మాట నిజమైంది. మా టీమ్ అందరికీ చాలా గర్వంగా ఉంది.
> - దర్శకుడు బుచ్చిబాబు సానా

తెలుగు సినిమా సత్తాకి నిదర్శనం

'అల్లు అర్జున్ సాధించిన ఈ అద్భుతమైన విజయం నాకు నిజంగా ఆశ్చర్యాన్ని కలిగించలేదు. ఆయన జాతీయ అవార్డును కైవసం చేసుకోవడంతో పాటు, ఈ ఘనత సాధించిన మొదటి తెలుగు నటుడిగా నిలవడం గర్వంగా ఉంది. అతని అసాధారణమైన ప్రతిభను, నిబద్ధతను గుర్తించే మరిన్ని పురస్కారాలతో అలంకరించబడిన భవిష్యత్తు దగ్గర్లోనే ఉంది' అని రచయిత, దర్శకుడు త్రివిక్రమ్ శ్రీనివాస్ అన్నారు.



త్రివిక్రమ్

జాతీయ స్థాయిలో తెలుగు సినిమా సత్తా చాటిన నేపథ్యంలో ఆయన మాట్లాడుతూ, 'కమర్షియల్ సినిమా పాటలకు కొత్త అర్థం చెప్పిన దిగ్గజ స్వరకర్త ఎం.ఎం. కీరవాణి 'ఆర్‌ఆర్‌ఆర్' వంటి స్మారక చిత్రానికి గానూ ఒకే ఏడాది అటు ఆస్కార్, ఇటు జాతీయ పురస్కారం గెలుచు కోవడం అభినందించదగ్గ విషయం. కాలభైరవ, శ్రీనివాస్ మోహన్, ప్రేమ్ రక్షిత్, కింగ్ సోలమన్‌లకు అభినందనలు. ముఖ్యంగా మన తెలుగు సినిమా కీర్తిని జాతీయ, అంతర్జాతీయ స్థాయికి తీసుకెళ్ళిన ఎస్.ఎస్.రాజమౌళికి ధన్య వాదాలు. తమ తొలి చిత్రం 'ఉప్పెన'తో జాతీయ అవార్డును గెలుచుకున్న బుచ్చిబాబు, పంజా వైష్ణవ్ తేజ్‌లకు శుభాకాంక్షలు. అలాగే, గీత రచయిత చంద్రబోస్ 'కొండపొలం' సినిమాకు జాతీయ అవార్డు అందుకోవడం ఆనందంగా ఉంది. స్వరకర్త దేవిశ్రీ ప్రసాద్ జాతీయ అవార్డును గెలుచుకోవడం నాకు హృదయం సంతోషంతో నిండిన క్షణం' అని తెలిపారు.

దసరా కానుకగా రిలీజ్

శివరాజ్ కుమార్ హీరోగా పాన్ ఇండియా స్థాయిలో రూపొందుతున్న హై ఓల్టేజ్ యాక్షన్ థ్రిల్లర్ చిత్రం 'ఘోస్ట్'. శ్రీని ఘోస్ట్ దర్శకుడు. పొలిటీషియన్, నిర్మాత సందేశ్ నాగరాజ్ తన సందేశ్ ప్రొడక్షన్స్ బ్యానర్ పై ఈ చిత్రాన్ని ప్రతిష్టాత్మకంగా నిర్మిస్తున్నారు.

ఈ చిత్రాన్ని ప్రపంచవ్యాప్తంగా అక్టోబర్ 19న దసరా కానుకగా విడుదల చేయనున్నారు. రిలీజ్ డేట్‌ని ఆకట్టుకునే పోస్టర్‌తో మేకర్స్ అనౌన్స్ చేశారు.




శివరాజ్ కుమార్

ఆకట్టుకునే ప్రచార చిత్రాలతో పాటు, ఇటీవల బ్లాక్‌బస్టర్ 'జైలర్'లో శివన్న పాత్రకు వచ్చిన ట్రెమండస్ రెస్పాన్స్ ఈ సినిమాపై మరింత హైప్‌ను తీసుకొచ్చింది. ఇతర భాషల్లో 'ఘోస్ట్' రైట్స్ కోసం పెద్ద పెద్ద బ్యానర్‌ల నుండి ఆఫర్స్ వస్తున్నాయి. చిత్ర బృందం అక్టోబర్ రెండవ వారం నుండి దేశవ్యాప్తంగా స్పెషల్ ప్రీమియర్స్ ప్లాన్ చేస్తున్నారు. అలాగే సెప్టెం బర్ రెండవ వారంలో ట్రైలర్ రిలీజ్ చేస్తున్నారు.అనుపమ్ ఖేర్, జయరామ్, ప్రశాంత్ నారాయణ్, అర్చన జాయిస్, సత్య ప్రకాష్, దత్తన్న ప్రధాన పాత్రల్లో కనిపిస్తారు. కన్నడ, తెలుగు, హిందీ, తమిళ్, మలయాళం భాషల్లో అక్టోబర్ 19న దసరాకు ఈ సినిమా ప్రేక్షకుల ముందుకి రానుంది.

మెప్పించే నా..నీ ప్రేమకథ

అముద శ్రీనివాస్ హీరోగా స్వీయ దర్శకత్వంలో రూపొందించిన చిత్రం 'నా.. నీ ప్రేమ కథ'. కారుణ్య చౌదరి కథానాయిక. పోత్నాక్ శ్రవణ్ కుమార్ ఎంటర్‌టైన్‌మెంట్స్ పతాకంపై పోత్నాక్ శ్రవణ్ కుమార్ ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నారు. సెప్టెంబర్ 2న ఈ సినిమా విడుదలకు సిద్ధమైన నేపథ్యంలో చిత్ర యూనిట్ ప్రీ రిలీజ్ నిర్వహించింది. ఈ ప్రెస్‌మీట్‌లో చిత్ర బృందంతో పాటు టీఎఫ్‌పీసీ సెక్రటరి ప్రసన్న కుమార్, రామకృష్ణ గౌడ్, శోభారాణి తదితరులు పాల్గొన్నారు.



ఈ సందర్భంగా అముద శ్రీనివాస్ మాట్లాడుతూ, 'వాస్తవ సంఘటనలు ఆధారంగా తీసిన చిత్రమిది. నటుడిగా, దర్శకుడిగా పని చేయడం ఒక సవాల్. మా డీవోపీతో పాటు చిత్ర బృందం అంతా ఎంతో సహకరించింది. నిర్మాత శ్రవణ్ కుమార్ ఎక్కడా రాజీపడకుండా సినిమాకి కావాల్సింది సమకూర్చారు. ఇందులో హీరో పాత్ర పేపర్ బాయ్, హీరోయిన్ డాక్టర్. వారి మధ్య ప్రేమ ఎలా పుట్టింది అనేది చాలా ఆసక్తికరంగా ఉంటుంది. ప్రేమ ఎలా అయినా పుట్టొచ్చు అనేది ఇందులో చిత్రీకరించాం. యూత్, ఫ్యామిలీ అందరూ చూడాల్సిన మూవీ ఇది' అని తెలిపారు. 'తెలుగు రాష్ట్రాలలో చాలా ప్రాంతాల్లో షూటింగ్ జరిపాం. సినిమా చాలా అద్భుతంగా వచ్చింది' అని నిర్మాత పోత్నాక్ శ్రవణ్ కుమార్ అన్నారు.

అనుభవమే ఆ బలాన్నిస్తుంది.. ఎలాంటి గైడెన్స్ లేదు: సమంత



మంచైనా, చెడైనా పాజిటివ్‌గా తీసుకునే బలాన్ని తాను గడించిన అనుభవమే ఇస్తుందన్నారు ప్రముఖ నటి సమంత. ఈ విషయంలో తనకెలాంటి గైడ్, బుక్ లేదని సరదాగా చెప్పారు. 'ఖుషి' సినిమా ప్రచారంలో భాగంగా తమిళ ఇంటర్వ్యూలో పాల్గొన్న ఆమె ఈ వ్యాఖ్యలు చేశారు. ఈ సినిమాలో పలు పార్శ్వాలు, సరికొత్త సన్నివేశాలు ఉంటాయని సమంత తెలిపారు. గతంలో.. 'మహానటి' చిత్రంలో విజయ్ దేవరకొండతో కలిసి నటించానని చెబుతూ నాటి జ్ఞాపకాలు గుర్తుచేసుకున్నారు. ఈ సినిమా కోసం సమంత పడిన కష్టాన్ని మాటల్లో చెప్పలేనని, సెప్టెంబరు 1న సమంత ముఖంలో నవ్వు చూడాలనుందని విజయ్ 'ఖుషి మ్యూజికల్ ఈవెంట్'లో చెప్పిన సంగతి తెలిసిందే. సినిమా గురించి విజయ్ మాట్లాడుతూ.. 'ఖుషి'లో నటించడం సంతోషంగా ఉంది. ఒకానొక సమయంలో ప్రేమకథా చిత్రాలను చేయకూడదనుకున్నా. కానీ, కొన్ని కారణాల వల్ల ఈ చిత్రంలో నటించా. ఈ సినిమా స్క్రిప్టు నాకు బాగా నచ్చింది. ప్రతి ఒక్కరికీ ఈ కథ కనెక్ట్ అవుతుందని అనుకుంటున్నా. శివ దర్శకత్వంలో నేను తొలిసారి నటించా. ఆయనతో కలిసి సమంత బ్లాక్ బస్టర్ చిత్రానికి (మజిలీ) పనిచేసింది. చిత్రీకరణ పూర్తై, పోస్ట్ ప్రొడక్షన్ పనులు జరుగుతున్న సమయంలో ఎప్పుడు శివకు కాల్ చేసినా 'సెప్టెంబరు 1న నీ ముఖంపై చిరు నవ్వు చూడాలని ఉంది బ్రో' అని చెప్పేవాడు' అని అన్నారు.

సందేశాత్మక చిత్రం

కార్తిక్ రాజు, ప్రశాంత్ కార్తి, మిస్తి చక్రవర్తి, ఆమని, దేవి ప్రసాద్, భీమినేని శ్రీనివాసరావు, పోసాని కృష్ణమురళీ ప్రధాన పాత్రల్లో అవి క్రియేషన్స్ సమర్పణలో తెరకెక్కిన చిత్రం 'అను'. తేజస్వి క్రియేటివ్ వర్క్స్ బ్యానర్ మీద సందీప్ గోపిశెట్టి ఈ సినిమాకు దర్శక, నిర్మాత బాధ్యతలను నిర్వర్తిస్తున్నారు.



ఈ సినిమా గురించి ఆమని మాట్లాడుతూ, 'సినిమా చాలా బాగా వచ్చింది. నేను ఇందులో కొత్త క్యారెక్టర్‌ను పోషించాను. ఇదొక మంచి సందేశాత్మక చిత్రం' అని తెలిపారు. 'ఇది నా మొదటి చిత్రం. మూవీ అద్భుతంగా వచ్చింది. సెప్టెంబర్‌లో సినిమాని రిలీజ్ చేయాలని ప్లాన్ చేస్తున్నాం' అని దర్శక, నిర్మాత సందీప్ గోపిశెట్టి అన్నారు. లైన్ ప్రొడ్యూసర్ కళ్యాణ్ చక్రవర్తి మాట్లాడుతూ, సినిమా చాలా బాగా వచ్చింది. సంగీతం అద్భుతంగా ఉంటుంది. ప్రతీ ఒక్కరూ కష్టపడి పని చేశారు. నాకు సినిమా నచ్చి రిలీజ్ చేసేందుకు ముందుకు వచ్చాను' అని అన్నారు.

భిన్న కాన్సెప్ట్‌తో పరాక్రమం

బిఎస్‌కె మెయిన్ స్ట్రీమ్ పతాకంపై బండి సరోజ్ కుమార్ హీరోగా నటిస్తూ దర్శకత్వం వహించనున్న చిత్రం 'పరాక్రమం'. ప్రస్తుతం ప్రీ ప్రొడక్షన్ పనుల్లో ఉంది. సెప్టెంబర్, అక్టోబర్‌లో రెండు షెడ్యూల్స్‌లో ముప్పై రోజుల్లో షూటింగ్ పూర్తి చేసి వచ్చే ఏడాది ఫిబ్రవరి 14న విడుదల చేయడానికి సన్నాహాలు చేస్తున్నారు. ఈ నేపథ్యంలో ఈ చిత్ర ప్రీ టీజర్‌ను విడుదల చేశారు.

ఈ సందర్భంగా హీరో, దర్శకుడు బండి సరోజ్ కుమార్ మాట్లాడుతూ, 'కళ నాది. వెల మీద" అనే కాన్సెప్ట్‌తో డిజిటల్ ప్లాట్‌ఫామ్స్‌లో రిలీజ్ చేసిన 'నిర్బంధం, మాంగల్యం' లాంటి కల్ట్ సినిమాలతో నాకు లక్షలాది ప్రేక్షకుల అభిమానం లభించింది. వాళ్ళు ఇచ్చిన బలంతో ఇప్పుడు 'పరాక్రమం' అనే చిత్రాన్ని నిర్మించబోతున్నాను. 'ఐ, మీ, మై సెల్ఫ్' అనేది దీని టాగ్ లైన్. గోదావరి జిల్లాలోని లంపకలోవ గ్రామంలో పుట్టిన లోవరాజు అనే యువకుడి జీవితంలో జరిగే గల్లీ క్రికెట్, ప్రేమ, నాటక రంగ జీవితం, రాజకీయం లాంటి ఘట్టాల ఆవిష్కరణే ఈ చిత్ర ముఖ్య కథాంశం. యువతను అన్ని విధాలుగా ఎంటర్టైన్ చేస్తూనే, వారిని మేల్కొలిపే ఒక మంచి కమర్షియల్ కథతో రాబోతున్నాను. ఇందులో కొత్త నటీనటులను పరిచయం చేయబోతున్నాను' అని తెలిపారు.



బండి సరోజ్ కుమార్

Printed and Published by Nandayala Narsimha Reddy On behalf Of Navatelangna Printers Private Limited, Printed At M.H Bhavan, 1st Floor, Plot No. 21/1, Azamabad Near Rtc Kalyana Mandapam, Baghlingampally, Hyderabad-500020,Telangana State, Published at Navatelangana Printers Private Limited, M.H Bhavan,1st Floor No.21/1, Azamabad, Near Rtc Kalyana Mandapam, Baghlingampally, Hyderabad-500020, Telangana State, Editor : R.Sudha Bhaskar TELTEL/2014/59462.

అనుమతుల్లేని మరమ్మతుల వల్లే కోరమాండల్ ఘోరం

- ఒడిశాలో రైలు ప్రమాదానికి కారణం.. సీబీఐ
- ఉగ్రవిధ్వంసమంటూ సోషల్ మీడియాలో ప్రచారం



న్యూఢిల్లీ: దేశ వ్యాప్తంగా సంచలనం సృష్టించిన ఒడిశా రైలు దుర్ఘటనకు అనుమతులు లేని మరమ్మతులు చేపట్టడమే కారణమని కేంద్ర దర్యాప్తు సంస్థ (సీబీఐ) వెల్లడించింది. సీనియర్ సెక్షన్ ఇంజినీర్ (సిగ్నల్ ఇన్‌చార్జి) అరుణ్ కుమార్ మహంత.. ఉన్నతాధికారుల నుంచి సరైన అనుమతులు తీసుకోకుండా క్షేత్ర స్థాయిలో మరమ్మతులు చేయించారని తెలిపింది. ఈ మేరకు ప్రత్యేక న్యాయస్థానానికి సీబీఐ వివరించింది. రైలు దుర్ఘటనకు సంబంధించి సీబీఐ అరెస్టు చేసిన ముగ్గురిలో ఒకరైన అరుణ్ కుమార్ మహంత తనకు బెయిల్ మంజూరు చేయాలంటూ భువనేశ్వర్‌లోని సీబీఐ కోర్టులో దాఖలు చేసిన పిటిషన్‌పై ఇవాళ విచారణ జరిగింది. దీనిని సీబీఐ తీవ్రంగా వ్యతిరేకించింది.

బహనగా బజార్ స్టేషన్ సమీపంలో ప్రమాదం జరిగిన 94వ క్రాసింగ్ లెవెల్ గేట్ వద్ద మరమ్మతు పనులు మహంత సమక్షంలోనే జరిగాయని కోర్టుకు వివరించింది. దీనికోసం ఆయన సీనియర్ డివిజినల్ ఇంజినీర్ (సిగ్నల్ అండ్ టెలికం) నుంచి అనుమతులు గానీ, సర్క్యూట్ చిత్రంగానీ తీసుకోలేదని తెలిపింది. గేట్ నెంబరు 79 వద్ద మరమ్మతులకు ఉపయోగించిన సర్క్యూట్ చిత్రం ఆధారంగానే ఇక్కడ మరమ్మతులు చేసినట్టు తమ దర్యాప్తులో తేలిందని వివరించింది. పనులు జరుగుతున్నప్పుడు మహంత అక్కడే ఉన్నారని, ఆయన ఆధ్వర్యంలోనే మరమ్మతులు చేపట్టారని, అందువల్ల ఆయనకు బెయిల్ మంజూరు చేయొద్దని కోరారు.మహంత తరపు న్యాయవాది వాదనలు వినిపిస్తూ.. ప్రమాదానికి కారణంగా భావిస్తున్న లెవెల్ క్రాసింగ్ గేట్ గత కొంత కాలంగా సరిగా పని చేయడం లేదని, ఆ విషయాన్ని ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లినా సరైన చర్యలు తీసుకోలేదని కోర్టుకు తెలిపారు. పర్యవేక్షణ పనిని ఇతర వ్యక్తులకు అప్పగించారని, అందువల్ల ప్రమాదానికి మహంత బాధ్యుడు కాదని అన్నారు. వాదనలు విన్న న్యాయస్థానం మహంతకు బెయిల్ నిరాకరించింది. సిగ్నల్, ఇంటర్‌లాకింగ్ ఇన్‌స్టాలేషన్లను పరీక్షించడం, సరిదిద్దడం, మార్పులు చేయడం పిటిషనర్ (మహంత) విధుల్లో భాగమని పేర్కొంది. ఉన్నతాధికారులు ఆమోదించిన సూచనలకు అనుగుణంగా అతడు బాధ్యతలు నిర్వర్తించాల్సి ఉండేదని అభిప్రాయపడింది. అందులో విఫలమైనందువల్లే.. 296 మందికి పైగా ప్రయాణికులు ప్రాణాలు కోల్పోవాల్సి వచ్చిందని తెలిపింది. ప్రస్తుతం అందుబాటులో ఉన్న వివరాల ప్రకారం.. ఈ ప్రమాదానికి మహంతానే ప్రధాన కారకుడని కోర్టు భావిస్తోందని పేర్కొంది. జూన్ 2న ఒడిశాలోని బాలేశ్వర్ సమీపంలో బహనగా బజార్ స్టేషన్ వద్ద జరిగిన ఘోర రైలు ప్రమాదంలో 296 మంది ప్రాణాలు కోల్పోగా.. వెయ్యి మందికిపైగా క్షతగాత్రులైన సంగతి తెలిసిందే. షాలీమార్-చెన్నై కోరమాండల్ సూపర్‌ఫాస్ట్ ఎక్స్‌ప్రెస్ రైలు మెయిన్‌లైన్‌లోకి వెళ్లడానికి సిబ్బంది గ్రీన్‌సిగ్నల్ ఇచ్చి, వెనక్కి తీసుకున్నారు.

దీంతో ఆ రైలు లూప్‌లైన్లోకి వెళ్లి అప్పటికే అక్కడ ఆగి ఉన్న గూడ్సురైలును ఢీకొట్టింది. ఆ తీవ్రతకు కోరమాండల్‌లోని కొన్ని బోగీలు ఎగిరి, పక్కనున్న ట్రాకుపై పడ్డాయి. అదే సమయంలో ఆ మార్గంలో దూసుకువస్తున్న బెంగళూరు-హావ్‌డా సూపర్‌ఫాస్ట్ రైలు వాటిని ఢీకొట్టి పట్టాలు తప్పింది. ఇదంతా క్షణాల్లో జరిగిపోవడంతో పెను విషాదం చోటుచేసుకుంది. కేంద్రం సిఫారసు మేరకు రంగంలోకి దిగిన సీబీఐ ముగ్గురిని అరెస్టు చేసింది. అరెస్టయిన వారిలో సెక్షన్ ఇంజినీర్ (సిగ్నల్) అరుణ్ కుమార్ మహంత, సెక్షన్ ఇంజినీర్ మొహమ్మద్ అమీర్ ఖాన్, టెక్నీషియన్ పప్పు కుమార్‌లు ఉన్నారు. ఇప్పటిదాకా ఉగ్రచర్యగా అభివర్ణించినా..కాదని సీబీఐ దర్యాప్తులో తేలిందని పలువురు అభిప్రాయపడుతున్నారు.

జాబిల్లిపై విక్రమ్ ల్యాండర్

- ఫొటోలు పోస్ట్ చేసిన ఇస్రో..కాసేపటికే తొలగింపు



బెంగళూరు: భారత అంతరిక్ష పరిశోధన సంస్థ (ఇస్రో) శుక్రవారం ఎక్స్‌లో కొన్ని ఫొటోలు పోస్ట్ చేసింది. బుధవారం చంద్రుడి దక్షిణ ధ్రువంపై దిగిన విక్రమ్ ల్యాండర్‌ను చంద్రయాన్-2 ఆర్బిటర్ ఫొటోలు తీసినట్టు అందులో పేర్కొంది. అయితే కొంతసేపటి తర్వాత ఆ పోస్ట్‌ను ఇస్రో తొలగించింది. చంద్రయాన్-3 విజయంతో చంద్రుడి దక్షిణ ధ్రువంపై తొలిసారి అడుగుపెట్టిన దేశంగా భారత్ చరిత్ర సాధించింది.ఈ నేపథ్యంలో చంద్రుడిపై దిగిన విక్రమ్ ల్యాండర్, దాని నుంచి చంద్రుడి నేలపైకి దిగిన ప్రజ్ఞాన్ రోవర్ సమాచారం, అవి పంపే ఫొటోలు, పరిశోధనలపై సర్వత్రా ఉత్కంఠత నెలకొన్నది. ఈ నేపథ్యంలో చంద్రయాన్-3 మిషన్‌కు సంబంధించిన వివరాలను ఇస్రో ఎప్పటికప్పుడు ఎక్స్ (గతంలో ట్విట్టర్)లో పోస్ట్ చేస్తున్నది.

కాగా, చంద్రుడిపై దిగిన ల్యాండర్‌కు సంబంధించిన ఫొటోలను ఇస్రో శుక్రవారం పోస్ట్ చేసింది.

చంద్రయాన్-3 మిషన్‌కు చెందిన విక్రమ్ ల్యాండర్‌ను చంద్రయాన్ -2 ఆర్బిటర్ ఫొటోలు తీసినట్టు తెలిపింది. ప్రస్తుతం చంద్రుడి చుట్టూ తిరుగుతున్న చంద్రయాన్-2 ఆర్బిటర్‌లో ఎవరికీ లేనటువంటి హై రిజల్యూషన్ కెమెరా (వోహెచ్‌ఆర్సీ) ఉన్నట్టు పేర్కొంది. కొన్ని క్షణాల తర్వాత ఆ పోస్ట్‌ను ఎక్స్ నుంచి తొలగించింది. అయితే ఇస్రో ఇలా ఎందుకు చేసిందో అంతుపట్టడం లేదు. మరోవైపు చంద్రయాన్-2 తీసిన విక్రమ్ ల్యాండర్ ఫొటోలు సోషల్ మీడియాలో వైరల్ అయ్యాయి.

నవతెలంగాణపై స్పందన
ఫోన్ చేయాల్సిన నంబరు : 9490099016

పత్రికకు ప్రజలే మార్గదర్శకులు. నవతెలంగాణలో మీకు నచ్చిన, నచ్చని అంశాలను ఎప్పటికప్పుడు మా దృష్టికి తెస్తే.. పత్రికకు మరింత పదునుపెట్టే వీలుంటుంది. ఆదివారం మినహా ప్రతి రోజూ మధ్యాహ్నం 12 నుంచి సాయంత్రం 6 గంటలవరకూ పత్రికపై మీ అభిప్రాయాలను 9490099016కు తెలియచేయవచ్చు. మీరు చెప్పేది స్పష్టంగా, సూటిగా, క్లుప్తంగా ఉండాలి. ఇప్పటికే చాలా మంది పంపుతున్న విమర్శలు, సూచనలు మాకు బాగా ఉపయోగపడుతున్నాయి. వారందరికీ కృతజ్ఞతలు.

అభిప్రాయాలు పంపదలిస్తే మా అడ్రస్ : స్పందన, నవతెలంగాణ తెలుగు డైలీ, ఎం.హెచ్ భవన్, ప్లాట్ నెం.21/1, అజామాబాద్, ఆర్టీసీ కళ్యాణ మండపం దగ్గర, బాగ్‌లింగంపల్లి, హైదరాబాద్ - 20.





ఆర్టీఐ ఆన్‌లైన పోర్టల్ నుంచి డేటా గాయబ్

- సమాచారహక్కు కార్యకర్తల ఆందోళన

న్యూఢిల్లీ : కేంద్ర ప్రభుత్వం ఆర్టీఐ ఆన్‌లైన్ పోర్టల్ నుంచి వందలాది దరఖాస్తు రికార్డులు కనిపించకుండా పోయాయి. ఇది ప్రభుత్వ సమాచారం కోసం అభ్యర్థనలను సమర్పించడానికి పౌరులు తరచుగా ఉపయోగించే వేదిక. ఈ అదృశ్యాన్ని అనేకమంది ఆర్టీఐ కార్యకర్తలు ధృవీకరించారు. దీనిపై వారు ఆందోళన వ్యక్తం చేశారు. డిపార్ట్‌మెంట్ ఆఫ్ పర్సనల్ అండ్ ట్రైనింగ్ (డీఓపీటీ) పోర్టల్‌ను పర్యవేక్షించడం,ఆర్టీఐ దరఖాస్తులతో వ్యవహరించేటప్పుడు ప్రభుత్వ అధికారులకు సరైన విధానంపై మార్గదర్శకత్వం, నిబంధనలను అందించడం బాధ్యత. ది హిందూ కథనం ప్రకారం.. ఆర్టీఐ ఆన్‌లైన్ పోర్టల్ 2013లో ప్రారంభించినప్పటి నుంచి 2022 వరకు 58.3 లక్షల కంటే ఎక్కువ దరఖాస్తులను విజయవంతంగా ప్రాసెస్ చేసింది. దరఖాస్తుల పరిమాణం స్థిరమైన పెరుగుదలను ప్రదర్శించింది. 2022 సంవత్సరంలోనే 12.6 లక్షలకు పైగా దరఖాస్తులను సమర్పించడం ద్వారా చూపబడింది. ఈ గణాంకాలు ఉన్నప్పటికీ, పోర్టల్‌పై పరిపాలనా అధికారాన్ని కలిగి ఉన్న డీఓపీటీ.. తప్పిపోయిన డేటాకు సంబంధించి ఎలాంటి స్పందననూ తెలియజేయకపోవటం గమనార్హం. "భారత ప్రభుత్వం ఆర్టీఐ ఆన్‌లైన్ పోర్టల్‌లో సాధారణ ప్రజలకు స్పష్టమైన ఉద్దేశాలను తెలియజేయకుండా ఏకపక్ష మార్పులు చేస్తున్నది. ఈ ప్రణాళిక లేని మార్పులు ప్రజాస్వామ్య కార్యకలాపాలకు హాని కలిగిస్తున్నాయి" అని టెక్ నిపుణుడు శ్రీనివాస్ కొడాలి అన్నారు.

ఏసీబీకి చిక్కిన అడిషనల్ ఆర్ఐ

నవతెలంగాణ-ప్రత్యేక ప్రతినిధి :

లంచం తీసుకుంటూ వనపర్తి జిల్లాకు చెందిన అదనపు ఆర్ఐ ఎ. నరసింహ అవినీతి నిరోధక శాఖ(ఏసీబీ)కి పట్టుబడ్డారు. ఏసీబీ డైరెక్టర్ జనరల్ రవిగుప్తా తెలిపిన వివరాల ప్రకారం.. వనపర్తి జిల్లా ఆత్మకూరు మండలంకు చెందిన ఒక వ్యక్తి తన భూమికి సంబంధించిన మ్యుటేషన్ పనిని పూర్తి చేయాలని తహశీల్దార్ కార్యాలయంలో దరఖాస్తు చేసుకున్నారు. ఆ పనిని పూర్తి చేయడానికి గాను రూ.5వేలను అదనపు ఆర్ఐ నరసింహ డిమాండ్ చేశారు. ఈ డబ్బులను తీసుకుంటుండగా ఏసీబీ అధికారులు అడిషనల్ ఆర్ఐను రెడ్‌హ్యాండెడ్‌గా పట్టుకున్నారు. లంచం సొమ్మును స్వాధీనపర్చుకొని నిందితుడిని అరెస్టు చేసి హైదరాబాద్ ఏసీబీ కేసుల ప్రత్యేకోర్టులో హాజరుపర్చి జ్యుడీషియల్ రిమాండ్‌కు తరలించారు.

జి-20 సమ్మిట్‌కు పుతిన్ హాజరుకావడం లేదు : రష్యా వెల్లడి

మాస్కో : భారత్‌లో జరగనున్న జి-20 సమ్మిట్‌కు రష్యా అధ్యక్షులు వ్లాదిమిర్ పుతిన్ వ్యక్తిగతంగా హాజరుకావడం లేదు. అయితే ఈ సదస్సులో వర్చువల్‌గా ఆయన పాల్గొంటారని తెలుస్తున్నది. క్రెమ్లిన్ ప్రతినిధి డిమిత్రి పెస్కోవ్ శుక్రవారం ఈ విషయాన్ని వెల్లడించారు. జి-20 సమ్మిట్‌కు పుతిన్ స్వయంగా హాజరయ్యే ప్రణాళికలు ఏమీ లేవని తెలిపారు. వర్చువల్‌గా ఈ సదస్సులో పాల్గొనడాన్ని తర్వాత నిర్ణయిస్తామని అన్నారు. సెప్టెంబరు 9 నుంచి 10 వరకు ఢిల్లీలో జి-20 సమ్మిట్ జరగనున్నది. అమెరికా అధ్యక్షులు జో బైడెన్ సహా పలు దేశాధినేతలు ఈ సదస్సుకు హాజరవ్వనున్నారు. అయితే రష్యా అధ్యక్షులు పుతిన్ మాత్రం వ్యక్తిగతంగా హాజరుకావడం లేదని ఆ దేశం స్పష్టం చేసింది. ఉక్రెయిన్‌పై సంక్షోభం నేపథ్యంలో పుతిన్‌పై అంతర్జాతీయ క్రిమినల్ కోర్టు (ఐసిసి) అరెస్టు కోసం వారెంట్ జారీ చేసింది. ఈ కారణంతోనే పుతిన్ విదేశాల్లో ప్రయాణించడం లేదని కొంత మంది ఆరోపిస్తున్నారు. తాజాగా దక్షిణాఫ్రికాలోని జోహన్నెస్‌బర్గ్‌లో జరిగిన బ్రిక్స్ సదస్సుకు కూడా పుతిన్ హాజరుకాలేదు. అయితే వర్చువల్‌గా పాల్గొని ప్రసంగించారు.

ప్రశ్నార్థకంగా విదేశీ విద్య..!

అంబేద్కర్ ఓవర్సీస్ విద్యానిధికి కోతలు

- ఏండ్ల కొద్ది పెండింగ్‌లో స్కాలర్‌షిప్‌లు
- విదేశాల్లో విద్యార్థుల అవస్థలు
- అప్పులు చేసి ఫీజుల చెల్లింపులు
- ఈ ఏడాది రాష్ట్రంలో 320 మంది విద్యార్థుల దరఖాస్తు
- 80 మందికి మాత్రమే అవకాశం



నవతెలంగాణ- రంగారెడ్డి ప్రాంతీయ ప్రతినిధి

ప్రభుత్వ భరోసాతో విదేశీ చదువులకు వెళ్లిన పేద విద్యార్థుల బతుకులు ఆగమవుతున్నాయి. అంబేద్కర్ ఓవర్సీస్ విద్యానిధి పథకం కింద విదేశీ చదువులకు వెళ్లిన విద్యార్థులకు సకాలంలో స్కాలర్‌షిప్‌లు అందక వారి చదువులు అర్థాంతరంగా ముగుస్తున్నాయి. నిధులు సమకూర్చకుండా పథకం నిర్వీర్యానికి ప్రభుత్వం కుట్ర చేస్తోందని విద్యార్థి సంఘాలు ఆరోపిస్తున్నాయి. ప్రతిఏటా పెడుతున్న ఆంక్షలు, విద్యార్థుల ఎంపికలో తగ్గుతున్న సంఖ్య దీనికి నిదర్శమని ప్రభుత్వ గణాంకాలే చెబుతున్నాయి.

రంగారెడ్డి జిల్లాకు చెందిన ఓ విద్యార్థి విదేశాల్లో ఎంబీఏ చేసేందుకు అంబేద్కర్ ఓవర్సీస్ విద్యానిధి కింద 2019లో దరఖాస్తు చేసుకు న్నారు. వివిధ కారణాలతో పలు దఫాలుగా రిజెక్టు చేశారు. చివరికి 2021లో ఆ విద్యార్థిని ఎంపిక చేశారు. 2021 మార్చిలో ఆ విద్యార్థి కెనడాకు వెళ్లాడు. అక్కడ కాలేజీలో చదివినప్పటికీ ప్రభుత్వం అందించే స్కాలర్‌షిప్ రాకపోవడంతో ఆ విద్యార్థికి కోర్సు సర్టిఫికెట్లు నేటికీ అందలేదు. దాంతో విద్యార్థి చదువు అగమ్యగోచరంగా తయారైంది. ఉమ్మడి రంగారెడ్డి జిల్లాలో 2021-22 విద్యా సంవత్సరంలో విద్యానిధి పథకానికి 98 మంది దరఖాస్తులు చేసుకుంటే 32 మందిని మాత్రమే ఎంపిక చేశారు. 2022-23 అకడమిక్ ఇయర్‌లో రాష్ట్ర వ్యాప్తంగా 330 మంది విద్యార్థులు దరఖాస్తు చేసుకుంటే 80 మందిని మాత్రమే ప్రభుత్వం ఎంపిక చేసింది. కాగా, తొమ్మిది నెలలుగా అంబేద్కర్ ఓవర్సీస్ విద్యానిధికి ప్రభుత్వం నుంచి చిల్లీగవ్వ కూడా అందకపోవ డంతో వందల మంది విద్యార్థులు విదేశాల్లో ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు.

ఎంపికలో కొర్రీలు

ప్రతియేటా రాష్ట్రం నుంచి అంబేద్కర్ ఓవర్సీస్ విద్యానిధి పథకం కింద 210 మందిని పంపించాల్సి ఉంది. డిగ్రీలో 60శాతం మార్కులు, జీఆర్ఈలో 20శాతం, జీఎమ్ఏటీలో 20శాతం మార్కులు ఉండాలి. కానీ ఇటీవల అనేక మార్పులు తీసుకొచ్చింది. గతంలో 60 శాతం ఉన్న దాన్ని 70 శాతానికి పెంచారు. దాంతో ఈ ఏడాది 330 మంది విద్యార్థులు దరఖాస్తు చేసుకుంటే కేవలం 80 మంది విద్యార్థులకు అవకాశం కల్పించారు. దీని వలన గ్రామీణ ప్రాంతంలో చదవిన విద్యార్థులకు అన్యాయం జరుగుతుందని విద్యార్థి సంఘాలు ఆవేదన వ్యక్తం చేస్తున్నాయి. మార్కుల శాతాన్ని తగ్గించడంతోపాటు పెండింగ్ బిల్లులు చెల్లించాలని కోరుతున్నారు.

బడ్జెట్ లేదు...

విద్యార్థుల తల్లిదండ్రుల నుంచి ఒత్తిడి వస్తోంది. విదేశాల్లో విద్యార్థులు ఇబ్బందులు పడుతున్న విషయం వాస్తవమే. కానీ ప్రభుత్వం నుంచి బడ్జెట్ రావాల్సి ఉంది. తొమ్మిది నెలలుగా బడ్జెట్ లేదు. బడ్జెట్‌ను బట్టి కొంత కొంత ఎమౌంట్ వేసి విద్యార్థులకు ఇబ్బంది లేకుండా చూస్తాం.

- రామారావు, ఎస్సీ సంక్షేమ శాఖ జిల్లా అధికారి

రాష్ట్రపతి పాలనకు సిఫార్సు చేస్తా..

- పంజాబ్ సిఎంకు ఆ రాష్ట్ర గవర్నర్ బెదిరింపు



చండీగఢ్: పంజాబ్ గవర్నర్ బన్వారిలాల్ పురోహిత్, ఈ రాష్ట్ర ముఖ్యమంత్రి భగవంత్ మాన్ మధ్య వివాదం శుక్రవారం తీవ్రస్థాయికి చేరింది. ఏకంగా పంజాబ్‌లో రాష్ట్రపతి పాలనకు సిఫార్సు చేస్తానని ముఖ్యమంత్రిని గవర్నర్ బెదిరించారు. గతంలో తాను రాసిన లేఖలకు సమాధానం ఇవ్వకపోతే రాష్ట్రపతి పాలనకు సిఫారసు చేస్తానని.. క్రిమినల్ చర్యలకు ఉపక్రమిస్తానంటూ హెచ్చరించారు. ఈ మేరకు మాన్‌కు పంపిన లేఖను గవర్నర్ శుక్రవారం మీడియాకు విడుదల చేశారు. గతంలో రాసిన లేఖలపై ప్రభుత్వం ఎలాంటి సమాచారం ఇవ్వకపోవడంపై కలత చెందినట్టు పేర్కొన్నారు. రాజ్యాంగ యంత్రాంగం వైఫల్యంపై రాష్ట్రపతికి నివేదించగలనంటూ హెచ్చరించారు. రాజ్యాంగంలోని ఆర్టికల్ 356, ఐపిసి సెక్షన్ 124 ప్రకారం తాను 'తుది నిర్ణయం' తీసుకోవడానికి ముందే చర్యలు తీసుకోవాలని మాన్‌కు సూచించారు. అలాగే, రాష్ట్రంలో మాదకద్రవ్యాల సమస్యకు సంబంధించి ప్రభుత్వం తీసుకున్న చర్యలపైనా సమాచారం ఇవ్వాలన్నారు. ఒకవేళ ఇవ్వకపోతే రాజ్యాంగం, చట్టపరంగా చర్యలు తీసుకోవడం తప్ప తనకు వేరే మార్గం ఉండదన్నారు.

రాష్ట్రంలోని ఆప్ ప్రభుత్వం తీసుకుంటున్న నిర్ణయాలను ప్రశ్నిస్తూ గవర్నర్ ముఖ్యమంత్రికి పలుమార్లు లేఖలు రాశారు. ఫిబ్రవరిలో కొన్ని ప్రభుత్వ పాఠశాలల ప్రిన్సిపాళ్లను సింగపూర్ పర్యటనకు ఎంపిక చేయడం సహా పలు అంశాలపై గవర్నర్ వివరాలు కోరారు. ఇలాంటి అంశాల విషయంలో ప్రభుత్వానికి, గవర్నర్‌కు మధ్య దూరం పెరుగుతూ వచ్చింది.

నాణ్యత నవ్వుల పాలు.. నిధులు నీళ్ల పాలు

నాసిరకమైన పనులు, ముక్కలైన చెక్ డ్యామ్‌లు

- భారీ వర్షాలతో బయటపడిన డొల్లతనం



నవతెలంగాణ-మల్హర్‌రావు

వరద పోటెత్తితే వర్షాల నీటిని ఒడిసిపట్టే ఆనకట్టలు ఎక్కడికక్కడ ధ్వంసమై వరదల్లో ముక్కలుముక్కలై కొట్టుకుపోతున్నాయి. భారీ వర్షాల ప్రభావంతో వాగులు, ఎల్ఎండీ గేట్ల ఎత్తివేతతో నీటి ప్రవాహం పెరిగి మానేరుపై కోట్ల రూపాయలతో నిర్మించిన చెక్‌డ్యామ్‌లు ధ్వంసమయ్యాయి. గుత్తేదారులు నిర్మాణ పనుల్లో నాణ్యత ప్రమాణాలు పాటించకపోవడంతో నాణ్యత నవ్వుల పాలై కోట్ల రూపాయల ప్రజల సొమ్ము నీళ్ల పాలవుతోంది. ఇందుకు జయశంకర్-భూపాలపల్లి, పెద్దపల్లి జిల్లాల సరిహద్దుల్లో మానేరుపై నిర్మించిన చెక్‌డ్యామ్‌లే ఉదాహరణ. వరద తాకిడికి ఇప్పటికే రెండు సార్లు ముక్కలయ్యాయి.

జయశంకర్-భూపాలపల్లి జిల్లా మల్హర్‌రావు మండలంలోని మల్లారం మానేరు నదిపై మొదటిసారి రూ.8 కోట్ల పైనే ఖర్చు చేసి చెక్‌డ్యామ్ నిర్మాణం చేపట్టారు. తేలికపాటి వరదల్లో చెక్ డ్యామ్‌తోపాటు పక్కనున్న పొలాలు సైతం కోతకు గురయ్యాయి. రెండవసారి రూ.16.62కోట్లతో నిర్మాణ పనులు చేపట్టారు. ఇటీవల కురిసిన భారీ వర్షాల వరదలకు మళ్ళీ చెక్ డ్యామ్ నాలుగు ముక్కలైన పరిస్థితి. అలాగే తాడిచెర్ల ఖమ్మంపల్లి మానేరుపై రూ.14.31కోట్లతో, సోమన్‌పల్లి, పీవీ నగర్ మానేరుపై రూ.13.40కోట్లతో చెక్‌డ్యామ్ నిర్మాణ పనులు చేపట్టారు. భారీ వర్షాలతో ఈ చెక్ డ్యామ్‌లు ముక్కలు ముక్కలయ్యాయి. అయితే చెక్ డ్యామ్‌లు తరచు వరదల్లో కొట్టుకుపోవడం పరిపాటిగా మారింది. చెక్ డ్యామ్ నిర్మాణ పనులపై సంబంధిత ఇరిగేషన్ అధికారుల పర్యవేక్షణ లేకపోవడంతో గుత్తేదారులు పనుల్లో నాణ్యత పాటించడం లేదని, అందుకే తరచూ వరదల్లో కొట్టుకుపోతున్నాయని పలువురు తెలిపారు. మానేరుపై 500 మీటర్ల పొడవుతో చెక్‌డ్యామ్ నిర్మాణ పనుల్లో సైడ్ వాల్స్ అడుగు భాగంలో గుత్తేదార్లు బైండింగ్ మట్టి పోయకపోవడం, ఇరు వైపులా కరకట్టలు కట్టకపోవడంతో పొలాలు కోతకు గురయ్యాయని రైతులు వాపోతున్నారు.

శాశ్వత పరిష్కారమేదీ..?

ఆయుకట్టల నిర్మాణంలో భాగంగా ముందుగా వాగులో గట్టితనం వచ్చేవరకు ఇసుకను పూర్తిగా తోడి బెడ్ నిర్మించాల్సి ఉంటుంది. ఇందుకు భిన్నంగా ఇసుకపై పునాది వేయడంతో చెక్ డ్యామ్ కింద నీటిని ఎత్తిపోసేందుకు నిర్మించిన అప్రాన్‌లు రిటైనింగ్ వాల్స్, అబార్ట్‌మెంట్ భాగాలు వరద ఉధృతికి దెబ్బతింటున్నాయి. వరద ఉధృతిని అంచనా వేసేందుకు ప్రత్యేక సాంకేతిక పరిజ్ఞానం అందుబాటులో లేకపోయింది. ఇసుక మేటలు పూర్తిగా తొలగించకుండానే చెక్ డ్యామ్ నిర్మాణం చేపట్టడంతో దెబ్బతింటున్నాయని పరివాహక ప్రాంత రైతులు చెబుతున్నారు. అధికారులు మాత్రం క్షేత్రస్థాయిలో పరిశీలించి వెళుతున్నారే తప్ప శాశ్వత పరిష్కారం చూపడం లేదని ఆరోపిస్తున్నారు.

హలాలా, ముటాపై మీ వైఖరి చెప్పండి

ముస్లిం బోర్డును కోరిన లా కమిషన్

న్యూఢిల్లీ : వివాహానికి సంబంధించిన రెండు వివాదాస్పద రూపాలైన నికాహ్ హలాలా, ముటాపై వైఖరిని నిస్సందేహంగా తెలియచేయాలని ఆల్ ఇండియా ముస్లిం పర్సనల్ లా బోర్డు (ఎఐఎంపిఎల్‌బి)ను లా కమిషన్ కోరింది. అలాగే వివాహానికి కనీస వయస్సు గురించి ఇస్లామిక్ చట్టంలో ఉన్న వివరణను కూడా కమిషన్ కోరింది.

ఈ మేరకు ఎఐఎంపిఎల్‌బి అధ్యక్షుడు మౌలానా ఖలీద్ సైఫుల్లా రెహ్మానీ నేతృత్వంలోని 11 మంది సభ్యుల ప్రతినిధి బృందంతో లా కమిషన్ చైర్మన్ జస్టిస్ (రిటైర్డ్) రీతు రాజ్ అవస్తీ రెండు గంటలపాటు సుదీర్ఘంగా సమావేశమయ్యారు. కొన్ని ఈ ప్రశ్నలను సంధించారు.

నికాహ్ హలాలా, ముటాకు వ్యతిరేకంగా కొంత మంది ముస్లిం మహిళలు సుప్రీంకోర్టులో పిటిషన్లు దాఖలు చేశారు. ఈ వారు రెండు రకాల వివాహాలపై నిషేధం కోరుతున్నారు.

లా కమిషన్‌తో సమావేశం గురించి ఎఐఎంపిఎల్‌బి ప్రతినిధుల బృందం మీడియాతో మాట్లాడింది. లా కమిషన్ పేర్కొన్న రెండు వివాహ విధానాలు దేశంలో పెద్దగా ఆచరణలో లేవని తెలిపారు.

అలాగే, వివాహానికి కనీస వయస్సు గురించి మాట్లాడుతూ 'అబ్బాయిలు, అమ్మాయిలు వయస్సు వచ్చినప్పుడు వివాహానికి ఇస్లాం అనుమతిస్తుంది' అని తెలిపారు. ఇస్లాంలో, వివాహానికి నిర్దిష్ట వయస్సు లేదని, భార్యాభర్తలు వివాహ బాధ్యతలను నెరవేర్చగల స్థితిలో ఉంటే, వారు వివాహం చేసుకోవచ్చని చెప్పారు. కాగా, ఈ సమావేశంలో ఉమ్మడి పౌరస్మృతి (యుసిసి)పై ముస్లిం ప్రతినిధితులు అభ్యంతరం వ్యక్తం చేసినట్టు సమాచారం. 'యుసిసి నుంచి ఈశాన్య రాష్ట్రాల గిరిజనులు, క్రైస్తవులను మినహాయించడానికి ప్రభుత్వం సిద్ధంగా ఉన్నప్పుడు ముస్లింలకు మాత్రమే ఎందుకు మినహాయింపు ఇవ్వడం లేదని, దీనికి అర్థం యుసిసి లక్ష్యం ముస్లింలు మాత్రమే అని తెలుస్తుంది' అని లా కమిషన్‌తో చెప్పినట్లు సమాచారం.

తమిళనాడు పాఠశాలల్లో 'ముఖ్యమంత్రి అల్పాహార పథకం'

ప్రారంభించిన సిఎం స్టాలిన్

నాగపట్టణం: రాష్ట్రంలోని పాఠశాలల్లోనే పిల్లలకు ఉచితంగా అల్పాహారం అందించేందుకు ఉద్దేశించిన 'ముఖ్యమంత్రి అల్పాహార పథకంను తమిళనాడు సీఎం స్టాలిన్ శుక్రవారం ప్రారంభించారు. ఈ పథకం ద్వారా తమిళనాడు రాష్ట్ర ఉన్న ప్రభుత్వ పాఠశాలల్లోని విద్యార్థులకు ఒకటో తరగతి నుంచి ఐదో తరగతి వరకు చదువుతున్న బాలబాలికలకు ఉదయం పూట అల్పాహారం అందించనున్నారు. దీంతో దేశంలోనే పాఠశాలల్లో అల్పాహారం అందిస్తున్న తొలి రాష్ట్రంగా తమిళనాడు నిలిచింది. నాగపట్టణం జిల్లాలోని తిరుక్కువళై ప్రాథమిక పాఠశాలలో ఈ స్కీం రెండో విడతను ప్రారంభించిన సీఎం స్టాలిన్.. చిన్నారులకు అందించే అల్పాహారాన్ని దగ్గరుండి పరిశీలించారు. అనంతరం పిల్లలకు స్వయంగా వడ్డించిన ముఖ్యమంత్రి.. తాను కూడా చిన్నారులతో కలిసి అల్పాహారం తిన్నారు. చెన్నైలో స్టాలిన్ కుమారుడు, రాష్ట్ర మంత్రి ఉదయనిధి ఈ పథకాన్ని ప్రారంభించారు.

వాస్తవానికి ఈ పథకాన్ని గతేడాది సెప్టెంబరులోనే ప్రకటించిన స్టాలిన్ సర్కారు.. ప్రయోగాత్మకంగా 1545 పాఠశాలల్లో ఇప్పటికే అందుబాటులోకి తీసుకొచ్చింది. ప్రయోగాత్మకంగా చేపట్టిన ఈ పథకం విజయవంతమవడంతో ఇప్పుడు శుక్రవారం నుంచి రాష్ట్రవ్యాప్తంగా 31,008 ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలకు దీన్ని విస్తరించారు.

మోడీ డిగ్రీ కేసు కేజ్రీవాల్‌కు దక్కని ఉపశమనం

న్యూఢిల్లీ : ప్రధానమంత్రి మోడీ డిగ్రీ కేసులో ఢిల్లీ ముఖ్యమంత్రి కేజ్రీవాల్‌కు సుప్రీంకోర్టులో ఉపశమనం లభించలేదు. ఈ కేసులో తనపై చర్యలు తీసుకోకుండా విచారణపై స్టే విధించాలని కోరుతూ కేజ్రీవాల్ దాఖలు చేసిన పిటిషన్‌ను సుప్రీంకోర్టు కొట్టేసింది. కేజ్రీవాల్ చేసిన వ్యాఖ్యలు తమ విశ్వవిద్యాలయానికి పరువునష్టం కలిగించాయని గుజరాత్ యూనివర్సిటీ ఈ కేసు వేసింది. ఈ కేసుకు సంబంధించిన విచారణ ప్రస్తుతం గుజరాత్ హైకోర్టులో పెండింగ్ ఉందని, అందువల్ల తాము ఎలాంటి నోటీసులు జారీ చేయలేమని సుప్రీంకోర్టు ధర్మాసనం స్పష్టం చేసింది. దీనిపై కేజ్రీవాల్, గుజరాత్ యూనివర్సిటీ తమ విజ్ఞప్తులను హైకోర్టుకు సమర్పించుకోవచ్చని సూచించింది. ఈ పరువు నష్టం కేసులో విచారణ నిమిత్తం గుజరాత్ మెట్రోపాలిటన్ కోర్టుకు రావాలని కేజ్రీవాల్‌కు సమన్లు జారీ చేసింది. ఈ సమన్లను సెషన్స్ కోర్టులో కేజ్రీవాల్ సవాల్ చేశారు. కేజ్రీవాల్ సవాల్‌ను సెషన్స్ కోర్టు తిరస్కరించడంతో ఇటీవల ఆయన గుజరాత్ హైకోర్టును ఆశ్రయించారు. అయితే, స్టే ఇచ్చేందుకు గుజరాత్ కోర్టు కూడా నిరాకరించింది. దీంతో సుప్రీంకోర్టును కేజ్రీవాల్ ఆశ్రయించారు. కాగా, ప్రధాని మోడీ తన డిగ్రీ సర్టిఫికెట్ చూపించాల్సిన అవసరం లేదని గుజరాత్ హైకోర్టు ఈ ఏడాది మార్చిలో తీర్పు వెలువరించిన విషయం తెలిసిందే. అయితే కేజ్రీవాల్ వ్యాఖ్యలపై గుజరాత్ వర్సిటీ పరువు నష్టం దావా వేసింది.

13 ఏళ్ల బాలునిపై ప్యూన్ లైంగిక దాడి

సాత్నా : మధ్యప్రదేశ్ లోని సాత్నా జిల్లాలోని ఓ రెసిడెన్షియల్ పాఠశాలలో దారుణం వెలుగుచూసింది. పాఠశాలలో 13 ఏళ్ల బాలుడిపై ప్యూన్ లైంగికదాడికి పాల్పడ్డాడు. రేవా జిల్లాకు చెందిన బాలుడు సాత్నాలోని సరస్వతి విద్యాపీఠ్ హయ్యర్ సెకండరీ రెసిడెన్షియల్ స్కూల్‌లో 7వ తరగతి చదువుతున్నాడు. ఆరోగ్యం బాగాలేకపోవడంతో బాధితుడు క్లాస్‌లకు వెళ్లకుండా తన హాస్టల్ గదిలోనే ఉన్నాడు. అదే హాస్టల్‌లో ప్యూన్‌గా పనిచేస్తున్న రవీంద్ర సేన్.. దీనిని అదనుగా భావించి బాలుడిపై లైంగిక దాడికి పాల్పడ్డాడు. అనంతరం దీనిగురించి ఎవరికీ చెప్పొద్దని బెదిరించాడు. జరిగిన సంఘటన గురించి ఆ విద్యార్థి తన తల్లిదండ్రులకు చెప్పాడు. కుటుంబ సభ్యులు పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేయడంతో కేసు నమోదుచేసిన పోలీసులు.. వెంటనే రంగంలోకి దిగారు. నిందితుడ్ని అదుపులోకి తీసుకున్నారు. 377 సెక్షన్‌తోపాటు, పోక్సో చట్టం కింద కేసు నమోదు చేశారు.